UNIVERSAL LIBRARY

OU_204518

UNIVERSAL LIBRARY

OUP—881—5-8-74—15,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81·6 S12 Accession No. T4135

Author

Title

This book should be returned on or before the date last marked below.

OUP—55^ ౧౦౦

గులాబీతోట

కవికోకిలా పబ్లికేషన్సు

నెల్లూరు

వెల :

మూడున్నరరూపాయి

గులాబితోట

సాదీమహాకవి "గులిస్తాన్"
అను పారసీ కావ్యమునకు
అనువాదము

అనువక్త
"కవికోకిల"
దువ్వూరి రామిరెడ్డి

అన్ని హక్కులు

దువ్వూరు వేణుగోపాలరెడ్డివి

అవతారిక

మహోన్నత ప్రభావభాసురుండగు భగవంతునిస్తుతించుటయు ఆయన యెడ శ్రద్ధాభక్తులు కలిగియుండుటయు తత్సామీప్యమునకు హేతువగును; కృతజ్ఞతాభివందనములు అనుగ్రహాభివృద్ధికి మూలమగును. మనము లోనికి పీల్చుకొను ప్రతియూపిరియు జీవితమును పొడుగించును. వెలికూర్చునప్పుడు హృదయోల్లాసము కలుగును. కావున, ప్రతియూపిరి వలన రెండు లాభములు చేకూరుచున్నవి. ప్రతిలాభమునకును మనము దేవునికి కృతజ్ఞులమై యుండుట ఆవశ్యకము.

ఎవనిచేతులు నాల్క యీశ్వరుదయకు
దగినట్లు నెరవేర్చు దమ కృతజ్ఞతను ?

“ దావీదు సంతానములార, కృతజ్ఞత నభ్యసింపుడు. నా సేవకులలో కృతజ్ఞులు కొద్దిమందిరే యున్నారు.”

దాసుండు దైవసన్నిధి
దోసములందెల్పి వినతి తోషమువేడఁ
వాని; యటుగాక యెవ్వడు
వీసర పోకుండ దైవవిధులనొనర్పఁ ?

సర్వేశ్వరుని యనంత కరుణామృత రసము అన్నిచోట్ల వర్షించును. ధారాళమైన ఆయన అనుగ్రహ సంతర్పణము ఎల్లయెడల వెలయుచుండును. పాపయుతులైనను తన సేవకుల గౌరవయవనికను చింపి వారిని సిగ్గుపరచడు. తప్పు లొనరించినను వారి దినబత్తెము నిరాకరింపడు.

ధర్మబాహ్యుల కగ్నిమతస్థులకును
గుప్త భాండారమున నుండి కుడువ నిడుదు,
వాదరింతువు శత్రుల నైన గరుణ;
నిక నెటు బహిష్కరింతువు హితులనీశ ?

భగవంతుడు గృహపరిచారకుడైన ప్రభాతవాయువును, పచ్చల రత్న కంబళమును, పరచుట కాజ్ఞాపించెను. దాదియైన వాసంత జలదమును ఓషధీ కుమారికల ధరా డోలిక యందుంచి పోషింప నియమించెను. తరులతలకు

ఉగాది కానుకలుగా పచ్చని యంగీల ప్రసాదించెను. వసంత సమాగమనోత్సవ సమయమున కొమ్మకొమరులు తలను ధరింప కుసుమగుచ్ఛ కిరీటముల నొసంగెను. చెరకుగడ రసమును తన శక్తిచేత ఉత్తమ మకరందముగ మార్చెను. ఖర్జూర బీజము తన శిక్షణమువలన ఉన్నత తరువగు నటులొనర్చెను.

జలదము వాయువుఁ శశియు సారసమిత్రుడు నంబరంబు నీ
విల దినభుక్తిఁగాంచ, లభియించిన భోజనముంగృతజ్ఞతా
కలితుడవై భుజింప, నిజకార్యనిబద్ధములై తొలంగ వా
జ్ఞల; మరి నీకు మాత్రమది న్యాయమె యాజ్ఞనతిక్రమింపగఁ.

ప్రాణికోటులకు నాయకుండును, సృష్టియందు శ్రేష్ఠుండును, లోకములకు కరుణాప్రదాతయు, మనుష్యులలో నిష్కళంక హృదయుండును, కాలచక్ర పరిభ్రమణమునకు పరమావధియునగు మహమ్మగు ముస్తఫాను (దైవాశీర్వాదము, శాంతి ఆయనపై నెలకొనునుగాక!) గురించి హదీసున చెప్పబడియున్నది.

మతతత్పరులను గోడకు
సతతము మీవంటి యాను సమకురియుండఁ
వెతలేల? నోహు నాలిక
పతియైనఁ షుభిత జలధి భయపడనేలా?

హదీసు:— దురదృష్టవంతుడును పాపియువగు నొకసేవకుడు పశ్చాత్తప్తుడయి, మన్నన గలుగు నన్నయాసతో చేతులెత్తునేని మహోన్నతుడగు భగవంతుడు వానిని కన్నెత్తియైనను చూడడు. మరల అతడు ప్రార్థించును. దేవుడు నిరాకరించును. తరువాత దీనతతో వేదనాభరితుడయి అతడు వేడికొనును. అంతట దేవుడు "వాని ప్రార్థన మంగీకరించితిని. ఏలయన, ఆదాసుని నిరంతర ప్రార్థనమునకును పరిదేవనమునకును నేను సిగ్గుపడితి" నని సెలవిచ్చును.

భగవంతుని యౌదార్యము
అగణిత కారుణ్యమెంతొ యరయుము. దాసుం
దెగబడి తప్పులొనర్చిన
యగడునకుందానె పొందు నార్తిని సిగ్గుఁ.

దేవునికీర్తి గౌరవములకు చిహ్నమైన 'కాబా' యొద్ద నిరంతరము నివసించు భిక్షువులు తమపూజాలోపమును ఒప్పుకొని "మిమ్ము పూజింపవలసిన విధమున

పూజింపకుంటి" మని విన్నవింతురు. ఆయన రూపసౌందర్యము నభివర్ణించు వారు ఆనంద తన్మయత్వమున "మిమ్ము తెలిసికొనవలసిన రీతిగా తెలిసికొనమైతి" మనివచింతురు.

భగవంతుని వర్ణింపుమ
తగినటులని యొకడునన్ను దమిగొనివేడ౯
జగదీశు నిరుపమేయుని
విగత హృదంతరుడ నెట్లు వివరింపగల౯ ?

ప్రియురాలి బలిపీఠి బ్రేయసుల్ మృతులు ;
పలుకేదెయు౯ రాదు వారిగొంతుకల.

ఒక మహనీయుడు ఆలోచనానిమగ్నుడయి తలవంచుకొని భావదృశ్య పయోధియందు మునిగియుండెను. ఆస్థితినుండి బయటకి వచ్చిన పిమ్మట "మీరు పచారు చేయుచుండిన యుద్యాన వనమునుండి యేమి వింతకానుక మాకు తెచ్చితి" రని యొకమిత్రుడడిగెను.

"గులాబిపాద దగ్గరకుపోయినప్పుడు, నాచొక్కాయి చెంగునిండ పువ్వులు కోసుకొని మిత్రులకు కానుకగా సమర్పింపవలయునని నేను తలంచితిని. కాని అచ్చటకి పోయినప్పుడు గులాబిపూవుల సౌరభ్యమునకు మత్తుడనయి చేతికొంగు జారవిడిచితిని" అని ఆయన చెప్పెను.

ఓసి బుల్బులి, శలభము నొద్దనీవు
అలవరుచుకొమ్ము ప్రణయపారాంతరమ్ము ;
దీపశిఖబడి యది కడతేరుగాని
బయటికే రావము౯ వినబడకయుండు.

దేవుని గనుగొంటి మటం
చేవో వర్ణించువార లెరుగనివారల్ ;
దేవునిగాంచిన తన్మయ
భావుల వృత్తాంత మెట్లు వచ్చును మనకు౯ ?

భావోహాతీతుడవగు
దేవా, నిను పండితుల్ నుతించెడు కంటె౯
నేవిని చదివినకంటెను
నీవత్యధికుండవంచు నేదలపోతు౯.

కడదాకె గ్రంథరాజము
కడచెను నాజీవితంబు గాంచుచు నుండన్.
విడువక మున్నటివలెనే
గడపెద నీపఠనమున కాలము నీశా.

ఇస్లాం మహాప్రభువు వర్ణనము

సాదీని గురించిన చక్కని ప్రశంసలు ప్రజాసామాన్యము నోట వెలువడుచుండెను. అతని వచనముల ప్రఖ్యాతి లోకమెల్లెడల వ్యాపించెను. ఆయన ప్రియమైన రెల్లుకలముతో రచించు కృతులను జనులు చక్కెరవలె భుజించుచుండిరి. ఆయన పద్యములు వ్రాసిన చిత్తుకాగితపు ముక్కలు సర్కారు నోట్లవలె చలామణి యగుచుండెను. దీని కంతయు అతని పాండిత్యాతిశయము వచోనైపుణ్యము కారణమనగాదు. ఏలయన, సార్వభౌముడు, కాలచక్ర పరిభ్రమణమునకు ఉత్తర ధ్రువము, సులేమానుకు ప్రతినిధి, ముసల్మాన్ భక్తరక్షకుడు, సాద్ జంగీ పుత్రుడు, ఇహలోకమున దైవచ్ఛాయ, ముజఫరుద్దీన్ అబూబకర్ (సర్వేశ్వరా! ఆయన కోర్కెలను నెరవేర్చుము) అనుగ్రహదృష్టిసారించి; అంగీకారము సూచించి; నిష్కపటమైన తన యభీష్టమును తెలియపరచి నందువలన, గొప్పవారు మొదలు సామాన్యులవరకు అందరును ఆయనపై స్నేహభావము చూపుచుండిరి. ఏలయన రాజుల మతమునే ప్రజలును అవలంబింతురు,

అనుపమ తావకీన కరుణామృత దృష్టులు నన్నుబోటి దీ
నుని పయి సోకినంతనె వినూతన యోగ్యత లాంఛనంబు హె
చ్చెను రవికంటె; నైజముగ సేవకునందు ననేక దోషముల్
పొనరియు, రాజు మెచ్చ ప్రతిలోపము మారును సద్గుణంబుగన్.

ప్రేయసి యొకనాడు పెట్టె నాచేత
స్నానంపు గదిలోన. సౌరంభంబీను
మృత్తిక నొక్కింత; మెచ్చుకొంచలరి
"కస్తూరి తునకవా, కాక. యంబరువ.
నేనుమత్తుడ నైతి నీదు నెత్తావి"
కనినేను దానితో నంటి నెయ్యమున.
అది నన్నుగని యిట్టులనియె: "ఓమిత్ర.
కొరగాని మట్టినై కుమిలితి మున్ను;

బాలకాలము గులాబీల సాంగత్య
మున నుంటి. నద్దాన దనరె నీపాటి
యంద చందము తావి, యట్లుగాకున్న
మున్నటివలె నేను మన్ను నైయుందు.

భగవంతుడా! ముసల్మానుల జీవితము పొడుగించి జీవిత ఫలము ననుభవింప జేయుము. వారి సత్కార్యములకు తగు ప్రతిఫలము నిచ్చింపుము. వారి స్నేహితులయు కార్య నిర్వాహకులయు పదవుల ఉన్నతి నొందింపుము. వారి విరోధులను, కీడుగోరు వారిని, ఖురానుసూక్తి ప్రకారము నిర్మూలము చేయుము, లోక పోషకా! వారి రాజ్యమును సంతానములను కాపాడు చుండుము.

ఉన్నతోన్నతుడును కలంక రహితుడును అగు భగవంతుడు, న్యాయాధిపతుల దండనీతి వలనను, కరగ్రాహుల ప్రయత్నములవలనను పావన షీరాజ్ పట్టణము అంత్యదినముదనుక శాంతియుతమై వర్ధిల్లునట్లు రక్షించుచుండును గాక!

కరుణాపాలిత లోక, మీకు నిహలోకచ్ఛాయయౌ పాదుషా
పరిపాలింపగ, పారసీక ధరణీ భాగంబునం; గాలదు
స్తర దౌర్గత్యము వచ్చె; నేడును ఫరస్ దేశంబునందెచ్చటన్
అరయన్ లేమ తదీయ దేహళికి దీటౌనాశ్రియస్థానమున్.

అదరు వేమిలేని ప్రజనందర బ్రోచు భరంబుమీది. యో
పాదుష, తత్కృతజ్ఞతను వాకొను భారము మాది; యాపయిం
గాదనకుండ యుక్తమగు కార్యఫలంబుల నిచ్చుభార మా
యాదిమసృష్టికర్త కరుణాఢ్యుని దౌనని విన్నవించెదన్.

మా పారసీకరాజ్యము
గాపాడుము దేవదేవ, కలకాలంబున్
ఏపాటి విప్లవానిల
కోపప్రళయోగ్రహతికి గురిగాకుండన్.

గ్రంథరచనాహేతువు

ఒకనాటిరేయి, గతించిన కాలమును గురించి యాలోచించుచు, వ్యర్థముగ గడచిపోయిన నాజీవితమునకై చింతించి, హృదయశిలా గృహమును బాష్పవజ్రముతో భేదించి, అప్పటి నాస్థితికి సరిపోవు ఈద్విపదలను పఠించితిని.

ప్రతి నిమేషము నూర్పువలన జీవితము
వ్యయమౌను; గమనించి యరయుదుమేని
ఎక్కువ శేషింప; దేబదియేండ్లు
గడచెనోయీ, యింక గన్నుమోడ్చెదవు;
మిగత యైదుదినాలు మేల్కని బ్రతుకు.
అంత్యకాలపుచింత నాత్మయందిడక,
సత్కర్మ రహితుడై చచ్చినవాడు
పరలోకమున సిగ్గుపడుట నిజంబు.
ప్రస్థానభేరీరవంబు బోర్కొనియె.
చంకమూటాముల్లె సవరింపవింక;
వెడలు వేకువనిద్ర కడుసుఖంబయ్యు
జాగుచేయును బాటసారి పైనంబు.
ఇటకు వచ్చినవారలెందరో క్రొత్త
గృహమును నిర్మించి, యేగుకాలమున
నింకొక్కరికి దానినిచ్చి పోయెదరు.
వారును గొన్నేండ్లవరకు సుఖించి
యేగుదురేగాని యిల్లొక్కడైన
బూర్వంబు కంటెను బూర్తిచేయండు.
చంచల చిత్తయౌ చపలాక్షినీవు
కామింపబోకుము; కడుద్రోహురాలు,
తగదు నీప్రేమకు, దలపోసి చూడు;
అఖిల మానవులకు హర్షమూలంబు
కడుపెయౌ; నది మెల్లగడచిన నేమి?
కట్టిన వెళ్లిన గష్టంబె రెంట;
అన్యోన్యము విరుద్ధమౌ చతుర్భూత
ములు కొంత కాలంబు గలసియు మెలసి
యొకటిగా నుండిన నౌదవు సుఖంబు;
అటుగాక నందొక్కడా మూటినణచి
చెలరేగ, దియ్యని జీవంబుమేను
వెడలునుగాన, వివేక సంపన్ను
డీ జీవితము పైననిచ్చ పెట్టండు.
సజ్జనుల్ దుష్టులు చచ్చెద, రైన
సౌజన్యమణి పెంపు జక్క గొంపోవు
సతడె సంతుష్టుండు సతి యశోధనుడు.

నీకంటెముందుగా నీదు గోరికకు
బరసౌఖ్య సాధన ప్రతిబింబించు
వెనుక నంపెడువారు వేరె లేరెవరు.
బ్రతుకు మంచునుబోలు. భానుండు వెలిగె;
మంచంత కరగెను. కొంచెమే నిలిచె;
అంత్యదినస్వామి యటవేచు చుండు;
ఓయి నెచ్చెలికాడ. యుత్తచేతులను
అంగడి వీధికి నరిగినా వేమొ
తలగుడ్డతో మళ్లి వెలువడ వంచు
భయము గల్గెడు నాకు; పండక మున్నె
యీాచపొట్టల మెక్కు నుత్త దరిద్రు
డామని దినములం దన్యుల మడుల
పరిగయేరి భుజింప వలసియే యుండు.
సాదిహితోపదేశము ప్రియంబార
వినుము; మార్గంబిట్టులొనరు; మానవుడ
వగుము; ధీరుండవై పథగామి వగుము.

ఆలోచించిన యనంతరము విషయ విముఖుడనై, మౌనము వహించి, యితరుల సాంగత్యము వీడి యొకమూల కూర్చుండుటయే యుచితమని నాకు తోచినది.

తననాలుక పని వినునటు
లొనరింపని వానికన్న యోగ్యతరుండౌ!
తన నలుక తెగి మూకత
ఘనబధిరత మూలబడిన కష్టుండైనన్.

ఇట్లుండ, యాత్రల యందును ఇంటియందును నాకు తోడు నీడగా నుండిన యొక స్నేహితుడు మున్నటి యలవాటు చొప్పున లోనికి ప్రవేశించి నన్నాట పట్టించి చతురోక్తులు ప్రేలియెంత వేట్కసల్పినను అతనికి ప్రత్యుత్తర మీయక, మోకాలిపై తల నానించుకొని దాసత్వము వహించి యుంటిని. అతడు మనసు నొచ్చుకొని నాతట్టుచూచి యిట్లనియెను:

అన్న. వచియించు శక్తి నీకున్న యపుడె
ప్రమదమున నాదరంబున బలుకు. మట్లు
గాక. రేపు మృత్యువుబంటు కడపద్రొక్క
మౌనమని వార్యముగ నీవు పూనవలయు.

నా మిత్రులలో నొకడు నాజీవిత పద్ధతిని గూర్చి యాతనికిట్లు తెలియ పరచెను. "సాది తన జీవితశేష మంతయు నిరంతర ధ్యాన పరాయణుండయి మౌనము వహించి యుండుటకు దృఢముగ నిశ్చయించు కొనెను. నీవు నీచేతి నైనమట్టుకు నీపనులు చూచుకొని నీకు సూటియైన దారినిపొమ్ము." అంత ట అస్నేహితుడిట్లనియెను: "నేను దేవుని పైనను పూర్వసహవాసము పైనను ఒట్టు పెట్టుకొంటిని. మునుపటివలె ఆయన నాతో మాటలాడకున్న ఊపిరిపీల్వను' అడుగైన వెనుకకు తీయను. ప్రతిజ్ఞా భంగము తేలికయైయుండ మిత్రులమనసు నొప్పించుట యవివేకము. అలీఖడ్గము ఒరలో నుండుటయు సాదీనాలుక నోట వతుకొని యుండుటయు పెద్దల యభిప్రాయమునకును ఋజుమార్గమునకును వ్యతిరేకముగ నుండును."

అరయఁ విజ్ఞుని నాల్కయెట్టిదన: బ్రాజ్ఞానేక విజ్ఞాన సం
భర భాండారకవాట కుంచికయగుఁ; ద్వారంబు బంధింప మం
దిర మందున్నయతం దమూల్యమణి మాణిక్యాది విక్రేతయో
చిరు సంభారము లమ్మువాడొ యని వాచింపంగ లేరెవ్వరుఁ.

పలుకక యుంట పండితుల భావమునం గడు మంచిదయ్యునీ
తులు పచరించుచో బలుకు దోసముగాదు; తగఁ వచింపగా
వలసినచోట మౌనమును, బల్కుట యుక్తము గానిచోట ప
గ్గలమగు మాట, లీ యిరువగల్ వెలయించును బుద్ధిమాంద్యముఁ

మొత్తముమీద ఆయనతో మాటలాడక యూరకుండుటకు తగిన శక్తియు, పరాఙ్ముఖుడనై యుండుటకు కావలసిన దిట్టతనమును నాయందు నశించెను. ఏలయన: అతడు నామనస్సున కెక్కిన ప్రాణమిత్రుడు.

పోరంగ వలసినప్పుడు
వైరిఁ నిర్జింప దగు నుపాయము గానీ.
బీరంబు వదల. వెనుకకు
దారందగు దారిగాని తడవుమ మున్నే.

ఆవశ్యకమును బట్టి ఆయనతో మాటలాడి హాయిగా విహరించుటకు బయలు వెడలితిని.

అది వసంతసమయము. మంచు దౌర్జన్యము శమించి సుఖప్రదముగ నుండెను. ఎర్రని గులాబీలు విరబూచి కలకల లాడుచుండెను.

కోరలు వసంత కాలమిది; కొమ్మలవేదిక లెక్కఁబుల్బులుల్
సరస మనోజ్ఞ గానములు సల్పుచునుండె; రుషాత్త చిత్తయై
చెరచెరలాడు కాంత నునుజెక్కులజారు శ్రమాంబులట్లు పొం
పిరిగొనె మంచుబొట్లు రుచిమించెడు నెర్రగులాబి పూవులన్.

తోటయందొక మిత్రునితోడ రాత్రియంతయు పుచ్చవలసినట్లు తటస్థించినది. అది మనోహర ప్రదేశము. అచ్చట తరులతలు అల్లిబిల్లిగ నల్లుకొనియుండెను. నేలయంతయు అద్దపు దునుకలచే వెదచల్లబడినట్లుండెనని చెప్పవచ్చును. ద్రాక్షతీగలందు పండ్లగుత్తులు నక్షత్ర పుంజములవలె వ్రేలాడుచుండెను.

వనమునందు గొలుసు వంకరలటు పారు
జల్లయూట కాల్వ మెల్ల మెల్ల;
దటుకులాయ ములను దనరు పక్షి కులంబు
సేయు రుతులు కర్ణపేయ మయ్యె.

పలువగ రంగులంగనుల పండువుసేయు గులాబి పూలతో
జెలువుగ నిండె బూబొదలు; చెట్లుఫలంబుల మ్రొగ్గె; గాలికిం
జలితములైన కొమ్మ చిరు సందుల వెన్నెలదూరి చెట్లచా
యలొనరె రత్న కంబళమునన్ని దెసల్ పరపించినట్లుగన్.

ప్రొద్దుపొడుపున ఇంటికి తిరిగి పోవలయునను కోర్కె అచ్చట నే కూర్చుండ వలయునన్న తలంపు నధఃకరింప, నామిత్రుడు పన్నీరు పూవులను సంబులములను ఇతర సుమములను కొంగునిండ నింపుకొని తిరిగిపోవ నుద్దేశించినప్పుడు ఆతనితో నిట్లంటిని: "తోటలోని గులాబీలు ఎంతకాలముండునో నీ వెరుగుదవు. పూలతోట యదనుగూడ నమ్మఁటకు వీలులేనిది. నశ్వరమైన దానిపై మనసు పెట్టుట యనుచితము గాదని పండితులు చెప్పుదురు." "అట్లయిన గత్యంతరమేది" యని యాయన అడిగెను.

నేనిట్లంటిని: "చూచువారికిని దగ్గరనున్న వారికిని సంతోషము కలిగించు 'గులాబితోట' యను గ్రంథమును నేను రచింప గలను. ఆగులాబితోట యాకులు శరన్మారుత నిరంకుశత్వమునకు పాల్పడవు. కాలచక్ర పరిభ్రమణము ఆ యుద్యానవన వసంత శోభను శరత్కోపమునకు గురిచేసి మార్పలేదు."

పెరిమందదట్టమునింపియుంచిన గులాబీ పూవులై దారు వా
సరముల్ చెల్లినవాడు; నట్టిసుమముల్ సంపాద్యముల్ గావు; నే
విరచింతుఁగా రమణీయమైతగు గులాబీతోట; నందొక్క సుం
దర పత్రమ్మును గొమ్మ; తద్వనరుచుల్ దర్పించు నిత్యమ్ములై.

నేనిట్లు వచింపగనే తన కొంగులోని పన్నీరు పూవులను క్రింద కుమ్మరించి, నాచొక్కాయి కొంగు పట్టుకొని "కరుణాహృదయులు చేసిన ప్రతిజ్ఞను చెల్లింతుర"ని ఆయన పల్కెను.

కొన్ని దినములు గడచిన పిదప, వక్తలకు పలికినచ్చినట్లుగను, పత్రలేఖకులవచోనైపుణ్యముకు హెచ్చుటకుందగినట్లుగను రెండధ్యాయములను (7, 8) చిత్తుపుస్తకమున వ్రాసితిని. గులాబితోటలోని శోభ యింకను శేషించియుండగనే ఈ "గులాబితోట" యను గ్రంథము సమాప్తమైనది.

అయినను లోకాశ్రితుడు, దైవచ్ఛాయ, కరుణాకిరణుడు, జనపోషకుడు, వదాన్యుడు, మతాశ్రయుడునగు పాదుషా ఆస్థానమున మెప్పువడసినప్పుడే యీ గ్రంథము నిజముగ సమాప్తమైనదనవచ్చును. (పాదుషా యింకను ఎట్టివాడనగా) దైవ బలయుతుడు, వైరులనిర్జించువాడు, సంపల్లక్ష్మికి బాహువు, మత ప్రదీపము, ఉత్తమోత్తముడు, ఇస్లాము మతకీర్తిమూర్తి, అతాబేక్ పుత్రుడు సాదు, రాజాధిరాజు, జన సమూహము కంఠములపై నధికారముగల పాలకుడు, అరబ్బీ పారసీసుల్తానుల కధినేత, సముద్రములను ఎడారులను పరిపాలించు ప్రభువు, సులేమాన్ రాజ్యమునకు వారసు, ముజఫరుద్దీన్ అబూబకర్ బిన్ సాద్ బిన్ జంగీ.

దేవుడు, తండ్రిబిడ్డల భాగ్యమును నిరంతరము పోషించుగాక! వారియిరువురి గొప్పతనమును అభివృద్ధిపరచుగాక! వారిసత్కార్యములను సఫలీకృతము చేయుగాక!

ధూధవానుగ్రహ కృపాభిభూషితంబు
నైనచో నాదు కృతిరాజ మన్నికడల
జెలువు వెదజల్లు నార్జంగి చిత్రమటుల,
చీని చిత్రాలయమువోలె; దీని జదివి

విముగువేసట గొనరని విశ్వసింతు
విరిసిన గులాబితోట హృద్వేదనలకు
కారణము గాదు; అందు మంగళము గూర్చు
పీఠిక అబూబకర్ సాదుబీనుజంగి
పేరనంకితమైయుంట ప్రియతరంబు

అమీర్ ఫికరుద్దీన్ అబూబకర్ బిన్ అబూనసర్ ప్రశంస.

మరియొకమారు నా భావమను నూత్నవధువు సౌందర్య విహీనయని యెఱింగి సిగ్గుపడి తలయెత్తక నిరాశాస్ఫోరకములైన కన్నులతో అధోముఖియై సుందరయువకులున్న సభను శోభావతియై ప్రవేశింప వెరచుచున్నది. ఏలయన, లోకాధిపతి, న్యాయవంతుడు, విజయశాలి, జనపోషకుడు, రాజ్యాధారుడు, రాజ్యవ్యవహార మంత్రజ్ఞుడు, దీనశరణ్యుడు, విదేశ జనాశ్రయుడు, పండితులకు పట్టుగొమ్మ, పుణ్యాత్ములకు మిత్రుడు, పారసీక జాతియకీర్తి మూర్తి, రాజ్యమునకు దక్షిణబాహువు, ఆస్థానికులకు అధినేత, మత రాజ్య పాలకుడు, ఇస్లామునకును ముసల్మానులకును ప్రాపు, రాజ్యమునకును రాజులకును విశ్వాసపాత్రుడు అబూబకర్ బిన్ అబూనసర్ అంగీకారభూషణముతో నలంకరింపబడినదే ఈ వధువు వెరపుమానదు. దేవుడాయన జీవితమును పొడుగించుగాక! ఆయన పౌరుషము నున్నతి నొందించుగాక! హృదయమును రంజింప జేయుగాక! ఆయన సత్కార్య ఫలితములు అభివృద్ధి చెందించుగాక! ఏలయన ఆయన అన్నిదేశముల గొప్పవారలలో ప్రఖ్యాతుడు; సకల సద్గుణములకు సంగమస్థానము.

ఆయన యనుగ్రహచ్ఛాయ యందు మనెడు
వాని దోషంబులు విధేయ వర్తనలుగ
మారు; పూర్వవిరోధులు చేరవారి
ప్రాణమిత్రుల పోలిక బాసిచనరు.

సేవకానుయాయుల యందరయందు ఒక్కొక్కనికిని ఒక్కొక్క కొలువు నియతమైయున్నది. దానిని నిర్వహించుటయందు అలక్ష్యముతో కొంచెమాలసింతురేని వారు నిశ్చయముగ శిక్షకు పాత్రులగుదురు. అయినను గొప్పవారికి కృతజ్ఞతను తెలిపికొనుచు, వారి సద్గుణముల నభివర్ణించుచు, వారికి శుభము

చేకూరుటకు దేవుని ప్రార్థించు మాబోటి దరిచేసి మండలికి ఈ శిక్షవర్తింపదు. ఇటువంటి కొలువు నిర్వర్తించుటకు సమీపమున నుండుటకంటె దూరస్థులుగ నుండుటయే మేలు. ఏలయన, దగ్గరకీర్తించుట ముఖస్తుతియగును. దూరమున నున్న, ఈ నిందపాడమక అంగీకృతమగును.

కాలమాతకు నీవంటి ఘనుడు సుతుడు
పుట్టెనన్న సంతోషము పట్టలేక
నింగి వంకరవీపు చక్రంగనయ్యె;
ప్రీతి సామాన్యప్రజలకు నీతినేర్ప
సృష్టికర్తయు నొకదాను నేరికొంట
సదమల వివేకమునకు దృష్టాంతమగును:
పేరుజీవించు నతడొందు విపులకీర్తి;
అతడు మరణింప గుణవర్ణనాత్మకంబు
పేరు జీవించు; పండితుల్ చేరినిన్ను
బొగడినను బొగడకయున్న సగుటుకొకటె!
సొగసుకత్తెమొగంబు సోయగము దిద్ద
చేటి పనితనమేల పంచేటుగాక!

సేవనంగీకరింపక వైరాగ్యము పూనుటకు కారణము.

ప్రధాన మంత్రిని స్వయముగా సేవించుటకు, కొలువుకూటమునకు నేను రాకపోకలు సేయని లోపమునకు ఈ క్రిందికథ యుదాహరణ ప్రాయ మగును.

హిందూస్థానమున పండిత సంఘము బుజుర్ జుంహార్ గుణగణములను గురించి తర్కించుచుండిరి. కట్టకడపట ఒక్క దోషము తప్ప మరియేమియు వారికి తోపలేదు. అది యేదన: ఆయన చాల యాలస్యముగ మాటాడును. ఆయన చెప్పనదంతయు వినవలయునన్న శ్రోతలు చాల కాలము వేచియుండ వలయును.

ఈ దోషనిర్ణయమును బుజుర్ జుంహారు విని యిట్లనియెను: మాటచెప్పిన వెనుక ఏలచెప్పితినని వేదన పడుటకంటె, చెప్పకమునుపు ఏమిచెప్పుదునని యాలోచించుట మేలు.

అనుభవజ్ఞుడు మాటలందు దిట్టండు
మును ముందు దలపోసి వెనుక మాటాడు;
యోచింపక వచించి యూర్పువెచ్చింప
వలదు; చక్కగబల్క వాడాలసించి
మాటాడ నేమి ప్రమాదంబుగల్గు?
పలుమారు దలపోసి వచియింపమేలు;
ఇకజాలునని చెప్పుటకు మున్నె నిలుపు;
మృగసంతతులకంటె శ్రేష్ఠుండు నరుడు
మాటలు నేర్చుట; సూటిగా నుచిత
భంగి వివేకించి పలుక లేవేని
మృగములు నీకంటె మేలన వచ్చు.

పుణ్యాత్ములకు నా కరమును, ఉత్తమపండితులకు కేంద్రస్థానమునగు రాజాస్థానిక సభయెదుట నేనెట్లు భాషింపగలను? ఎట్టులో సాహసించి మాటాడుదునేని నా సిగ్గిడితనమును వెల్లడించినవాడనయి పాల్లు సరకులను మహామంత్రియెదుట పెట్టియుండును. గాజుపూస రత్నవ్యాపారుల యంగడియందు ఒక యవగింజకైన కొరగాదు. దీపము సూర్యునియెదుట ఒక కిరణమునైన వెలిజిమ్మదు. సౌధాగ్రగోళము అల్పంబు పర్వతము ప్రక్కన చిన్నదిగ నగపడును.

గర్వించి మెడనిక్క గిల్గినవాడు
తన యధఃపతనంబు దానె యార్జించు;
సాదినమ్రుడు, ముక్తసంచార పరుడు;
పతితుని పైనొరుల్ పగబూనబోరు;
మొదట నాలోచన, పిదప వాక్యంబు;
మునుమూలబంధంబు వెనుక కుడ్యంబు;
ఏను కృత్రిమ సుమాకృతుల నిర్మింతు;
నైన, బూదోటలోనవి కొరయౌనె?
నేను సుందరమూర్తినైన ప్రేయసుడ,
నైన, "కనాను"లో నది యేమిలెక్క?

"ఇంతటి ప్రాజ్ఞత యెవనియొద్ద నేర్చుకొంటి"వని లక్మానును కొందరు ప్రశ్నించిరి.

"గ్రుడ్డివానియొద్ద. ఎట్లన వాడు నేల తడవుకొని చూడనిదే కాలు పెట్టడు" అని ఆతఁడు చెప్పెను.

"ఎదురొక్కనుటకు పూర్వము తిరోగమన మార్గము పదిలపరచుకొను" మని అరబ్బులు చెప్పుదురు.

మగతనంబున్నదని రుజువుచేసి పెండ్లియాడుము.

బవరమున గోడిపుంజు దుర్వారమైయ్యు
గింజుగోళుల వేగతో గెలయబడునె?
ఎలుకపైదూక సింహమౌ నింటిపిల్లి,
యదియె పులిమ్రోల నెలుకయై యడిరిపాపు.

అయినను గొప్పవారు దీనుల దోషములపై కన్నువేయరు. తక్కువవారి లోపములను తూర్పారబట్టరు. అట్టి యుదార హృదయుల సుస్వభావముపైగల నమ్మకముచేత, సంక్షేపముగ అపూర్వములైన సాదృశ్యములు, కవితలు, కథలు పూర్వనరపాలుర స్వభావపరిశీలనము మున్నగునవి యీ గ్రంథమున సమకూర్చితిని. దీనికై నాయమూల్య జీవితమున చాల భాగము వెచ్చించితిని. "గులాబితోట"ను రచించుటకు ఇవియే కారణములు.

ఈ కవితయు నీ క్రమమును,
నాకాయము చివికి యణుగుణంబులు ధూళిఁ
ఏకంబై చను పిదప న
నేకము లౌనేండ్లు పూండ్లు నిటువలెనిల్చుఁ.

సరసమౌ నీ రచన నాదు స్మరణ చిహ్న
మైన చిత్రింబు; స్థిరముగాదవని బ్రతుకు
అనఘ లేదీవజనుల కృతార్థతలకు
దేవుని బ్రిణతి సల్పి ప్రార్థింపకున్న.

గ్రంథ రచనాపద్ధతి, అధ్యాయాలంకరణ విన్యాసక్రమము, సంగ్రహవచోబంధము చక్కగ నాలోచించి, శోభావంతమైన యీ గులాబితోట అష్టద్వారయుతమైన స్వర్గమును బోలునట్లు అష్టాధ్యాయిగా నొనర్చితిని.

పఠితలకు విసుగు వేసటలు కలుగకుండు నట్లు గ్రంథమును సంక్షేపించితిని.

ప్రచురణ సంవత్సరము

క్రీ—వె— 1258.

మాకు సంతోషకరమైన మాసమదియు;
ఆరు వందల యేబదియూరు హిజ్రి;
హితమె యుద్దేశ; మటురచయించినాడ;
అవల వెడలితి దేవుని కప్పగించి.

అవతారిక సంపూర్ణము.

గులాబితోట

ప్రథమాధ్యాయము

పాదుషాల ప్రవర్తనము

ఒకానొక పాదుషా యొక ఖైదీని వధించుటకు ఆజ్ఞాపించె నని వింటిని. దిక్కులేని యా హతభాగ్యుడు నిరాశాస్థితియందు తన సొంతభాషలో తెలివితక్కువగ మాటాడి, పాదుషాను దూషింపసాగెను. ప్రాణములపై ఆసవదలిన వాడు మనసునకు వచ్చినట్లెల్ల మాటాడును.

తప్పించుకొనరాని తరుణంబునందు
గత్తివాదరబట్ట గమకించుజేయి

వాడేమి పలుకుచున్నాడని పాదుషా యడిగెను. అచ్చటనుండిన వజీరులలో సుస్వభావుడొకడు, మహాప్రభూ, క్రోధమునడంచుకొని దీనుల మన్నించువారిని సర్వేశ్వరుడు సఖ్యముతో కనికరించునని వాడు మనవి చేయుచున్నాడు అని విన్నవించెను. ఈ పలుకులకు పాదుషాకు కరుణగలిగి వాని మారణదండనము ఉపసంహరించెను.

అంతట ఆ వజీరునకు ప్రతిస్పర్ధియైన వేరొక వజీరు లేచి మహాప్రభూ, మాబోంట్లు పాదుషాయెదుట సత్యముదప్ప ఇతరము చెప్పరాదు. వాడు ఏలినవారిని నీచముగ నిందించెనని చెప్పెను. ఆ మాటలకు పాదుషా కోపముతో పెడమొగము పెట్టుకొని, ఓయీ, ఆతడు చెప్పిన యబద్ధము నీవు చెప్పిన సత్యమునకంటె నాకు ప్రియమైనది. ఏలయన, ఆతని యబద్ధము సదుద్దేశప్రేరితము నీ సత్యము అసూయామూలకము. హితకరమైన యసత్యము, ఉపద్రవకరమైన సత్యమునకన్న మేలని పెద్దలు చెప్పిరి.

తానుజెప్పినట్లు తప్పకవర్తించు
నృపుని కెప్పుడైన నెన్నదేని,
మంచిమాటచెప్ప మరియేమి చెప్పిన
నకట! కీడువచ్చు: నఘమువచ్చు.

ఫరీదూను చక్రవర్తి సౌధతోరణమునందు ఈసూక్తి వ్రాయబడియున్నది :

స్థిరముగా దెవ్వరికినైన ధరణితలము,
మనసు దేవునిపై నిల్పికొనుము; చాలు;
నిన్నుబోంట్లెందరనొ పెంచి మన్ను సేయు
నవనిని తలాడగానమ్మి యానుకొనకు.

ఎప్పుడో యొక్కనాడంతు చెప్పకుండ
విమలజీవము దేహముల విడును గాన.
రాచగద్దియ మరణంబు ప్రాప్తమైన,
దుమ్ములోబడి చచ్చిన దుదకు నొకటె।

౨

సబుక్తగీను కుమారుడైన సుల్తాను మహమ్మదు కళేబరమంతయు మన్నదిని దుమ్మయిపోయినను, కన్నులుమాత్రము కంటిలో త్తలలో అటునిటు కదలుచు చూచుచున్నటుల, ఒక ఖురాసాను రాష్ట్రాధిపతి కలగనెను. ఆకలలోని భావమును వివరించుటకు పండితులకందరకు అసాధ్యమయ్యెను. అంతట నొకదరిబేసి వినయపూర్వకముగ నమస్కరించి, అయ్యా, ఆయన రాజ్యము పరహస్తగతమైనదని యిప్పటికిని చూచుచున్నాడని స్వప్నభావమును వెల్లడించెను.

పూర్వమెందర ఖ్యాతపూరుషులను
ఇలను బూడ్చిరి, యునికి గుర్తేదినేడు?
భువిని బెటిన ముదిపీను చివికిమన్ను
దిమట నష్టికలైనను గసుల బడపు.

చెల్లి బహుకాలమయ్యు నౌషీరవాను
ఇంకనుంబేరు బ్రతుకు న్యాయేశుడౌట:
కాయముండంగ లోకోపకారివగుచు
జీవితామూల్య లాభంబుజెందు మోయి.

3

ఒకానొక రాజకుమారుడు పొట్టివాడుగను కంటికి తాళని సామాన్యుడుగనుండెనని వింటిని. ఆతనితోడబుట్టువులు ఒడ్డుపొడుగు గలవారుగను రూపవంతులుగనుండిరి.

ఒకప్పుడు తండ్రి ఆ అల్పకాయుని తిరస్కారదృష్టితో చూచి విసుగుకొనెను. కుమారుడు కుశాగ్రబుద్ధితో విచారించి యిట్లని యనెను:

నాయనా, బుద్ధిమంతుడైన పొట్టివాడు బుద్ధిహీనుడైన పొడుగువానికన్న మేలుగద!

ఆకారపుష్టిగల ప్రతిదానికి మూల్యము హెచ్చుచుండునా?

(మేక ఆకారమున చిన్నదయ్యు దాని మాంసము తినుటకు యోగ్యమైయున్నది ఏనుగ పెద్దదయ్యును దానిమాంసము నిషిద్ధము. తూర్ పర్వతము కొండలన్నిటికంటె చిన్నదయ్యును భగవంతుని దృష్టియందు పెద్దదిగను గౌరవ యుక్తమైనదిగ నున్నది.)

బక్కచిక్కియు సత్త్వమాశ్వంబు మేలు
గాదె, దొడ్డెడుఖరములకంటె ననుచు
తెలివిగల బక్కవాడొక తెలివిలేని
స్థూలకాయునితో నన్న సూక్తి వినవె?

ఈ మాటలకు తండ్రి నవ్వెను; అమాత్యులు మెచ్చుకొనిరి; సహోదరులు రోషావమాన పీడితులైరి.

ఎప్పుడైన మాటాడ నోరెత్తుదాక
తెలివియును లోపమును దాగితెలియరావు;
ప్రతిపనంబును శూన్యగర్భంబటంచు
నూహసేయకు, పులిహరుక్కుచుండ వచ్చు

ఆ కాలమున రాజునకు ప్రబలవిరోధిగనుండిన పరిసర రాష్ట్రాధిపతియొకండు తలవాకిటఁ బడి విడిసెని ఇరువాగుల సైనికులు ముఖాముఖి నిలబడి పోరాటమునకు నుద్యుక్తులైనప్పుడు మొట్టమొదట అల్పకాయుఁడైన ఆ రాజకుమారుఁడే రణరంగమున ప్రవేశించి యిట్లు వచించెను.

సంగరంబున బోరాడు సమయమందు
దుమ్ము నెత్తుటిబురదలు గ్రమ్ముకొనిన
నాశిరము జూతురేగాని, నాపిరుంద
కంఠగత జీవినైనను గాంచరరులు.

వైరిసేనల డీకొని పోరునతఁడు
ఆత్మరక్తంబుతో జూదమాడుచుండు;
వెంచి వెన్నిచ్చి పరుగిడు పిరికిపంద
భటుల రుధిర ప్రవాహంబు బందెమిడును

ఇట్లనుచు ఆరాజకుమారుడు విరోధి సైనికులపై కురికి కొందర మొగదాలలను వధించెను. తరువాత తండ్రియొద్దకువచ్చి గౌరవ పురస్సరముగ నేలముద్దిడి యాతఁడిట్లనియెను:

నాశరీరాల్పత దలంచినావె గాని
గట్టితనపు నైపుణ్యము గాంచవకట!
బడుగు గుఱ్ఱంబు రణభూమి బనికి వచ్చు
గండపట్టియు నెద్దులక్కఱకురావు

అంతకంతకు విరోధి సైన్యము హెచ్చుచుండెను. వీరిసైనికుల సంఖ్య తగ్గుచుండెనని వినిని తను సిపాయీలలో కొందరు వెరచి

వెన్నిచ్చి పరుగెత్త నుద్దేశించుచున్న సంగతి నెరింగి రాజకుమారుడు ఎలుగెత్తి ప్రోత్సాహకరముగ కేకవేసి, ఓ వీరులారా! ఆడువారి రవికెలు మీరు తొడుగుకొనక యుందురేని యుద్ధ ప్రయత్నము గావింపుడు అని మందలించెను. ఈపలుకులు విన్నంతనే గుఱ్ఱపు రౌతులకు వీరావేశము పిచ్చలించి మరియొక మారు విరోధిసైన్యములపై తలపడిరి. ఆనాడు రాజకుమారుని పక్షముననే జయము చేకూరెను. అంతట తండ్రి కుమారుని కౌగిలించుకొని మొగమును కన్నులను ముద్దిడి కొనియెను. నా నాటికి తండ్రికా పుత్రునిపై ప్రీతి హెచ్చుచుండెను. కడకు అతనినే యువరాజుగా నొనర్చెనని వింటిని.

సహోదరులు అసూయాగ్రస్తులయి ఆతని చంపుటకు అన్నమునందు విషము పెట్టిరి. ఈ విషయము సహోదరి మేడమీది గది నుండిచూచి, హెచ్చరించుటకుగా కిటికీ తలుపును కదలించి చప్పుడు చేసెను. రాజకుమారుడు సూక్ష్మబుద్ధి కావున ఆ హెచ్చరికలోని భావమును గ్రహించి అన్నములోనున్న చేతిని వెనుకకుతీసి, సముదరులు మరణించుటయు, బుద్ధిహీనులు వారి స్థానము నాక్రమించుకొనుటయు కష్టసాధ్యమని యనుకొనెను.

అవని హుమాపక్షి యంతరించినను
గూబరెక్కల నీడగోర రెవ్వరును.

ఈ దుష్కార్యము తండ్రికి తెలియవచ్చి కొడుకులను రావించి తగువైన చీవాట్లు పెట్టి పంపెను. తరువాత అన్నదమ్ములలో అన్యోన్య కలహములు కలుగకుండు నటుల సీమాంత రాష్ట్రములను తృప్తికరముగ నొకరొకరికి తండ్రి పంచి పెట్టెను.

ఒకగొంగడి పదిమందిదరిబేసులు నిద్రపోవుటకు చాలునుగాని, ఒకరాజ్యము ఇద్దరు పాదుషాలను భరింపలేదని పెద్దలుచెప్పుదురు.

సగమురొట్టైను భక్షించి మిగత సగము
దైవ భక్తుండు పేదకు దానమిచ్చు;
ఒక్క దేశంబు గెలువ నింకొక్కదిక్కు
గడవ సేయ సుల్తానుకు గలుగుగోర్కె.

౪

అరబ్బీ దేశపు దారిదోపిడిగాండ్రి తండము ఒకపర్వత శిఖరమున నివసించుచు సార్థవాహముల మార్గము నరికట్టుచుండిరి. చుట్టుపట్టుల గ్రామస్థులు వారి మోసములకు చాల కష్టపడుచుండిరి.

దుర్గమపర్వత ప్రదేశమునందలి యొక యభేద్య దుర్గమును వశపరచుకొని వారు దానిని తమ నివాసస్థానముగ నొనర్చుకొని యుండుకతన, సుల్తాను, రక్షకభటులు సైతము వారిదెబ్బకు తట్టుకొనలేకుండిరి. ఈదారిదొంగలను ఇట్లే అప్రతిహతముగ వదలిపెట్టిన ఇకమీద వారిని ప్రతి ఘటించుట యసాధ్యమని తలంచి చుట్టుపట్టు జిల్లాల యధికారులు వారివలన గలుగు బాధలు నివారించుటకయి ఆలోచించిరి.

క్రొత్తగా వేరునాటిన కుజమునొకడె
పెల్లగించును; కాలంబు చెల్లెనేని
గిలక యత్రింబు సంధించి వెలువరింప
వలవిగాకుండు వేళ్లల నంటిదిగుట.

ఊటనీటికాలువ తలనొక్క మేకు
గొట్టియొకవేళ నీరాపిపెట్టవచ్చు;
అదియె పెంపొంది వెల్లువయయ్యెనేని
గజమునెక్కియు దరియింప గష్టతరము.

దొంగల చర్యలను కనిపెట్టుటకు ఒకచారుని నియమింప నిశ్చయించి అధికారులు అనుకూల సమయము కొరకు నిరీక్షించు చుండిరి.

ఒకనాడు దొంగలగుంపు ఇంకొక సంఘముపై దాడివెడలి యుండుటవలన వారి బిడారము అరక్షితముగ నుండెను. అనుభవజ్ఞులును యుద్ధమునందారితేరిన ధైర్యవంతులునగు కొందర భటులను పంపిరి. వారు కొండలోయలలో దాగియుండిరి. చీకటి పడిన వెనుక దొంగలు దోపిడి యాత్రనుండి మరలివచ్చి కొల్లముఖపుల నొక చోట నుంచి ఆయుధములను తీసిపెట్టిరి.

రవిబింబ మంధకారంబున గ్రుంకె;
చేపనోటను బ్రవేశించె యూనస్సు.

అంతట విరోధియైన నిద్దుర మొట్టమొదట వారిపై నధికారము కొనసాగించెను. రాత్రి యొకజాము గడచెను.

తరువాత ధైర్యశాలులైన యుద్ధభటులు మాటునుండి వెడలివచ్చి దొంగల నొక్కొకరని పెడరెక్కలువిరచి కట్టి సూర్యోదయమైనవెంటనే సుల్తాను దివాణము ముందు నిలువబెట్టిరి. సుల్తాను వారినందరను వధింప నాజ్ఞాపించెను తలవని తలంపుగ వారియందు క్రొత్తగా పొటమరించిన యౌవనపు ఫలముగలవాడును, కపోల గులాబీవనమందు నవీనముగ నంకురించిన యూకుపచ్చలు గలవాడునగు నొక యువకుడుండెను. వానినిచూచి యొకవజీరు సుల్తాను సింహాసన పాదప్రదేశమును గౌరవ పురస్సరముగ ముద్దిడి ప్రార్థనాపూర్వకముగ శిరము భూమిపయిమోపి, మహాప్రభూ, యీ యువకుడు తక్కిన సహచరులవలె జీవితారామము లోని ఫలములను రుచి చూచి యెరుగడు. యౌవన భోగము లనుభవించి యుండడు.

కావున వీనినిమన్నించి, యురిశిక్షను నుపసంహరించి, యీ మీ దాసుని మనోభీష్టమును ఆదరింతురని యేలినవారి సహజౌదార్యము పై నాకు ఆశగలదు అని మనవి చేసెను.

ఈమాటలు పాదుషా యున్నతాశయమునకు ప్రతికూలముగ నుండుటవలన పెడమొగము పెట్టుకొని యిట్లనియెను:

భవ్యహృదయుల సద్బోధ పట్టువడదు
అధమ నైజము గలయట్టి యల్పమతికి;
చెనటి మూకకు గావించు శిక్షణంబు
గర్భగుడిపైన యకరోటు కాయసూవె.

వీరి వంశమును కుటుంబమును నాశనము చేయుటయె మేలైనపని. ఏలయన, మంటను చల్లార్చి వేడికొరకచ్చును వదలి పెట్టుటయు, విషసర్పమును చంపి దానిపిల్లలను పోషించుటయు బుద్ధిమంతుల కార్యము గాదు.

అంబుదంబులు గురిసియు నమృతవృష్టి
ఫలము గనలేవు 'బేదు' కొమ్మలను నీవు;
దుఃస్వభావుని శిక్షింప దొరకదెపుడు,
చక్కెరనుదీయ వశమౌనె వాపతుంగ.

వజీరు ఈపలుకుల నాలకించి, యిష్టము వచ్చిరానియటు మెచ్చుకొని, అభిప్రాయ సౌష్ఠవమును కొనియాడి యిట్లని విన్నవించెను: మహాప్రభూ, మీ యేలుబడి శాశ్వతముగ నుండుగాక! దేవరవారు సెలవిచ్చిన దంతయు సత్యము, ప్రత్యుత్తర రహితమైన ప్రశ్నము. దుర్మార్గుల సంఘమునందు శిక్షణము పొందిన యెడల వారి స్వభావమే పట్టువడి వీడును అట్టివాడేయగును. కాని, సజ్జనుల సహవాసగోష్ఠియందు శిక్షింప బడునేని ఆబుద్ధిమంతుల స్వభావమె

యలవడును. పాపము! వీడిప్పుడు చాల లేబ్రాయమువాడు. స్వసంఘము యొక్క దుర్వర్తనములు, పెడదారులు వీని చిత్తమునందింకను హత్తుకొనవు. 'హదీసు'న నిట్లు చెప్పబడి యున్నది:

''నిజముగా ప్రతి బిడ్డయును 'ఇస్లాము'నకు తగిన ప్రకృతితో పుట్టును. తర్వాత తల్లిదండ్రులవలన, యూదుడుగనో క్రైస్తవుడుగనో అగ్నేయ మతస్థుడుగనో యగుచున్నాడు.''

దుర్జనులతోడ నోహు కూతురు వసింప
జ్ఞానదృష్టి నశించె సంతానమునకు;
సప్తనిద్రాళు శునకంబు సజ్జనాను
సరణమున మానవత్వము సంగ్రహించె.

ఇట్లుపలికి నంతట, ఆస్థానము నందలి యితర రాజమిత్రులును ఆ యువకుని క్షమింప ప్రార్థించిరి. ప్రభువు వానిని మన్నించి ''ఉచితము కాదని తెలిసియు మన్నించితి'' నని యిట్లు పలికెను: జాలురుస్తుమునకు చెప్పినసూక్తి తెలియునా?

అల్పుడును నిరాధారు డటంచు నీవు
పగతు నెప్పుడు దలపోయ బాడిగాదు;
ఊటమొగదల జిన్నదై యుండి యుబ్బి
బరువు నొంచెను గొంపోవ నరసి యుంటి.

అంతట వజీరు ఆ యువకుని ఇంటికి కొనిపోయి ప్రేమాదరణములతో పెంచుచు శాస్త్ర పారంగతుడైన యొకపండితుని వానికి విద్యా గరపుటకు నియోగించెను. సంభాషణమునందలి యొరపును, తర్కమును, రాజాస్థాన వర్తులకు తెలియవలసిన మట్టుమర్యాదలను నేర్చుకొని కళల యందారితేరి ఆ యువకుడు అందర ప్రశంసలకు పాత్రుడయ్యెను. ఒకనాడు వజీరు ఆ యువకుని సద్గుణములను కొల

దిగ సుల్తాను బ్రాహ్మణుల ప్రశంసించుచు, పండితుల శిక్షణము వాని చిత్తమున చక్కగ నలికినది. మున్నటి యజ్ఞానము వాని స్వభావమునుండి నిర్మూల మైనది అని విన్నవించెను. ఈమాటలకు సుల్తాను నవ్వి యిట్లనెను:

మనుజాని సాంగత్యమున బెంచ బడియు
తుదకు దోడేలెయౌ దోడేటికూన.

రెండు సంవత్సరములు గడచినంతట పట్టణములోని యల్లరి మూకలు యా యువకుని యొద్ద చేరి స్నేహ సూత్రముల బంధించిరి. అతడును సమయమునకై వేచియుండి, వజీరును అతని యిద్దర బిడ్డలను హత్యగావించి విశేషధనమును కొల్లగొట్టి దొంగల నివాస స్థానమైన పర్వతగహ్వరమునకు వెడలి, తండ్రిస్థానమును ఆక్రమించి గడిదీరిన జనకంటకుడాయెను. ఈ వృత్తాంతమువిని సుల్తాను దుఃఖములో వ్రేలుకరచి యిట్లనియెను.

చెడ్డయినుము పెట్టి చేయ సాధ్యంబౌనె
యేరికైన వాడి యెసగువాలు?
శిక్షణమున దుష్టచిత్తుండు సజ్జనుం
డగునె పండితుండ. యరయుమోయి.

పక్షపాతరహిత భావంబుతో వర్ష
మిన్నిచోట్ల గురియు. నైనగాని
తోటలందు మొలచు దొలికారు లావెలు.
చవుటి పరలనెదుగు జట్టుతుంగ

నీపప్రియత్న బీజంబులు నిరుపయుక్తి
జల్లకుము; చౌటబెరుగునే సంబులములు?
చెడ్డవారికి సువకృతిసేయుటెల్ల
మంచివారి కపకృతి గావించినట్లు

౫

ఉగ్లమీాషు చక్రవర్తి సౌధద్వారముకడ నేనొక సేనాధిపతి కుమారుని కాంచితిని. తెలివి తేటలయందును కుశాగ్రబుద్ధియందును అతడు వర్ణనాతీతుడు. బాల్యము నుండియు గొప్పతనపు సూచనలు ఆతని లలాటమున మూర్తిభవించియుండెను.

తెలివి తేటల కల్మిదీపించె నతని
తలమీదుగా గొప్పతనమను చుక్క.

ఆ యువకుడు శరీర సౌష్ఠవ సౌందర్యములను బుద్ధి పాటవమును గలవాడని సుల్తానున కెఱుకపడెను. ఐశ్వర్యము హృదయమునందున్నది, ఆస్తియందు కాదు. గొప్పతనము వివేకము నందున్నది, వయస్సునందు కాదని పండితులు చెప్పుదురు.

సరిసమానులగు సహవాసులకు ఆతని యున్నతిపై అసూయ వొడమి ద్రోహియన్న అపనింద నారోపించి చంపించుటకు వ్యర్థప్ర ప్రయత్నములు సలిపిరి. స్నేహితుడు దయగలిగి యుండ విరోధి యేమి చేయగలడు?

నీయందు వారికి ద్వేషము కలుగుటకు కారణమేమని రాజడిగెను.

దేవరవారి ప్రభుత్వశీతలచ్ఛాయాశ్రయము వలన అందరను సంతోషపెట్టగలిగితిని. నాయధఃపతనముచే సంతసించు అసూయాగ్రస్తులు మాత్రము మిగిలియున్నారు. దేవరవారి భోగభాగ్యములు శాశ్వతముగ పెంపొందుగాక! అనియాతడనెను.

ఒరుల మతులనొప్పింపక యుందుగాని
యాత్మపిహితార్థుడయిన యీర్ష్యాళునేమి

సేయగలం? చావుమోయి దుశ్శీల. నీకు
వేదనాముక్తి మృతికంటె వేరులేదు.

ధనవంతుల కింకెప్పుడు
ధనమును గౌరవము యశము తగ్గునటంచుం
బని చెడిన మందభాగ్యుడు
దినము నిరీక్షించుచుండు దీరని కోర్కెన్.

గబ్బిళముకన్ను. దినవేళగానకున్న
తప్పుసూర్యునిదాయేమి? తథ్యమరయ
నట్టి వేయికన్నులు గ్రుడ్డివగుట మేలు
అర్కబింబము నల్లని దగుటకంటె.

౬

పారసీక నరపాలుడొకడు దౌర్జన్యమునల్పి రైతుల ద్రవ్యము హరించుచు వారిని పడరాని యిడుమల గుఱుపు చుండెనని చెప్పుకొనిరి. ఆ కష్టములకు మోసములకు బ్రతుకుపై రోతపుట్టి బాధలు తప్పించుకొనుటకు ప్రజలు పరరాష్ట్రమునకు వలసపోయిరి.

రైతులసంఖ్య తగ్గుటవలన ప్రభుత్వాదాయము సన్నగిల్లెను. రాజకోశము నిర్ధనమాయెను. ఈ కీ లెరిగి విరోధులు విజృంభించి యొత్తిడి కలిగించిరి.

రిక్తదశ దోడుపాటు గోరెదవ యేని
యున్న యప్పుడు దాతృత్వ మూనవలయు;
బానిసయు నాదరింపని స్వామి విడుచు;
పరుడు సైతము దాసుడౌ గరుణ చూప.

ఒకసమయమున, రాజసముఖమున ‘‘పానామా’’ యను

పూర్వ నరపాలుర చరిత్రమునందలి జొహాక్ అను జనకంటకుని రాజ్య భ్రష్టతయు ఫరీదూన్ అను రాజశ్రేష్ఠుని రాజ్యకాలమును గురించిన పుస్తకములు చదువబడెను. చతురంగ బలములు లేని ఫరీదూనునకు ఎట్లు ప్రభుత్వము లభించినదో మీరు తెలిసికొన గలిగితిరా యని వజీరు రాజును ప్రశ్నించెను. నీవిప్పుడు వినినట్లుగ నె ప్రజలు ప్రీతి విశ్వాసములతో అండా దండ నిలిచి సాయపడుట వలన ఆతనికి ప్రభుత్వము సిద్ధించినదని రాజునుడివెను. మహాప్రభూ అట్లయిన ప్రజలు అండా దండ నిలచి సాయముచేయుటయె ప్రభుత్వ ప్రాప్తికి హేతువై యుండ మీరేల ప్రజలను కష్టపెట్టెదరు ? మీకు ప్రభుత్వకాంక్ష లేదాయని వజీరు ప్రశ్నించెను.

భూపాలకుడు సేన బోషింప మేలు,
దాననే సర్దారి తనము వర్ధిల్లు.

రయితులు సిపాయీలు భటులు దగ్గర చేరుటకు సదుపాయ మేదని రాజు వజీరునడిగెను. పాదుషాకుఔదార్యముండిన రైతులు సిపాయీలు చుట్టు మూగుదురు. కారుణ్యముండిన మీచల్లని పరిపాలనమున వారు సురక్షితముగ సర్వ సుఖముల ననుభవింతురు. కాని తమకు ఈరెండు గుణములును లేవు.

బ్రజల బాలింప దగడు నిర్దయుడు రేడు ;
వృకము మేకల మేప నెందేని తగునె?
ఉన విరుద్ధముగా నేలు మనుజ విభుడు
తన ప్రభుత్వపు మూల బంధంబు త్రవ్వు.

చెనకన్ శక్తి విహీనులైన ప్రజ గాసిం బెట్టు భూపాలకుం
గినుకన్ బాయు దురాప్తులుం బరుల పోల్కింగష్ట కాలంబు నన్ .
జన సంతుష్టిగ నేలుమీ. రిపులమాత్సర్యంబు నిన్నేమిసే
యును ? న్యాయప్రభుసేన రైతులను లోకోక్తిన్ వినన్ లేదొకో.

నిస్సహాయుల పైని నెనరూను మోయి,
కాలదౌర్జన్యంబు గడవ రెవ్వరును.

౭

సముద్ర యాత్రయందు సుల్తానుతోడ ఒక పారసీకపు బానిస యుండెను, వాడెప్పుడైనను సముద్రమును చూచిగాని సముద్ర యాన కష్టములను అనుభవించి గాని యెరుగడు. ఓడ త్రుళ్లింతలకు వాడు భయపడి వెక్కి వెక్కి యేడ్చుచు గడగడ వడక సాగెను. వీనివలన సుల్తాను సంతోషమునకు భంగము కలిగెను. ఎంత యోదార్చినను వాడు వినకున్నందున ఏమి సేయుటకు తోపక వారూర కుండిరి.

ఓడ యందొక వైద్యు డుండెను. అతడు సుల్తానును సమీపించి, దేవర యాజ్ఞయైన యెడల ఏదోయొక విధముగ వానినోరు మూయించెదనని విన్నవించెను అట్లయిన చాలయుపకారము చేసినట్లగునని సుల్తాను సెలవిచ్చెను అంతట వైద్యుడు ఆ బానిసను సముద్రము లోపడద్రోయించెను. కొంతసేపు బుటకలు వేయనిచ్చి వెంట్రుకలు జవిరి పట్టుకొని వానిని ఓడ యొద్దకు లాగిరి. వాడు రెండు చేతులతో చుక్కాని పలకను పట్టుకొని ఓడపై కెక్కివచ్చి యొకమూల నెమ్మదిగా కూరుచుండెను, సుల్తానుకు ఇది యంతయు వింతగా దోచి దీని రహస్యమేమియని యడిగెను. ఇంతకు పూర్వము వీడెన్నడును నీటిలో పడుట యందలి యపాయమును ఓడయందలి నిరపాయమును కని యెరుగడు. వ్యాధిగ్రస్తుడు గాక పూర్వము శరీరారోగ్యము విలువ యెవ్వడెరుగును ?

యవరొాట్టై దినసీకు నభిలాషపుట్టదు
తృప్తుడా. యాకలిదీరు కతన;
నాకు బ్రేియసియైన నారీవతంసంబు
కుటిలాంగిగా నీకు గోచరించు;
దేవలోకమునందు దిరుగు నచ్చరలకు
నడిమిలోకముదోచు నరకమటుల;
నరకవాసులకును నాకమట్లానంద
సంధాయియౌ మధ్యజగము; మరియు

ప్రాణవల్లభ రొమ్మున బట్టి బిగ్గ
గౌగిలించెడు సంతుష్టకాముకునకు
జెలికొరకు ద్వారసీమ వీక్షించు విరహ
దాధితునకెంతొ భేదంబుపరగుమండు

౭

వృద్ధుడగు నొకపారసీక ప్రభువు వ్యాధిపీడితుడాయెను. ఆతనికి జీవితముపై ఆసయంతరించెను. అట్టి సమయమున అశ్వారోహకు డొకడు హజారము ప్రవేశించి "మహాప్రభూ, దేవరవారి ప్రాభవము వలన ఆదుర్గమును వశపరచుకొంటిమి; విరోధులను కట్టి తెచ్చితిమి. ఆ ప్రాంతముల రైతులును సిపాయీలును ఏలినవారి యాజ్ఞను శిరసావహించి"రని శుభవార్త దెల్పెను. అందుకురాజు నిట్టూర్చి, యీ శుభవార్త నాకుగాదు; నావిరోధులైన రాజ్యపువారసులకని చెప్పెను.

హృదయమున నున్న కోర్కె యీదేరుననెడు
తలపుతోజెల్లె బ్రియజీవితంబు; నేడు
ఇష్టమొనగూడె; నైన నాకేమి మేలు?
అయ్యో! క్రిమ్మరునే గతమైనవయసు.

ప్రస్థానభేరిని వాయించెమృత్యువు
తలనుండి కనులార, సెలవుగొనుడు;
ఓచేయి, యరచేయి, యోముద్దు మంజేయి,
యొండొరుల్ వీడుకోలొసగికొనుడు;
పగవారి కోరికఫలియించె, నేనింక
భోగభాగ్యము వీడిపోవు వాడ;
ఎప్పుడో యొకనాడు తప్పకవత్తురు
మీరు నాతోబాటు మిత్రులార;

జ్ఞానహీనుండనై నేను గాలమెల్ల
వ్యర్థపుచ్చితి; నేజేయనట్టిదాని
నుండి మీరలుద్బోధంబునొంది బ్రతుకు,
జ్ఞాన సంపాదనమునందు గడపమేలు.

౯

మీ తండ్రిగారి మంత్రులను చెరసాలయందుంచుటకు వారి యందేమి తప్పిదముగోచరించెనని కొందరు మిత్రులు హర్మ్యాజు నడిగిరి. నాకు వారియందేమియు దోషముగపడుటలేదు. కాని యీ విషయముమాత్రము నాకునిశ్చయముగ తెలియును. నన్నుగురించిన భీతి వారి హృదయములందు విశేషముగ నాటుకొనియున్నది.

నామాటపై వారికి సంపూర్ణవిశ్వాసములేదు. నిజాపాయ శంక వలన వారు నన్ను చంపు తలంపుతోనుందురని వెరచితిని. అంతట పండితుల సూక్తిని ఆచరణకు తెచ్చితిని. వారిట్లు చెప్పియున్నారు.

వినుగని భీతిజెందునరు నింగని భీతిలు మోయి, యట్టి వా
రిని అని నూరుమంది నెదిరించి జయింపను శక్తి యుండియుఁ;
గొనకొని పాముపట్టుకొను గొల్లని పాదము వ్రేటుశంక; డా
గను తరిలేకయున్న, బులికన్నుల జీలుచు పిల్లిగోళులఁ.

౧౦

దిమిష్కు నగరమునందలి గొప్పమసీదునందు పైగంబర్ ఏహ్యా మహాత్ముని సమాధియెదుట నేను కొంతకాలము నిరంతరధ్యాననిర్మగ్నుడనై యుంటిని. అధర్మప్రవర్తనముచే దుష్కీర్తి గాంచిన యొక అరబ్బీ దేశపు రాజు అచ్చటకు వచ్చి నమాజు చేసి వరప్రసాదము కోరెను.

ధనికులుం బేదలు దాసులీయెడకు;
ధనికులౌ కొలదిని దనరు నక్కరయు.

అతడు నాతట్టు తిరిగిచూచి, దరిబేసుల సచ్చింతనమునకును నిష్కపట వ్యవహారములకును అనురూపముగునట్లు మీరు నాతోడ దేవుని ప్రార్థింపవలయును. ఏలయన, బలవద్విరోధి యొకడు నాపైకి దండెత్తి వచ్చునను భయము నన్ను బాధించుచున్నదని చెప్పెను. అంతట నేనిట్లంటిని: బలహీనులైన రైతులను దయాదాక్షిణ్యములతో కాపాడుము. బలవంతులైన విరోధులవలన నీకు బాధయుండదు.

భుజబలంబును శౌర్యంబు పొనరుననుచు
బీదల అశక్తకరముల విరువదగదు;
పతితులగు వారలకు దోడుపడని వాడు
పడిన జేయూత యిడరను భయములేదె?

చెడ్డవిత్తి మంచినిగోరు చెనటివాడు
పనికిమాలిన వెకలిభావములదేలు;
చెవియొసగి న్యాయదానంబుసేయు; మట్లు
గానియెడ "అంత్యదిన" మొంటుగలదుగాదె!

మనుజు లన్యోన్య మవయవమాత్రు; లంద
రేకమూలమునుండి మోసెత్తినారు;
కాలవశమున నొక్కయంగకమునొవ్వ
చల్లగా దక్కినవి యూరడిల్లగలవె?

ఒరులయాపద కెదగరగని నిన్ను
మనుజుడవని పేరుకొన బాడిగాదు.

౧౧

దైవానుగ్రహముగల దరిబేసి యొకడు భాగ్దాదు పట్టణమున గనిపించెను. ఆ వృత్తాంతము హుజ్జాజు యూసఫు విని, ఆ మహాత్ముని పిలిపించి, నాశ్రేయోభివృద్ధి కొరకు దేవుని ప్రార్థింపుమని కోరెను. అంతట ఆ దరిబేసి, సర్వేశ్వరా, యీతని ప్రాణములను గొని పొమ్మని ప్రార్థించెను. అయ్యో దేవుడా! యి ది యే మి ప్రార్థన యని రాజడిగెను. ఈ ప్రార్థనయె నీకును ము స ల్మా ను లందరకును శుభావహమైనదని యతడు పల్కెను.

బీదసాదుల బీడించు పృథ్వీపాల,
యెంతకాలము నీయాట లిట్లుసాగు?
ఉర్వియుండి నీకేమి ప్రయోజనంబు?
జనుల వేచుట కంటెను జావు మేలు.

౧౨

న్యాయ దూరుడగు నొక ప్రభువు ఒక పుణ్యాత్ముని గాంచి, నాకు ఏవిధమైన దైవచింతనము మేలుగ నుండునని ప్రశ్నించెను.

నీకు మధ్యాహ్న వేళ నిద్ర మేలుగనుండును. ఆయొక్క క్షణము నందైనను ప్రజలను బాధపెట్టకయుందువని ఆపుణ్యాత్ముడు చెప్పెను.

అరదినము కూర్కు కరినాత్మ నరసియంటి:
నీవు దౌర్జన్య మవు. నీకు నిద్రతగును;
ఏవని జాగర్యకంటె మేలవును నిద్ర
యట్టి దుష్టుని జీవితం బరుట శుభము.

౧౩

ఒకానొక ప్రభువు సంతోష భోగములచే రాత్రిని దినముగ పరిణమింపజేసెనని వినియుంటిని. పానమత్తుడైన ఆసుల్తాను ఇట్లు నుడివెను.

ఇంతకంటెను సంతోష మిడెడు క్షణము
వేరొకటిలేదు మాకిల వెదకి చూడ;
మంచి చెడ్డల భావంబు మదిని జొరదు.
అఖిల విషయచింతా తీత మయ్యె మనము.

శీత కాలపుజలిలో వస్త్రహీనుడయి యచ్చట పండుకొని యుండిన యొకడది జేసి యిట్లనియెను:

ఓ మహారాజ, నిజమె, నేనొప్పు కొందు;
పరులు సరిరారు మీకు సంపదలయందు;

లబ్ధకాములు మీకునేలాటి వంత
చేకురదుగాని మా బోంట్ల చింతలేదె ?

సుల్తాను ఈ మాటలకు సంతసించి వేయిదీనారటంకములు గల సంచిని కిటికీగుండ బయలుపెట్టి, దరిబేసి కొంగుపట్టుమని యడిగెను. చొక్కాయియే లేనివానికి కొంగెచ్చటనుండి వచ్చునని యాతడు బదులు చెప్పెను. శోచనీయమైన యాతని స్థితికి ప్రభువు మిక్కిలి జాలిపొంది గౌరవసూచకమైన యుడుపును కూడ చేర్చి దరిబేసికి పంపెను అతడు కొద్దికాలములోనే ఆరోక్యమును ఉడుపును కరగద్రావి కష్టములకులోనయి మరలవచ్చెను.

జల్లెడ నీరంబు, క్షమకామి మతిని
రాగముక్తునిచేత ద్రవ్యంబు నిలదు

ఆతని తలంపేలేక సుల్తాను చిత్తము అన్యాయత్తమై యున్నపుడు వానిరాక నెరిగించిరి. అందుకు ప్రభువుకోపగించుకొని మొగము త్రిప్పుకొనియెను. కావుననే పాదుషాల క్రోధమును కరకుదనమును గమనించి తేకువతో మెలగవలయునని అనుభవజ్ఞులయిన బుద్ధిమంతులు చెప్పియుండిరి. ఏలయన వారిమనస్సు ముఖ్యమైన రాజ్యకార్యాలోచలనయందు మగ్నమైయున్నపుడు సామాన్య ప్రజల యెడ ఓరిమియుండదు.

అర్థసమయంబు నెఱుగని యతనికెపుడు
రాజుల ధనంబు చేముట్టరానిదగును;
పలక తరుణంబు ముందుగా దెలియవేని
చెనటిమాటల నీబెట్టుచెరచుకొనకు

ఇంతకొద్ది కాలములో నంతద్రవ్యమును వృధావ్యయముచేసిన యాసిగ్గులేని దూబరదిండి బిచ్చగానిని తన్ని తరిమివేయుడు. ధర్మ

నిధి నిరుపేదలకు కబళము వేయుటకేర్పడినది గాని స్త్రైతాను అనుచరుల పొట్టనింపుటకు గాదని సుల్తాను సెలవిచ్చెను.

పగటిపూట కర్పూరపువత్తి దివ్వె
నింటవెలిగించు మూఢాత్ముడెవ్వడైన
రాత్రిపూటకు దీపపాత్రంబునందు
తైలమడుగంటియుంట సత్వరమెరుంగు.

విశ్వాస పాత్రుడైన యొక వజీరిట్లనియెను: మహాప్రభూ, ఇటువంటి బిచ్చగాండ్రకు ఉదర పోషణమునకు కావలసినంత మాత్రము కొన్నిదినముల కొకతూరి యిచ్చుచుండుట యుచితమని నాకు తోచుచున్నది. అట్లయిన ఆబ్రాహ్మను వారు దుర్వ్యయముచేయరు. దేవరవారు సెలవిచ్చినట్లు బొత్తిగ వారిని త్యజించుటయు, ఒకనిని ఔదార్యముచే ఆసపురికొల్పి మరల నిరాశచే నొప్పించుటయు గొప్పవారి యాశయమునకు సమ్మతముగ నుండదు.

ఊరక యర్థుల వాంఛా
ద్వారముదెరవంగబోల; దటుదెరచినచో
గూర్రత గ్రమ్మరమూయం
గోరుట తమవంటి దాతకుంచగవౌనే ?

దప్పిగొను యాత్రికులు నీరుదాగ్రవనెంచి
కదలి యొడ్డున గూర్చుండ గాంచమెపుడు;
ఎచటదియ్యని సెలలూరు నచటజేరు
మనుజపశుపక్షికీటక మక్షికములు

౧౪

పూర్వకాలమున నొక నరపాలుడు రైతుల నుండి కప్పము చక్కగ వసూలు చేయక, సిపాయీలకు నెలజీతములు క్రమముగ

నియ్యక యుపేక్షించుచుండెను. తప్పనిసరిగా కొన్నిదినములకు బలవంతుడైన విరోధి దండెత్తివచ్చెను. సిపాయీలు వెన్నిచ్చిపారిపోయిరి.

ఎపుడు ప్రభువు సిపాయీల కిచ్చుజీత
మీయకుండిన జెయికత్తినెత్తదదయు;
కడుపుగడవని రిక్తుండు కలనియందు
ఆత్మశౌర్యంబు చూప సమర్థుడగునె?

ఇట్లు ద్రోహముచేసి పరుగెత్తి పోయిన వారిలో నామిత్రుడొకడుండెను. చీవాట్లుపెట్టి యతనితో నిట్లంటిని: కొంచెము స్థితి మారినంతనె పూర్వస్వామిని ఒప్పరికించి అన్ని సంవత్సరముల నుండి యతని యుప్పుపులుసు దిన్నందులకు లేశమైన కృతజ్ఞత చూపక, నట్టనడిమేట ముంచినట్లు పరుగెత్తుటకంటె నీచమును అగౌరవకరము నగు కార్యమొకటి యుండునా? ఆతడిట్లు బదులు చెప్పెను: దయతో మన్నింతువేని ....నాగుర్రము మేతకు యవలు లేవు. జీనీ నందా పట్టు కుదువబడియున్నది. సుల్తాను సిపాయీల కియ్యవలసిన ధనము లోభముచే బిగబట్టిన యెడల హృదయపూర్వకముగ ఆతని కొరకు శౌర్యసాహసములతో వారెట్లు పోరాడగలరు?

యుద్ధభటులకు నెలజీతమొసగుమోయి,
వారు తమతలనిత్తు రీ పోరునందు;
జీతమును బత్తెమును లేక సిలుగు గుడుప
నింక మరియొక చోటికి నేగువారు.

౧౫

వజీరులలో నొకడు ఉద్యోగము నుండి తొలగింపబడి దరిచేసి మండలియందు చేరెను. ఆగోష్ఠి దివ్యప్రభావము ఆతని చిత్తమున

నాటుకొని మన శ్శాంతి చేకూర్చెను. మరియొక సమయమున రాజు నకా వజీరుపై సద్భావము కలిగి, మరల యుద్యోగము నిర్వహింప మని యాజ్ఞాపించెను. దానికాతడు సమ్మతింపక, ఉద్యోగ నిర్వహణ మున కన్న నిరుద్యోగమే మేలని వచించెను.

కార్యముక్తులు ఘనక వక్త్రంబు లకును
పరులనోళ్లకు జిక్కాలువైచి, కాగి
తంబులను జింపివోసి, కలంబు విరిచి
చెడువిమర్శకు నోటను జేతబడరు.

ఎట్లయినను రాజ్య కార్యములు నిర్వహించుటకు నాకిప్పు డొక వివేకియైన వజీరు అత్యావశ్యకముగ కావలసి యున్నాడని సుల్తాను చెప్పెను. కార్య నిర్మగ్నులు కాక యుండుటయె వివేకవం తుల చిహ్నమని ఆ వజీరు పల్కెను.

అస్థులే భక్షించి యలహూమా పక్షి
'పులుగులనేపక పూజ్యమై తనరె.

౧౬

సింహము సేవను నీవేల కోరుకొంటివని సివంగిని కొందరడిగిరి. ఏలయన, అది తిని వదలిపెట్టిన మాంసమును నేను దిను చుందును. దాని శౌర్య ప్రతాపముల యాశ్రయ మూలమున విరోధుల దౌష్ట్యమునుండి రక్షించు కొందునని యదిచెప్పెను. అట్లయిన ఇప్పుడు నీవు దాని యాశ్రయ రక్షణము పొందుట వలన కృతజ్ఞతను తెలుపుకొను చున్నావుగదా, మరి విశ్వాసపాత్రులయిన స్వసేవకులలో నిన్నొకదానినిగ ఎంచుకొనునటుల నీవేల సింహమునకుసమీప

మున వర్తింపవు? ఏలయన దగ్గరనున్న యెడల దాని కోపమునుండి సురక్షితముగ నుండజాలనని ఆ మేకము చెప్పెను.

అగ్నిని నూరేండ్లు నర్చ నల్పియును
అర్చకుండీల్గదే యందుదా బడిన!

సుల్తాను సచివునకు ద్రవ్యము దొరకిన దొరకవచ్చును; లేదా తలయూడిన నూడవచ్చును. అనుక్షణ భిన్నమైన పాదుపాల చిత్త వృత్తులయెడ అత్యంత జాగరూకతతో మెలగవలయును. సలాము చేసినందు కొకప్పుడు వారు కోపగించుకొందురు. నిందించినందు కొకప్పుడు గౌరవించి యంగీ నొసంగుదురని పెద్దలు చెప్పుదురు. హాస్యోక్తులు రాజమిత్రులకు వన్నెను, పండితులకు లోపమును తెచ్చును.

వినయంబు యోగ్యత విడబోకు మీవు:
విడు రాజసఖులకు వేడుకల్ నగవు.

౧౭

నామిత్రులలో నొకడు తన దురదృష్ట బాధనుగూర్చి నా యెదుట నిట్లు మొరపెట్టుకొనెను: వరుమానముకొద్ది; కుటుంబమా పెద్దది. నిరశన కష్టభారమును వహించుటకు దార్ఢ్యములేదు. ఏపరదేశమైన వలసపోయి అచ్చట నాజీవితము గడపిన యెడల నామోగు బాగులు ఇతరుల కెరుకపడక యుండునని పలుమారు తలంచితిని.

పలుమారు నాకట బన్నుండెగాని
యవ్వాని స్థితిగతు లరయ రెవ్వరును;
పలుమారు పెదవిపై నిలిచె ప్రాణంబు
వానికై యేడ్చిన వారు లేరెవరు.

కుటుంబము కొరకు నేనుగావించు ప్రయత్నములను అమానుషత్వముగను నిస్స్వార్థ్యతగను విరుద్ధార్థము కల్పించి నా ప్రత్యర్థులు నేను లేకుండుతరి తూలనాడి నవ్వు కొందురనియు, నాదురవస్థకు సంతోషించు చుందురనియు మరల తలపోసితిని.

ఎప్పుడు నదృష్ట మెట్టిదో యెఱుగరాని
పరువుమాలిన యధముని పాటు గనుడు!
నేడు సుఖముగ దనపొట్ట నింపుకొనుచు
విడిచినా డాలుబిడ్డల వెతలు చెంద.

గణితము నాకు కొంత తెలిసియుండుట మీరెరుంగనిది కాదు. మీపలుకుబడి మూలమున నాకొక చిన్న యుద్యోగము ప్రాప్తించునెడల మనసు కుదుటబడి మరణ పర్యంతము మీకు నేను కృతజ్ఞతా ఋణబద్ధుడనుగ నుండగలనని అతడు పల్కెను.

తమ్ముడా, పాదుషాల సేవకు రెండుదిక్కులు గలవు. ఉదర పోషణము జరుగుననను ఆసయొకటి; ప్రాణభీతి మరియొకటి. ఇంతమాత్రపు టాసకై అంతటిభీతి ననుభవించుట పెద్దల యాశయమునకు భిన్నముగ నుండును.

చేనుదోటల కప్పంబు చెల్లదనుచు
నెవరు నడుగరు దరిచేసి యింటి కరిగి;
కష్టవేదన సైపుము; గాక నీదు
ప్రేవులను గాకి మూకకు వేయ బొమ్ము.

దీని కాత డిట్లనియెను: మీరుచెప్పినది నాస్థితికి సరిపోదు; నా ప్రశ్నకు తగునైన ప్రత్యుత్తరమును గాదు. ఎవడు వంచనము చేయునో వానిచేయి భీతిచే గడగడ వణకు చుండుననుమాట మీరు వినలేదా?

సత్యమార్గము దైవకమ్మతంబగును
దారి దప్పంబోడు ధర్మాధ్వగామి.

నలుగురు మనుష్యులనుచూచి నలుగురు ప్రాణముపోవునట్లు భయ పడుచుందురని పెద్దలు చెప్పుదురు. కోశాపహారి సుల్తానును, కన్న పుదొంగ తలయారిని, వ్యభిచారి చారుని, బజారులంజె కొత్వా లును చూచి భయపడుచుందును. లెక్కలు నిర్దోషముగనుంచిన వానికి తనకీదారువలన నేమి భయము?

మిడిసి యుద్యోగమున మేర మీరకున్న
పదవి దొలగిన, శత్రుల బారి బడవు ;
నిర్మలుడవైన భయ మేమినీకు సఖుడ,
మురికిగుడ్డనె బండపై మోదుజాకి.

ఇప్పటి నీస్థితికి ఒకనక్కకథ సరిపోవుచున్నదని యిట్లు చెప్పి తిని: ఒక నక్క పడుచు లేచుచు పరుగెత్తుచుండెను. ఏమియాపద సంభవించినది, ఇట్లుచావు బ్రతుకులతో పరుగెత్తుచున్నావని యొక డడిగెను. వారికి సింహముతో పనిబడెననివింటిని అని నక్క చెప్పెను. ఓసి తెలివిమాలినదానా, నీకును సింహమునకును ఏమిసంబంధసామ్య ములున్నవి?నోరుమూసుకొమ్ము. అసూయాగ్రస్తులుదురుద్దేశముతో ఇదియునుసింగపుకొదమయని నిరూపింతురేని నేను బంధింపబడుదును. విచారణసలిపి నన్నువదలిపెట్టించుటకు ఎవరునాపక్షమూనుదురు? ఈ రాకు దేశమునుండి సంజీవనౌషధము తెచ్చులోపల సర్పదష్టుడు మర ణించును, అసలదిబదులు చెప్పెను. ఇదేవిధముగ నీకు యోగ్యతయు భక్తివిశ్వాసములుండి సురక్షితుడవై యుండియును ప్రత్యర్థులు మా టున పొంచియుందురు. విరోధులొకమూల కనిపెట్టుకొనియుందురు. ఒకవేళ నీ నీతిప్రవర్తనము వారు మారుపరచి సుల్తానుకుఎక్కజెప్పి నీపైదురభిప్రాయముకలిగించినయెడల, అట్టిసమయమున నీపక్షమున

మాటాడుటకెవరికిశక్తియుండును? నీవు సంతృప్తిరాజ్యమునురక్షించుకొనుచు ప్రభుత్వోద్యోగకాంక్షకు నీళ్లువదలుటయె శ్రేయస్కరమని యిప్పటికినినాకు తోచుచున్నది.

జలధియాత్రంగల్గు సర్వలాభములు;
నిరపాయతంగోర బరగు తీరమున

నా మిత్రుడు ఈమాటలకు ప్రీతినొందక మొగముత్రిప్పుకొని నిష్ఠురముగ నిట్లనియెను:

ఈ మాటలయందేమి వివేకము, కార్యపరత్వము, విషయ గ్రహణము అగపడుచున్నది? చెరసాలయందు స్నేహితులు అక్కరకువత్తురు. తిండికూటమునందు విరోధులైనను నెయ్యము చూపింతురను పెద్దలవాక్యము ఇప్పుడు దృష్టాంతీకరింపబడినది.

సంపదల దేలునప్పు డిచ్చకములాడి
అన్న, తమ్ముడ, యను వార లాప్తవరులె?
కష్టదినముల నేదిక్కుగాంచనపుడు
చేయి యందిచ్చువారెపో చెలిమికాండ్రు.

అతడు కలతచెంది నాబోధను వినకుండుటనెరిగి, నాకుపూర్వ పరిచితుడైన కోశాధికారియొద్దకు పోయి ఆయువకుని దుఃస్థితియు, యోగ్యతయు, శక్తిసామర్థ్యములును అభివర్ణించితిని. అంతట నొక చిన్నయుద్యోగమీయబడినది. కొంతకాలమునకు ఆతని యోగ్యతా స్వభావములకును కార్యనిర్వహణ నైపుణ్యమునకును పైయధికారులు మెచ్చుకొనిరి. అప్పటినుండియు ఆతనిపని మేలయ్యెను. ఇంతకన్న పెద్దయుద్యోగ మొసంగబడినది. అతని సంతోషగ్రహము వాంఛాపరిపూర్తియను ఉచ్ఛస్థితి నలంకరించెను.

క్రమక్రమముగ ఆయువకుడు సుల్తానుకు ప్రేమపాత్రుడయి రహస్యములు చెప్పుకొనదగినంతటి విశ్వాసనీయుడాయెను. అతని సౌఖ్యమునకు సంతోషించి యిట్లంటిని:

కటికిలేమిడి కీవు గాసి చెందకుము;
చీకటిలో నూరు జీవామృతంబు
మోము మాడ్చకు కాలనేమి దుర్గతికి,
ఓర్పు చేదయ్యు బండొసగు దియ్యనిది

ఆ సమయమున కొందర స్నేహితులతోడ కలసి నేను మక్కాయాత్రకు వెడలవలసినట్లు తటస్థించెను. మరల నేనుయాత్రనుండితిరిగివచ్చినపుడు ఒకటిరెండు అంచెలుండగనే ఆ నామిత్రుడు నాకు యెదురు కోలొసగెను. దరిబేసియుడుపులు ధరించుకొనియుండిన ఆతని దుఃస్థితినిచూచి, యిదెట్లు సంభవించెనని యడిగితిని. మీరిదివరకు చెప్పినట్లియసూయాగ్రస్తులు నాపైనిందనారోపించిరి. సుల్తాను అందలి సత్యాసత్యములను విచారించుటకు యత్నింపలేదు పూర్వ మిత్రులును ప్రాణస్నేహితులును న్యాయముచెప్పక నోరుమూసుకొని యూరకుండిరి. వారు మున్నటి సహవాసమునుకూడ మరచిరి.

చూచుచున్నారుగద ముఖస్తుతినిపుణుల
వశగతహస్తులయి భాగ్యవంతునెదుట!
అతడె దురదృష్టవశమున నధనుడైన
నఖిల లోకంబు కాల్మెట్టు నతవితలను

వేయేల, యింతవరకు చెరసాలకష్టములనుభవించితిని. ఈ వారము మక్కాయాత్రికులు సురక్షితముగ నగరముచేరిరన్న సంతోషవార్త విని అధికారులు మమ్ము బంధవిముక్తుల గావించిరి. పిత్రార్జితమైనఆస్తినిగూడ జప్తిచేసిరనిచెప్పెను. ఆనాడు నామాట

నీ చెవికెక్కకపోయెను. పాదుషాలసేవ అపాయకరమును, ఆదాయకరమునైన సముద్రయాత్రవంటిది. ధనమార్జించిన నార్జింపవచ్చును లేదా యలల దెబ్బకు ప్రాణములు పోయినను పోవచ్చునని యిదివరకు నేను చెప్పియుండ లేదా ?

పెద్దవారల బోధకు బెడచెవి నిడ
కాళ్లకుం జుట్టుకొనును సంకెళ్లు; మరల
గాటుబాధకు నోర్చుకో దీటులేక
తేలు నివసించు బొరియలో వ్రేలి నిడకు,

౧౮

కొందరు దేశదిమ్మరి ఫకీరులు నాగోష్ఠిలో నుండిరి. వారు శాంతగుణా లంకృతులుగ బయటికగపడు చుండిరి. ఒకానొక సంపన్నుడు వారి సమాజముపై విశేష సద్భావము గలిగి సదావృత్తి నొసంగు చుండెను. అంతట కొన్ని దినములకు వారిలో నొకడు దరిబేసుల కుచితము కాని నీచకార్య మొనరించెను. ఆపెద్దమనుష్యుని మనస్సు విరిగెను వారి యోగ్యతకు విలువ తగ్గెను. దిన బత్తెము సిలిపివేయ బడెను

ఏవిధము చేతనైనను నామిత్రులకు మరల జీవనాధారము కల్పింప వలయునని తలంచి ఆసంపన్నుని సేవించుట కుద్దేశించితిని. అచ్చటి ద్వారపాలకుడు నన్ను లోనికి ప్రవేశింపనీయక యరికట్టి మొరకుదనము చూపెను. పెద్దలిట్లు చెప్పియుండుట వలన వానిని మన్నించితిని.

ధరణి పాలుర మంత్రుల ద్వారములకు
పరిచయము లేక నీవేగ వలనుపడదు;
కుక్కగాంచిన జొక్కాయి కొంగులాగు
గటుసు పణిహారిగన మెదనొదిసిపట్టు.

ఆసంపన్నుని సమీపవర్తులగు ముఖ్యసేవలకు నాస్థితియెరుక పడినంతట వారుమర్యాదతో నన్నులోనికిగొనిపోయి యున్నతాసనమున కూర్చుండగోరిరి. అయినను నేను వినయపూర్వకముగ క్రింద కూర్చుండి యిట్లంటిని :

మీగులాముల పంక్తినే గూరుచుందు:
అధమ దాసువినన్ను నటుసేయనిందు

నాపలుకులువిని, అయ్యో దేవుడా! యిదియేమిమాట!

కోరి నాకనులపై కూర్చుందువేని
ముద్దుదీర్తును; నీవు మోహనుడవోయి

అని ఆసంపన్నుడు పల్కెను. అంతట ఉచితాసనముపై కూర్చుండి వివిధవిషయములు ప్రసంగించుచుండ వానిమధ్య ప్రస్తావవశమున నామిత్రుల దోషచరిత్రము కూడవచ్చినది నేనిట్లంటిని:

పూర్వదాతవైన పూజ్యులు మీకేమి
నెరసుదోచె దాసు బరిహరింప
గొప్పతనము శాంతి యొప్పు సర్వేశుండు
తప్పుగనియుదిండి తప్ప కొసగు.

అంతట ఆపెద్ద మనుష్యుడు నామాటలకు ప్రీతినొంది నామిత్రులకు మునుపటివలెనే పోషణద్రవ్య మొసగుటకును, నిలువపడియున్న బత్తెముగూడ ఇచ్చుటకును ఆజ్ఞాపించెను. నేను కృతజ్ఞత

తెలుపుకొనుచు వినయముతో భూమిని ముద్దిడి, నా సాహసము మన్నింప వలయునని యిట్లంటిని ;

ఆశలీడేర్చు 'కాబా'కు నరుగు చుంద్రు
దేశ దేశాలనుండి ధిదృక్షు జనము;
తాము ముముటోంట్ల సహియింప దగును ; విఫల
కుజము నెవ్వరైన రాలతో గొట్టబోరు.

౧౯

తండ్రి సంపాదించి పెట్టిపోయిన విశేషధనసంచయము కుమారునకులభించెను. ఆరాజపుత్రుడు ఉదారచిత్తుడయి దాతృత్వ హస్తము తెరచి ధారాళముగ రైతులకును సిపాయీలకును ధనము వెద చల్లుచుండెను.

ఊదునింపిన పళ్లెర ముంచినంత
ఇంపునెత్తావి గొనదు ఘ్రాణేంద్రియంబు;
వేడినిప్పుల నాపొడివేయ వెదలు
అంబరును మించు సౌరభం బన్నియెడల.

గొప్పతనమును వహియింప గోరుదేని
మానసంబున నౌదార్య మూనవలయు;
ఆర్ద్రి కేదారమున విత్తువంతవరకు
మొలకలెత్తవుధాన్యంబు; తెలియుమోయి.

వివేచనా రహితుడగు నొకమిత్రుడు ఆరాజకుమారున కిట్లు నీతి బోధించుటకు ప్రారంభించెను. "మన పూర్వులైన భూపతులు ఎంతయో ప్రయత్నముకల్పి అక్కరలకొరకు ధనము కూడబెట్టిరి.

నీవు చేతిని కొంత మట్టుపరచుకొనుము. ఇప్పుడెరుగరాని కార్యములు ముందు తలపడును. విరోధులు వెనుకనుందురు. పనివడినపుడు ధనహీనుడవై కష్టపడకుండునటుల అరసికొమ్ము.''

" ధనము సామాన్యజనులకు దానమీయ
నొక్కొకరికొక్క బియ్యపు ముక్కవచ్చు
ప్రతి మనుష్యుని కడయవపాటి వెండి
గొన్న దినదిన వృద్ధియే గోశధనము. "

రాజకుమారునకీమాటలు సమ్మతముగాక కోపగించుకొని కఠినముగ నిట్లు పలికెను: '' సర్వేశ్వరుడు నన్నీరాజ్యమునకు పరిపాలకునిగా నొనర్చినది, నేననుభవించుటకును ఇతరులకు పెట్టుటకే గాని కావలివానివలె ధనము కాపుదారిచేయుటకు గాదు.''

నలువది కొట్టుల ద్రవ్యము
నిలిపిన ఖారూను చావనే చచ్చెను: వి
ర్మల కీర్తి నిలిపి చనుటను
వెలయును నౌషిరవాను పేరిప్పటికిన్.

౨౦

న్యాయప్రభువైన నౌషీరవాను వేటాడుచుండిన స్థలమునందు మాంసమును కరుకట్లు చేయుచుండిరి. ఉప్పులేదని తెలుసుకొని ఒక గులామును గ్రామమునకు పరుగెత్తిపొమ్మనిరి. అంతట నౌషీరవాను ఇట్లుచెప్పెను: వెలయిచ్చి తీసికొనిరమ్ము. లేకయున్న యిది యొక చెడ్డ యలవాటుగ పరిణమించి గ్రామమును నాశముచేయును.

ఈ కొద్దికే యేమి యపకారము కలుగునని వాడనెను. ఈలోకమునందు నిరంకుశత్వమునకును దౌర్జన్యమునకును మూలము మొట్టమొదట సూక్ష్మముగనె యుండెను. వెనుక వచ్చినవారు దానిని మరింత అభివృద్ధి చేయగా ఇప్పటి నిస్సీమస్థితికి వచ్చినదని రాజనియెను.

రైతు తోటను ఫలమొండు రాజు దినిన
ధ్వంస మొనరింతురు పరిజనుల్ పండ్లచెట్లు;
అయిదు గుడ్ల కొల్లకు నృపుడాజ్ఞ వెట్ట
వేయికోళ్ల సిపాయీలు వేచి తిందురు

౨౧

పన్నులు వసూలుచేయు నొక యుద్యోగి రైతుల కొంపాగోడి నాశముచేసి రాజు బొక్కసము పెంపొందించుచుండెను మనుష్యులచిత్తము మెప్పించుటకొరకు సర్వేశ్వరుని హృదయము నొప్పించువారి సంపదలు నిర్మూలించుటకు అటువంటి మనుష్యులనె దైవము వారిపైకి నియోగించునను పెద్దలసూక్తి ఆయుద్యోగి యెరుగడు కాబోలు !

రెల్లు మంటల పొగ రేగుటకంటె
ఆర్తుల నిట్టూర్పు యధికమై పొదలు.

మృగములలోనెల్ల సింహము శ్రేష్ఠమైనదనియు గార్ధభము అధమమైనదనియు జనులు చెప్పుచుందురు. పెద్దలంగీకరించినట్లుగా

మనుష్యులను హింసించు పంచాననముకంటె భారమును వహించు గార్దభమె మేలైనది.

ఖరము బుద్ధిలేని మొరక జంతువె యయ్యు
బరువు మోయుచుంట గరము ప్రియము;
గార్దభంబు వృషము గాన్పించు మేలుగ
ప్రజల హింసపెట్టు వారికంటె.

కొన్నిదినములకు నింద్యుడైన యాయుద్యోగి స్వభావము కొంతవరకు సుల్తానుకెట్లో తెలియవచ్చి వానిని చిఱుత పలకలతో నొత్తి పలుతెరగుల బాధపెట్టి చంపుట కాజ్ఞాపించెను.

ప్రజల యంగీకృతికి బాలుపడవయేని
పాదుషాహికి నీపయి రాదు ప్రీతి;
దైవకారుణ్యముం గోరదలతువేని
అతని సృష్టికి శ్రేయంబు నాచరింపు

ఆ యుద్యోగిచే నిదివరకు బాధలొందిన వారిలో నొకడు ఆసమయమున తత్సమీపమున పోవుచుండి వాని యధఃపతనమును తనలో తాను తలపోసుకొనుచు నిట్లనియెను:

ప్రభువి యోగబలంబున్న ప్రతి మనుజుడు
ప్రజల ద్రవ్యంబు దిన నోంట బట్టగలడె?
గట్టి యెముకను గబళింప గలడుగాని
పొక్కిలిం జేరినప్పుడు పొట్టజీల్చు.

దురదృష్టవంతుడౌ దుష్టనుండీల్గు!
ప్రజల శాపము వ్రేలు వానిపై జిరము.

౨౨

క్రూర కర్ముఁడైన యుద్యోగియొకఁడు ఒక సాధువుతలపై రాయి రువ్వెనని చెప్పుకొందురు. ఆదరిబేసి కప్పుడు కసితీర్చుకొనుటకు శక్తి చాలక ఆరాతిని దాచియుంచుకొనెను.

ఒకప్పుడు పాదుషాకు ఆయుద్యోగిపై కోపమగ్గవించి తలబంటి గోతిఁలో పాతించెను. సమయముకొరకు వేచియుండిన ఆదరిబేసి ఆరాతినే ఆతని తలపై విసరెను. నీవెవ్వఁడవు? ఈరాతినేల రువ్వితివని ఆయుద్యోగి యడిగెను. నేను ఫలానివాఁడను. ఈ రాయి ఫలానిది. ఫలానిదినమున ఈరాతితో నాతలపయి కొట్టియుంటివని దరిబేసి చెప్పెను. ఇంత కాల మెచ్చట నుంటివని ఆయుద్యోగి యడిగెను నీయధికార గౌరవములకు భయపడుచుంటిని. ఇప్పుడు నిన్నిగుంటలోఁ చూచి యనుకూలసమయము ప్రాప్తించెనని తెలుసుకొంటిని.

ఇల నయోగ్యుల భాగ్యంబు హెచ్చుచుండ
సూక్ష్మబుద్ధులు మర్యాద చూపుచుండ్రి;
పెరఁజ పెనువాడి గోళులు పెరుగువరకు
దుష్టరిపులను మార్కొన దొడరకీవు.

ఉక్కు చెయివాని పంజాను నొత్తబోకు
నీదు మెత్తని మునిజేయి విర్కొనలగు;
వాఁడు విధి బద్ధహస్తుడై బలము దొలఁగ
మెదడు పెరుకుము మిత్రులు ముదమునొంద.

౨౩

ఒకానొక యధిపతి తీవ్రమైన రోగముచే బాధపడుచుండెను. దాని విషయము వర్ణింపక వదలుటయే మేలు. ఈవ్యాధి కుదురు టకు ఫలాని గుణముగల మనుష్యుని పిత్తకోశముతప్ప వేరొక మందు లేదని యూనాని వైద్యుల సంఘము ఏకగ్రీవముగ తీర్మానించెను.

అంతట అట్టిగుణముగల మనుష్యుని వెదకుటకు ఆజ్ఞయైనది. ఒకానొక పల్లెటూరి చిన్నవానికి వైద్యులు చెప్పిన గుణములన్నియు కలవని వానిని తోడ్కొని వచ్చిరి. తల్లిదండ్రులకు లెక్కకు మిక్కు టమైన ధనమునిచ్చి సంతోషపెట్టిరి.

పాదుషా జీవిత క్షేమముకొరకు ఒక రైతును వధించుటకు సెలవొసంగితినని న్యాయాధికారి ఆజ్ఞాపత్రము నొసగెను. అటుపయి వధకులు ఆబాలుని కొంపోవుటకు సంసిద్ధులైరి. అంతట నాతడు మొగము నాకసమువంక కెత్తి నవ్వెను. ఈస్థితిలో నీకు నవ్వు వచ్చుటకు కారణమేమని రాజడిగెను. బిడ్డలు తల్లిదండ్రుల ప్రేమ నాసింతురు. విచారణకొరకు న్యాయాధికారి యొద్దకు పోదురు. న్యాయమునుకోరి పాదుషా నాశ్రయింతురు. ఇప్పుడన్ననో, తల్లి తండ్రులు కొద్దిపాటి ద్రవ్యము నపేక్షించి నన్ను మృత్యువున కప్ప గించిరి. న్యాయాధిపతి నన్ను వధించుటకు ఆజ్ఞాపించెను. పాదుషా నావధమూలమున తాను క్షేమపడజూచు చున్నాడు. ఈ సమయ మున కేవలుడగుమయుడైన సర్వేశ్వరుని రక్షణముతప్ప నాకు వేరొండు ఆశ్రయము లేదు

నీ సేత కెవరితో నేమొఱ్ఱలిడుదు?
వినుగ[illegible]యొద్దనే విచారణయు!

ఈపలుకులకు సుల్తాను చిత్తముకరుణార్ద్రమయి కన్నీరు జొటజొట గారుచుండ నిట్లనియెను; అమాయికుడైన యీ బాలకునిరక్తము స్రవింపజేయుటకంటె నామరణమేయుత్తమమని, వానిని చేరదీసి కౌగిలించుకొని కన్నులు ముద్దిడుకొని మితిలేని ద్రవ్యము బహుమానమిచ్చి యింటికి పంపెను. ఆవారమునందె సుల్తాను వ్యాధి యుపశమించెనని చెప్పుకొనిరి.

నీలునదీ తటమున నొకమావటివాడు పాడుకొనుచుండిన పద్యము ఈ సందర్భమునకు సరిపోవుచున్నది.

నీపదంబు క్రిందరూపరు చలిచీమ
కష్టమెరుగవేని, కరిపదంబు
క్రిందజిక్కి బాధనొందు నీకాలెట్టు
లున్నొదాని నీవు నూహసల్పు.

౨౪

ఉమ్రూ లైస్ ఖానిసలలో నొకడు తప్పించుకొని పారిపోయెను. కొందరు వెన్నంటిపోయి వానిని పట్టి తెచ్చిరి. తక్కిన ఖానిసలు ఇకమీద నిట్టికార్యము చేయకుందురను నెపముపెట్టి పూర్వద్వేషమును సాధించుకొనుటకు వజీరు ఆఖానిసకు మరణదండనము విధించెను. అంతట వాడు ఉమ్రూలైసు సముఖమునకు వచ్చి శిరము భూమిపైమోపి యిట్లనియెను:

నా కేదివచ్చినా న్యాయంబెయగును
అది పాదుషాకిష్టమై యుండుకతన;
ధర్మ ప్రభులుమీరు, దాసుండ నేను,
మీయాజ్ఞ కెదురాడ మేలౌనె నాకు?

అయినను, ఏలినవారి కుటుంబపుటుప్పు పులును తిని పెరిగిన మేలు మరవనందున, నిర్హేతుకముగ నాయూపిరితీసిన నేరమునకు అంత్యదినమునందు మీరు ప్రస్టుపడక యుండవలయునని నేను కోరుచున్నాను. సెలవిత్తురేని యీవజీరును చంపెదను. ఆయపరాధమునకు ప్రతికారముగ మీరు నాకు మరణదండనము విధింపుడు. అప్పుడు మీరు న్యాయముగ శిక్షించిన వారగుదురు. ఈమాటలకు సుల్తాను నవ్వి ఈ ధర్మసందేహమెట్లని వజీరునడిగెను. మహాప్రభూ, దైవప్రీతిగ దీనిని మీపెద్దల గోరీలకు జన్నెవిడిచి వదలిపెట్టుటయె యోగ్యమని నాకు తోచుచున్నది. అందువలన నాకుగూడ ముప్పు దప్పెను. తప్పిదము నాదియేయని తలంతును. ఏలయనపెద్దల వాక్యమిట్లున్నది.

మంటిగడలు విసరెడు మనుజుతోడ
బుద్ధిహీనత బోరిన పురెప్పగులు;
ఎదిరి ముఖమున బాణంబు వేయునపుడు
వాని గురికి నీవును బాలుపడుట నెరుగు.

౨౫

జార్జ్ రాష్ట్రాధిపతి యొద్ద దయార్ద్ర చిత్తుడును సుస్వభావుడునగు నొక ఖాజీ యుండెను. ఆయన అందరను ఎదుట గౌరవించుచు. వారివెనుక మంచి మాటలాడుచుండును. ఒకప్పుడు ఖాజీ యొనర్చిన గార్యము సుల్తానుకు అంగీకారముగాక జరిమానా విధించి శిక్షించెను. రాజభృత్యులు పూర్వమాతని కారుణ్యమునకు పాత్రులైయుండిన మేలు మరవక కట్టుబాటునందు ఏలాటి యిక్క-

టులు గలుగనీయక దయా దాక్షిణ్యములు చూపుచు అతని గౌరవించు చుండిరి.

వెనుక నిందించు వైరి మైత్రిని వరింతు
పేని మెచ్చుకొమ్మ యెదుట వానిమాట;
అదుదాత్ముడెటుల మాటలాడు; వాని
నుడుల చేదేదనలుపుము నోరుతీపు.

అతడు తనపయి మోపబడిన కొన్ని నేరములనుండి విముక్తుడయి మరి కొన్నిటికొరకు చెరసాల యందుంచబడెను. పరిసర రాష్ట్రాధిపతి యొకడు రహస్యముగ అతనికిట్లు లేఖ వ్రాసిపంపెను. అప్రాంతాధిపతి అటువంటి గొప్పవారి యోగ్యతను తెలిసికొనక యగౌరవించెను. ఫలానివారి యభిప్రాయము (వారిని దేవుడు విముక్తులను జేయుగాక!) మాయెడల ప్రసన్నమగునేని శక్తివంచనలేక వారి కోరిక ననుసరించుటకు ప్రయత్నింపబడును. ఈ రాజ్యాధిపతులు వారి దర్శనమునకు నువ్విళ్లూరుచున్నారు. ఈ యుత్తరమునకు ప్రత్యుత్తరము నిరీక్షించుచున్నారు.

ఖాజీ యీ లేఖలోని విషయము మనసునకు తెచ్చుకొని, యందు అపాయము శంకించి, యొకవేళ బయలు పడినను ఆపద రాకుండునటుల తక్షణమె ఆ లేఖ వెనుకప్రక్క సంక్షేపముగ ప్రత్యుత్తరము వ్రాసి పంపెను.

ఒక రాజోద్యోగి యీ సమాచారము తెలిసికొని, ఏలినవారప్పుడు శిక్షించిన ఖాజి పరిసర రాష్ట్రాధిపతులతో ఉత్తర ప్రత్యుత్తరములు నడుపుచున్నాడని సుల్తాను కెరిగించెను. అంతట ఆజాబు కొనిపోవుచుండిన భృత్యుని పట్టుకొని దానిని చదివిరి.

అందిట్లు వ్రాయబడి యున్నది: గొప్పవారికి నాయందు నాయోగ్యతకు మించిన సదభిప్రాయమున్నది. కాని వారు ప్రసాదించిన వరము నంగీకరించుటకు ఈ దాసునకు వలను పడదు. ఏలయన, వీరి కుటుంబపు సొత్తుతిని పెరిగిన నేను కొద్దిగ ఆదరణము మారినందులకె, పూర్వమునుండి మేలు చేసిన వారియెడ కృతఘ్నుడనుగ నుండజాలను.

నిరతంబు నీమీద నెనరూనువాడు
చెడుగొందు నొకవేళ జేయమన్నించు.

సుల్తాను ఆ ఖాజీ కృతజ్ఞతకు సంతోషించి, గౌరవ సూచకముగు అంగీని ధనమును బహుమానమిచ్చి యిట్లనెను. నేను తప్పు చేసితిని, నిరపరాధుని నిన్ను కష్టపెట్టితిని. మన్నింపవలయును. మహా ప్రభూ, యీదాసునకు ఏలినవారియందు ఏతప్పిదము నగపడుట లేదు. నేనట్లు కష్టములపాలు కావలసి యుండుట దైవ నిర్ణీతము గావున, నన్ను చిరకాలము సాకి సంతరించిన వారి మూలముననే చెడుగొందుటయు మేలని యీదాసుడు తలంచుచున్నాడు. పెద్దలిట్లు చెప్పియున్నారు.

పరులు కష్టంబు విడిరని పనవబోకు,
తలప సుఖదుఃఖ హేతువు దైవమగును;
వింటిలోనుండి బాణంబు వెడలినట్లు
గనుపడియు గారకుండు విల్కాడుగాదె

౨౬

అరబ్బీదేశపు నరపాలు డొకడు కోశాధికారులతో నిట్లు చెప్పెనని వింటిని: ఇప్పుడెంత యిచ్చు చుండినను ఫలానివాని జీతము

ఇమ్మడిచేయుడు. ఏలయన, వాడు ఆజ్ఞానువర్తియయి దివాణమును జాగరూకతతో సేవించుచున్నాడు. ఇతర సేవకులు ఆటపాటల పొద్దుపుచ్చుచు వారివిధి నిర్వర్తనమందు ప్రమత్తులయి సంచరించుచున్నారు.

ఈ మాటలు వినుచుండిన యొక పుణ్యాత్ముడు నిట్టూర్పువిడిచి మూల్గెను. నీకేమి తోచినదని ఆయన నడిగిరి. సర్వేశ్వరుని ఆస్థానమునందుగూడ దివాణపు దాసులకు నిట్లె పదవులు హెచ్చుచుండును.

రెండు రేపులు సుల్తాను ప్రీతిగొలువ
గనికరించును మూడవ దినము, నిజము;
సదయుడౌ యీశ్వరుని మొగసాలనుండి
యర్థికెట్టి క్రమ్మరదు భగ్నాశ నెపుడు;

ఆజ్ఞ ననుసరింప నలరు నేతృత్వంబు;
ఆజ్ఞదాటగాంచ వధికపదవి;
ధర్మపరులు సతము దైవసన్నిధియందు
శిరమువంచి సేవ చేయుచుంద్రు.

౨౭

ఒక నిరంకుశుడు నిరుపేదలయొద్ద వంటకట్టియలు బలవంతముగ తక్కువ వెలకు తీసుకొని, యెక్కువ వెలకు భాగ్యవంతులు విలుచునట్లు నిక్కచ్చి చేయుచుండెను. పుణ్యాత్ముడొకడు ఆతని యొద్దకు పోయి యిట్లనెను.

కనిన వారల నెల్ల గరచు సర్పమవు;
కూర్చుండు నెడబాడుగోరు ఘూకమవు.

నీబలాత్కృతి మాయొద్ద నిగ్గవచ్చు,
సర్వ సాక్షిదేవుని కడసాగబోదు;
ప్రజల బలవంతముగ గష్టపరతువేని
వారి ప్రార్థన మాకాశ పదమునంటు.

అతడు ఈమాటకు కోపగించుకొని అందలి నీతికి విముఖుడయి యాసజ్జనుని నిరాదరించెను. ఒకనాటి రేయి వంటయింటినిప్పు కట్టెలగుట్ట కంటుకొని అన్ని వస్తువులను కాల్చివేసెను. మెత్తని పడుక కాలిపోవుటవలన ఆతడు వేడిబూడిదలో నిలబడియుండెను. ఈనిప్పు ఎచ్చటినుండి నాయింటిపై బడినదో తెలియకున్నదని ఆజన కంటకుడు మిత్రులతో పలుకుచుండు సమయమున మున్నటి పుణ్యాత్ముడు ఆకస్మికముగ ఆదారిని వచ్చుచుండి యాతని చూచి, నిరుపేదల హృదయముల వెడలు వేడి నిట్టూర్పులనుండి యని బదులు చెప్పెను.

వేదనాతప్త హృదయుల వేడియూర్పు
గూర్చి యవధానమెడదల గోడుతుదకు
దలకొనును; జేతనైనంతకాలది యొరుల
యెదల నొంపకు; నిట్టూర్పు లేర్చుజగము.

కైఖుస్రువు చక్రవర్తి కిరీటఫలకమున నిట్లువ్రాయబడి యుండెను.

ఎన్ని పురుషాంతరము లేదు లీజనాళి
నాదు మృత్తిక పైనింక నడచుచుండు!
రాజ్య మెటునాకు జెయిమారి ప్రాప్తమయ్యె
అట్లె యదివేరు చేతుల కరుగుచుండు.

౨౮

ఒకానొక మల్లుడు కుస్తీ విద్యయందు ప్రవీణుడాయెను. అతనికి మున్నూట యరువది చక్కని కుస్తీపట్లు తెలిసియుండి, ప్రతి దినము నొక్కొక క్రొత్తపట్టుచూపగలిగి యుండెను. తన శిష్యులలో రూపవంతుడైన యొక యువకునిపై ప్రీతిజనించి, అతడు వానికి మున్నూట యేబది తొమ్మిది పట్టులను నేర్పించెను. కాని యొక పట్టుమాత్రము నిలిపి పెట్టుకొని దాని తరిబీదు ఆలస్యము చేయుచుండెను.

క్రమ క్రమముగ శిష్యుడు బాహుబలము నందును మల్లయుద్ధనైపుణ్యమునందును వన్నెకెక్కెను. ఆ కాలమున ఎవ్వరికిని వాని నెదిరించు శక్తి సామర్థ్యములు లేకుండెను. ఆ దిమసముతో శిష్యుడు సుల్తాను దగ్గరకుపోయి యిట్లు విన్నవించెను. మా గురువుల వారు విద్య నేర్పినందువలనను, వయస్సుచే తను నాకన్న మిన్నయగును గాని, లేకున్న బాహుబలమునందు ఆయనకన్న తక్కువవాడనుగాను. కళాకౌశలమునందు ఆయనకు సరి సమానుడను.

రాజు ఈ చులకదనపు మాటలకు ఈసడించుకొని గురు శిష్యులను కుస్తీపట్టుటకు ఆజ్ఞాపించెను. విశాలమైన ప్రదేశము నాయత్తపరచిరి. అమాత్యులును రాజన్యులును దేశ దేశములనుండి వచ్చిన మల్లురును అచ్చట చుట్టు మూగియుండిరి. ఆయువకుడు మత్తగజము వలె గోదాలోనికి ప్రవేశించు నురువడిచూడ, కంచుకొండ యడ్డము వచ్చినను దానిని పెకలించి పారవేయునో యనునట్లుండెను. వాడు తనకన్న బలవంతుడని యెరిగి, వానికి నేర్పక దాచియుంచిన పట్టును ఈ తరుణమున గురువు ప్రయోగించెను. శిష్యునికి దాని

నుండి తప్పించుకొను ఉపాయము తెలియకుండెను. అంతట కోప గించుకొని వస్తాదు రెండుచేతులతో వానిని భూమినుండి తన తల పైకెత్తి క్రిందికి విసరెను.

ప్రజలలోనుండి సంతోషకలకలము వెల్లురేగెను. అంతట గురువునకు గౌరవసూచకమగు అంగీని ధనమును బహుమానమిచ్చు టకు రాజాజ్ఞయైనది. నిన్ను పోషించి విద్య నేర్పినవానిపైకి కాలు దువ్వితివి. తుదకు నీయత్నము విఫలమాయెను అని రాజు శిష్యుని పిలిచి చీవాట్లు పెట్టెను. మహాప్రభూ, బాహుబలముతో ఆతడు నన్ను గెలువలేదు. కాని కుస్తీ విద్యయందు ఒక పట్టుమాత్రము కొరవపడి యుండినది; దానిని నాకు నేర్పక బిగబట్టి యుండెను. ఈ దినము ఆ పట్టే నన్ను చిక్కించుకొన్నదని యువకుడు విన్న వించెను.

ఇటువంటి దినము ఒకటి వచ్చునని యే ఆపట్టును నేర్పక దాచి యుంచితిని. మిత్రులొకవేళ విరోధులగుదురేని వారు నీకపకారము చేయగలయంతటి బలము మైత్రియున్నపుడొసగబోకుమని బుద్ధి మంతులు చెప్పుచుందురు. తన శిష్యునిచే అపకారమొందిన యొక గురువు చెప్పిన మాటలు వినలేదా ?

ఇలను విశ్వాసమఖిలంబు ఖిలమొ! లేక
యిత్తరిని తదాచరణంబు రిత్తయేమొ।
బాణవిద్యనాకడ నలవరుచుకొనియు
నన్నుగురిసేయదను శిష్యునెన్నడెరుగ.

ఒకానొక దరిబేసి యిసుక యెడారియందు ఒకమూల కూర్చుండి యుండెను. పాదుషా యామార్గమున పోవుచుండెను. దరిబేసి నిశ్చింతముగ సంతృప్తి రాజ్యము నేలుచుండుకతన పాదు

పాను కన్నెత్తి చూడలేదు. అందులకు రాజ్యాధికార గర్వితుడగు సుల్తాను కుతిలపడి యిట్లనియెను: కుట్లబొంతలు తొడుగుకొను ఈ దరిబేసిమాక నాలుగుకాళ్ల జంతువులతో సమానము. వీరికి యోగ్యతయు మానుషత్వము శూన్యము."

అంతట వజీరు దరిబేసి యొద్దకు పోయి "అయ్యా! యీ యిలనంతయు, పరిపాలించు పాదుషా మీ ప్రక్కన పోవుచుండ, మీరు రాజోచిత మర్యాదలు నెరపి యేల యేలినవారిని సేవింపరు" అని యడిగెను. అందుకు దరిబేసి, మీ సుల్తాను కిట్లు చెప్పుము. "సుల్తాను ధనము నెవరు కోరుచుందురో అట్టివారు అతనిని సేవింతురు. ఇదియుంగాక, రాజు రైతుల రక్షణముకొరకు ఏర్పడెను. రైతులు రాజును సేవించుటకు గాదు" అని చెప్పెను.

రాజు పార్థివముచే ప్రజ సుఖించియును
పేదల కాపరి పృథ్వీశ్వరుండు;
గొల్లండు గొర్రెల కొరకు నేర్పడియె
గొల్లని సేవకై గొర్రెలుగాదు.
ఒకడు కృతార్థుడై యుప్పొంగుచుండ
హృదయక్షతి దపించు నింకొక్కరుండు;
మరణంబు తనయాజ్ఞ నెరవేర్చినంత
వ్యర్థభావుని తలపందు లో మెదడు
మట్టి జీకెడుదాక మాటాడబోకు:
తర్వాత స్వామియు దాసుడన భేద
మంతరించును; మరణానంతరంబు
వారి మట్టినిద్రవ్వ వాడు దరిద్రు
డి తదర్థవంతుడం చెరుగంగ వశమె?

దరిబేసి పలుకులకు సుల్తాను మెత్తవడి నీ వేదైన కోరుమని

యడిగెను. ఇకొకమారు నన్ను తొందర పెట్టక యుందురనియె నాకోరికయని అతడు చెప్పెను. నాకేదైన యొక నీతి తెల్పుడని రాజడిగెను.

ధనము న్న యప్పుడే దలపోసికొనుము;
సిరులు రాజ్యంబులు చేతులు మారు.

అని దరిబేసి చెప్పెను.

౩౦

ఒక వజీరు మిసరు దేశీయుడైన జున్నూను యొద్దకుపోయి ఆయన యాశీర్వాదముగోరి యిట్లనియెను: నేను రేయుంబవలు సుల్తాను సేవయందె నిర్భాగ్యుడనై యున్నాను. నిరంతరము మేలున కెదురుచూచుచు దండనమునకు భయపడు చున్నాను.'' జున్నూను దుఃఖించి యిట్లనియెను: '' నీవు సుల్తానుకు భయపడినట్లు నేను సర్వేశ్వరునికి భయపడియుండిన ముక్తులలో నొకడనై యుందును.''

కష్టసుఖముల తలపోత గలుగకున్న
స్వర్గమున నుండు దరిబేసి పదయుగంబు;
ప్రభువునటు దైవమును భయభక్తి గొలువ
దేవదూతయై మంత్రియు దేజరిల్లు

౩౧

ఒక పాదుషా నిరపరాధుని వధించుటకు ఆజ్ఞాపించెను. అంతట వాడు, నాపయి మీకుగల క్రోధమును సాధించుటయందు మీసొంత కీడు నాహ్వానింపకుడు. ఏలన ఈ మరణదండనము నాపయి

ఒక్క నిమిషములో గడచిపోవును. కాని, ఆ పాపము మిమ్ము శాశ్వతముగ చుట్టుకొనును.

జీవిత మెడారి గాలినా శీఘ్రమేగు;
కష్టసుఖములు, సొబగుల కలిమి లేమి,
చను; నిరంకుశ హింసనక్షణమె వేచు,
గాని, యదివేలు నెప్పు డవ్వాని మెసను.

సుల్తాను వాని నీతివాక్యముల వలన లాభపడినవాడయి మరణ దండనము నుపసంహరించెను.

౩—౨

నౌషీరవాను మంత్రులు ఏదోయొక ముఖ్యమైన రాజకీయ విషయమును గురించి యాలోచించు చుండిరి. వారియందొక్కొక్కడును ఒక్కొక్క విధముగ తన యభిప్రాయమును వెలిపుచ్చెను. సుల్తానును తనకు తోచిన యభిప్రాయము వెల్లడించెను. అంతట ప్రధాన మంత్రి బుజుర్ జుమిహారు రాజాభిప్రాయమె శ్రేష్ఠమని యంగీకరించెను.

తర్వాత తక్కిన మంత్రులు రహస్యముగ ప్రధానామాత్యుని ఇట్లు ప్రశ్నించిరి. ఇందరి పండితుల యభిప్రాయముల కంటె సుల్తాను అభిప్రాయము మీకెట్లు మేలని తోచినది? ఎట్లన, కార్యఫలిత మెట్లుండునదియు మనకు తెలియదు. మన యభిప్రాయముల సాఫల్యము దైవేచ్ఛపై నాధారపడియున్నది. ఒకవేళ అనుకూల పడిన పడవచ్చును. లేదా ప్రతికూలమైన కావచ్చును. కావున సుల్తాను ఉద్దేశము ననుసరించుటయే మేలు. అందువలన ఒకవేళ కార్యము

విఫలమైనను ఆయన కోపమున కగ్గము కాము. కావుననే పెద్దలిట్లు వచించిరి:

పాముపా కంటె వేరవిప్రాయపడుట
తనమెడకుతానె యురి త్రాడు తాల్చుకొనుట;
దినము రాత్రియటంచు రాజనియనైని
అదుగొ చంద్రుడు, సప్తర్షులవుగొయనుము.

33

ఒక మోసగాడు జెడ పెనచుకొని, నేను అలీసంతతి వాడనని చెప్పుకొనుచు మక్కా యాత్రికుల సార్థవాహముతోడ పట్టణముప్రవేశించెను. తాను మక్కా యాత్రికుడనని తెలిపికొని స్వరచితమని యొక చక్కని పద్యమును సుల్తానునకు సమర్పించెను. రాజందుకు సంతసించి ధన మొసగి గౌరవించి, అందరును ఆతని నాదరింప వలయునని ఆజ్ఞాపించెను.

ఆ సంవత్సరమె సముద్రయాత్రనుండి మరలివచ్చిన యాస్థానసచివుడొకడు ఇట్లనియెను: నేనితనిని బస్రాపట్టణమున 'అజహా' పండుగనాడు చూచితిని. ఇతడు మక్కా యాత్రికుడు కాడు. మరి యింకొకడిట్లనియెను: ఈతని నేను గుర్తెరుగుదును. ఇతని తండ్రి మాల్టా పట్టణమున నున్నయొక క్రైస్తవుడు. కావున వీడు అలీ సంతతివాడు కాడు. స్వరచితమని యతడు చెప్పిన పద్యము అన్వారి పద్యసంగ్రహమునందున్నదని వారెరిగిరి. అంతట సుల్తాను కోపగించుకొని వీనిని తన్ని తరిమి వేయుడని యాజ్ఞాపించి, ఓయీ, యొకదానిపై నొకటి యిన్ని యసత్యములెట్లు పలికితివని వానినడిగెను. మహాప్రభూ, ఒక్కమాట విన్నవించ వలసియున్నది. అట యథార్థము

కానియెడల ఏలినవారు ఏశిక్ష విధించినను దానికి బద్ధుడనై యుందు నని చెప్పెను.

అది యేదియని రాజడిగెను.

బీద గొల్లడు మజ్జిగ విక్రయింప
గలుపు నీరు సేరు సేరొక్క గరిటె చల్ల;
దేశ దేశాలు దిరిగిన త్రిమ్మరీండ్రు
జంకు నడిలేక బొంకులె చాటుచుండ్రు.

అని యాతడు చెప్పెను. ఈ మాటలకు సుల్తాను నవ్వి, నీజీవితమున నింతకన్న సత్యమైన వాక్యమును ఎప్పుడును చెప్పియుండవని సంతోషించి మామూలు బత్తెమిచ్చి పంపుడని సెలవిచ్చెను. వారు అతని మనసు సంతోషపెట్టి పంపివేసిరి.

౩౮

హారూనుల్ రషీదు పుత్త్రులలో నొకడు కోపోద్రిక్త చిత్తుడయి తండ్రి యొద్దకువచ్చి, ఫలాని సేనాని కుమారుడు మాతల్లిని దూషించెనని, చెప్పెను. అంతట అమాత్యులనుచూచి హారూను అట్టివానికి ఏమి శిక్ష యుచితముగ నుండునని ప్రశ్నించెను, ఒకడు చంపుట మంచిదనెను. ఇంకొకడు నాలుక తెగగోయుట యుచితమనెను. తక్కినవారు జరీమానా విధించి యూరు వెడలగొట్టుట యుక్తమనిరి.

హారూను ఇట్లు నుడివెను: కుమారా, వానిని మన్నింతువేని దయచూపిన వాడివగుదువు. నీకది శక్యము కానియెడల, నిన్నువాడే మాత్రము తిట్టెనో, ఆమాత్రమే నీవును వానితల్లిని తిట్టుము. హద్దు

మీరి పెట్టిన తప్పు నీ యందుండును. నీ విరోధి నీపై నేరము మోప వలసి యుండును.

మత్తకరితోడ బోరాడు మల్లునైన
వీరుడని సన్నుతింపరు విబుధ వరులు;
నిజముగా వాడె వీరుండు నిండు కోప
మాత్మ సహియించి వెడమాటలనని యతడు.

౩౨

కొందరు పెద్దమనుష్యులతోడ నేనొక యోడ యందు కూర్చుండి యుంటిని. మా వెనుక వచ్చుచుండిన యొక పడవ కెళ్లి అందుండిన యిద్దరు సహోదరులు సుడిగుండములో పడిరి. అదిచూచి యొక పెద్దమనుష్యుడు నావికుని పిలిచి యిట్లనియెను: వారిద్దరను తప్పింపుము. అందుకు బహుమానముగ చెరి యేబది దీనారముల నిచ్చెదను. ఆ మాటలువిని నావికుడు నీటిలో దుమికి ఒకనిని తప్పించెను మరియొకడు మృతినొందెను. నేనిట్లంటిని: అతనికి ఆయుష్యము పూర్ణమైనది కాబోలు! కావున నీ వాని లేవనెత్తుట కాలసించితివి. రెండవ వానిని రక్షించుటకు త్వరపడితివి నావికుడు నవ్వి యిట్లనియెను: తా ము సెలవిచ్చినది యథార్థమె. అయినను దానికి వేరొక కారణమున్నది.

ఏమి కారణము?

ఒకనిని రక్షించుటకు నామన మువ్విళ్లూరు చుండినది. ఏల యన, ఒకప్పుడు నేను ఇసుక యెడారిలో అలసి సొలసి నడువలేక యుండినపుడు అతడు నన్ను ఒంటెపై గూర్చుండ బెట్టుకొనెను, మరి యొకడు బాల్యమున కొరడాతో కొట్టెనని నావికుడు చెప్పెను.

చేత నైనంత వర కేరి చిత్తములను
గాసి పెట్టకు; మా బారి కంటకాంకి
తంబు; చేయూతయిమ్ము పేదలకు; నీకు
గూడ బనులున్నవని యెంచుకొమ్ము సఖుడ.

౩౬

ఇద్దరన్నదమ్ములుండిరి. ఒకడు సుల్తాను సేవచేయు చుండెను. మరియొకడు తన చేతుల కష్టముతో జీవించుచుండెను. ఒకప్పుడు భాగ్యవంతుడైన యన్న యిట్లనియెను: నీవు సుల్తానును సేవించు చుండిన, పనులు చేయవలసిన కష్టము తప్పిపోవునుగదా. అంతట తమ్ముడిట్లనియెను: నీవును కష్టించి పనులు చేయుచున్నయెడల నీచమైన రాజసేవనుండి విముక్తుడవగుదువు గదా. ఏలయన జరీనడుము పట్ట కట్టుకొని రాజు కొలువున నిలుచుండుటకంటె యెవరొట్టైదిని కూర్చుండుటయె మేలని పెద్దలు చెప్పియున్నారు.

పాదుషాలను సేవించి పనులురేయు
జేతులను రొమ్ముపయి భక్తి జేర్చుకంటె,
వేడి సున్నపురాలను విరియబోసి
కట్టుసున్నంబుగా జేత గలుప మేలు.

ఏమి మెసవుదు వేసవి నేమిసీతు
నందు బొడుగుదు నను చింత వ్యర్థమయ్యె
బ్రతుకు: సేవాభరంబున వంగుకంటె
పాడుపొట్ట, రొట్టియతోనె పడుముతృప్తి.

౩౭

ఒకడు ధర్మప్రభువైన నౌషీరువాను సన్నిధికి వచ్చి, ఫలాని

మీ విరోధిని దేవుడు కొనిపోయెనని సంతోషవార్త తెలిపెను. నన్ను వదలిపెట్టెనని నీవేమైన వింటివా యని నౌషీరవాను ప్రశ్నించెను.

శత్రువీల్గినటన్న సంతోషమేల?
మన జీవితము గూడ మనదు సతంబు.

౩౮

నౌషీరవాను ఆస్థానమున అమాత్యులు ఏదోయొక విషయాలోచనమునందు తర్కించుచుండిరి. వారియందు ప్రముఖుడైన బుజుర్ జమిహారు ఊరకుండెను. ఈ వాదోపవాదములయందు మీరేల పాల్గొనరని తక్కినవారడిగిరి. ఏలన, వజీరులు వైద్యుల వంటివారు. వైద్యుడు వ్యాధిగ్రస్తునకు తప్ప నితరునికి మందియ్యడు. మీ యభిప్రాయములు సహేతుకములుగ నున్నయపుడు పైపెచ్చుగా నేను మాటలాడుట యుక్తము కాదు.

నాప్రవేశ మక్కఱలేక సదుచువసుల
పనికిమాలిన మాటలు పలుకవగదు;
గ్రుడ్డివాని మార్గమునందు గూపమున్న
వానిగని యూరకుండుట తప్పెయగును.

౩౯

హారూనుల్ రషీదు మిసరు రాజ్యమును స్వాధీన పరచుకొని యిట్లనియెను: మిసరు రాజ్యము నేలుచున్నానను గర్వముతో దైవత్వమారోపించుకొన్న విప్లవకారునికి వ్యతిరేకముగ, ఈ రాజ్యము నింకొకనికిత్తును.

రాజు బానిసలలో అధమాధముడైన 'కొసీబ్' అను నీగ్రోజాతి వాడొకడుండెను. హారూను వానిని మిసరు రాజ్యమునకు పట్టాభిషిక్తునిచేసెను. వాని తెలివితేట లిట్లుండినవని చెప్పుకొందురు: ఒకప్పుడు మిసరుదేశపు కృషీవలులు బానిసరేని సముఖమునకు వచ్చి, ప్రభువా! నీల్ నదీ తీరభూములందు ప్రత్తి చల్లితిమి. కాని యకాలవర్షములు పట్టి యంతయు నాశనమైనదని మొరపెట్టుకొనిరి. నాశము కాకుండుటకు మీరు కంబళిబొచ్చును చల్లియుండవలసినదని ఆ బానిసరేడు వారికి ఉపాయము చెప్పెను. ఈ మాటలు వినుచుండిన యొక పుణ్యాత్ముడిట్లనియెను.

వేత్తృతను బట్టి భాగ్యంబు వెలయునేని
అజ్ఞమతి కంటె రిక్తుని నరయులేము,
పండితులయూహ వెరగొంది బమ్మరింప
అజ్ఞులదృష్ట సంపద లధిగమించు.

ధనము వొలతు ప్రాప్తించు దైవనియతి,
కాదు కార్యజ్ఞత తదీయ కారణంబు,
కష్టపడి ధనవాది దుఃఖమున బాప
వెడగు పెను లబ్ధి గను బాటియడుగుత్రప్ప

౪౦

ఒక పాదుషాకు చీనాదేశపు బానిస కన్నెనొకతెను సమర్పించిరి. అతడు మధుపానమత్తుడై యుండి యా యువతిని గవయ గోరెను. అందుకా కన్య సమ్మతింపకుండెను. సుల్తాను కోపగించుకొని యా రమణిని ఒక కరిబానిస కిచ్చివేసెను.

వాని వికారస్వరూపమును వర్ణించుటకు నలవిగాదు. పైపెదవి ముక్కురంధ్రముల నతిక్రమించి యుండెను. క్రింది పెదవి

మెడపట్ట పైకి వ్రాలియుండెను. 'సఖాని' యను దయ్యము కూడ వాని వికృత ముఖస్వరూపము చూచి వెరగొని పరుగెత్తవలసి నట్లుండెను. వాని బాహుమూలములనుండి మసి యూటలు స్రవించుచుండెను.

అంపము చందము యూకంబు
సందును, వికృతంపు రూప మాబానిసలో
బందె వడి వ్యాకయుమయ్యెడు
సందనుకం జిక్కి యుండు నని యన వచ్చున్.

వర్ణనాతీతమగు వాని పాడు రూపు!
ఇంక బాహు మూలములన్ని నిశ్వరుండె
కాచుగావుత సమ్మునా కంపు నుండె!
యెండలో గుళ్ళుపసుగె యెంతొమేలు.

ఆనాటి రేయి యా కరిగానిసకు మోహమగ్గలించి కామోద్రేకము చిక్కబట్టనోపక, బలాత్కరించి యాకన్యను చెరచెను. ప్రొద్దుపొడిచి నంతట సుల్తానుకై పుత్రగ్గి యా యువతిని వెదకెను. నిన్న జరిగిన కథ రాజున కెరిగించిరి. అంతట అతడు మండిపడి, ఆ బానిసను ఆ తొత్తు కూతురిని ఒకటిగా కట్టి యెత్తైన మేడపైనుండి కందకంలో పడద్రోయుడని ఆజ్ఞాపించెను.

తరువాత సుస్వభావుడగు నొక వజీరు లేచి ప్రార్థనా పూర్వకముగ శిరము భూమిపై నానించి యిట్లు విన్నవించెను: పాపము, ఇందు నా బానిస తప్పేమియు లేదు. ఏలయన ఏలినవారి గులాములందరు ఇట్టి బహుమానములకును ఆదరింపులకును అలవాటుపడి యున్నారు.

దాని నంటక యొక రాత్రి యోర్చుకొనియుండిన వాని దేమి మునిగిపోవును? అట్లయిన ఆ బానిస కత్తె ఖరీదుకన్న నెక్కుడు

ద్రవ్యము వానికిచ్చియుండుననని పాదుషా యనెను. అంతటవజీరు, మహాప్రభూ, దేవరవారు సెలవిచ్చిన దంతయును నాకర్థమగుచున్నది. అయినను పెద్దలిట్లు చెప్పియున్నారు:

అతి తృషార్తుడు సెలయేటియందు జొచ్చి
మత్తకరి యున్నదని జంకి మరలిపోడు;
అకలెత్తిన మతహీను డన్నమున్న
యింట నొంటిమై 'రంజాను' కేల వెరచు?

సుల్తాను ఇంపితమైన యీమాటలుకులకు సమ్మతించి యిట్లనెను: ఇప్పుడా బానిసకత్తెను నీకిచ్చి వేయుచున్నాను, ఆ తొత్తుకూతురి నేమి చేయమందువు?

దానిని ఆ బానిసకే యిచ్చివేయుడు. కుక్క యెంగిలి తినుటకు కుక్కకే తగియుండునని వజీరు చెప్పెను.

చెడ్డవారల నడయాడు చిన్నదాని
జెలిమి పాటించి దగ్గర జేర్చ కెపుడు;
దప్పి గొనియు నెప్పుడుగాని త్రావబోడు
కంపునోటి వాడానిన కమ్మనీరు.

౪౧

సికందర్ రూమీని ఇట్లడిగిరి: పూర్వపశ్చిమ దేశములను మీరెట్లు లోబరుచుకొంటిరి? పూర్వనరపాలురకు మీకంటె నెక్కుడు కోశము, వయస్సు, రాజ్యము, సిబ్బంది మొదలగునవి యుండియు మీవలెవారు జయమునొంది యెరుగరు.

రూమీ యిట్లు చెప్పెను: దైవసాహాయ్యమువలన నేనేయే దేశముల వశపరచుకొంటినో ఆ యా దేశముల రైతులను గష్టపెట్టినదిలేదు. పూర్వులు ఏర్పరచిన దానధర్మములను సదాచారములను రద్దుపరచినదిలేదు. పాదుషాలనుగూర్చి వారి మంచితనము తప్ప వేరొండు మాటాడినదిలేదు.

మహితుల నామంబు మలినంబుసేయు
కుమతి బెద్దని పెరుకొనరు పండితులు;
భాగ్యంబు భోగంబు బలుప్రాభవంబు
శాసనాజ్ఞాకృతి జయము నాక్రాంతి
యన్ని తృణప్రాయమౌను గతింప;
పూర్వుల సత్కీర్తి పాలియింపబోకు
నీపేరు ప్రఖ్యాతి నిలువంగ వలదె?

గులాబితోటలోని
ప్రథమాధ్యాయము

సంపూర్ణము.

గు లా బి తో ట

ద్వితీయాధ్యాయము

దరిబేసుల శీలము

౧

ఒక పుణ్యాత్మునిచూచి యొక పెద్దమనుష్యుడిట్లనియెను. ఇతరులచే నిందింపబడుచున్న ఫలాని భక్తునిగూర్చి మీరేమి చెప్పెదరు?

బయటికి నేదోషమును కాన్పించుటలేదు. అతని యంతరంగమున నేమి దాగియున్నదో దానిని నేనెరుగను.

మాసికల బొంత దొడిగిన మనుజుగాంచి
కల్మషములేని భక్తునిగా దలంచు;
మేమి వానిలో నున్నదొ యెరుగకున్న
ఏమి ఎని ' ముహ్తసీబున ' కింటిలోన.

అని ఆ పుణ్యాత్ముడు పలికెను.

౨

పావనమైన ' కాబా ' వాకిట పరిణతుడయి వేదనా గద్గదస్వరముతో నొకదరిజేసి యిట్లు మొరపెట్టుచుండ నేను వింటిని: ఓ క్షమాశీలా, కరుణామయా, మాబోటి దుర్మార్గుల వలనను అజ్ఞానుల వలనను ఏమి ప్రయోజనముండునో నీవెరుగుదువు.

భక్తి వినయంబులునులేవు; ప్రణతినల్ప
సత్ప్రలోపంబె నీ మ్రోల బెట్టినాడ;
పాపి యనుతప్తుడగు దనపాపములకు,
జ్ఞాని యర్చనా లోపంబు సైపలేడు.

భక్తులు తమ సేవకు ప్రతిఫలము వాంఛింతురు. వర్తకులు తమ వస్తుసామగ్రికి విలువ గోరుదురు. వినయముచూపి రక్షణము

గోరునంతటి యోగ్యతనాకులేదు. నిర్హేతుక వాత్సల్యముచే నీవు నన్నురక్షింతువన్న యాస యొక్కటియె నీయెదుట పెట్టుచున్నాను. నేను యాచించుటకు వచ్చితిని; వ్యాపారము చేయుటకుకాదు.

నను ముంచిన దేల్చిన నే
ననయము నీద్వారసీమ నాంచెదశిరముఁ;
దనరునె స్వేచ్ఛ గులామున.
కనువర్తించెదను నీదు నాజ్ఞను దేవా.

అర్థియొకడు 'కాబా' ముందు నార్తివెక్కి
వెక్కి యేడ్చుచు నిట్లన వింటిః ప్రభువ,
వినతి గ్రహియింపు మని నిన్ను వేడగాని
కలుషముల పైని బెట్టు నీ కలము గిటు.

3

అబ్దుల్ ఖాదర్ గిలాని కాబా మందిరమున పవిత్రశిలాఫలకముపయి మోము వోపి యిట్లు పలుకుచుండ కొందరువినిరి: సర్వేశ్వరా, నన్నుమన్నింపుము. అట్లుగాక నేను శిక్షార్హుడనని తలంతు వేని అంత్యదినమున పుణ్యాత్ములను గాంచి సిగ్గు పడకుండునటుల నన్ను గ్రుడ్డివానినిగ లేవదీయుము.

అనుదినంబును బ్రొద్దున నవని నంట
వినతి పలవంచి యారీతి వేడికొందుః
నిన్నుమరవకు సర్వేశ; నన్నుదాసు
స్మృతిక నెలయింతువె యెప్పుడేని క్షణము.

౪

కన్నపు దొంగ యొకడు ఒక పుణ్యాత్ముని యింట ప్రవేశించెను. అచ్చట నెంత వెదకినను ఏమియు దొరకనందున వాడు భగ్న

మనోరథుడాయెను. ఆ పుణ్యాత్మునకీ విషయము తెలియవచ్చి తాను పండుకొని యుండిన కంబళినితీసి దొంగ మనసు చిన్నపోకయుండునట్లు వాని మార్గమున విసరివేసెను.

దైవ మార్గానువర్తులు తమ విరోధి
హృదయములనైన నొప్పింప రెన్నడేని;
స్నేహితుల తోడ గలహంబు సేయు నీకు
నిట్టి గౌరవ పద మింక నెట్టు లబ్బు?

నిర్మలాత్ముల మైత్రి యెదుటనైనను వెనుకనైనను ఒకే విధముగ నుండును. అట్టివారు ముందు నీకొరకు ప్రాణములనైన నర్పింతుమని నమ్మబలికి వెనుకకు మరలినపుడు తప్పులు పట్టరు. కపట మిత్రులన్నో—

ఎదుట మేక విధాన నెంతొ నెమ్మదియు,
వెనుక హంసానక్త వృకవర్తనంబు!

ఇతరుల తప్పులు నీకడ
సతతము తూర్పార బట్టు చందంబున దు
ర్మతి నీతప్పులు సైతము
నితరులకడ జాటుచుండు నెల్లిదపరుపన్.

౨౩

కొందరు దేశద్రిమ్మరి ఫకీరులు పరస్పర సుఖదుఃఖ భాగస్వాములయి యాత్రసల్పుట కంగీకరించిరి. నేను వారి సహవాసము నాసించితిని. దానికి వారొప్పుకొనకుండిరి. అంతట నేనిట్లంటిని: మాబోటి బీదల సహవాసము నిరాకరించుటయు, మీబోంట్లగోష్ఠి వలన గలుగు లాభమును పొందనీయక యాటంకపెట్టుటయు తమ వంటి గొప్పవారి కారుణ్యమునకును సౌశీల్యమునకును లోపముగ

నుండును. తమచిత్తములకు భారభూతుడనుగాక తెలివిగల చెలికాని వలె తోడ్పడుచుండుటకు తగినంత యుత్సాహము ఆతురత నాకు గలదు.

అంతట వారిలో నొకడిట్లు చెప్పెను:

మా మాటలను మీరు వేరు విధముగ తలంచుకొని క్షోభిల పడబోకుడు. ఏలయున, కొన్నిదినములకు పూర్వము చోరుడొకడు దరిబేసి వేషముతోవచ్చి మావద్దచేరి స్నేహసూత్రముతో మమ్ము బంధించెను.

అంగివాల్చిన వాని యంతెట్లు తెలియు?
లేఖలో విషయంబు లేఖకుండెరుగు

సామాన్యముగ దరిబేసుల సత్ప్రివర్తనముసందుగల విశ్వాసమువలన వానిపై నెవ్వరికిని సంశయము పుట్టక సహవాసము నంగీకరించిరి.

జ్ఞానులకు బాహ్యచిహ్నము
మానితపౌ కుట్లబొంత; మరియదె చాలుఁ
మానసము పుణ్య చింతా
దీనముగానెల్లవేళ దిరమై యున్నఁ.

నీ విధుల నిర్వహింపుము నిరత, మంత
నెడద కెక్కిన యుడుపుల దొడిగికొమ్ము,
తల గిరీటము, భుజముపై ధ్వజముబెట్టి
కొమ్ము. దాన రాదేమి లోపమ్ము నీకు.

అంతయు ద్యజించి వైరాగ్య మభ్యసింప
జ్ఞానియగు గాని వేషంబు కలిమిగాదు;
బొందళము పీరుడు ధరింప బోలుగాని
బడుగుపేడికి నదియేల బరువుచేటు.

ఒకనాడు పొద్దుకుంకు వరకు దారి నడిచి నడిచి చీకటిపడిన తోడనే యొక కోట ప్రక్కన పండుకొని నిద్రించితిమి. అంతట వేషధారియైన యాదొంగ లేచి కాలు సేతులు శుద్ధిచేసికొనుట కని మిత్రుని జలపాత్రముతీసికొని దొంగిలించుటకు బయలు వెడలెను.

దైవభక్తుల యంగిని దాల్చినట్టి
అల్ల దరిబేసి కార్యంబు నరసినావె?
పూతకాబాకు గప్పిన పుట్టమూడ్చి
గాడిదకు గుడారముగాగ గట్టినాడు!

మేము పండుకొనియున్న స్థలము దాటినంతనే యాదొంగ కోటలోనికి ప్రవేశించి యలంకార పేటికను దొంగిలించి పలపల తెల్లవారులోపల చాలదూరము పయనించెను ఏమియు నెరుగని మేము నిద్రించుచుంటిమి. ప్రొద్దుపొడుచుచుండగనె యధికారులు మమ్ము కోటలోనికి తీసుకొనిపోయి చావమొత్తి చెరసాలలోనికి సాగనంపిరి. ఆ దినము మొదలు మేము అన్యుల సహవాసము వర్జించి నిస్సంగులముగా నుండుటకు తీర్మానించుకొంటిమి.

కులములోన నొకడు కొరగాని పనిసేయ
మిగతవారికెల్ల నగడు వచ్చు;
బెడిసి యొక్కయెద్దు బీటిలో పడినంత
ఊరిపశువులెల్ల దూరు గుడుచు.

బాహ్య దృష్టికి, వారి సహవాసము నుండి నేను తొలగింప బడినట్లగపడినను తథ్యమరసిన దరిబేసుల గోష్ఠియందు పొందదగిన లాభము ఆ కథ మూలమున సిద్ధించినందులకు సర్వేశ్వరునికి వంద

నములర్పించితిని. మా బోంట్లకు ఈ నీతి జీవితమునందెల్లప్పుడు ప్రయోజనకారి కాగలదు.

మట్టు మర్యాద లెరుగని మనుజుడొకడు
సభను జెలరేగ బెద్దలస్వాంతమెరియు;
దొరగ బన్నీరు నింపిన తొట్టియందు
గుక్కపడునేని జలదారి గుంటయగును.

౬

భక్తుడొకడు పాదుషాకు అతిథియయ్యెను. తనయందు వారికి సదభిప్రాయము హెచ్చునటుల భోజనమునకు కూర్చుండినపుడు అతడు తన కిష్టముండినంతకన్న తక్కువగ భుజించెను. నమాజు చేయుటకు లేచినపుడు తన యలవాటుకన్న ఎక్కువ సేపు ప్రార్థించెను.

కాబాకుబోలేవు గనుమోయరబ్బి
యీబాట తుర్కికి నేగురో యబ్బి.

ఆ భక్తుడు స్వగృహమునకు వచ్చినప్పుడు మరల అన్నము తినగోరెను. బుద్ధిమంతుడైన యాతని కుమారుడు ఇట్లు ప్రశ్నించెను: తండ్రీ పాదుషా విందుబంతిని నీవేల చాలినంత భుజింపకుంటివి? అదియు నొకందుకు పనికివచ్చునని వారు చూచుచుండగా నేనే మియు తినలేదని తండ్రి చెప్పెను. ఒకందుకు పనికివచ్చుదానిలో నేదియు కొరత పడకుందునట్లు నమాజుకూడ చేయుమని కుమారు డెత్తిపొడిచెను.

సుగుణసంపత్తి నరచేత జూపినావు;
తప్పిదంబుల జంకలో దాచినావు;
కష్టదినమున జెల్లని కాసుతోడ
ఓయి గర్వాంధుడా, ఏమిచేయుగలవు ?

౭

బాల్యమునందు నెక్కడు శ్రద్ధాభక్తులు కలవాడననియు, రాత్రి జాగరము, పుణ్యచింతనము, ఉపవాసములయందు మిక్కుటమైన పట్టుదలకలిగినవాడననియు నాకిప్పటికిని జ్ఞప్తియున్నది. ఒకనాటిరేయి మా తండ్రిగారియొద్ద కూర్చుండి యా రాత్రి యంతయు కంటిపై రెప్ప వేయక ప్రియమైన ఖురాను నొడిలో నిడుకొని పారాయణము చేయుచుంటిని. మా చుట్టుపట్టలనుండినవారు నిద్రించుచుండిరి. వారిని గురించి జనకునితో నిట్లంటిని: ఈ సమూహములో నొక్కడైనను నమాజుచేయుచున్నవానివలె తలయెత్తడు. వీరందరు మరణించిరో యనునట్లు గాఢనిద్రా పరవశులైయున్నారు. ఇందుకు జనకుడిట్లనియెను: ప్రియతనూజ, యితరుల తప్పు లెత్తిమాపుటకంటె, నీవును నిద్రించియుండిన మేలుగ నుండెడిది.

వ్యర్థ గర్వావగుంఠనం బమర, వాది
తాను దనకన్న నన్యంబు దలపలేదు;
జ్ఞాన దృష్టి ప్రబోధంబు గాంచునేని
తెలియు దనకన్న నజ్ఞుండు గలుగడంచు.

౮

ఒక సభయందు ఒకానొక పెద్దమనుష్యుని యోగ్యతను

సద్గుణములను ఇనుమిక్కిలిగ పొగడిరి. అంతట నా యోగ్యుడు తలయెత్తి యిట్లనియెను: నేనెటువంటివాడనైనదియు నేనెరుంగుదును.

పరిజకు నా బాహ్యవర్తన భవ్యమయ్యె
జిత్తమలినత దలవంతు సిగ్గుతోడ;
తన బెడంగును రంగు నందరు నుతింప
నెమిలి కరిగాళ్ళరోతకు నెగులుచెందు.

౽

లిబనాను పర్వతమునందలి పుణ్యాత్ములలో నొకడు దిమిష్క నగరములోని గొప్ప మసీదునకు వచ్చెను. ఆ మన యుపన్యాసములును మహిమలును అరబ్బీదేశమంతట ప్రసిద్ధములైయుండెను. ఆ మహనీయుడు బావియొద్ద నీటితొట్టికడ కాలుసేతులు శుద్ధిపరచుకొనుచుండ కాలుజారి తొట్టిలోబడి చాలకష్టముతో తప్పించుకొని పైకెక్కివచ్చెను. నమాజు పూర్తయైన వెనుక సహవాసులలో నొకడు ఆయనతో నిట్లనియెను. నాకొక సంశయం కలిగినది.

ఏమి సంశయము ?

దేవరవారు పడమటి సముద్రముపై నడచునప్పుడు అరకాలైన చెమ్మగాక యుండిన సమాచారము నాకు జ్ఞప్తియున్నది. అయినను ఏమికారణమోగాని యీదినము తమరు నిలువులోతు నీళ్ళలోబడి తప్పించుకొని బయట పడుటయె కష్టసాధ్యమయ్యెను,

అంతట ఆ మహాత్ముడు తలవంచుకొని కొంత సేపు వరకు ఆలోచనా నిమగ్నుడయి తలయెత్తి యిట్లనియెను: లోకప్రభువైన

మహమ్మదు సెలవిచ్చిన యీ సూక్తి నీకు తెలియదా? "ఒక సమయమున నేను సర్వేశ్వరునియొద్ద యున్నపుడు తన సమీపవర్తి యగు దేవదూతగాని లోకమున కంపబడిన ప్రవక్తగాని అచ్చటికి వచ్చుటకు దారిలేకయుండెను." కాని సదా యట్లేయుండునని ఆయన చెప్పలేదు.

మహమ్మదు మరియొకప్పుడిట్లు సెలవిచ్చెను: "ఆయన యొకప్పుడు జిబ్రియీలు, మయికాలు వంకచూడడు. వేరొకప్పుడు హజ్రా జైనాబులతోడ మాటాడును."

కన్నులయెదుట నిమేషము
యెన్నునగొమ్మెరుగు పోల్కి మెరసి, మరిగి, యా
పన్నుల గాఢోత్కంఠయు
జెన్నగు నీ విలువ హెచ్చు జేసెద వీశా.

యాకూబుగని కొందరడిగిరీరీతిగ:

"ఓ కీర్తి భూషణా, యోమనీషి
మిసరు రాజ్యమునందు మీకుమారుండుండ
నతనిచొక్కా తావి నద్భుతముగ
గంటిరి పసిపట్టి; కతమేమినేడు 'క
నాను' కూపమున మీ నందనుండు
కడు దగ్గరగ దాచబడియుండ నెరుగరు?"
అనతిని యాకూబు ననియె నిట్లు:
"క్షణికములు మాపనులు శంపగతి; నొకప్డు
స్వర్గముననుందుము; మరొక్క క్షణమునందు
కాలిమడమను గనలేము; జ్ఞానిస్వవిధి
వర్తిల నిహపరాతీత పదవినొందు.

౧౦

నేనొక సమయమున బాల్ఖు నగరపు మసీదునందు నీతిబోధకముగ నుపన్యసించుచుంటిని. అచ్చటి శ్రోతలు నీరసులుగను, మృత హృదయులుగను, లౌకిక విషయాసక్తులుగను, పరచింతా శూన్యులుగ నుండిరి. నా యుత్సాహము ఉద్రేకము వారి నంటుకొనలేదనియు, నా వేదాగ్ని పచ్చి కట్టెలవంటి వారి హృదయముల దరి కొల్పబోదనియు గనుగొంటిని. పశుప్రాయుల శిక్షణమున విసిగి వేసారితిని. గుడ్డివారికి నద్దము చూపుట వ్యర్థమని తెలిసికొంటిని. అయినను వ్యాఖ్యాన ద్వారము తెరువబడినది. వాక్యప్రవాహము తుంపెసలు గొట్టినది. "మేము మనుష్యులకు తమ కంఠంలోని రక్తనాళముకంటె సమీపమున నున్నాము" అను ఖురాను సూక్తిని వివరించుచు నిట్లు చెప్పితిని :

చెలినాకంటెను నాకుదగ్గరిదియై చెన్నారు : నట్లయ్యు లో
దలపంజిత్రము ! కామితార్థమునకుఁ దవ్వాయెజిత్తంబు : ఈ
కొలకే నేమియొనర్తు ? నేరికడ నాకుండుఁ నివేదింతు ? నె
చ్చెలి నాకౌగిటనుండియుఁ విరహనైచింతింతు నశ్రాంతముఁ.

ఈ వాఖ్యాసవమును గ్రోలి నేను మత్తుగొంటిని. పానపాత్రలోని ద్రాక్షారసము ఇంక కొంత శేషించియుండగనే యొక బాటసారి యీ సభ ప్రక్కన పోవుచుండెను. ఆ వాక్ప్రవాహపు గడపటి తరంగములు ఆతని దాకెను. వేదనాభరితుడయి యా బాటసారి మూల్గెను. సభ్యులందరును ఆతని ననుసరించి మూల్గిరి. అంతట నేను భావోద్రేకముతో నిట్లంటిని: "దేవుడు స్తుతింపబడుగాక! దూరస్థులయినను ప్రాజ్ఞులు జ్ఞానముచేత సన్నిహితులుగనుందురు. సమీపవర్తులయ్యును, అజ్ఞులు మూఢత్వమువలన దూరస్థులగుదురు"

భావములు శ్రోతలకు బోధపడకయున్న
వక్తశక్తిలోపంబని పలుకవచ్చు;
విరివిసేయుము నీకోర్కి వీడి, నందు
వక్తృతా కందుకముగొట్టు పండితుండు.

౧౨

మక్కాకుపోవు మార్గమున నిసుక యెడారియందు నొకరాత్రి నిదురలేనందున అడుగెత్తిపెట్టుటకు శక్తిలేక యొకచోట గూలబడి "నా గదికి నన్ను వదలిపెట్టు"మని ఒంటెవానితో చెప్పితిని.

ఒంటియేగమన శ్రమకుమ్మలింప
నెంతదూరమ్ము తెరువరి యేగగలడు ?
బలిసినయతండు కృశియించి పడకమున్నె
బక్కవాడు కష్టంబుల జిక్కిమడియు.

"సోదరుడా, మక్కాముందున్నది. దారిదోపిడి గాండ్రు వెనుకనున్నారు. నీవిప్పుడు పయనింతువేని బ్రతుకుదువు. శయనింతువేని మరణింతువు. పెద్దలు చెప్పిన యీ వాక్యమును నీవు వినలేదా" యని యొంటెవాడిట్లనియెను :

రాత్రివేళ నెడారి మార్గంబునందు
బయనమగుచుండి, చల్లగా బాటప్రక్క
చెట్లక్రిందను నిద్రింప జెలగు సుఖము,
కాని ప్రాణంబుపై ఆస మానవలయు.

౧౩

పెద్దపులిచేత గాయపడి సముద్రతీరమున కూర్చుండియుండిన

నొక పుణ్యాత్ముని చూచితిని. ఎట్టి పూతమందువలనను ఆతని గాయముమానకుండెను. కొంతకాలము దాని బాధతో కష్టపడుచు సర్వేశ్వరునికి నిరంతరము వందనము లర్పించుచుండెను.

"ఏల వందనములర్పించుచున్నావు" అని కొందరడిగిరి. "ఏలయన, దురదృష్టమునకు పట్టుపడితినేగాని పాపమునకు పట్టువడ లేదుగదా" యని దేవుని కీర్తించుచున్నాను" అని ఆ పుణ్యాత్ముడు చెప్పెను.

ఆ ప్రియస్నేహితుడు నన్ను నంతకునకు
నొసగినను బ్రాణభీతితో నుమ్మలింప;
మీ యెడద నొవ్వనీదాను డేయఘంబు
సలిపెనోయన్న చింతయే కలచుమదిని.

నిజముగా దైవభక్తులు పాపమునకంటె కష్టమునే కోరుకొందురు. "వారు నావలన కోరిన దానికంటె చెరబడుటయె మేలుగా తోచుచున్నది" అని యిటువంటి సందర్భమున యూసబు చెప్పిన వాక్యము నీవెరుగవా?

౧౩

ఆవశ్యకమైన కార్యము తలపడి యొక దరిద్రుడేసి మిత్రునింట కంబళిదొంగిలించి దానిని విక్రయించి తన యక్కర గడుపుకొనెను. దండనాధికారి వాని చేయి తెగగొట్టుటకు ఆజ్ఞాపించెను.

"అంతట మిత్రుడైన కంబళి సొంతదారు జాలిగొని ఆతని మన్నించితిని. శిక్ష నుపసంహరింపుడు" అని అధికారిని ప్రార్థించెను. "నీవు వత్తాసివచ్చినను దండనీతిని జవదాటను"అని అతడుపల్కెను. "తమరు సెలవిచ్చిన దంతయు యథార్థమె. అయినను దానధర్మ

ములకై నిర్ణీతమైన ద్రవ్యమునందు ఏదో కొంచము దొంగిలించిన యతడు చేయి తెగగొట్టవలసినంత కఠినశిక్షకు పాత్రుడు కాడు. ఏలయన, ఫకీరునకు సొంతమైనది యేదియు లేదు. దరిబేసుల కాస్తి యుండినను అది అక్కరగలిగినవారికిగూడ సొంతమైనదిగనుండును” అని యా మిత్రుడు విన్నవించెను. ఆ మాటలకు అధికారి సంతసించి దరిబేసి శిక్ష నుపసంహరించి వానిని చీవాట్లుపెట్టి యిట్లనియెను: “ఇటువంటి ప్రాణస్నేహితుని యింట తప్ప దొంగిలించుట కింకెచ్చనైనవీలులేక లోకమంతా గొడ్డుపోయినదా యేమి!”

“పెద్దలు చెప్పిన యీ వాక్యమును తమరు వినలేదా? కాని వాని యింటి కడపనైన త్రొక్కకుము. చెలికాని యిల్లు చూరగొనుము.”

కష్టసంప్రాప్తికి మవంబు కలతచెంది
బలము ధైర్యంబు విడుచుట పాడికాదు;
మరి, విరోధుల వీపు చర్మంబు, స్నేహి
తుల యొడలిపైని చొక్కాయి నొలిచికొమ్ము.

౧౪

పాదుషా యొక పుణ్యాత్మునిగాంచి “మేమెప్పుడైనను మీకు జ్ఞప్తికి వచ్చుచుందుమా?” యని ప్రశ్నించెను. “అవును, మేము దేవుని మరచినప్పుడు మాత్రము” అని ఆ పుణ్యాత్ముడు జవాబు చెప్పెను.

కడకు నీ ద్వారముననుండి క్రమ్మరింప
బడిన నరుడన్ని దిక్కుల బమ్మరించు;
నీవు చేరబిల్చినవాని నిక్కువముగ
ఇతర గేహాళి యాచింప నీవు దేవ.

౧౫

పాదుషా స్వర్గమునందును, దరిబేసి నరకమునందు నుండినట్లు ఒక పుణ్యాత్ముడు కలగనెను. పాదుషా ఊర్ధ్వగమనమునకును దరిబేసి యధఃపతనమునకును కారణమేమయ్యుండును? సాధారణముగ లోకులు తలంచుదానికంటె యిది విపరీతముగనున్నది'' అని యాతడనెను. ''పాదుషా దరిబేసులపైగల ప్రీతిచేత స్వర్గముననున్నాడు. దరిబేసి పాదుషా సాంగత్యమువలన నరకముననున్నాడు'' అని ఆకాశవాణి పలికెను.

అంగి జపమాల బొంతయు సమరియున్న
లాభమేమౌను దుష్కార్య లంపటునకు?
సుగుణుడౌ దరిబేసి దాల్చుకొనవచ్చు
దురికిదైన గుళ్లాయి తార్తరివియైన.

౧౬

కూఫా నగరమునుండి వచ్చుచున్న యొక బాటసారి మక్కాయాత్ర చేయుచుండిన మా బిడారమును గలసికొనెను. ఆతని కాళ్లకు చెప్పులుగాని తలకు కుళ్లాయిగాని లేదు. దారిబత్తెమయిన తెచ్చుకొనలేదు. అతడు సంతోషముతో దారి నడచుచు నిట్లు పలికెను.

ఒంటెనెక్క, భారముమోయు నొంటెపోల్క;
బ్రజల బాలింప, ప్రభునకు బంటుగాను;
గతమునకు నుమ్మలింప, ప్రస్తుతపు జింత
నెరుగ, హాయిగా గడపెద నెపుడు బ్రతుకు.

“ ఓ దరిబేసీ, యెచ్చటికి పోవుచున్నావు? గమన ప్రయాసముచే మరణింతువు. వెనుకకు మరలుము ” అనియొక యొంటె రౌతు చెప్పెను. దరిబేసి యా మాటలు వినక యెడారి దారి పట్టెను. మహమ్మదు ఖర్జూరపుదోట కడకువచ్చు నప్పటికి ఒంటె రౌతు మరణించెను. దరిబేసి యాతని తలగడ కడ వంగి యిట్లని యెను: “ నేను కష్టముల పాలయ్యును బ్రతికియున్నాను. నీవు ఒంటెపై నెక్కివచ్చియు మరణించితివి. ”

ఒక్కడు వ్యాదితునకు గా
బొక్కుచు నిసియెల్ల నేడ్చి ప్రొద్దున మడసెన్;
మొక్కవలె గూరుచుండెను
పక్కపయిన్ రోగి వ్యాధిబాగయి తుదకున్.

జపము సత్వంబు గలుగు నశ్వముల్ బడల
నలసగతి గుంటి గాడిద యంచె జేరె;
ఎందరో దృఢకాయులు మ్రందినారు.
క్షత శరీరుడు జీవించె గంటిమాని.

౧౨

సుల్తాను ఒక భక్తుని తన దివాణమునకు ఆహ్వానించెను. ఆ భక్తుడిట్లు తలపోసెను: “ నేను మందు తిని కొంచెము బలహీనుడ నయ్యెదను. అందువలన సుల్తానుకు నాయందిప్పుడున్న విశ్వాసము మరింత హెచ్చగలదు. ” అతడు పొరపాటున విషగుటిక మ్రింగి చచ్చెనని చెప్పుకొనిరి.

ఉల్లి విధంబున బయిపయి
ఒల్లుగ మడుపులను దొడిగి పిస్తావలెమే

నెల్లత గండగలిగి సాం
పిల్లెదు దరిజేసిగంటి వేసవు పెద్దగా.

ప్రజకు మొగమును వీపు 'కాబా' కు జూపి
ప్రార్థనముసేయు దరిజేసి ప్రకటనేచ్ఛ ;
దైవభక్తుండవై కొల్వ దలతువేని
దైవమును దప్ప వేరొండు దలపనేల ?

౧౮

సార్థవాహుడు యూనాను దేశమున పయనించుచుండ బంది పోటు దొంగలు వారి నడ్డగించి లెక్కకు మిక్కుటమైన ధనమును కొల్లగొట్టిరి. ఆ వర్తకులు లబోదిబోయని యేడ్చుచు దైవమును పైగంబరులను ఎంత ప్రార్థించినను ప్రయోజనము లేకపోయెను.

దారి దోపిడిగాండ్రకు ధన భయంబు
చేత జిక్కిన రాబట్టు సేతగలదె ?
సార్థవాహుల కన్నీటిజడి కొకింత
కరుణ గల్గునె చోరుల కటికి యెదల !

ఆ బిడారునందు సుప్రసిద్ధ నీతివేత్తయగు లకుమానుండెను. " ఈ దొంగలకు నీతి మాటలతో కొంత బుద్ధి చెప్పిన యెడల ఒక వేళ వారు అపహరించిన ధనములో కొంత భాగమైన మాకియ్య వచ్చును. లేకున్న నింత ద్రవ్యమును పోగొట్టుకొనుట చాల పరితాపకరముగ నుండును అని యొకవర్తకుడు చెప్పెను. " ధర్మాధర్మములను అటువంటి మనుష్యులకు చెప్పుటకూడ చాల విచారకరముగ నుండును " అని లకుమాను బదులు చెప్పెను.

పత్ర పరశువుతో రాయబడియు దుప్ప
దిన్నలోహంబు మెరుగార దీర్పబడునె ?
నీతి కొరయె మలీమస చేతసులకు ?
ఇనుపమేకును రాతిపై జొనుపదగునె ?

ధనముగలవాడె బీదల దనువు ; వారి
యిష్ట లీడేర్తునేని నీయిడుమ లుడుగు ;
యాచకుల కిమ్ము వేదన ; కట్లుగాక
ధనమును నిరంకుశుండూర్చుకొను నెకప్డు.

౧౫

పరమపదించిన మా గురువు అబుల్ ఫరజ్‌బిన్‌జూజి నేను దరిబేసుల సంగీత గోష్ఠులకు పోగూడదనియు కార్యభారము వహింపక యేకాంతముగ కాలము గడపవలయు ననియు నొక్కి చెప్పి యుండెను. కాని, యౌవన సహజమైన చాపల్య మగ్గలించి లౌకిక విషయేచ్ఛలకు లోనయి ఆ చార్యుని యభిప్రాయమునకు విరుద్ధముగ కొంత సంచరించితిని. ఆటపాటల సంతోషమున మునిగి తేలుచుంటిని. గురుని వాక్యములు మనస్సునకు వచ్చినప్పు డిట్లనుకొనుచుంటిని.

మాతోడ ఖాజి యుండిన
జేతో ముదమతిశయింప జేతులు విసరున్;
బ్రీతిగమత్తు క్షమించును
అతరి ధర్మాధికారి యానవ మానన్.

ఒకనాడు సాయంకాలము వరకు ఆ సమాజమున కలసిమెలసి తిరుగుచు నందొక గాయకుని కాంచితిని.

అతడు సారంగిపై నాడించెడు కమాను
ధమనుల నడలించు దారుణముగ ;
గాన వైఖరియును గంత నినాదంబు
తండ్రి చావున కేడ్చు తనయు కూయి
కొంత మేలనిపించు ; గొందరు విసుగొంది
వ్రేళ్లు చొప్పించిరి వీనులందు ;
జాలించుమనిచెప్ప సంజ్ఞగా నొకసారి
పెదవిపై వ్రేలిని బెట్టికొనిరి.

మధుర కంఠస్వరానంద మగ్నమగుచు
నంతరంగము పారవశ్యమును బొందు
గాని, నీవంటి దౌర్భాగ్య గాయకుండు
ఊరకుండిన సంతోష మొదవుమాకు.

నీ పాటయు పద్యము విన
జేపడెనే ప్రమదమెవని చిత్తమునందుఁ ?
నీ పోకకుఁ మా యుల్లము
తాపము విడి చల్లపడును, దలగుమవేగఁ.

పాట విన్నయంత-భగవంతుని స్మరించి
యింటి స్వామితోడ నిట్టులంటి :
దూది దెమ్ము చెవుల దోపుదు, లేకున్న
తలుపు దెరవుమేను వెలికి జనుదు.

వేయేల మిత్రుల యభీష్టానుసారముగ కష్టముతో ఆ రాత్రి నెటులో వెడల బుచ్చితిని.

అదను దెలియక మేల్కొని యరచుచుండె
నిద్ర మాంద్యమ్మున మునాది ; నీవు నాదు
రెప్పలను బ్రిక్క చేయుము రేయినిడవి,
క్షణము సేపైన నిద్దుర గాంచియెదుగ.

తెల్లవార, లేచి మొలపట్టనుండి యొక దీనారమును, తలపై నుండి తలపాగయు తీసి ఆశీర్వాద పురస్సరముగ ఆ గాయకుని యెదుటపెట్టి యాతని కౌగలించుకొని నా కృతజ్ఞతను తెలుపుకొంటిని.

ఆతనియెడ నా ప్రవర్తనము ఆచార విరుద్ధమని స్నేహితులు నా తెలివితూలిన తనమునకు లోలోపల నవ్వుకొనిరి. వారిలో నొకడిట్లు నిందింపసాగెను: "నీ వొనర్చిన కార్యము ప్రాజ్ఞ సమ్మతముగాదు. పెద్దల కుచితమైన తలపాగను ఇటువంటి గాయకున కొసంగితివి. వాని జీవితకాలమునందెన్నడైన నొక దీనారమును సంపాదించి యుండడు. బంగారు రాపోడి డక్కికి అతికించి యెరుగడు. ఎవనిని రెండుమూరు లొకచోట కాంచలేమొ యట్టి గాయకుడు ఈ యానంద మందిరమునకు దూరముగ నుండుగాక!"

రోమములు నిక్క పొడుచును
ఏ మనుజునకైన వాని యెలుగును విన్నగా;
మా మనము పొగులు; బులుగులు
వేమరు గిగావటంచు వెరగొని యార్చుగా.

"నీవు నన్ను తూలనాడక యూరకుండిన మేలుగ నుండును. ఆ గాయకుని మహిమ నాకు గోచరమైనది" అని నేనంటిని.

"ఆ మహిమ యెట్టిదో నాకు దెలుపుము. నేనును ఎగతాళి చేసినందుకు ఆతని యొద్దకుపోయి క్షమింప వేడుకొందు" నని మిత్రుడు పల్కెను. ఆ మాటలకు నే నిట్లంటిని: "అది యెట్టిదనగా, దివంగతుడైన మా గురువు దరిబేసుల యాటపాటలలో చేరవద్దని నాకు పలుమారు బుద్ధి చెప్పియుండెను. అయినను అదృష్టవశమున నిన్నటిరాత్రి నే నిచ్చోట నడుగిడునంతదనుక గురువొసగిన నీతిలోని ప్రయోజనము నాకు గోచరింపకుండినది. ఇది

మొదలు నా జీవితాంతము వరకు నెప్పుడైన దరిబేసుల నృత్యము వందును ఆటపాటలయందును పాలుగొననని ఆ గాయకుని చేతిలో చేయివేసి యొట్టు పెట్టుకొంటిని.

తేనె పాతెర పువుబోణి తియ్యబలుకు
రాగయుతమైన గాకున్న రమ్యమగును ;
ఎట్టి సంగీత ఫణితియు నీ పిశాచ
గాయకుని నోట వెడలిన గ్రాచమెదను.

౨౦

లోక ప్రసిద్ధ నీతివేత్తయగు లకుమానును "నీవు మట్టు మర్యాద వెవరివలన నలవరచుకొంటివి" అని కొందరు ప్రశ్నించిరి,

"మట్టు మర్యాద వెఱుగని వారినుండి నేర్చుకొంటిని. వారి నడవడియందు నాకేది సమ్మతముకాదో అట్టి దానిని నేనాచరింపక వదలితిని."

హాస్యముగనైన నొకమాట యన్నయంత
బ్రాజ్ఞులందుండి నీతిని బడయుచుంద్రు.
నూరు పన్నాల నీతులు నూరిపోయ
నజ్ఞు డెగతాళిగా దాని నవగణించు.

౨౧

ఒకానొక భక్తుడు రాత్రిపూట పది మణుగుల యన్నమునిని ప్రొద్దుపోడుచు వరకు ఖురాను పారాయణము చేయుచుండెనని కిం వదంతి యుండెను. ఆ వృత్తాంత మొక పెద్ద మనుష్యుడు విని

యిట్లనియెను : "సగము రొట్టెయే తిని రాత్రియంతయు నిద్ర పోవునేని అంతకన్న చాల మేలుగ నుండును."

జ్ఞాన దీప్తులు నీలోన గడలుకొనగ
ఉదరమున కొంత రిక్తమై యుండవలయు;
ఎరుక నీయందు శూన్య, మదేలయన్న
ముక్కువరకు నాహారంబు మెక్కెదవుడు.

౨౨

అధర్మ ప్రవర్తనము వలన దైవమార్గమునకు వెలియైన యొక పతితుడు సర్వేశ్వరుని నిర్హేతుక కృపాకటాక్ష వీక్షణ ప్రదీపము దారి చూప, సన్మార్గవర్తియయి పుణ్యాత్ముల సంఘమున చేరెను. వారి భక్తి విశ్వాసముల ప్రభావము వలన అతనికి దుఃస్వభావము మారి సత్కార్యాచరణము పట్టువడెను. లౌకిక భోగేచ్ఛలపై అతని చిత్తమును పరుగెత్తనీయక మట్టుపరచుకొనెను. అయినను లోకులు "అతడు పూర్వ విధముగ నేయున్నాడు. అతని భక్తిశ్రద్ధలు కేవలము నాటకము" అని నిందింపసాగిరి.

అనుతాపంబున ప్రార్థన
దనకుత్కట దైవశిక్ష దప్పినదప్పూ;
మన మేర్చు కాకిలోకుల
మొననాలుక పోటుదాటి పోవశావశమే!

అతడు లోకుల యాడికోలు సహియింపనోపక మతగురువు నొద్ద తన సంగతి నిట్లు మొరపెట్టుకొనెను. "మహాత్మా, జనులు నన్నుగూర్చి చెప్పకొను మాటలు వినివిని క్రుళ్లికృశించుచున్నాను."

దానికి గురువిట్లనియెను: "అంత మేలుచేసినవారి ఋణము

నీవెట్లు తీర్చుకొనగలవు? ఏలయన వారు నిన్నుగురించి తలచునంత కంటె నీవు శ్రేష్ఠుడవుగనున్నావుగద!

ఈసుబోతులు, కీడునెంచెడివారు
నన్నుదూషింతురు, నా రక్తపాత
మునకు నిరీక్షింతురని పల్కెదీవు!
చెడ్డమానిసివయ్యు శ్రేష్ఠుండవనుచు
అఖిల మానవులు నిన్నగ్గించుకంటె
సన్మార్గివై నింద సహియింపమేలు.

మరినా సమాచారము. నేను సద్గుణ పరిపూర్ణుడనని ప్రజలు నాయెడ పూజ్యభావముతో వర్తింతురు. సత్యము నరసిన, నాకును లోపములుగలవు. వానిని గురించి తలపోసికొనుచు దుఃఖభాజనుడనై యున్నాను.

నాదులోపము ప్రజకు గన్పడనియట్లు
వాకిలినిమూసితినిగాని వాలకమున
అనిశమంతర్బహిస్సాక్షివైన నీవు
గనకయుండ దలుపుమూయగలమెదేవ!

౨౩

నేనొకనాడు పూజ్యుడైన మతగురువునొద్దకు చని యిట్లు మొరపెట్టితిని: "ఫలానివారు నేను తగవులమారినని సాక్ష్యము చెప్పెను." అందుకు గురువిట్లనెను: నీ శాంత స్వభావముచే వానిని సిగ్గుపరచుము."

చెడుగు తెంపరి నినుగాంచి చెనకలేని
యటుల సన్మార్గవర్తివై యలరుమీవు;

తగినశ్రుతిలోన వల్లకీతంత్రిపలుక
వైణికుండేల చెవినొక్కి పట్టిత్రిప్పు.

౨౪

సూఫీమత తత్త్వమేమని కొందరు ఒక మత గురువు నడిగిరి. ఆయన యిట్లు చెప్పెను. ఇంతకు పూర్వముండిన సూఫీలు బాహ్యమునకు దారిద్ర్యమనుభవించుచు కష్టపడుచుండినట్లు అగపడినను యదార్థముగ మనశ్శాంతి గలిగి తృప్తులై యుండెడివారు. ఇప్పటి వారన్నో బాహ్యమునకు శాంతచిత్తులుగ నగపడుచు లోలోపల చీకాకు పడుచుందురు.

ప్రతినిమేషము చిత్తంబు బయలుచనగ
దపసి నిర్మలస్వాంతుడై తనియగలడె?
భోగభాగ్యవాణిజ్యముల్ పొదలుకొనియు
దైవసంసక్త హృదయుండు తపసియగును.

౨౫

రాత్రియంతయు సార్థవాహుల బిడారుతోడ నడచి నడచి వేగుజామున నేను ఎడారియోర నిద్రించిన సంగతి యిప్పటికిని నాకు జ్ఞప్తియున్నది. (దైవ) విరహవేదనా భరితుడగు సత్పురుషుడొకడు మా బిడారుతో కలసికొని పయనించుచుండెను. అతడు ఆనాటి వేకువలేచి మొలుగెత్తి కేకలువేయుచు నెడారి మార్గమున గ్రుమ్మరుచు నొక్కక్షణమైన చిత్తశాంతి యెరుగక వేదనననుభవించుచుండెను. మరుసటిదినము, "నీకేల యీ యవస్థపట్టెనదని యడిగితిని. అతడిట్లు బదులుచెప్పెను: "చెట్లపయి బుల్బులి పిట్టలు కర్ణ

పేయముగ గానము సేయుచుండెను. కొండలందు డేగలు ఈల వేయుచుండెను. నీటిపడియలందు భేకములు బెకబెకమని యరచుచుండెను. వనములందు జంతుసంతానము రొదవెట్టుచుండెను. ఈ విధముగ ప్రాణిలోకమంతయు సృష్టికర్తను ప్రశంసించుచుండ నేను మాత్రము ఇట్లు మందమతినై నిద్రపోవుచుండుట సమంజసము గాదని భావించుకొంటిని.

నిన్నటివేకువన్ మనసు నీరయిపోబులుగొందుపాడినన్
సన్నగిలెన్ వివేకము ప్రశాంతియు క్షాంతియు శక్తిమోద మా
పన్నుడనైన నా గళరవంబు వినంబడినంత, మిత్రుడో
యన్న, విహంగకూజితము లాగతినార్తునిజేసెనే నినున్.

ఇది యెటు నమ్మనౌననిన నేనిటువల్కితిః నోయిమిత్ర, స
మ్మదముగ బకిసంతతులు మోహనునా భువనేశ్వరున్ రసా
స్పదకమనీయగీతములు పాడినుతింపగ, నేనుమూగనై
పదరక యూరకుంట యదిపాడియె? ధర్మమె మానవాళికిన్.

౧౭

ఒకానొక సమయమున హిజ్జాజయాత్రయందు సజ్జనులైన కొందరు యువకులు మాకు దారితోడైరి. వారును మేమును పొరపొచ్చెమెరుగని నెయ్యముతో కలసిమెలసి ప్రవర్తించుచుంటిమి. వారొకప్పుడు పాటపాడుచు మరియొకప్పుడు స్తోత్రపాఠములు చదువుచుండిరి.

మా తోడ వచ్చుచుండిన యొక పుణ్యాత్మునకు ఈ పద్ధతి యింపితము కాలేదు. ఆయనకు దరిబేసుల కష్టనిష్ఠురములందు నేమాత్రమును సహానుభూతి లేదు. ఇట్లుండ మేమందరమును హులాల్

సంతతివారి ఖర్జూరవనము చేరితిమి. 'హామ్యో' యను నొక యరబ్బి తెగకు చెందిన నల్లని పిల్లవాడొకడు అచ్చటి కరుదెంచి వీనుల విందుగా రాగము నాలపించెను ఆ గానము నాలకించి యాకాశము లోని పక్షులు సైతము ఎగురక నిలిచిపోయెను. ఆ పుణ్యాత్ముడెక్కి వచ్చుచుండిన యొంటెయు గానపారవశ్యమున నృత్యము సలుపుచు అతని క్రింద పడద్రోసి యెడారిమార్గమున పరుగెత్తెను. ఆయన దగ్గరకుపోయి నేనిట్లంటిని: "మహాత్మా, ఆ గానము జంతువును సైతము ఆనందపులకితముగ నొనర్చినది. కాని అది నీ హృదయము నందు ఏలాటి మార్పును కలిగింపలేకపోయెను!"

పరితృష్ణంబున బుల్బులి పలికెః ప్రణయ
మెరుగనేరవు నీవేమి నరుడవోయి,
ఒంటెయు నరబ్బిపాటకు నుబ్బియాడ
బశువవో నీవు నిర్వృతి బడయలేవు!

కనులకుగట్టు సర్వము వికస్వరకంఠముసెత్తి యాశ్వరుల్
వినుతియొనర్చు; దెల్లమగు వీనులుగల్గిన దద్రహన్యముల్;
పొనరుగులాబిపూవు నొక బుల్బులెకాదు నుతించుచుంట, దే
వుని బొగడంగనాల్కయగుచో ప్రతికంటక మీవనంబునల్.

౨౭

ఒకానొక నరపాలునకు ప్రాణావసానకాలము ఆసన్నమాయెను. తనకు వారసులెవ్వరును లేరు. కావున నాతడిట్లు వ్రయులు నామాట్రాసి మరణించెను.

"నేను మరణించిన మరునాటి ప్రొద్దున మొట్టమొదట నెవడు ఈ పట్టణము ప్రవేశించునో వానికి కిరీటధారణము గావించి రాజ్యమంతయు నప్పగింపవలయును"

విధివశమున మరునాటి వేకువ నొక బిచ్చగాడు మొట్టమొదట పట్టణము ప్రవేశించెను. వాడు తన జీవితమంతయు భిక్షాన్నము భుజించుచు చింపిరి పేలికలు బొంతగా కుట్టుకొని కప్పుకొనుచుండెను. మంత్రులును అస్థాన సచివులును వృయులునామా ప్రకారము కోశాగారదుర్గముల కుంచెకోలలు ఆతనికి స్వాధీనపరచిరి.

కొంత కాల మా దరిబేసి రాజ్యపరిపాలనముచేసెను. తరువాత కొందరు సామంతులును రాష్ట్రాధిపతులును స్వతంత్రులయి సైన్యముల సమకూర్చుకొని యుద్ధసన్నద్ధులైరి. ఇంతయేల. యాతని యసమర్థపాలనమువలన రైతులకును, సిపాయీలకును తలప్రాణము తోకకువచ్చినది. రాష్ట్రములోని కొన్ని ప్రాంతములు తిరుగబడి తల్లిరాజ్యమునుండి విడబడియెను. ఇవి యన్నియు తలపోసికొని ఆ యాచక చక్రవర్తి కుమిలికూలుచుండెను. పూర్వదశలో తనకు స్నేహితుడుగానుండిన యొక దరిబేసి యాత్రనుండి మరలివచ్చి యాతని యున్నత స్థితికి సంతోషించి యిట్లనియెను: "నీకు అభ్యుదయమును చేకూర్చి సర్వసంపదలను రాజ్యమును హస్తగతము గావించి, నీ గులాబిపువ్వులను ముండ్లనుండియు, ముల్లును కాలినుండియు తీసివేసిన సర్వేశ్వరునికి వందనములర్పించుచున్నాను."

మొగ్గలొకవేళ వికసించి ముదముగూర్చు;
వేరొకప్పుడు వసివాడి వృంతమెడలు;
విగతపత్రంబులైయున్న వృక్షలతలు
మరల నాకుల బువ్వుల మురువుచూపు.

అంతట రాజిట్లనియెను:

"మిత్రమా, నన్నభినందించుటకంటె నోదార్చుటకె యిది సరియైన తరుణము. పూర్వము నన్ను నీవు చూచినప్పుడు అన్న

చింత యొక్కటియె నన్ను పీడించుచుండెను. ఇప్పుడన్ననో రాజ్య భారమంతయు వహించుచున్నాను.''

లోకము విరోధమైనను
శోకము, ననుకూలమైన సుఖబంధనముం
జేకురు; రెంటను గష్టమే
దూకొను నరు; డంతకన్న దుఃఖముగలదే ?

కోరెదవేని సంపదలు, కోరుము తృప్తిని; దానికన్న బం
గారము మేలుగాదు; కనకంబు ధనాఢ్యుడు పంచిపెట్టి నం
గూరకుమానదానిపయి; గొప్పమనుష్యులు సేయు ద్రవ్య స
త్కారముకంటె బూజ్యముగదా దరిబేసి తితిక్ష పోల్పగన్.

అలబహరాముని విందున
వలచెడు పనఖరపుటెరచి బలుషేపుళ్ళుం
దలపోయ జీమ యొసగెడు
శలభపు దొడమాంసమునకు సాటియె యెందున్ !

౨౮

అబూహరీరా ప్రతిదినమును మహమ్మదు ముస్తఫాను సేవించుటకు వచ్చుచుండెను. ఒకనాడు మహమ్మదు ఆయనతో నిట్లు చెప్పెను: ''నీవు ప్రతిటనమును నా యొద్దకు రాకుందువేని మన స్నేహము మరింత గాఢమగును.''

కొందరా పుణ్యాత్మునితో నిట్లనిరి: ''సూర్యుడు సౌందర్య శోభితుడయ్యును తన్నెవ్వరును ప్రేమించినట్లు మేమువినలేమ.'' దానికాతడిట్లు పలికెను: ''ఏలయన సూర్యుని మనము ప్రతిదినమును చూడగలుగుచున్నాము. వర్షాకాలమున రవిబింబము మబ్బ

మునుగులో మరిగియున్నపుడు దానికై మనము నిరీక్షించుచుందుము. అప్పుడది ప్రేమపాత్రమగును."

ఒరుల దర్శింపబోవుట యొప్పెయగును;
గాని, పలుమారు దర్శింప గలుగు వెగటు;
ఒరులు నిను మందలింపకయుండునటుల
నిన్ను నీవె విమర్శించు కొన్నమేలు.

౨౬

దిమిష్కునగరమున నా మిత్రుల సాంగత్యముపై రోతపుట్టి పుణ్యభూమి ప్రవేశించి యచ్చట మృగములతో సహవాసము నెరపుచుంటిని. ఇట్లుండ నొకనాడు ఫరంగులు నన్నుపట్టి బంధించి తిరాబలీస్ పట్టణమునకు కొనివచ్చి కొందర యూదులతోడ నన్నును కందకము త్రవ్వుపనియందు వినియోగించిరి.

నాకు పూర్వపరిచితుడైన హాలబ్ పట్టణపు సరదారియొకడు ఒక దినము మేము మట్టిపనిచేయుచుండిన ప్రదేశమున పోవుచుండిన నన్నుగాంచి "ఈ దుర్గతి నీకేలపట్టినది"యని యడిగెను. నేనిట్లంటిని; ఏమిచెప్పుదును!

దైవమునకన్న నన్యులు
సేవింప ననర్హులగుట, జెచ్చెర ప్రజలం
బోవిడి కొండ లెడారులు
తావలముగనుంటి శాంతి దైవారంగన్.

ఇప్పటినా దురవస్థను
దప్పక యూహించుకొనుము; దైవంబేలా
యిప్పగిది బహుసమానులు
మొప్పెలతోగూడి బ్రతుక బొనరిచెనన్నున్.

పరులంగూడి సుగంధపు
విరిదోట జరించుకంటె, ప్రియమిత్రులముం
దర నిగళ బద్ధ పదుడయి
తిరుగుట సంతసమటంచు దెలియవె సఖుడా.

అంతలు నాదురవస్థకు కనికరించి నా మిత్రుడు పది దీనారము లకు ఫరంగులయొద్ద నన్నువిలిచి కైదుతప్పించి హాలబ్ పట్టణము నకు తీసుకొనిపోయెను. ఆయన కొక కూతురుండెను ఆయువతిని నాకిచ్చి పెండ్లిచేసి యరణముగ నూరు దీనారముల నొసంగెను. కొంతకాలము గడచెను. నాయిల్లాలు వాయాళియు గయ్యాళియు తగవుల మారియునైనది.

మూతుల పొడిచెడి యిల్లా
లెతని కొనగూడువానికిల నిరయంబౌ;
ఓ తండ్రి, యట్టి జంతను
మూతల బెట్టకయ కపుణ మననీయగదె.

ఒకనాడు నా భార్యనోటికి వచ్చినట్లెల్ల అరచుచు నిట్లు తిట్టు టకు మొదలుపెట్టెను: "నీవు ఫరంగివారియొద్ద బానిసనై యుండ మాతండ్రి నిన్ను పది దీనారములకుకొని కైదుతప్పించెను కదా!"

"అవును. పది దీనారములకు ఫరంగివారియొద్ద విలువబడి, కైదు విడిపింపబడి, మరల నూరు దీనారములకు నీచేత పట్టుపడిన మందభాగ్యుడను నేనే" యని యంటిని.

వృకవక్త్రంబున జిక్కియున్న యజముజ వేవేగరక్షించి, యిం
టికి గొంపోయి వధించె దానిని నిశజ నిశ్చింతుడై యొక్క క
ర్షకు; డాజంతువునాత్మ యిట్లనియె స్వర్గంబేగుచో వానితోజ;
వృకబాధం దొలగించియుజ వృకమవై పీడించితేనజ దుదిజ.

౩౦

ఒకానొక పాదుషా బహుకుటుంబియగు నొక పుణ్యాత్ముని చూచి "నీవెట్లు కాలముగడపుచున్నావు" అని యడిగెను.

"రాత్రి యంతయు ధ్యానమునందును, వేకువ ఆవశ్యకముల గురించిన ప్రార్థనమందును, పగలెల్ల దినబత్తెము గడించుకొనుట యందును నాకాలము గడచిపోవుచున్నది" అని యాతడు జవాబు చెప్పెను.

పాదుషా యామాటలయందు ధ్వనించు భావమును గ్రహించి కుటుంబ పోషణభరము తొలగునటుల ఆ పుణ్యాత్మునకు బత్తెమొసగ నాజ్ఞాపించెను.

చిరము కుటుంబ వాగురలజిక్కిన మిత్రుడ, నీకు నింక నె
త్తెర గలపోకగల్గు; తన దిండియు గట్టను గప్పబుట్టముల్
దొరకవటన్న చింత, యొక దొడ్డదు బిడ్డలబెంచు చింత, యి
ద్ధరణికిలాగు నిర్జర పథంబున నేగు మహాత్మునేనియున్.

ధ్యానము సల్పుదున్ నిశను దైవముసంచు బవల్ దలంతు; నే
ధ్యానము సేయరేయి శుచియైన మనంబున గూరుచుండ మ
న్మానసమున్ నిరంతరము మల్లడి వెట్టును రేపు ప్రొద్దునన్
దీనతనేడ్చు బిడ్డలకు దిండియెటొగదె యన్న భావముల్.

౩౧

ఒకానొక తపస్వి యెడారియందు నివసించుచు, ఆకలములు దిని యాకటి బాధ తీర్చుకొనుచు నిశ్చింతముగ బ్రతుకుచుండెను. పాదుషా ఆ మహాత్ముని సేవించుటకు అచ్చటికి యాత్రచేసి యిట్లు

విన్నవించెను. "మీకు ఉచితమని తోచునెడల మీకొరకు పట్టణమునందొక యాశ్రమమును నిర్మింపజేసెదను. మీ పూజాపురస్కారములకు నిక్కడికన్న నక్కడ ఎక్కువ యనుకూలముగను నిరంతరాయముగ నుండును. ఇతరులును ఆత్మశక్తి మూలకమైన మీ యాశీః ప్రభావమువలన పుణ్యము నార్జింతురు. మీ నీతి ప్రవర్తనము లోకులకు అనుసరణీయమైన మేలుబంతి కాగలదు. పాదుషా పలికిన యీమాటలు తపసికి రుచింపక పెడమొగము పెట్టుకొనెను.

అంతట వజీరిట్లు విన్నవించెను. "మహాత్మా, పాదుషా కోర్కె తీర్చుటకైనను తమరు రెండుమూడు దినములు మాపట్టణమున నివసించి యాశ్రమముయొక్క ఔచిత్యానౌచిత్యములను స్వయముగ తిలకింపుడు. ఒకవేళ అన్యుల సహవాసమువలన మీ నైర్మల్యమునకు కళంక మాపాదించునేని యటుపైని దేవర వారి యిష్టమువచ్చినట్లొనర్పవచ్చును." ఈ మాటలకు సమ్మతించి యా తపస్వి పట్టణమునకు విజయము చేసెను. ఉద్యాన వనములోని పాదుషా సొంత మహడీయందు ఆయనకు బస యేర్పాటు చేసిరి. ఆ నివాసము స్వర్గమువలె మనోహరముగను శాంతిదాయకముగ నుండెను.

చెలువల నిద్దపుందళుకు జెక్కులబోలు గులాబిపూలు, త్రొ
య్యలినెరిగొన్న ముంగురుల యందము మందముసేయు నంబుజా
లలరెను, దాదిపజ్జ మరగనట్టి నిసుంగువిధాన, సీతు పెం
జలికిని మంచుతాకులకు జంకెడునోయన గోమలంబులై.

పొగసడుము నాల్కజాపెడు
ధగ ధగ మను నగ్నికీల తతులటు పూచెన్
జిగురారు తొగరు పూవులు
సొగసుగ దరు లతలయాకు జొంపములందున్.

ఆ తపసికి పరిచర్యసలుపుటకు చంద్రవదనయగు సుందరాంగి నొకతెను పాదుషా తత్క్షణమె నియమించెను. ఆయువతి నిట్లు వర్ణింప వచ్చును.

లలితేందు రేఖ కెనయగు
నలికము, నప్సరసవంటి యాకృతి, వర్ణో
జ్జ్వలమగు బర్హిమనోజ్ఞత
గల చెలి యతి హృదయమైన గడకు హరించుకా.

ఆ కలువకంటి వెనువెంటనే శరీర సౌష్ఠవమును అపూర్వ రూప లావణ్యమునుగల యొక యువకుడును తపసి యొద్దకు గులాముగ పంపబడెను.

ఆతని యందము చందము
చేతోముదమొంద నెంతసేపరసిన మా
కాతురదీరదు, పూరాత్
స్రోతోదర్శనము శోషరోగికి బోలెన్

క్రమ క్రమముగ ఆ మహాత్ముడు కమ్మని రుచిగల వంటకముల నారగింప మొదలిడెను. సొగసైన యుడుపులు ధరించుటకును, ఫలములు, మధురములైన తినుబండములు భక్షించుటకును అత్తరుపులు పూసికొనుటకును అభ్యాసమైనది. పరిచారిక రామణీయకముపై కన్నువేయును. గులాము అంగసౌష్ఠవముగాంచి యానందించును. సుందరాంగుల ముంగురులు బుద్ధిని బంధించు సంకెలలనియు, జ్ఞాన విహగము నాకర్షించు దీపములనియు పెద్దలు చెప్పియుండిరి.

మతము హృదయంబు పాండితీ మాన్యతలును
వ్యయిత మయ్యెను నీ సేవయందె నతము;
నేడు జ్ఞాన ఖగంబును నేను; నీవు
ఉచ్చులకు బిక్కినెలయించునోదనమవు.

వేయేల, చిరకాలార్జితమైన యీ తపస్వి ప్రభావము క్షీణించెను.

నిర్మలాత్ములు పక్తులు నీతి తత్త్వ
విదులయొద్ద గడించిన విద్యయుండి
పాడు లౌకిక గోష్ఠిలో బడుట నతడు
తేనెలోబడ్డ యీగ చందాన నయ్యె.

ఒకనాడు ఆ పుణ్యాత్ముని సేవించుటకు పాదుషాకు కోరిక కలిగి యచ్చటికిపోయి దర్శించెను పూర్వము తాను చూచినప్పటి కంటె ఆయన పూర్తిగ మారియుండెను. నల్లకప్పు వదలి దేహము ఎర్రగోరి బలిసి యుండెను. బంగారు నగిషీపనిచేసిన పట్టుదిండ్లపై ఆయన హాయిగ నానుకొనియుండ మనోహరుడగు గులాము నెమిలి కన్నుల వీవనలీచుచుండెను. ఆతని సుఖస్థితికి పాదుషా సంతసించి వివిధ విషయములు సల్లాపించి సంభాషణానంతరము ఇట్లు చెప్పెను. "నేను విద్వాంసులను దైవభక్తులను అత్యంత ప్రీతితో గౌరవించు చుందును." అంతట, తత్త్వజ్ఞానియు; వివేకియు, లోకజ్ఞాన సంపన్నుడునగు వజీరు ఇట్లు విన్నవించెను: "మహాప్రభూ, మీ ప్రీతికి పాత్రులయిన యీ రెండు తెగలవారికి మేలు సేయుటయే స్నేహిత ధర్మము. ఎట్లన, విద్వాంసులకు ధనమొసంగినవారు ఇతరులకు విద్యగరపుదురు. భక్తులకు ధనమొసగకుండిన దైవచింతనము క్షీణింపక వారెప్పటివలె భక్తులుగ నుందురు.

సహజ సౌందర్యవతియగు చానకేల
రంగు పూతలు పచ్చల యుంగరాలు?
సత్స్వభావము, నగుమోము, శాంతి గలిగి
తనియు దరిబేసికేల నత్తరువు సూడు?

తనకు గల్గియు నితరుల ద్రవ్యమునకు
జేయి చాపెడు భక్తుండు శిష్టుడగునె ?

ద్రవ్యమేల విరాగికి, ధనముగొన్న
నతడు, వేరొక భక్తుని నరసికొమ్ము.

దైవచింతా నిమగ్న చిత్తంబువాడు
బిచ్చమెత్తక యేదరిబేసి యగును;
వేళ్ళు జెవి తమ్మె లందమౌ వెలది, కామ్య
గాదె యుంగరాల్ కమ్మలు గలుగకున్న.

౩–౨

ఒకానొక పాదుషాకు నొక ముఖ్యమైన కార్యము తలపడెను. ఆ కార్యము తన యిష్టానుసారము నెరవేరునేని కొంత ద్రవ్యమును భక్తులకు పందేరము చేయుదునని నిర్ణయించుకొనెను. తాను తలంచినట్లె కార్యము ఫలించినది.

అంతట తన వాగ్దానము ప్రకారము మ్రొక్కుబడి చెల్లించుట ఆవశ్యకమని తలంచి, ఆతని సేవకులలో నొకనిని పిలిచి, దీనారముల సంచిని వానిచేత పెట్టి యీ ధనమునంతయు భక్తులకు పంచి పెట్టవలసినదిగా పాదుషా యాజ్ఞాపించెను. ఆ సేవకుడు వివేకియు జాగరూకుడనియు విని యుంటిని ఆతడు దినమంతయు పట్టణమెల్ల తిరిగి తిరిగి సాయంకాలమున పాదుషా సన్నిధికివచ్చి దీనారముల సంచిని ముద్దిడి యెదుటపెట్టి "మహాప్రభూ, యెంత వెదకినను నొక భక్తుడైన కానరాడు" అని విన్నవించెను.

"ఇదియేమిమాట? నాకు తెలిసినంతవరకు ఈ నగరమున నన్నూరుగురు భక్తులున్నారు." అని పాదుషా చెప్పెను.

"మహాప్రభూ, యథార్థముగ భక్తులైనవారు ఏమియు పరిగ్రహింపరు. పరిగ్రహించువారు భక్తులుగారు." అని సేవకుడు

మనవి చేసెను. పాదుషా యీ మాటలకు నవ్వి యాస్థాన సచివు లతో నిట్లనియెను.

"దరిబేసులను భక్తులను నేనెంత ప్రీతిశ్రద్ధలతో సమ్మానిం చినను, ఈ కొంటెకాయ మాత్రము వారిపై విరోధమూని తిరస్కా రము చూపుచుండును. అయినను న్యాయము వానితట్టే యున్నది"

ధనమూన కాసించు దరిబేసికంటె
నిష్కాముడౌ భక్తునెమకి కన్గొనుము

33

"సద్వృత్తిని గూర్చి మీ యభిప్రాయమేమి" యని యొక విద్వాంసుని ప్రశ్నించిరి.

"మనశ్శాంతి కొరకు పాటుపడువారు ధర్మాన్నము భుజించు ట ఉచితమగునుగాని, కేవలము పొట్టపోసికొనుటకే ధర్మశాలలలో బంతులుతీరి కూర్చుండుట నీచము" అని ఆయన చెప్పెను.

దైవభక్తి సాగ ధర్మాన్న కబళంబు
గొనిన నొప్పు, దాన గొదవలేదు;
పొట్టవింపు కొనగ బిరుదు చెప్పుచును
కపటభక్తి నలుప గలుష మొదవు.

34

దయార్ద్ర హృదయుడైన యొక పెద్దమనుష్యుని యింటికి నొక దరిబేసి వచ్చెను. అచ్చట విద్యావంతులును నొరు నాజూకు వెరిగిన కొందరు మిత్రులు సరస సల్లాపములాడు చుండిరి. ఆగోష్ఠి

యందు నొక్కొకడును వాని వానికి తోచినట్లు చతురోక్తులు పలుకు చుండెను. ఆ దరి బేసి యిసుక యెడారిలో నడచి వచ్చుట వలనను అంతవరకేమియు తినకయున్నందునను అలసటచే నూరకుండెను. "నీవుకూడ నేదైన నొకటి మాటాడిన బాగుగనుండును" అని యా స్నేహితులలో నొకడు కోరెను. "మీవలె నేను విద్యావంతుడనుగాను. నోరు నాజూకు వెరుగను. అదియుగాక యింతదనుక రొట్టెముక్కయైన ఎంగిలిచేసి యెరుగను. ఒక్క పద్యముతో మీరు తృప్తిపడుదు రేని చదివెదను" అని చెప్పెను. అందరును ఆతురముతో "ఏదీ చదువు" మని కోరిరి. అతడిట్లు చదివెను:

భామినీ స్నానమందిరద్వారసీమ
నిలబడిన బ్రహ్మచారినా నేను, జవులు
నింపు భోజ్యముల్లెల్ల వడ్డింపబడిన
పళ్లెరము ముందు నిలుచుంటి బ్రమప మెసగ.

మిత్రులు అతని బడలికను దౌర్బల్యమును ఎరిగి పళ్లెము పెట్టునట్లు ఆజ్ఞాపించిరి. అంతట గృహస్వామి యిట్లనియెను: "మిత్రమా, మా నౌకరులు కందుడు మాంసము వేగించి తెచ్చు దనుక కొంచెము తామసింపుము." ఈ మాటలకు దరి బేసి మొగమెత్తి చూచి నవ్వుచు నిట్లనియెను.

వేపుట వేగిన వానికి
వేపుడు మాంసంబు ప్రియమె? వేళకునేదో
చేపడిన యుత్త రొట్టెయె
సాపడి యాకలిని గొంత శాంతమొనర్చుజా.

౩౫

ఒక శిష్యుడు గురువుతో నిట్లనియెను. “ప్రజల మూలమున నేను చాల యిబ్బంది పడుచున్నాను. నన్ను సేవించుట కొరకు వారు యాత్రచేయుచున్నారు. నాకాలమంతయు వారి రాకపోకలచేతను సంభాషణమువలనను గడచిపోవుచున్నది. మనశ్శాంతి కుదురుట లేదు.” ఈ మాటలు విని గురువిట్లు చెప్పెను. “బీదవారికి కొంచెము ఋణమిమ్ము. భాగ్యవంతులను ఏదైన కొంత చేబదులుగ నడుగుము. తర్వాత ఇరు తెగలవారును నీయొద్దకువచ్చి తొందరపెట్టరు”

భిక్షుకుండిస్లాము పృతనాగ్రగామి
యైనచో ‘కాఫరు’ యాచనాభీతి
వడకి చీనా యెల్లవరకు దౌడెత్తు.

౩౬

వేదాంత విద్యార్థి యొకడు గురువుతో నిట్లనియెను. “ఉపన్యాసకులు చేయు నుపన్యాసములు అలంకృతములయ్యును మనోహరములయ్యును నా మనమున నాటుకొనుట లేదు. ఏలయన వారి చేతలకును మాటలకును ఏమియు సంబంధముండదు.”

పూర్ణ వైరాగ్య మొరులకు బోధచేసి
తాము ధనధాన్య మార్జింప దలకరెపుడు;
విధుల శాసించు బహు శాస్త్రవేత్తలేమి
చెప్పిన నొకని మనసైన జెమ్మగిలదు.

చెడుగు దలపక మరి తాను జేయనట్టి
పనిని పరులకు గర్తవ్యమని తెలుపక
మాటలకు జేతలకు నేమి మారుపాటు
లేని మాన్యుండె పండితుడౌను తండ్రి.

ధనమార్జించుచు దేహము
పనివడి పోషించునతడు పండితుడగునే?
తను దారిదప్పి క్రుమ్మరు
మనుజుం డితరులకు నెట్లు మార్గము చూపుఁ.

ఈ పలుకులు విని గురువిట్లనియెను. కుమారా, పనికిమాలిన యూహను మాత్రమె యవలంబించి నీతిబోధకుల శిక్షణమును బహిష్కరించుటయు. పండితులకు తప్పులంటగట్టుటయు, పరిశుద్ధ హృదయులగు జ్ఞానులను ఎల్లకాలము నన్వేషించుచు విజ్ఞాన లాభమునకు వెలియగుటయు తలపోయ నొక గ్రుడ్డివాని కథకు సరిపోవు చున్నది.

ఒకనాటి రేయి అంధుడొకడు బురదగుంటలోఁ బడి యిట్లనియెను. "ఓ ముసల్మానులారా, నా దారిలోనైన నొక దీపము పెట్టరాదా?" ఈ మాటలను ఒక బజారులంజె విని యిట్లడిగెను: ఓయీ, నీవు దీపమునే చూడలేవు, మరి దీపమువలననేమి కనుగొందువు?

నీతిబోధక పరిషత్తు గుడ్డలంగడి వంటిది. అచ్చట నంతయు రొక్కపు బేరము. డబ్బు చెల్లింపనిదే వస్తువులను నీవు తీసికొనలేవు. ఎంతవరకు నీ మనస్సున జ్ఞానార్జనాసక్తి యుదయింపదో అంతదనుక ఆనందమనుభవింపలేవు.

మాటలకు జేతలకు మారుపాటులున్న
బండితుల వాక్యములు వినవలయు శ్రద్ధ;
సుప్తుడొక్కడు మరియొక్క సుప్తు నెట్లు
మేలు కొల్పెడు ననుమాట మిథ్యయగును.

కుడ్యలిఖితమయ్యు గుణవంతు లెపుడు
హితబోధ గ్రహియింప నెనగుఁ శ్రేయంబు.

౩౭

మతము విసర్జించి మాన్యుండు సుజనుండు
పండితగోష్ఠి లాభంబు బడయ
నరుదెంచె విశ్వవిద్యాలయ భూమికి
అంతట నే నిట్టులంటి : మిత్ర,
సన్న్యాసులకు సర్వశాస్త్రజ్ఞులకు నేమి
భేదంబు గంటిరి ? వీరి కొరకు
వారిని ద్యజియించి వచ్చితి రిప్పుడు
దయచేసి తెల్పుడు తమ తలంపు,
ననవుడాతపస్వియు నిట్టులనియెః సఖుడ,
తనదు గొంగడి వెల్లువ మునిగిపోవ
ఊరికి సన్న్యాసి యద్దాని నుద్ధరించు;
పండితుడు పతితులనెల్ల బయటికీడ్చు.

౩౮

ఒకడు తప్పత్రాగి దారిప్రక్కన నొడలు తెలియక పడియుండెను. పుణ్యాత్ముడొకడు ఆ త్రోవన పోవుచుండి యాతని నీచస్థితికి ఏవగించుకొని వెగటుగాచూచెను. అంతటవాడు కైపునిద్రలోనే తలయెత్తి చూచి యిట్లనియెను.

పతితునిగని పెడమోమిడి
యతి దారుణదృష్టిజూడ న్యాయమె? కరుణా
మతి దప్పుల మన్నించుట
మతిమంతుల కుచితమండ్రు మాన్యులు పెద్దల్.

నేను పాపినెయౌదు; నీవైనధీర
గాంభీర్యమున నన్ను గడచిపోరాదె?

౩౯

పనిపాటులేని తుంటరులు కొందరు ఒక దరిబేసి నెదుర్కొని దూషించి చావమోది కష్టపెట్టిరి. అంతట నా దరిబేసి నాకీగతి పట్టినదని తన యశక్తతను గురించి మతగురువునొద్ద మొరపెట్టు కొనెను. ఆ మొరనాలకించి గురువిట్లనియెను: "కుమారా, దరిబేసుల కుట్లబొంత సంతోష సహనములకు లాంఛనము. ఆ యంగీధరించినవారు దౌర్జన్యము సహింపనోపరేని ధర్మబాహ్యులగుదురు గాని దరిబేసులు కారు. వారివలన కుట్లబొంతయు దూష్యమగును."

కడలిలోనరాయి బడవేసినంతనే
బురదరేగబోదు పూర్ణమగుట;
తాల్మి ధృతియులేని దరిబేసియొకలోతు
పాతులేనినీటి పడియసుమ్ము.

ఓర్చుకొనుము కష్టంబుల నోపనంత,
దేవుడు దయార్ద్రహృదయుండు; తెగునఘంబు;
తమ్ముడా, తుట్టతుదకీవు దుమ్మెయగుట
కాయ మట్లౌటకున్మున్నె కమ్మిదుమ్ము.

౪౦

వినుడోయి వినుడోయి వింతయౌకథను!
బాగదాదను మేటి పట్టణంబందు
జండాకు ముసుగుకు జరిగెదర్కంబు;
దారిశాపిరిదుమ్ము తలపై నినిండ
పలుప్రయాణంబుల బడలిక హెచ్చ
నిష్ఠురంబుగబల్కె నిగిడి కేతనము;

ఒకమంచమున బండి యొకకంచమందు
గుడిచి యిద్దరమొక్కటబడి పఠించితిమి;
యొకరాజునే కొల్చుచున్నాము మనము.
అయిన నేమోకాని యరక్షణంబైన
నిలువునిల్కడలేదు, నిడిప్రయాణంబు;
ఏ వేళకష్టంబు లెఱుగవునీవు;
కోటముట్టడి గుండుగురికి పాల్పడవు;
గాలిదెబ్బ యెడారి గాటంపుటెండ,
యిసుకదుమారంబు లెఱుగవునీవు;
మోహరంబున గాలు ముందుకేచాపి
యిన్ని యిక్కటులనే నెపుడోర్చుకొనగ,
నాకంటెనీకు విన్ననువుగౌరవము
హెచ్చుగానుండుట కేమికారణము?

చిన్నారియువతుల చెక్కిళ్లముద్దు
విడుదువుతనివార; నిందుబింబమును
బలుచనిజలదంబు పైగప్పినటుల
నందగత్తెలమోము లంటిరేవెలదవు;

మల్లెపూనెత్తావి మలయుపూబోండ్ల
పాలిండ్లపై బడి ప్రాకులాడెదవు;
చెవిలోనగుసగుసల్ చెప్పుచుండెదవు;
చెనటిసిపాయీల చేతిలోనేను
బడితి; వారలునన్ను బయనించువేళ
త్రాళ్లతోజుట్టి తలక్రిందుసేయ
న్యాయమేయని కేతనంబు ప్రశ్నింప,
నవగుంతనంబిట్టు లనియెనవ్వుచును:

వినయంబుతోఁ గ్రిందఁ వీక్షింతుగాని
నీవలెదలయెత్తి నిక్కి గర్వమున
నింగిపైఁ జూడ్కుల నిగిడింపబోను;
అవివేక గర్వాంధులై మోరలెత్తు
వారలు తలక్రిందుపడుట నిజంబు.

౪౧

ఒకానొక మల్లుడు కోపావేశమున కంపించుచు నోటనురుగులు గ్రక్కుచుండుట నొక సజ్జనుడుచూచి "ఈ యవస్థ యీతని కెట్లుకలిగె" నని యడిగెను. వానిని ఫలానివాడు తిట్టెనని యచ్చట నున్నవారనిరి. "పాపమీ నిర్భాగ్యుడు వేయిమణుగుల బరువుగల రాతిని తేవనెత్త గలడుగాని యొక్క మాట నోర్చుకొనునంతటి శక్తి లేకపోయెను" అని యా సజ్జనుడు పల్కెను.

భుజబలంబును శౌర్యంబు బొగడుకొనకు
నీచనైజముగల్గి, యేనియతిలేక
మనసు చిక్కబట్టగలేని మానవునకు
అబలకినుమంత భేదంబు నరయగలమె?

నిన్నుగాంచి యొరులు నిందింపనట్లుగా
జేసికొమ్ము నీకు జేతనైన;
మోముముష్టితోడ మోదినయంతనే
వీరుడౌనె? మేటిశూరుడౌనె?

మదగజ కుంభస్థలమున
మెదడుపెరుకు శక్తియున్న మేటరియైనఁ
సదయత బరకష్టంబుల
కెద కరగనివాడు మనుజుడే తలపోయఁగా.

ఆధూళిచేబుట్టె నాదామునంతు,
ఆధూళిగాకున్న నతడుమానవుడె?

సూఫీమత సామాజికుల సౌశీల్యమెట్టిదని నేనొక పెద్దమను ష్యుని అడిగితిని. ఆయన ఇట్లుచెప్పెను: వారిలో నధముడు తన సొంతకార్యముల నటుకట్టిపెట్టి ముందుగ స్నేహితుల యభీష్టము నెరవేర్చును. పండితులిట్లు చెప్పియున్నారు: ''సొంతమునకు కట్టుపడిన సోదరుడు, సోదరుడును కాడు సొంతమును కాడు.''

పయనమందు తోడి బాటసారియునిన్ను
వదలి గడచిపోవ వాడుహితుడె?
ఎడదనంకెలనిను నెవడుబంధింపడో
అట్టివానిచెలిమి కాసపడకు.

భక్తిమతములేని బంధువర్గముల
సంబంధమునువీడ జాలమెలాను.

ఈ ద్విపదలోని భావమును ఆక్షేపించుచు ఒకవాది నన్ను ప్రతిఘటించినసంగతి యిప్పటికిని నాకు జ్ఞప్తియున్నది. అతడిట్లనెను ''సర్వశక్తి సంపన్నుడగు సర్వేశ్వరుడు పవిత్రమగు ఖురాను: నందు బంధుసంబంధ విచ్ఛేదము నిషేధించెను నీవు చెప్పునది ఆ సూక్తికి వ్యతిరేకముగ నున్నది.''

నేనిట్లు బదులుచెప్పితిని: ''నీవు తప్పుదలచితివి. నేను నుడివినది ఖురానుసూక్తికి విరుద్ధము కాదు. సర్వేశ్వరుడిట్లు ఆజ్ఞాపించి యున్నాడు: ''మీకు యదార్థ విషయపరిజ్ఞానము లేనప్పుడు: మీ తల్లిదండ్రులు మిమ్ము మీతోడ భాగస్వాములు కండు అని యాజ్ఞాపింతురేని మీరు వారిమాటల ననుసరింప బనిలేదు.''

దైవచింత నుంతదనరని బంధుల
వేయిమందినైన విడువవచ్చు,
సతముదైవభక్తి నలిపెడునన్యుని
కొరకు నతడెమదికి గూర్చువాడు.

౪౩

బాగ్దాద్ పట్టణ వాసియొరాజాణ
వృద్ధుండుతనయకు బెండ్లిగావించె;
బాదరక్షలుకుట్టు పనివానికిచ్చి
కూతురియధరంబు గోరికైనామొరక,
కాటుల నెత్తురు గారుచునుండె;
మరునాడుతనయ వాతెర జూచి తండ్రి
అల్లునితో నిట్టులనిమె నిందించి:
చెప్పట్టయనుకొంటె చిగురువా తెరను?
ఎగతాళిగాదిది. ఏమిమజాఖ?
దాంపత్యమునకీవు తగవోయిమూర్ఖ,
యనుచు గూతురి దీసికొనియేగె దండ్రి.
పుట్టుకలోవేరు పెట్టినచెడ్డ
కాటికేగినదాక కనిపెట్టియుండు.

ఒకానొక శాస్త్రివేత్తకు నొక కుమారికయుండెను. ఆ కన్య యందగత్తెకాదు. ఈడేరి కొంతకాలమయ్యెను. హెచ్చుగ కన్యాహరణమిచ్చి కన్యాదానము చేసెదనని యే వరునికోరినను ఒక్కడైన ఆ కురూపవతిని పెండ్లియాడుటకు సమ్మతింపకుండెను.

చక్కదనంబులేని చానపైబట్టు
జలతారుచీరలు వెలవెలబోవు.

వేయేల, ఆవశ్యకమును బట్టి యాకన్యనొక యంధునకిచ్చి పెండ్లిచేసెను. అంతట కొలదికాలమునకు స్వర్ణద్వీపమునుండి గ్రుడ్డితనము బాగుసేయు వైద్యుడు అచ్చటికి వచ్చెనని చెప్పిరి "నీ యల్లుని గ్రుడ్డికన్నులకు చికిత్స చేయింపరాదా" అని కొందరా శాస్త్రవేత్తనడిగిరి. "కంటిచూపు వచ్చిన ఆతడు నా కూతురిని వదలిపెట్టునని భయపడుచున్నాను" అని యాతడు చెప్పెను.

అందచందము లేని యతివమగండు
అంధుడైయుండిన నదికొంత మేలు.

౪౨

ఒక పాదుషా దరిబేసులను నీచముగ చూచుచుండెను. వారిలో నింగితజ్ఞుడొకడు ఈ సంగతి గమనించి పాదుషాతో నిట్లనియెను: "ప్రభూ, యీ లోకమున సంతోషమునందు మీకంటె మేము హెచ్చు. భోగభాగ్యములందు మాకంటెను మీరు హెచ్చు. మరణమాసన్నమైనపుడు ఇరువురము సమానులము. అంత్య దినమున మీకన్నను మేము మేలు".

రాజ్యంబుల జయించి రాజేలవచ్చు;
కూటికై దరిబేసి కుందంగవచ్చు;
ఇరువురు మరణించునెడ. శవపేటి
దప్ప నొండెద్దియు దమవెంటరాదు.
పరలోక యాత్రకు ద్వరపడువేళ
పరమ రిక్తుడుమేలు పాదుషాకంటె.

దరిబేసికి ప్రాతవడిన కుట్లబొంతయు బోడితలయు బాహ్యలక్షణములు. నిజమాలోచించిన అతని హృదయము సజీవము; అరిషడ్వర్గము మృతప్రాయము.

ప్రజల విడనాడి తనసొంత ప్రార్థనంబు
సేయునతడు, నమ్మలు కీడుసేయ నొగిలి
కయ్యమునకు గాల్ద్రవ్వెడు కపట వేష
ధారి, దరిబేసిగాడనావారి గాని.

కొంచె నెత్తమునుండి గుంద్రాయి దొరల
దప్పించుకొని పోవ దరిబేసి యగునె?

దైవసంకీర్తనము, కృతజ్ఞత, సేవాసక్తి, వినీతి. దానము, సంతృప్తి, ఐక్యమునందు నమ్మకము, మతవిశ్వాసము, పారతంత్ర్యము, సహనము, అను నీ సద్గుణములు కలిగియుండువారే యథార్థమైన సూఫీలు. వారే దరిబేయులు. అట్టి మహానీయులు ఏ యుడుపుదొడిగికొనిన నేమి? అట్లుగాక వ్యర్థప్రలాపములు సేయుచు నమాజుచేయక, భోగాలాలసులయి దినములు వెళ్లబుచ్చుచు, యింద్రియ సౌఖ్యములకు లోనయి రాత్రులు గడపుచు, మాంద్యమున పొరలాడుచు, చేతికి దొరికినదెల్ల తినుచు, నోటికి వచ్చినదెల్ల మాటలాడుచు జీవితము వ్యర్థముసేయు కుమతులు దరిబేసిబొంతె తొడిగికొని యుండియును అధములగుదురు.

అంతరంగంబు పుణ్యశూన్యంబునీకు,
కపట వేషంబుతో నేమి గాంచగలవు?
ఇంటి గూర్పుంచ జిరుచాప కంటిలేక
యేడురంగుల తెరయేల యింటి మొగను?

౪౬

గరికపోచలు చుట్టి కట్టిన క్రొత్త
పన్నీరు పూగుత్తి బరికించి యంటిః
ఏమి యదృష్టంబొ యీబీద గరిక

కన్నెగులాబీల కడనెవసించు!
కన్నీరువెట్టుచు గరిక యిట్లనియెః
మాటలాడకుమోయి, మరియాదలేదె?
దయయు దాక్షిణ్యంబు దనరినవారు
మరవరు మిత్రులౌ మందభాగ్యులను;
సౌరు సౌరభ్యంబు చక్కనిరంగు
అలర కుండిననేమి, యా దేవదేవు
వనభూమిలో నేను ప్రభవింపలేదె?
భువనేశ్వరుని కృప బోషింప బడితి,
ఆ తండ్రి దాస్యంబె యర్థించుకొంటి;
తెలివిలేకుండియు దేవుని దయకు
అంజలి ఘటియింతు నానతో నతము;
యోగ్యత వినయంబు నోచ్చులేకున్న
తన సేవకునికోర్కె తానెయెరింగి
నవరించు, నన్యరక్షణలేని కతన;
పరనిర్వృతి పథాన బయనించుసాది
నుద్ధరింపుము తండ్రి యోసృష్టిశిల్పి;
తమ సేవ వృద్ధులౌ దాసుల బంధ
ముక్తి యొనర్తురు భూపాలపగులు;
విశ్వేశ, నీ ద్వారవీధి వర్తించు
ప్రాణికి గత్యంతరంబు లేదొకటి.

౪౭

దాతృత్వ ధైర్యములంగో నేది శ్రేష్ఠమైనదని యొక ప్రాజ్ఞుని ప్రశ్నించిరి. ఆయన యిట్లు చెప్పెను: ‘‘ఎవరికి దాతృత్వముండునో వారికి ధైర్యము ఆవశ్యకము కాదు.’’

బలము శౌర్యముగల్గు బాహువుకంటె
నర్థులకిడుచేయి యత్యుత్తమంబు
అనుచుముగా లిఖియించిరా బహరాము
గోరి గోరీమీద గుంటక్షరముల.

ఏగె హాతిముతాయి, యేండ్లుపూండ్లాయె
నైన పేరుప్రతిష్ఠ లఖిలకాలంబు
దైవారు దులలేని వాతయౌ కతన
నీకున్నయంతలో నిర్ధనార్థులకు
దానంబుసేయుము దైవంబుమెచ్చు;
వనపాలకుడు ద్రాక్ష వల్లిశాఖలను
గత్తిరించిన గాయుగాయు దట్టముగ.

గులాబితోటలోని

ద్వితీయాధ్యాయము

సంపూర్ణము

గుంటాబితోట

తృతీయాధ్యాయము

సంతృప్తి

౧

పడమటి సీమ నిచ్ఛగాడొకడు హాలబ్ పట్టణమున వర్తక సంఘమునందు ఇట్లు పలికెను. భాగ్యవంతులారా, మీకు న్యాయ బుద్ధియు మాకు సంతృప్తియుయుండెనేని లోకమునందు యాచనా చారము నిర్మూలమైయుండెడిది.

నను ధనికుని గావింపుము
నిను గొలిచెదనోసి తృప్తి, నీ సరిసిరి యెం
దును దుర్లభమగు; లకుమను
గనె సహనం; బోర్పులేక జ్ఞానముగలదే

౨

మిసరు దేశమున నిద్దరు రాజకుమారులుండిరి. వారిలో నొకడు శాస్త్రపాండిత్యము సంపాదించెను మరియొకడు ధనమా ర్జించెను. తుట్టతుదకు ప్రథముడు అప్రతిమాన విద్వాంసుడాయెను. ద్వితీయుడు మిసరురాజ్యమునకు అధిపతియాయెను. కొంతకాలము గడచిన వెనుక సంపన్నుడగు రాజు నిరుపేదయగు విద్వాంసుని నీచముగచూచి యిట్లనియెను. "నేను రాజ్యపాలనము చేయు చున్నాను. ఈతడన్ననో దారిద్ర్యమనుభవించుచున్నాడు".

ఈ మాటలకు పండితుడిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "ఓయి సోదరుడా, దేవుడు నాకొనర్చిన మేలునకు నేను ఎక్కుడు కృతజ్ఞు డనుగ నుండవలయును. ఏలయన పైగంబరుల పైతృకమనాదగు శాస్త్రపాండిత్యము నాకు లభించెను. నీకన్ననో ఫారూహామా నుల పైతృకమగు మిసరు రాజ్యభాగము చేపడెను.

అడుగు క్రిందనలిగి మిడుకు చీమనెగాని
యేడ్వగుట్టు కందురీగగాను;
ప్రజల కష్టపెట్ట బలమీయనందుకు
దేవదేవుఋణము దీర్పగలనె?

3

ఆకటిచిచ్చులో మలమలమాడుచు, చీరికపై చీరికపెట్టి కుట్టుకొనుచు, సొంతయూరట కొరకు నిట్లు పాడుకొను నొక దరిబేసిని గూర్చి నేను వినుచుంటిని :

ఎండు రొట్టెమెనవి యెంతొ తృప్తిపహింతు,
కుట్లబొంత దొడిగికొని సుఖింతు;
పరుల దయకు ఋణముపడి యుండు గతికంటె
తన పరిశ్రమంబె తనకుమేలు

ఒకడాతనితో నిట్లనెను. "ఓయి, యేల యూరకకూర్చుంటివి? ఈ పట్టణమున దయాంతరంగుడును సర్వసమకారుణ్యముగల యొక పెద్దమనుష్యుడు ముక్తుల పరిచర్యసలుపుటకు నడుముకట్టుకొని వారికోర్కెలీడేర్చుటకు కని పెట్టుకొని యున్నాడు. నీ యిప్పటి స్థితిగతులు ఆయన కెరుకపడెనేని మీబోటి ప్రియుల యిష్టానుసారము వర్తింప సమయము చిక్కినందుకు మిక్కిలి సంతోషించును" ఈ మాటలు విని దరిబేసి యిట్లు పలికెను: "నోరుమూసికొమ్ము మన యక్కరల నొరులయొద్ద వెళ్లబెట్టుటకంటె దారిద్ర్య కష్టముల ననుభవించుటయే మేలు.

క్రొత్త చొక్కాలులేవని గొణుగుకొనుచు
దాతకర్జీలు పెట్టెడు దానికంటె,
జీరికలుగుట్టి ధరియింప శ్రేష్ఠమగును;
పాప సహనంబు శాంతియు దక్కుసీకు.

ఇరుగుం బొరుగు మనుష్యుల
కరుణా సాహాయ్యలబ్ధి గడస్వర్గంబుం
బొరియుట కంటెను మేలగు
నిరయాగ్నిం బడెడుబాధ; నిజమిది మిత్రా.

౪

మహామ్మదు ముస్తఫాకు అందుగాటులోనుండి కావలసిన చికిత్స చేయుచుండుటకు నొక నిపుణుడైన వైద్యుని పారసీక నరపాలుడొకడు పంపెను. ఆతడు కొన్నేండ్లపాటు అరబ్బీ దేశమున నివసించెను. ఎంతకాలము చూచినను ఒక్క రోగియైనా మందిమ్మని తనయొద్దకు రాకుండెను. అంతట ఆవైద్యుడు మహామ్మదు ప్రవక్త సముఖమునకు వచ్చి యిట్లు మొరపెట్టెను: "దేవరవారి యనుయాయులకు చికిత్స చేయుటకు నన్నిచ్చటికి పంపిరి. ఈ గులాము నియుక్తకార్యము నిర్వహించుటకు నొక్కడైన నావద్దకు వచ్చుట లేదు" ఈ మాటలువిని మహామ్మదు ఇట్లనియెను: "చురుకుగ ఆకలెత్తనిదే భుజింపరాదనియు, ఆకలి కొంచెము మిగిలి యుండగనే భుజించుట మానవలయుననియు మా సంఘమువారికి దాటరాని కట్టుబాటు గలదు" వారి యారోగ్యమునకు ఈ పద్ధతియె కారణమయ్యుండునని వచించి గౌరవ పురస్సరముగా భూమిని ముద్దిడి యావైద్యుడు తన దేశమునకు వెడలెను.

అది భుజింపుమ, యిదికూడ దనుచుజెప్పు
వైద్యు; డటు చెప్పకుండిన వచ్చుగీడు;
బొత్తిగా బస్తుబడి యున్నబోవు పటిమ;
వెజ్జునిపుణత హితమును వినుచుటందు.
ఆయురారోగ్యములు భోజ్యమందు గలవు;

౨౫

అర్దిషీర్ శాబకాన్ చరిత్రము నందిట్లు వ్రాయబడియున్నది "దినమున కెంతమాత్ర మాహారము తినవచ్చు" నని యొకనాడు అర్దిషీరు అరబ్బీ వైద్యుని ప్రశ్నించెను. "నూరుదేరముల యెత్తు చాలును" అని వైద్యుడు చెప్పెను. "ఈ కొద్దిపాటి యాహారము ఏమి బలమిచ్చును" అని యర్దషీరడిగెను ఈ కొద్దిపాటి యాహారము నిన్ను మోయగలదు. ఇంతకన్న నెక్కుడు భుజింతువేని దానిని నీవు మోయవలయును" అని ఆతడు చెప్పెను.

బ్రతుకంగ బ్రార్థింప బ్రాజ్ఞుండు దినును,
తినుటకే బ్రతికెదు తిండిపోతన్న!

౨౬

ఖురాసాను రాష్ట్రవాసులగు నిద్దరు దరిబేసులు తోటి శాట సాగులయి యాత్ర సల్పుచుండిరి. వారిలో నొకడు బలహీనుడుగ నుండి రెండుదినముల కొకతూరి భుజించు చుండెను. మరియొకడు బలవంతుడయి దినమునకు మూడుపూటలు మెక్కుచుండెను.

ఇట్లుండ నొకనాడు వారొక పట్టణము ప్రవేశించు నప్పుడు వేగువారను నేరము మోపబడి బాధింపబడిరి. రాజభటులు వారి నొక గదిలోనికి నెట్టి, ద్వారమును మంటితో మూసివేసిరి. తరువాత ఏడుదినములకు వారు నిర్దోషులని తెలిసినది మన్నుత్రవ్వి వారిని గదినుండి బయటికి తీసిరి. బలవంతుడు మరణించి యుండెను బలహీనుడు బ్రతికియుండెను. ఈ విపరీతమునకు నందరు ఆశ్చర్య పడిరి. అంతట నచ్చటనుండిన యొక పండితుడు ఇట్లనియెను: "ఇం

తకన్నా విపరీతముగ జరిగియుండిన మనము వింతపడవలసి యుండును ఏలయన వాడు తిండిపోతు పస్తుపడియుండుటకు శక్తి లేక మరణిం చెను. రెండవవాడు కొద్దిగ తినువాడు అందువలన తన యలవాటు చొప్పున ఆకలినోర్చుకొని క్షేమముగ బ్రతికివచ్చెను.

కొలదిపాటిగ దినువాడు కొండయంత
కష్టములనైన సులువుగా గడచిపోవు;
విచ్చలవిడిగ దినిమేను పెంచువాడు
పేదవడ, నిడుములజిక్కి వీగిపోవు.

౭

తనివితీర భుజించుట రోగహేతువగును. కావున నీవు మితి మీంర తినరాదని వివేకియగు తండ్రి పుత్రుని కాజ్ఞవెట్టెను.

"తండ్రీ, యాకటిబాధ ప్రజలను చంపును ఆకటిమంటతో బ్రతుకుటకంటె సంతృప్తిగాతిని చచ్చుటయే మేలని బుద్ధిమంతులు చెప్పినమాట నీవు వినలేదా?" అని కుమారుడడిగెను. "మేరమీంర కుము. సర్వేశ్వరుడు ఖురానులో నిట్లు చెప్పియున్నాడు: ఎంత యావ శ్యకమో యంతమాత్రమె తినుము, త్రావుము. మితిమీంరకుము."

త్రక్కవలసినట్లు కడుపు నింపకుము;
బక్కచిక్కగ మేను, పస్తులుండకుము.
అన్నకబళమొదలి కాధారమయ్యును
అదియె రోగహేతువమితమైన;
కోర్కెలేక తిన్న గుల్గందు విషమౌను,
ఆకలెత్త రొట్టె యమృతమగును.

౮

"నీకు దేనిపై కోరికయున్నది" అని యొకరోగినడగిరి. "నేనేమియు కోరక యుండవలయునను కోరికగలదు" అనియాతడు చెప్పెను.

కడుపాట్ల నవ్వంగ గడుపునింపినను
అన్నియు నరియయ్యె హాయిచేపడదు.

౯

వాసిత్ నగరమున కొందరు సూఫీలు ఒక కసాయివానికి కొన్ని దేరములు ఋణపడి యుండిరి ప్రతిదినమును అతడు బాకీదం డుచు కఠినముగ మాటాడుచుండెను. ఆ సూఫీలు వాని చు రు కు ముట్టుమాటలకు మనసు నొచ్చియు నేయునదేమిలేక సహించి యుండిరి. వారిలో నొక పుణ్యాత్ము డిట్లనియెను: "ఆకట మిలమల మాడుచున్న కడుపునకు అన్నము వేయుదునని సులువుగా వాయిదా వేయవచ్చును గాని కసాయివాని యప్పుతీర్చుటకు గడువుపెట్టుట యసాధ్యము."

తెలిసి పణిహారిచేదిట్లు దినుటకంటె
ఉన్నతుల దర్శనము మానుకొన్న మేలు;
కసికవాని వసూలు నిక్కచ్చికంటె
ఆమిషపుటాన మరణించుటైన శుభము.

౧౦

తార్తారుయుద్ధమునందు ఒక యువక వీరుడు గాయపడెను: "ఫలాని కోమటిశెట్టి యొద్ద గంటిని మాన్పు మందున్నది. నీవు

కోరదువేని ఒకవేళ ఆతడిచ్చిన నీయవచ్చును. అయినను ఆ వర్తకుడు పిసినిగొట్టను ప్రతీతి."

శెట్టితను కంచమూన నెండురొట్టె బదులు
భానుబింబంబె యుండిన, ప్రళయదినము
వరకులోకంబు సూర్యతపంబు గోలు
పోవలసివచ్చు; పిసినారి పుట్టువతడు.

అంతట ఆ యువకుడిట్లనియెను: "ఒకవేళ నేను ఆతనిని మందడుగుదునేని యిచ్చిన నీయవచ్చును. లేదా లేదనవచ్చును. ఇచ్చునుపో అది యుపయోగపడవచ్చును. లేక నిరుపయోగము కావచ్చును, ఎట్లయినను అటువంటివానియొద్ద మందు తెచ్చి పూసికొనుట విషము చరిమినట్లగును"

అధముని యాచించి యర్థించునెదియు
దనువు హెచ్చించును, తగ్గించునాత్మ.

పండితులిట్లు చెప్పిరి: "జీవనామృతము అమ్మబడుచున్నను ప్రాజ్ఞులు ఆత్మగౌరవమును వెచ్చించి దానిని విరువరు. ఏలయన నీచముగ బ్రతుకుటకంటె గౌరవముతో మరణించుటయె యుక్తమును."

చిట్టవేసిన పుట్టిడౌనట్టి మొగము
వానిచేతి రసాయన మానుకంటె
సంతసము వెలిబుచ్చెడు నరసుచేతి
చేదు సొరకాయ పినుటయే శ్రేష్ఠమగును

౧౧

ఒక విద్వాంసునికి నింటబడి తినువారు ఎక్కువగనుండిరి.

వరుమానము తక్కువగనుండెను. తనపై విశ్వాసముగల యొక పెద్దమనుష్యుని యొద్దకుపోయి తన నిరుపేదతనమును తెలుపుకొనెను. ఆయనకు విద్వాంసుని యాచన అప్రియముగాఁదోచెను, ఏల యన, మట్టుమర్యాదలెరిగిన పండితుల యాచన ఆ పెద్ద మనుష్యునికి లజ్జాకరముగ తోఁచినది.

మోము మాడ్చుచు గష్టముల జెప్పనఖుల
నరసకేగకు వారి నంతుష్టిచెడును.

నవ్వుతేటలు మోమున నివ్వటిలగ
నక్కరల దెల్పుకొనుము, నీ కగును శుభము
స్మేరవదనంబు కార్యంబు జెరచదెపుడు;
మోదము ముదంబు నొరులలో బొదలుకొల్పు.

ఆ విద్వాంసున కీయబడు బత్తెము కొంచము హెచ్చింపబడెను, ఆ పెద్ద మనుష్యునకు ఆ పండితునిపైగల గౌరవము చాల తగ్గినదని చెప్పుకొనిరి.

కొన్నిదినములకు తనపై విశ్వాసము తగ్గినసంగతి తెలిసికొని యాతడిట్లనియెను:

అక్కరకువేడు సామగ్రి యధమమగును;
కుండ పాయిమీదికెక్కెను, కూడుడికెను;
కాని ప్రియమైన నా యాత్మగౌరవంబు
బుడగలైచిట్లి యావిరై పోయెనయ్యొ!

పెరిగెను బత్తెంబు, తరిగెమానంబు;
పాడు యాచనకంటె పస్తుంటమేలు.

౧౨

ఒక దరిద్రుసికి ధనముతో నక్కరగలిగెను. "ఫలాని పెద్ద మనుష్యుడు అత్యంత భాగ్యవంతుడు. దయార్ద్ర స్వభావుడు. నీ యక్కర ఆయనకు తెలియవచ్చెనేని యెట్లయినను నీపని నెరవేర్చుటకు ఆలసింపడు" అని యొకమిత్రుడు చెప్పెను. "నేనాయనను ఎఱుగను" అని దరిద్రుసి చెప్పెను. "అట్లయిన నేను తీసుకొని పోయెద" నని చెప్పి, చేయిపట్టుకొని యా పెద్దమనుష్యుని యింటికి వాని దోడ్కొని పోయెను.

అచ్చట పెదవులు వ్రేలాడవేసుకొని పప్పుముద్దవలె దసికిల బడి కూర్చుండియున్న యింటియజమానుని చూచి దరిద్రుసి యేమియు మాటాడక తిరిగివచ్చెను. "ఇట్లేలచేసితివి?" అని మిత్రుడడిగెను "అతడిచ్చు సంభావన అతని ముఖమండలమునకు కానుకగా సమర్పించితి" నని యా దరిద్రుసి చెప్పెను

ఏడ్పు మొగమువాని నేమి యర్థింపకు
మతని దుఃస్వభావమాత్మ గలచు;
అడిగెవేని వాని నడుగుమా యెవ్వాని
యాస్య పద్మమివి కానవాలొ.

౧౩

ఒకయేడు సికిందిరియా నగరమున పెద్దకరువు సంభవించినది దరిద్రులకు కష్టము లోర్చుకొనుశక్తి సన్నగిల్లినది. ఒక్క వాన చినుకైనా భూమిపై పడనియట్లు ఆకాశద్వారము మూతపడినది రైతుల దీనాలాపములు మిన్నుముట్టినవి.

ప్రాకు పురుగు మొదలు పైనిబోవు ఖగంబు
వరకు గలుగు ప్రాణివర్గమందు
మిన్ను జూచి చూచి మన్నైనయానతో
నుమ్మలింపనట్టి దొకటిలేదు.

అన్నమో రహీమని యెప్పుడంగలార్చు
ప్రజల నిట్టూర్పు ధూమంబు పైనిమొగులు
గట్టి. కన్నీరువానయై కడవపోత
జడిగ వర్షింపకుంట విస్మయము గొల్పె.

యిటువంటి సంవత్సరమున ఆ పట్టణమునందు పేడి యొకడుండెను. వాడు మిత్రులకు దూరస్థుడగునుగాక! వానిని వర్ణించుట మర్యాదకు లోపముగ నుండును. మీదుమిక్కిలి పెద్దమనుష్యులకడ వర్ణించుట యింకను అనుచితము. అట్లయిన నింద్యుడని వానిని వర్ణింపక బొత్తిగ వదలి పెట్టుటయు సరికాదు. ఏలయన అట్లు వదలి పెట్టుట నా శక్తిదారిద్ర్యమని యితరులు లోపమారోపింతురు. సంక్షేపముగా ఈపద్యమున వానిని వర్ణించెదను. అన్నమును పరీక్షింప నొక్క మెతుకును పట్టిచూచినట్లును, గోనెలోని ధాన్యమును మచ్చుచూచుటకై నొక పిడికెడు చాలినట్లుగను, ఈ పద్యమొకటి చాలును.

పేడిదార్తారి చంపిన వేదువుమతని,
ప్రతివదనుమాను; మెన్నేండ్లు బ్రతుకునతడు
బాగదాద్ వంతెనవిధాన, బైని జనులు
క్రింద వాఃప్రపూరము ఝుంకరించి పార.

ఇంతకును ఎవరని వర్ణనమునందు మీరొక్క యక్షరము మాత్రమే విన్నారో అట్టివానికి ఈ కరవుకాలమున మితిలేని ధనరాసులుండెను. అతడు నిరుపేదలకు వెండిబంగారము నిచ్చుచుండెను

బాటసారులకు అన్నము పెట్టించుచుండెను దరిద్రులు పస్తుపడియుండలేక సదావృత్తి కొరకు నాతని యాచించు తలంపుతోనుండి నా యభిప్రాయమును కోరిరి. వారితలంపు నాకు అంగీకారము గాక యిట్లంటిని:

గుహను సింహ మశక్తమై కూలబడియు
గుక్క యెంగిలిదినగ గక్కురితిపడునె?
ఆకటిని సహింపుముగాని, యధమునొద్ద
జేయిచాపకు మెంత యాదాయమున్న.

సంపదల ఫరీదూనుతో సమునినైన
దెలివిలోపింప నరుడంచు దలపబోకు;
పయినిదాలుచు నవివేకి పట్టుటంగి
మట్టిగోడకు పసిడి నీర్గొట్టినట్లు.

౧౪

మీకంటెను గొప్ప బుద్ధిగలవానిని ఈ ప్రపంచమున నెచ్చటనైనను కనివిని యున్నారా? అని హాతీంతాయినడిగిరి.

"అవును కనియున్నాను. ఒకదినమున నలువది యొంటెలను బలిపెట్టి విందు చేసితిని. అరబ్బీ పాలెగాండ్రను ఆహ్వానించుటకు పోవుచుండ నడారిలో నొకమూల కట్టెలుగొట్టువానిని గాంచి యిట్లంటిని: "హాతీంతాయికి అతిథివై నీవేల పోలేదు? ప్రజలు ఆయన విందునకు నలుదిక్కులనుండి వచ్చుచున్నారు." కట్టెల మోపు తలపై కెత్తుకొనుచు ఆతడిట్లనియెను.

చేజేత కష్టించి జీవించునతడు
తాయి ప్రసాదంబు దలపడెప్పుడును

"నాకంటె అతడు గొప్పబుద్ధిమంతుడు శౌర్యమునందును మేల్తరమని నిశ్చయించుకొంటిని" అని హాతీముతాయి చెప్పెను.

౧౭

కట్టగుడ్డలు లేక దిసమొలతో బయటదిరుగుటకు సిగ్గుపడి, యిసుకలోదుకొని గుంటలో కూర్చుండియున్న యొక దరిబేసిని మూసాప్రవక్త చూచెను. "అయ్యా, తినుటకన్నమును కట్టగుడ్డయు లేక నాబ్రతుకు దుర్భరమగుచున్నది. నాకు దినబత్తెము దొరకునట్లు మీరు సర్వేశ్వరుని ప్రార్థింపవలయును" అని యా దరిబేసి ప్రవక్తను" వేడుకొనెను. అంతట మూసా "అల్లాకాని" వ్మని ప్రార్థించి వెడలిపోయెను.

కొన్నిదినముల కాదరిబేసి దుష్టుడయి సారాయిత్రాగి కయ్యమునకు కాలుచాపుచు నొకనిని చంపి పట్టుపడెను. జనులు వాని చుట్టు మూగియుండిరి. అట్టిసమయమున మూసాప్రవక్త ఆదారిన వచ్చుచుండి "యిస్లీల తటస్థించినది" అని యడిగెను "త్రాగి తలకుపోసుకొన్న యతడొకన్ని హత్యగావించెను. వానికి ప్రతివధ యాజ్ఞయైనది" ని చెప్పిరి.

గండుపిల్లికి రెక్క జోడుండునేని
పిచ్చుకల గ్రుడ్లు మాయమౌ పృథ్వియందు;
గాడిదకు నావుకొమ్ములు గలిగెనేని
దగ్గరకు నేరిరానీక తరిమిపొడుచు.

దుష్టునకుడబ్బు చేవకుదోడుపడిన
అది యుపద్రవకరమైన హానియగును;
వాడు చెలరేగిన బీదల గోడుగుడుపు,
వారి బలహీనకరముల వంచివిరుచు.

బత్తెంబుదేవుండు పంచిపెట్టినను
తగవుల మారులై దాసులుండెవరు.

నీచునకు బైడిపదవియు నెగడునేని
తలకు జెప్పులడుగు, గాలిదన్నుగోరు;
చీమ కెరకలు లేకుంట శ్రేమమనెడు
పెద్దలాడిన సూక్తిని వినవెనీవు.

నిను ధనికుని గావింపని
జనకునకుం దెలియు నీకు సరియగునదియే
దని నీ కంటెను హెచ్చుగ;
వినయము నిర్ధనుడె దేవునారాధించు౯.

౧౬

బస్రాపట్టణమున రత్నవ్యాపారులమధ్య కూర్చుండి యొక అరబ్బీ యిట్లుచెప్పుచుండ వింటిని: "ఒకానొక సమయమున ఎడారి యందు దారితప్పితిని. నేను తెచ్చుకొన్న దారిబత్తెము వ్యయమైనది మరణించుటకు సంసిద్ధుడనయి యుంటిని. అంతట నాకస్మికముగ ముత్యములసంచి నాకు దారిలో దొరికెను ఆ సంచిలోనివి గోదుమ బొరుగులని యనుకొన్నప్పుడు నాకుగలిగిన యపరిమితానందమును, ముత్యములని తెలిసికొన్నప్పుడు నేనుపొందిన నిరాశయు హృదయాకులత్వమును ఎప్పటికిని నాకు మరపురాదు."

ఇసుకరేగు నెడారిలో నెండదప్పి
గొన్నతనినోట ముత్యాలు గుల్లలొకటె;
బత్తెమడుగంటి కూలిన బాటసారి
రొండి బెంకులు రొక్కంబు రెండునొకటె.

౧౨

ఒక యరబ్బి యెడారియందు మిక్కుటముగ దప్పిగొని ఇట్లని యెను:

ఆశఫలియించునే నేను నంతమొందు
లోన, దైవమా, యొక్కనాడేని యూట
పుట్టవలయును మోకాలిపొంత, నందు
నీటిపంచైన కడుపైన నింపకొందు.

ఇదేవిధముగ నొకదరిబేసి యెడారియందు దారితప్పి తినుట కన్నముగాని శ్రమవహించుటకు శక్తిగాని లేకుండెను. వాని యొద్ద రూకలుమాత్రము కొన్నియుండెను. తిరిగితిరిగి వేసారి సరిదారిగానక అతడు బడలికచే మరణించెను కొంతసేపటికి బాటసారులు కొందరు ఆ మార్గమున వచ్చిరి. మరణించిన యరబ్బియెదుట రూకలు పరవబడి యుండుటయు, ఇసుకలో ఈ పద్యము వ్రాయబడి యుండుటయు వారు చూచిరి.

దారిబత్తెములేకున్న దరియుడెవడు
జాఫరు సువర్ణనిధులకు స్వామియయ్యు;
వేగెడు నెడారి గ్రాగిన భిక్షుకునకు
ముదమొసగు గందములు వెండిముద్దకంటె.

౧౮

ఎప్పుడైనను నేను కాలదుర్గతికి కంట తడిపెట్టినదిలేదు. దైవ దుర్విపాకమునకు మోము చిట్లించుకొన్నదియు లేదు. అయినను ఒక సమయమున నా కాళ్లకు చెప్పులులేక బాధపడుచుంటిని. వెల యిచ్చి కొనుటకు నాకు శక్తి లేకుండెను అట్టిస్థితిలో కూఫానగరము నందలి మసీదు ప్రవేశించితిని. అచ్చట కాలులేని యొక దురదృష్ట వంతుని చూచితిని. అంతట దేవుడు నాకొనరించిన మేలునకు కృతజ్ఞత దెల్పికొని సర్వేశ్వరుని కీర్తించితిని. కాలులేని వానికంటే చెప్పులు లేని యిబ్బందిని సహియించి యుంటిని.

మెక్కి తనసినవానికి నెక్కుమదికి
బొరుటు మాంసంబు కంటెను పుల్లగూర;
తిన మెతుకులేని పేదకు గెనుసుదుంప
తృప్తికలిగించు పొరిటిన యొరచికంటె.

౧౯

ఒకానొక సుల్తాను శీతలకాలమునందు కొందరాస్థానికులతోడ వేటాడబోయెను. ప్రొద్దుగ్రుంకినప్పటికి విడిదియింటికి చాలాదూరమున నుండిరి. అచ్చటనున్న యొక పల్లెటూరువాని యింటినిచూచి "నాకు పడిశము పట్టకుండునటుల రాత్రి ఆ యింట గడిపెదము" అని సుల్తాను చెప్పెను. అందుకు నొక వజీరిట్లనియెను: "పల్లెటూరి వానియింట బసచేయుట గౌరవస్థులగు పాదుషాలకు ఉచితము కాదు ఇచ్చటనే డేరాకొట్టించి నెగడి వేయించెదను."

ఈ సంగతి యా పల్లెటూరు రైతునకు తెలిసి అప్పటికి నింట నున్న పదార్థములను ఆయత్తపరచి సుల్తాను మ్రోలనుంచి గౌరవ

పురస్సరముగ భూమిని ముద్దిడి యిట్లు విన్నవించెను: "యింత మాత్రముననే యేలినవారి గొప్పతనమునకు లోపము వాటిల్లదు. అయినను పల్లెటూరిరైతు గౌరవము హెచ్చుట వజీరులకు నిష్టము లేదు." ఈ మాటలకు సుల్తాను సంతసించి రాత్రి వానియింటనే బసచేసెను. మరునాడు వానికి గౌరవ సూచకమగు అంగీని ధనమును బహుమతి చేసెను.

కొన్ని యడుగులదూరము సుల్తాను కాలిక్రింది అంకవన్నను పట్టుకొని నడచుచు నాతడిట్లనియెనని వింటిని:

గాజువాదడు సుల్తాను గౌరవంబు
పల్లెరైతింట నొకరేయి బసయొనర్ప;
రైతు కుల్లాయికొనకుచ్చు రవినిముట్టె
దమరివంటి రాజులనీడ పగులుకతన.

౨౦

మొండెకతైయుగు నొక పిసినారి బిచ్చగానిని గురించి యిట్లు చెప్పుదురు: ఒకానొక బిచ్చగాడు అపరిమితమైన ధనమును ఆర్జించెను. పాదుషా యాతని పిలువనంపి యిట్లనియెను: "నీ వద్ద విశేష ధనమున్నదని తెలియవచ్చినది. మాకొక ముఖ్యమైన కార్యము తటస్థించినది. నీదగ్గరవున్న ధనములో కొంతభాగమిచ్చి మాకు తోడ్పడుదువేని శిస్తు వసూలైన వెంటనే నీ ఋణముతీర్చి, నీ మేలు మరవము." ఈ మాటలువిని బిచ్చగాడిట్లు విన్నవించెను:

"మహాప్రభూ. తమబోటి గౌరవస్థులగు పాదుషాలకు, కొద్దికొద్దిగా బిచ్చమెత్తిన నాబోటి దరిద్రుని ధనముతో చేయి మలినము చేసికొనుట ఉచితముకాదు." నీవు చింతపడవలసిన పని

లేదు. మలినులకు మలినమార్గము కావున నీడబ్బు కాఫరులకే యిచ్చెదను. క్రైస్తవుల బావినీరు మైలపడునేని దానితో యూదుని శవము కడిగిన దోషముండదు." అని సుల్తాను పలికెను.

అంతట ఆ బిచ్చగాడు రాజాజ్ఞను తిరస్కరించి యన్యాయమని వాదించి ధనమీయక ప్రతిఘటించెనని వింటిని. సుల్తాను కోపగించుకొని "కోశశాసనము" ను వానిపై దారుణముగ ప్రయోగింపుడని యాజ్ఞాపించెను.

మంచిమాటల ఫలము లభింపకున్న
బలిమి గార్యంబు సాధింప వలసివచ్చు;
తానెయియ్యని పిసినారి వానిబట్టి
యెపుడు బలవంతపెట్టుట యుచితమగును.

౨౧

వ్యాపార సామాగ్రి మోయు నూటయేబది యొంటెలును నలువది గులాములును సేవకులును గల యొక మనుజుని గాంచితిని కైష్ ద్వీపమున ఒకనాటి రేయి యాయన నన్ను తన విడిదికి గొనిపోయి నాకొక్క నిమిషమైన నూరట చేపడకుండునట్లు తన స్వంతగొడవ నిట్లు బయలుబెట్టెను: "నాకు తుర్కీస్తానమున ధాన్యపుకొట్లు గలవు. ఫలాని వ్యాపార వస్తువులు హిందూస్థానమునందున్నవి. ఇది ఫలాని భూమియొక్క విక్రయ పత్రము. ఇదిఫలాని వస్తువునకుగా ఫలాని మనుష్యుడు వ్రాసియిచ్చిన జామీనుపత్రము" మరల కొంతసేపిట్లు చెప్పసాగెను: "సికందరియా నగరమునకు పోవుటకు నేను ఉవ్విళ్లూరుచుందును. ఏలయన అచ్చటి శీతోష్ణస్థితి హృదయరంజకముగ నుండును. అయినను ఆ ప్రయాణము కొన

సాగదు. పడమటి సముద్రము కలత వారియున్నది. ఓసాదీ, నాకొక్క ప్రయాణము కొరవ చిక్కియున్నది. అది పూర్తియగు నేని నా జీవిత శేషమంతయు తృప్తితో నొకమూల కూర్చుండి కాలము గడపెదను

"అదియే ప్రయాణము?" అని నే నడిగితిని. అతడిట్లనియెను, "పారసీ దేశపు గంధకమును చీనాకు తీసుకొని పోయెదను. దానికక్కడ వెల హెచ్చుగ లభించును. చీనా పింగాణి పాత్రలను గ్రీసు దేశమునకు కొనిపోవుదును ఆ దేశపు జలతారు హిందూ దేశమునకును అచ్చటి యుక్కు హాలబ్ పట్టణమునకును, ఆ పట్టణములోని యద్దములను అరబ్బీ దేశమునకును, అచ్చటి గీరల గుడ్డలు పారశీ దేశమునకును, కొని పోయెదను. తర్వాత పరదేశ యాత్రలు చాలించుకొని నెమ్మదిగ నంగడిలో కూర్చుండెదను. ఈవిధముగ చెప్పి చెప్పి యింకను చెప్పుటకు శక్తిచాలక, "సాదీ, నీవుకూడ కని వినియున్న సంగతులు చెప్పుమని నన్నుకోరెను. నేనిట్లంటిని:

హా రెడారిని బోవు వ్యాపారి ముఖ్యు
డొంటిపైనుండి బడలిక నుర్విగూలి
యనియెః ప్రాపంచికుని కన్నులందు దృష్టి
గాని, తనగోరి దుమ్మైనగాని నిండు.

— ౨ —

హాతింతాయి యౌదార్యమున నెంతప్రసిద్ధుడో పిసినిగొట్టుతనమున నంత పేరెల్లిన యొక ధనికునిగూర్చి వినియుంటిని. అతని బాహ్యస్థితి యైహిక సంపదలచే నలంకృతమై యున్నది. కాని

యాతనిస్వభావమున నీచత్వమెంత గాఁ డెనన వేళ్లు పారియున్న దనగా, ప్రాణము పోవనున్నను తన చేతితో నాకొన్నవారికి నొక రొట్టెముక్కయైన పెట్టడు, అబూకాఁకికిఁ పిల్లికిసైతము పిడికెడన్నము పెట్టడు. సప్తనిద్రాళివ్రుల కుక్కకేఁచియు నొక యెముకను పడవేయడు. వేఁగొల, యతని యింటిలోనికిఁ బోరువబడి యుండుట ఎవ్వరును చూచియెరుగరు. అతని యన్నమును ఒక్కడైన ఎంగిలి చేసి యెరుగడు.

వానసయెతప్ప నాతని వంటకముల
చవియెరుంగడు దరివేసి చచ్చిచెడియు;
మరచియు విదల్పబోడొక్క మారుగాని
కాకి కెంగిలిచేతిని; కఠినుఁడతఁడు.

పశ్చిమ సముద్రముదాటి మిసరు దేశమునకు పోవలసినట్లు అతనికొక ప్రయాణము తటస్థించినది దేవునివాక్యము ప్రకారము "వాడు మునిగిపోవునంతవరకు" ఫారోనువలె మిథ్యాగర్వమును భావమున చిత్రించుకొని సముద్రయాత్ర చేయుచుండెను. మరునాడు ఎదురుగాలి కొట్టి ఉయ్యేలలూగుచుండెను.

కుప్పగూలిన నిన్నింక గుస్తరింప
హృదయమెటు ప్రోత్సహించిన నేమిఫలము.
యానమున కనుకూలమై యనుదినంబు
కోరినట్టుల తెరగాలి గొట్టుబోదు.

అతడు చేతులు పైకెత్తి మాటిమాటికి దైవమును ప్రార్థించెనుగాని యేమియు ప్రయోజనము లేకపోయెను. ఓడపగిలెను. దేవుడిటు సెలవిచ్చి యుండెనుగదా. "సముద్రయాత్ర చేయునపుడు మీరు సర్వేశ్వరుని ప్రార్థింతురు"

పరమదాతృత్వమును బూనవలసినపుడు
కక్షవిన్యస్తహస్తులై, కష్టవేళ
దైవమునకు చేతులుచాపు దానజనులు
ప్రార్థనాంజలి యిడనేమి ఫలముగలుగు?

ధనము ననుభవించు; తనుపుమర్త్యులకిచ్చు;
ధరణినీకు శాశ్వతంబుగాదు;
ఇంట వెండి పైడి యిటుక లొక్కొకటిగా
దీయుమోయి; గాలిదివ్వెబ్రతుకు.

అతనికి మిసరు దేశమున నిరుపేదలైన చుట్టములుండిరని చెప్పుకొనిరి. వాని మరణానంతరము ఆ భాగ్యము సంక్రమించి వారు ధనికులైరి. వారు ప్రాతయుడుపులను చింపివేసి సన్నని మిసరు దేశపు వలిపములను ధరించిరి. వారము దినములు గడువక పూర్వమె వారిలో నొకడు గాలివలె గాడుతీయు గుర్రము నెక్కి యుందచందములుగల గులాము వెనువెంట పరుగెత్తుచుండ సవారి చేయుచుండెను.

మృతుడు క్రమ్మరనింటికి నేగుదెంచి
యాస్తినాయది, లెండు పొండనిన నయ్యో!
వారసుల దుఃఖమింతని పలుకగలమె?
యిష్టబంధుల మృతికంటె గష్టతరము.

పూర్వము మా కిరువురికుండిన చనవువలన ఆతని చొక్కాయికొంగు పట్టుకొని యిట్లంటిని

తానుభవింప కొరులకు
దానముసేయకయు బిసిడి ధనమునగరుణా
హీనుడు చేర్చిననిధి మి
త్రా, నిత్యము ననుభవింపు ధన్యాత్ముడవై,

౨౩

దుర్బలుడైన యొక బెస్తవానివలలో బలముగల పెద్దచేప పడెను. దానిని పైకీడ్చుటకు వానికి సత్తువలేకుండెను ఆచేప వానిని తుఁగారించి వలను నీటిలోనికీడ్చుకొని పోయెను.

నీటికొరకు బానిన సెలయేటికరుగ
నేట నీరుబ్బి వెల్లువ నేగనతడు.
ఎన్నిమారులొ వల చేపనీడ్చెగాని
యీ తడవ జేపయడుగున కీడ్చెవలను.

"అటువంటి యరుదైనచేప నీ వలలో పడినది. దానిని నీవు బయటికి లాగలేక పోతివి" అని తోడిజాలరులు అతనిపై విసుగుకొని చీవాట్లుపెట్టిరి.

"ఓ యన్నలారా, నేనేమిచేయగలను? నాకీవేళ దురదృష్టము పట్టినది. దానికింక నొకదినము ఆయుష్యమున్నది." అని యాతడనెను. అదృష్టము లేనిదే 'దిజ్లా' నదియందు జాలరి చేపలు పట్టలేడు. దురదృష్టము నెట్టుకొనిరానిదే చేప గట్టుపై నెగిరిపడి మరణింపదు.

౨౪

కాలుసేతులులేని వాడొకడు వేయికాళ్ల జెర్రిని చంపెను పుణ్యాత్ముడొకడా తట్టునపోవుచుండి యిట్లనియెను: "పరాత్పరుడు కీర్తింపబడుగాక! తనకు వేయికాళ్లుండియు మృత్యువు దాపురించియున్నందున, కాలుసేతులులేని వానికి చిక్కక పరుగెత్తుటకు శక్తి చాలక యుండెను."

ప్రాణములు తీసెడు విరోధి పదము వెంట
బడిన, బరుగెత్త నీయక పాదు ప్రాప్తి
యడుగు లరికట్టు; నరిపైన బడిన యపుడు
గాండివము వంచిననేమి కార్యముండు?

౨౫

విద్యావివేక శూన్యుడొకడు జలతారు పువ్వుల యంగీ దొడుగుకొని, మిసరు మస్లీను తలపాగచుట్టుకొని యరబ్బీ గుఱ్ఱము నెక్కి వచ్చుచుండ నేను చూచితిని. నా ప్రక్కనుండిన యొక మిత్రుడిట్లనియెను: "ఓ సాదీ! విద్యావంతుల కుచితమైన యుడుపులను ఆ పశుప్రాయుడు ధరించుకొని యుండనీ కెట్లగపడుచున్నాడు?"

"వేయి జలతారు అంగీలకంటె కొలదిపాటి సహజ సౌందర్యమే శ్రేష్ఠమని పెద్దలు చెప్పిరి."

అంగి తలగుడ్డ బయటి బెడంగుదప్పు
నతని మానవుడని చెప్ప నలవిగాదు;
ఆస్తిపాస్తులు వెదకిన నందు మనకు
గ్రాహ్య మగునది యాతని రక్తమొకటి!

సత్కులీనుడు తగ్గి యశక్తుడైన
నతని యౌన్నత్యమున కేమి హానిలేదు;
వెండి వాకిటికిం బైడి కొండియున్న
యూదుడు కులీను డౌనని యూహ గొనకు.

౨౬

ఒక దొంగ బిచ్చగానితో నిట్లనియెను: "యవబీజమంత

వెండికై సను కన్నకన్నవారి కాళ్లు కడుపులు పట్టుకొని దేబిరించు టకు నీకు సిగ్గులేదా?"

పావులాబేడ దొంగిలి పట్టువడుచుః
జేయి నరికించుకొను నీదు జీవనంబు
కంటె, వేడంగ, దాతలు కనికరించి
యీయ జేచావు నాస్థితి యెంతొ మేలు.

౨౭

బాహు బలాఢ్యులగు నొకయువకుడు కాలదుర్గతికి చింతిల్లు చుండెను. మిక్కుటమగు ఆకటిచిచ్చువల్లను పేదరికము చేతను ప్రాణములు విసిగి యొకనాడు తండ్రివద్దకు వచ్చెను. తనదుస్థితిని గురించి మొరపెట్టి దేశాటనమునకు అనుమతి వేడుచు ఆతడిట్లని యెను: "నేను యాత్రసేయుటకు నుద్దేశించి యున్నాను. బాహు బల సాహాయ్యమువలన నా కోరికలు నెరవేర్చుకొందును. పెద్దలిట్లు చెప్పియున్నారుగదా:"

కళలు శాస్త్రంబులు మరెట్టి జ్ఞానమైన
అప్రయుక్తంబుగా నున్న వ్యర్థమగును;
అగరు నిప్పున బడకున్న, నరుగ జాద
కున్న గస్తూరి. నెత్తావియుట్టి పడునె?

ఈ మాటలకు తండ్రి యిట్లనియెను: "కుమారా, యీ పిచ్చి తలంపులు నీ మనమునుండి వెడలింపుము. ఉన్నదానితో తనివిచెంది క్షేమముగ బ్రతుకుము. ఏలయన ప్రాజ్ఞులిట్లు చెప్పియుండిరి: "ఐశ్వ ర్యము ప్రయత్న సాధ్యముగాదు. దానిని గురించి పరితాపపడకుండు టయి అందుకు తగిన ప్రతిక్రియ."

పట్టి బలవంతముగ నెట్టివాడుగాని
లక్ష్మి జలతారు పయ్యెద లాగలేడు;
గ్రుడ్డివాని కన్బొమ్మల గుంచెతోడ
శిల్పి మసిరేక దిద్దిన చెలువు గనునె?

నీకు దల వెంట్రుకలయన్ని నేర్పులున్న
కాని కాలాని కేవి యక్కరకు రావు
ఎంత శక్తియుండి యభాగ్యుడేమి సేయు?
బాహుబలము కంటె సదృష్ట బలమె బలము!

ఈ మాటలువిని కుమారుడిట్లనియెను: "నాయనా, యాత్ర వలన ననేకలాభములు సమకూడును. మనస్సునకు సంతోషము హెచ్చును. చిత్రవిచిత్ర సంఘటనముల చూడవచ్చును ఆశ్చర్యకర మగు వార్తలు వినవచ్చును ఉబుసుపోకకు పట్టణములలో విహరించ వచ్చును. ప్రియమిత్రులతో సంభాషించవచ్చును. మట్టుమర్యాదల నేర్చుకొనవచ్చును. ధనమార్జించవచ్చును. క్రొత్తమిత్రుల పరిచ యము చేసికొనవచ్చును. సమకాలీనమైన లోకానుభవము పొంద వచ్చును. మరియు సన్మార్గ ప్రవర్తకులిట్లు చెప్పియున్నారు.

కుదువ పడినయట్లు కదలక నీవింట
నుండ, మానవత్వ మొనరదెపుడు;
దేశ దేశములను దిరిగి వేడుకచూడు,
పుడమి వీడినివు పోకమున్నె.

ఈ మాటలకు తండ్రి యిట్లనియెను: "కుమారా, నీవు చెప్పి నట్లుగనే యాత్రవలన ననేకలాభములు చేకూరును. అయినను అది మైదువర్గముల మనుష్యులకే సౌఖ్యప్రదముగ నుండును. మొదటివాడు వర్తకుడు. అతడు భాగ్యవంతుడు. శక్తిమంతుడు. దాసదాసీజనము, జాగరూకులగు సేవకులు అతని కాచుకొని యుం

దురు. దినమునకొక పట్టణము, రాత్రికొక విడిది. గడియకొక వినోదస్థానము, క్షణమునకొక సంతోషము చొప్పున వణిజుడు యాత్రా సౌఖ్యము ననుభవించును.

భాగ్యవంతునకు నెడారి బయుల, వసుల,
గొండ కోనల నెందునే కొదువలేదు;
ఎచట విడియు, గుడారంబు లచట వేచు;
నఖిల లోకంబు లాబన నవతరించు.

కాంక్ష లీడేర్చుకొన చిల్లిగవ్వ లేక
యుత్త చేతుల నిరుపేద యోగ్యు డయ్యు
వాడెవండని యడుగరు తోడిజనులు;
అతడు స్వస్థానమందైన నన్యుడగును.

రెండవవాడు పండితుడు. మధురమైన వక్తృత్వము అనర్గళమైన వాక్చాతుర్యము విజ్ఞానసంపన్నత కలిగియుండు కతన పండితుడు ఎచ్చటికి పోయినను లోకులాతని నాదరించి మర్యాదచూపుచుందురు.

శాస్త్రి పాండితి బంగారు నవర యట్టు
లెచటజూచిన దన్మూల్య మెరుకపడును;
అక్షరాస్యుడుగాని ధనాఢ్యసుతుడు
తొలునాణెంబు; పరభూమిగేల గొనరు.

మూడవవాడు సౌందర్యవంతుడు. రూపవంతుని జూచినపుడు పుణ్యాత్ములును వానితో కలసిమెలసి యుండగోరుదురు. "అపరిమిత ధనముకంటె పరిమితమయ్యు సౌందర్యము మేలు." అని పెద్దలుచెప్పిరి. రమణీయ వదనము సంతప్త హృదయులకు జీవనౌషధము వంటిదనియు, మూయబడియున్న తలుపులు తెరచుటకు కుంచె

కోలవంటిదనియు పెద్దలు చెప్పిరి. వేయేల, ఆతని సాంగత్యమబ్బుట మహాభాగ్యమని తలపోసి లోకులు వానిని కన్నుల నద్దికొందురు.

తల్లిదండ్రులు చీకొట్టి యిల్లు వెడల
గొట్టి నను నందగానికే కొరతలేదు;
ప్రేమ గౌరవములు చూపి ప్రియుని పోల్కి
నాత డెచ్చోటి కేగిన నాదరించ్రెను.

నెమిలియీక 'ఖురాను' లో నేను గాంచి
యిట్టులంటిని: "తగదు నీకిట్టి పదవి"
'మాటలాడకు, సౌందర్య మహిమదనర
నెటకు బోయిన జేయూత కేమిలోటు?

మోహనుండు మంచిముత్యమౌ; అదిగుచ్చి
గర్భమందెయుండ. గనదుశోభ;
ఆణిముత్యమైన నత్యంత మూల్యంబు
నిచ్చి కొందు రెవ్వరేని సంత.

నాలుగవవాడు గాయకుడు. ఆతని మధురగానము దావీదు చిత్రకోకిలి పాటవలె హృదయరంజకమయి ఎగురు పక్షిని పారు నీటిని అడ్డగించును. ఆతడు సంగీత కళానైపుణ్యము వలన శ్రోతల చిత్తమును హరించును. దైవభక్తులును వానితోడ కూర్చుండి వివిధ పరిచర్యలు సలుపుటకు నిచ్ఛగింతురు.

ప్రత్యూషంబున గై పెక్కు దావీదుసఖుల
చెవుల కమృతంపు టూట రుచించుపాట!
నాణెమగు మోముకంటె గానంబు మేలు;
దాన గామంబు, దీననాత్మకు సుఖంబు..

అయిదవవాడు పనిపాటు సేయువాడు. అతడు తనచేతుల కష్టముతో అన్నము సంపాదించుకొనును. తాను ఆత్మగౌరవమును బలియిచ్చి కడుపు నింపుకొనవలసిన యవసరముండదు. పెద్దలిట్లు చెప్పియున్నారు.

సొచికుండన్య దేశమున చనిన జేత
గాసులేకున్న దిండికి గానిపడదు;
రాజ్య విప్లవమైన బద భ్రష్టుడైన,
రొట్టెముక్క దొరకక సమ్రాజు చచ్చు.

కుమారా, నేనిప్పుడు వివరించిన గుణములు యాత్రేయుని మనస్సునకు శాంతి చేకూర్చును. సంతోషమునకు తావలమగును. వీనిలో నొక్క గుణమైన లేనివాడు పిచ్చితలంపులు పెట్టుకొని పరదేశమేగునేని వాని ఊరూ పేరు విచారించువారుండరు.

కాలచక్రము వ్యతిరేకగతి భ్రమింప
గలసి రాకుండు ననుకూల కార్యమేని;
క్రమ్మర కులాయమునుగాంచు ప్రాప్తిలేక
పావురము ధాన్యలుబ్ధమై వలను జిక్కు.

అంతట కుమారు డిట్లనియెను. "తండ్రీ, పండితుల వాక్యములకు నే నెట్లు విరుద్ధముగ ప్రవర్తింపగలను? వారిట్లు చెప్పిరి."

"మన దినబత్తెము దైవ నిర్ణీతమయ్యెను దాని నార్జింప వలసిన భారము మనపై నున్నది. మన మనుభవించు కష్టములు విధి కృతములయ్యెను వాని యెడ జాగరూకులమై యుండుట ఆవశ్యకము."

మన తలపులేక తిండి సంప్రాప్తమయ్యె
నార్జనముసేయ దెలివికి నర్థమగును;
వ్రాత దిరుగనిదే చావురాదటంచు
బాముసోటను జెయివెట్ట బాడియగునె?

నేనిప్పుడుండు స్థితిలో మదగజము తోడనైన పోరాడ గలను. భయంకరమగు సింహముతో పెనగులాడగలను. కావున నాయనా, యాత్రచేయుటయే నాకు హితమని తోచుచున్నది. యిక మీద పేదరికము నోర్చుకొనుటకు నాకు శక్తిలేదు.

పరువును ప్రతిష్ఠ దొలగినవానికింక
భరమగునదేది? జగమెల్లవానియిల్లె!
ప్రొద్దుగ్రుంకిన నింటికిబోవు ధనికు,
డెచట నిసియౌనదరిబేసి కపటి విడిచి.

యిట్లు చెప్పి జనకుని యాశీర్వాదము వడసి సెలవు పుచ్చుకొని పయనించుచు యువకు డీట్లు వచించెను:

కాల మెదురు దిరిగి కాంక్ష లీడేరక
పోవునేని, నేర్పు పాగుపాయు
ఎవరునాని తన్ను నెరుగని పరదేశ
మందు బ్రతుక నెంచి యుచటికేగు

ఆతడట్లు నడచి నడచి సముద్రతీరము చేరెను. తరంగ తాడితములై గండ శిలలు ఒకదానిపై నొకటి పడియుండెను. సముద్ర ఘోష మూడు మైళ్ళవరకు వినబడుచుండెను.

అనిల సంక్షుబ్ధ వార్ధి భయంకరోర్మి
మాలికా డోలికల నీటి కోళులైన
క్షేమముగ నిల్వవే; ఒక్క చిన్న యలదొ
వెలికి గానుగ రాతిని విసర గలదు.

పడవ రేవుకడ మూగియుండిన యాత్రికుల సమూహమును యువకుడు చూచెను. అందు నొక రొక్కరును మూటా ముల్లెకట్టుకొని కేవిచ్చి పడవలో నెక్కి కూర్చుండిరి. పడవ కూలియిచ్చుటకు

వానియొద్ద పైసా యైన లేక వారి నెంత బతిమాలుకొన్నను కని కరము చూపకుండిరి. కఠినాత్ముడగు నొక నావికుడు మొగము చిట్లించుకొని యిట్లనియెను:

"ధనము లేకున్న మమ్ము బలవంత పెట్టలేవు. ధనముండిన బలిమితో నావశ్యకముండదు."

ధనము లేకున్న బాదోధి దాటలేవు
బాహు బలమెంత యుండినబైత్యకాడ,
పదుగురి బలంబు మాపద్ద బయట పెట్ట
నేమికార్య! మొక్కనికేవు నిచ్చుకొమ్ము.

నావికుని మాటలు యువకుని చెవులలో ములుకులై గ్రుచ్చు కొని వానిపై కసి దీర్చుకొన దలచెను గాని యంతలో పడవ కొంత దూరమేగెను. "నేను తొడుగుకొనియున్న చొక్కాను కేవుకు బదులు నీవు తీసుకొని తృప్తి పడుదువేని యిచ్చుటకు నాకేమి యభ్యంతరము లేదు. "అని యువకుడు బిగ్గరగ నరచి చెప్పెను. ఆ మాటలు విని నావికుడు చొక్కాపైని యాసతో పడవను వెను కకు మరలించి గట్టు చేరెను.

అత్యాశనిర్లిప్తుడు నంఘునిజేయు
బులుగులం జేపల వలలజిక్కించు.

నావికుని మెడపట్టయు గడ్డపు పీచులును చేతికందగనే ముందుకులాగి మెడకరచుకొని క్రింద పడద్రోసి నిర్దయముగ యువకు డతని మర్దించెను. దీనిని జూచుచుండిన నావికుని స్నేహితుడొకడు తోడ్పడుటకుగా పడవదిగివచ్చి యువకుని నెదుర్కొనెను. వానికిని నావికుని కైనంత మర్యాద జరిగినది. అతడు వెనుకకు మరలి కాలికి

బుద్ధి చెప్పెను. ఇట్టి బలవంతునితో రాజీ చేసుకొని కేవ్వు నడుగ కుండుటయే యుచితమని పడవవాండ్రు కలబలుకుకొనిరి.

తగవురానున్న దొనకక తాల్మిగొనుము;
బొత్తిగవివాదములమాన్పు మెత్తదనము;
మంచిమాటలనెయ్యాన మదగజంబు
నైనవెం(ట్రుకతో గట్టనలవియౌను.

తిట్టుకయ్యముగల్గ తియ్యగాపలుకు;
పచ్చిపట్టునుగొను బాకుతరంబె ?

నావికులు యువకుని పాదములపై బడి మన్నన వేడుకొని తెచ్చికోలు వలపుచూపి మొగమునను కన్నులపైని ముద్దులు గురిపించి యాతని పడవలో కూర్చుండబెట్టుకొని ప్రయాణము సాగించిరి.

కొంత దూరము పోయి నీటిలో పాడుపడియుండిన యూనాను సౌధ స్తంభము ప్రక్కన పడవ నిలిపి నావికు డిట్లు చెప్పెను: "పడవ అపాయకర స్థితిలో నున్నది. మనలో బాహు బలాఢ్యుడు ఎవ్వడైనను ఆ స్తంభ మెక్కి మోకును దానికి ఉచ్చు వేసిన మనము పడవను రక్షించుకొనవచ్చును." యీ మాటలు విని బాహుబల గర్వితుడగు నాయువకుడు పరాజితుల ప్రతీకారము నైన తలంపక, "నీవు మొట్ట మొదట దుఃఖపెట్టినవానిని అంతరాత్మ నూరుమారులు సంతోషపెట్టినను వాని ప్రతీకారము నెడ జాగరూకుడవై యుండుము. హృదయమునుండి బల్లెమును పెరికివేసినను గాయము పచ్చిగనే యుండును" ఒక సేనాధిపతి సైనికులతో నిట్లు చెప్పెను:

"పరసైనికుల గాయ పడజేతురేని
మరచిపోకుడు వారి మతిరాజు కసిని
యితరుల హృదయంబు నీవు నొప్పింప
హదనుకైవేచి నిన్నట్లె నొప్పింత్రు;
కోటకుప్పెను రాత గొట్టెదవేని
కొట్టెదవరొకరాయి కోటపైనుండి."

అను నిట్టి పెద్దలవాక్యములను సడ్డచేయక ఆ యువకుడు మోకును చేతికి తగిలించుకొని స్తంభము పైకెక్కెను. తక్షణమె నావికుడు వాని చేతిలోనుండిన త్రాటిని లాగుకొని పడవను వేగముగ కదలించెను.

యీ మోసమున కాతడు వెఱగందిచూచి యేమి చేయునది లేక రెండు దినములా స్తంభముపై గాసిపడి యలసి సొలసి మూడవనాడు నిదుర తబ్బిబ్బున నీటిలో పడెను. తరువాత నొక రాత్రియు నొక పగలును ఈది యీది యెట్లో యాపద తప్పించుకొని కొన యూపిరితో నొడ్డునబడెను. ఆకటి మంట తీర్చుకొనుటకు ఆకలములు వేరు వెల్లంతులు తిని కొంత సేద దేరి నడువ శక్తిగలిగిన వెంటనే యా మందభాగ్యుడు ఎడారి దారి పట్టెను.

కొంతసేపటికి ఎండ తాపమునకు దప్పి హెచ్చి కాలు మెదల్ప దిఃఖప్పులేక సమీపమున పథిక సమూహమును గాంచి యచ్చటికేగెను. ఆచోట నొక బావి యుండెను, బాటసారు లొక్కొక్కరును సొంతగానికి నొక్కొక్క రూకయిచ్చి పర్చెతుకంటె ప్రియముగా నొక గిన్నెడు మంచినీటిని త్రాగుచుండిరి. యీ యువకుని చేత కాసైన లేదు. ఆతడెంత బతిమాలి భంగపడినను ఎవ్వరును కనికరింపకుండిరి. అంతట దౌర్జన్యము వహించి కొందర క్రింద పడమొత్తెను. పథికులందరు నొక కట్టుగట్టి యాతని నిర్దయముగ మర్దించి గాయపరచిరి.

లావు పొడుగెత్తు కండబలంబుగలుగు
కరిని జోరీగలొకటైన గాసిపెట్టు
భీకరమృగెంద్రు చర్మంబు బిప్పిసేయు

ఆయువకుడు కొంతసేపువర కక్లే చూర్చుండి యక్కరనుబట్టి వర్తకుల బిడారు వెంటబడి పోవుచుండెను. రాత్రియగునప్పటికి

దొంగల యలజడి మిక్కుటముగనుండు నొక మజిలీ చేరిరి. సార్థవాహులకు గోడలు దడపుట్టెను. ప్రతిక్షణము మరణము నిరీక్షించుచుండిరి. ఈ సంగతి తెలిసికొని "మీరు భయపడకుడు. మీమధ్య నే నొకడనే యేబదిమంది మనుష్యులకు జవాబు చెప్పగలను. మీలోని తక్కిన బలవంతులు నాకు తోడ్పడగలరు," అని యువకుడు వారికి ధైర్యము చెప్పెను.

వర్తకు లాతని ప్రగల్భములకు మనసు కుదుటపడి యతని సహవాసమునకు సంతోషించి అన్న పానీయముల నొసగుట యావశ్యకమని తలచిరి. యువకుని యాకటిమంట చెలరేగినది; ఓర్చుకొను శక్తి సన్నగిల్లినది. యాకలిదీర కొన్ని బొక్కలు బొక్కి పయింబయి నీరు ద్రావి కడుపులోని దయ్యమును శాంతింప జేసెను. కడుపు నిండినంతనే నిద్దుర పైకొనెను.

వర్తకులలో ననుభవజ్ఞుడగు నొక వృద్ధుడుండెను. అతడు వారితో నిట్లనియెను: "దొంగల భయముకంటె మీ సహవాసగాని భయమె నాకు మిక్కుటముగ నున్నది. అదెట్లన, ఒక బీదవాడెట్లో కొంత ద్రవ్యము సంపాదించెను. అతనికి లూఠియార్ దొంగల భయముచే రాత్రులు నిద్రపట్టకుండెను. యెంతెసపాటునకు భయపడి తనకు తోడుగానుండుటకు నొక స్నేహితుని పిలిచెను. కొన్ని రాత్రులు వాడు అతనికి తోడుగా పండుకొనెను ఇట్లు కొంత కాలము జరిగిన వెనుక బీదవాడు డబ్బు దాచియుంచిన చోటు తెలిసికొని యా స్నేహితుడు దానిని దొంగలించి ఖర్చు పెట్టుకొని యెచ్చటికో పయనించెను.

ప్రొద్దున లేచి చూచుకొని యా బీదవాడు లబో దెబోయని కొట్టుకొనుచుండ నొకడు విని, "యెందుకట్లు దుఃఖించుచున్నావు?

నీ ధనమును దొంగలెవరైన దోచుకొనిరా” యని యడిగెను. “అయ్యో దేవుడా! దొంగలుకారు, నా స్నేహితుడే దొంగలించుకొని పోయెను,” అని చెప్పెను.

చెలిమికాని స్వభావంబు దెలియునంత
వరకు నొకకంట గనిపెట్టవలయు వాని;
చెలిమినెపమునదగ్గర జెరికరచు
శత్రువులపంటిగాటులు చాలచురుకు.

ఈతడు దొంగల గుంపులోనివాడు కావచ్చును. నిజము నెవ రెరుంగుదురు? కపట వేషముతో మన మధ్య ప్రవేశించి యంతు పొంతు లరసి యొళవెరింగి సరియదును వేచి వీడు తన సహచరులకు తెలుపవచ్చును. కావున నిద్రపోవుచున్న వీనిని వదలిపెట్టి మూటా ముల్లెలు కట్టుకొని మనము పయనించుటయే యుచితమని నాకు తోచుచున్నది ” వృద్ధుని యీ హితబోధ తక్కిన వారందరు నంగీకరించిరి. యువకుని బాహుబలమునకు వారందరు వెరపుగొని సామాను కదలించుకొని నిదురించుచున్న యాతని విడిచిపెట్టి పోయిరి.

ఆతడు నిద్రలేచు నప్పటికి సూర్యుడు పడిమింట నుండెను. తలయెత్తిచూడ వణిజుల బిడారు లేచిపోయియుండెను ఈమరదృష్ట వంతుడు ఎడారిలో తిరిగి తిరిగి సరిదారి గానక యాకలి దప్పులచే తపించి చావునకు సిద్ధమయి మోమునిసుకపై మోపి యిట్లనియెను: “ఒంటెలు కదలి పోయినవి నాతోడ నెవ్వరు సంభాషింతురు? అన్యునకు నన్యుడు తప్ప స్నేహితులు మరెవ్వరును లేరు. పలుమారు పయనించి యాత్రలోని కష్టసుఖము లెరుగనివాడు పరులను కష్టపెట్టును.” యీ నిర్భాగ్యు డిట్లు పలుకుచుండగా పాదుషా కుమారుడొకడు వేటతమకమున అనుచరులను దూరమున వీడి,

యీ మార్గమున పోవుచుండి. వాని తల తట్టు నిలిచి, యీమాటలు విని, వానిని నిదానించి చూచెను.

రూప సౌష్ఠవ మున్నను ప్రస్తుత స్థితి శోచనీయముగనుండుట యెరిగి, "ఎచ్చటనుండి వచ్చితివి?" ఈ స్థలమున కెట్లు జేరితివి. అని రాజకుమారుడు ప్రశ్నించెను. తనకు సంప్రాప్తమైన కష్టములను యువకుడు సంక్షేపముగ విన్నవించెను. ఆతని దుస్థితికి జాలిగొని ద్రవ్యమును అంగీని యిచ్చి నమ్మకమైన బంటును దారి తోడిచ్చి యువకుని స్వస్థానమునకు సాగనంపెను.

కుమారుడు క్షేమముగ తిరిగి వచ్చినందుకు తండ్రి సంతోషించి దేవునికి వందనము లర్పించెను. రాత్రి భోజనా నంతరము యువకుడు పడవ వృత్తాంతము. నావికుల దౌర్జన్యము, శావిదగ్గర కాటసారుల దుడుకుదనము, వర్తకుల మోసము. మరియు యాత్ర యందు తనకు సంభవించిన కష్ట పరంపరలను తండ్రితో పూస గ్రుచ్చినటుల వివరించెను. అంతట తండ్రి యిట్లనియెను: "కుమారా నీవు ఇల్లు వెడలి నప్పుడు ధనహీనుని ముంజేయి శౌర్యవంతమయ్యు, నిగళబద్ధమయియు, సింహముష్టి పొసగియున్నను అది భగ్నముగు ననియు నీతో చెప్పి యుండలేదా? యేబది మనుగుల బలమునకంటె నొక యువమెత్తు బంగారమే మేల"ని రిక్తహస్తుడగు సిపాయి చెప్పెను. యీ మాటలకు కుమారు డిట్లనియెను: "నాయనా, యెట్లయినను కష్టపడకున్న, ఆపదలకగ్గము కాకున్న విరోధుల జయింప నేరవు. ధాన్యము చల్లకుండిన పంట లభింపదు. కొంచెము దుఃఖమునకు ప్రతిఫలముగ నే నెంత సంతోషము నార్జించినదియు, తేనె టీగ కాటున కోర్చుకొన్నందుకు ఎంత తేనెను సేకరించినదియు నీవు చూడలేదా?

అన్నమీశ్వర నిర్ణీతమయ్యె, గడన
యందు నలసులమైయుంట న్యాయమగునె?
చోరచేపరంపవు వెరగూరునేని
ధీవరుడు ముత్యముల నెట్లుదేగలండు?

తిరుగలి క్రిందిరాయి తిరుగక యున్నందుకు మిక్కుటమైన భారము మోయుచున్నది.

గుహనుబడియున్న సింహము కుడుచుటెట్లు?
రెక్కలొలిచినడేగ యేదిక్కు కెగురు?
ఇంటగూర్చుండి వేటాడనెంతువేని
కాలుసేతులు సొలిడుకాళ్ళలగును.

ఈ మాటలకు తండ్రి యిట్లనియె: "ఈ పట్టున దైవము నీకు ననుకూల పడినది. నీ యదృష్ట వశమున రాజకుమారుడు సీ వద్దకు వచ్చుట తటస్థించి నీ మంచి సెబ్బరలు విచారించి కరుణించెను. ఎల్లకాల మదే విధముగ సంఘటింపదు. కావున నిట్టి విచిత్ర సంఘటనలపై నాధారపడి యుండకుము.

అనువిసము వేటకానికి
పసమున జంబుకమునేయవచ్చునె? యెపుడో
కనిపెట్టి చిరుతపులి యా
తని వెక్కనుజీల్చి నల్ల్రగావగవచ్చున్

సందర్భోచితముగనున్న యీ కథను వినుము: పారసీక ప్రభువునకు అమూల్య రత్నము పొదుగబడియున్న యొక యుంగర

ముండెను. ఆయన యొకనాడు వినోదార్థముగ కొందరు యాస్థానికులతో షీరాజు పట్టణ ప్రాంతమునను న్న 'ముసల్ల' యను పట్టణమునకు పోయెను. తన వ్రేలి యుంగరము తీసి 'అజుద్' గోపురముపై నిలబెట్టించి, యుంగరముగుండ దూరిపోవునట్లు ఎవడు బాణము విడచునో వాడీ యుంగరము తీసికొనవచ్చునని చాటింప జేసెను.

రాజ దళములో నుండిన నన్నూరుమంది గడిదేరిన విలుకాండ్రు గురిపెట్టి తప్పగొట్టిరి. యొక మేడపై నాడుకొనుచుండిన బాలుడు ఆటకాయ తనమున నుద్దేశ రహితగ బాణమును వదలెను. అనుకూలముగ వీచుచున్న ప్రాతర్వాయువు ఆ బాణము వుంగరములో దూరునట్లు విసరెను. ఆ బాలునకు నుంగరము ధనము అంగీయు నాదరణ పూర్వకముగ బహూకరింపబడెను.

అంతట నా బాలుడు వింటిని అంబును కాల్చివేసెనని చెప్పుకొనిరి. "ఇట్లేల చేసితివి"? అని వాని నడుగగా, "మొదటికీర్తి శాశ్వతముగ నుండుటకు" అని యాతడు చెప్పెను.

ఒక్కొకప్పుడు ప్రతిభానముబ్బలుండు
పలుకు హితము కృతార్థత పడయకుండు;
అజ్ఞుడగు బాలకుడు వేసినట్టి యంబు
తప్పదారి లక్ష్యంబును దాకునెపుడు.

౨౧

బాహ్య ప్రపంచ సంబంధము వదలుకొని కొండగుహలో వసించుచు కాలము గడపు దరిబేశినిగురించి నేను వినియుంటిని.

పాదుషాలును, భాగ్యవంతులును ఆతని కంటికి తృణప్రాయులుగ నగపడుచుండిరి.

యాచకంబున కొడిగట్టు నతడు చచ్చు
వగకు దిండికి చేజాపవలసివచ్చు;
ఆశవీడి నృపాలత్వ మందుమోయి,
తృప్తిపరుకంత మున్నతస్థితివహించు.

ఆ ప్రాంతపు పాదుషా ఆ సన్యాసిని దర్శించి యిట్లు విన్న వించెను: "మీ దయార్ద్రమగు మానవ స్వభావముపై నాధారపడి. మా యింట నొకపూట మా కున్న యుప్పపులుసు రుచి చూడ వలయునని ప్రార్థించుచున్నాను." మహమ్మద్ ప్రవక్త యాచార మునకు నిట్టి యాహ్వానము అనుకూలము కావున ఆయన యంగీక రించెను. మరునాడు. తా నొసంగిన శ్రమకు మన్నన వేడుటకుగా పాదుషా సన్యాసిని దర్శింప వచ్చినపుడు ఆయన యెదురుకోలొసగి కౌగలించుకొని యాదరించి సన్మానించెను. పాదుషా పోయిన వెనుక యచ్చటనున్న వారిలో నొకడు ఇట్లడిగెను:

"యీ వేళ పాదుషాకు మీరు చూపిన దయ మీ యభ్యాస మునకు వ్యతిరిక్తముగ నున్నది. ఇట్టిది మరి యెప్పుడును నేను చూచి యెరుగను." అందుకు షేకు ఇట్లనియెను: "ఒక పుణ్యా త్ముడు సెలవిచ్చిన సూక్తిని నీవు వినలేదా!

పెంచిపెద్దజేసి ప్రియముగా దినబెట్టి
నతడు; మరలనీకు నతిథియైన,
ఎదురుకోలొసంగి యెదమెచ్చ బరిచర్య
నలుపు; మదియు బ్రాజ్ఞసమ్మతంబు.

ప్రాణముండినదాక వేణువీణా గతి
        విననీకచెవుల లోగొనగవచ్చు;
ఉద్యానవనదర్శనోత్సాహ మడుల
        కలరనీయక యాజ్ఞ నిలుపపచ్చు;
ముద్దుగులాబీల మూర్కొననీయక
        ఘ్రాణేంద్రియంబును గట్టపచ్చు;
పట్టుమంచము దిండుపరుపులు లేకున్న
        బండపైదలమోపి పండవచ్చు;

పడుకతోడుగ బాబోణి బడయకున్న
జేతు లెదగట్టుకొని నిద్రచెందవచ్చు;
గాని కొరగాని యీపాడు కడుపునెపుడు
అదనుకేదైనవేయక యణచలేము.

గులాబితోటలోని
తృతీయాధ్యాయము

సంపూర్ణము.

గులాబితోట

చతుర్థాధ్యాయము

మౌనమువలని లాభములు

౧

''మిత భాషిత్వమే నాకు సమ్మతముగ నుండెను. యేలయన, చాల సమయములందు మనము మాటాడునప్పుడు మంచి మాటలును చెడ్డమాటలును దొరలుచుండును. విరోధులదృష్టి చెడ్డమాటలపై దప్ప వేరొంటిపైకి ప్రసరించదు, అని నేనొక స్నేహితునితో చెప్పితిని. అత డిట్లనియెను. ''సోదరుడా, నీయందు మంచితనమును చూడని విరోధియే మేలైనవాడు.''

ఎపుడు వైరుధ్య కలుషిత దృష్టిజూడ
నొప్పులునుదోచు కొండంత తప్పులట్లు;
విరియు పన్నీరుపువ్వైన వినుముసోది
కంటకంబుగ వైరికి గానబడును.

మసనంబుగాంతితో బూరించు రవిని
అఘమాకృతిగ నెంచు సంఘమూకము.

౨

ఒక వర్తకునకు వేయి దీనారములు నష్టమువచ్చెను. ''ఈసంగతి యెవ్వనితో చెప్పవద్దు'' అని అతడు కుమారునికి చెప్పెను. ''నాయనా. నీ వాజ్ఞ పెట్టినందువలన నేనెవ్వరితో చెప్పను. అయినను ఈ రహస్యమును దాచియుంచుటవలన ఏమి లాభము గలుగునో దానిని నాకు తెలియ జెప్పుము'' అని కుమారుడడిగెను.

''మన కష్టము రెండింతలు కాకుండుటయే లాభము. ఒకటి: ధన నష్టము. రెండు: మన దురదృష్టమునుగూర్చి యిరుగు పొరుగు వారు సంతోషించుట,''యని తండ్రి చెప్పెను.

3

ప్రత్యర్థితోనీవు భాషింపబోకు
మాత్మదుఃఖము ; నాతడానందమొందు

తెలివితేటలుగల యొక యువకుడు కళలయందును శాస్త్రములందును ఎక్కుడు పరివేశము అభిరుచియు గలిగియుండెను. కాని యాతడు కొంచెము పిరికి గుండె కలవాడు. పండిత సభలలో కూర్చుండునేగాని నోరెత్తి మాటాడడు. ఒకనాడు తండ్రి యాతనితో నిట్లనియెను: "కుమారా, నీవుకూడా నీకు తెలిసిన దానిని గురించి యుపన్యసింపుము."

"వారు నాకు తెలియనిదానిని గురించి ప్రశ్నింతు రేని సిగ్గుపడవలసివచ్చునని నాకు భయము కలుగుచున్నది,"యని యువకుడు బదులు చెప్పెను.

చెప్పుమడిమకు భక్తుండు చిలగొట్టు
చుండ. నదిగాంచి వైనికుం'డేయు, నాడు
గుర్రమునకులాడంబు గొట్టరమ్ము
కదలు'మని కొంగులాగిన కథనువినవె?

మౌనము వహింపనీతో
నే సరునకుగాని యుండదేకార్యంబుం;
గాని, వచింపదలంచిన
దాని బ్రమాణీకరించి గతజెప్పవలెణ.

౪

ఒకానొక యోగ్యుడగు పండితునకును నిరీశ్వరవాదికిని వివాదము తటస్థించినది. పండితుడు వాద ప్రతివాదములందు అతనితో

నెగ్గలేక డాలూ డవాలు విసరికొట్టి వెడలిపోయెను. "మీకింత శిక్షణము శాస్త్రపాండిత్యమున్నను ఆ మతహీనుని వాదమునందు ప్రతిఘటించి జయింపలేక పోయితిరిగదా." యని యొకడా పండితుని నడిగెను. "నా పాండిత్యము, ఖురాను, పురాణములు, తమ గురువుల (శ్రీ) సూక్తులకు సంబంధించినది. కాని యా మతహీనునకు ప్రమాణబుద్ధి లేదు. వానిని వినడు. అందువలన వాని మతవిరుద్ధ ప్రసంగము వినుటవలన నాకేమి ప్రయోజనము కలదు?" అని యా పండితుడు చెప్పెను.

ఎవడు 'ఖురాను' ప్రమాణము
నవివేకతనమ్మకుండు నతనికి భక్తుం
డెవడును ప్రత్యుత్తర మి
య్యవల; దదేతగుజవాబటంచు దలపుమి.

బుద్ధిహీనుడొకడు పండితుని మెడ పట్ట పట్టుకొని లాగుచు నవమాన పరచుచుండుట జాలీనూన్ జూచి యిట్లనియెను: "ఈతడు ప్రాజ్ఞుడే యైనయెడల, ఏమియు తెలియని మూర్ఖుని చేతిలో నిట్టి స్థితికి పాల్పడడు."

ఇరువురు ప్రాజ్ఞులెప్డు కలహింపరు; మూర్ఖునితోడ జివ్వకుం
ద్వరపడిపోడు పండితుడు; వాడొకవేళ ఖలస్వభావుడై
పరుషములాడినన్ సహనభావముతో మృదులోక్తులన్ మనో
హరముగ బల్కు వానిహృదయంబున గోపమునన్నగిల్లగన్.

నిరతంబు వాదులాడెడు
నిరువురుసజ్జనుల నొక్క యొరకను గట్టం
దరమగు; వారిరువురు ము
ష్కరులైనను గొలునులేని చాలవుపట్టః.

ఒక సజ్జనుని నొక దుర్జనుడు దూషించెను. అతడు ఆ మాట లకు కోపపడక యోర్పు వహించి యిట్లనియెను: "ఓయీ, నీ వన్న దానికన్నను నేను చెడ్డవాడను. నే నిదివరకెఱుగని నా తప్పులను నే నిప్పుడు తెలిసికొంటిని.

౬

సుహాబాన్‌వాయిల్ అను పండితుడు వక్తృత్వమున అప్రతి మానుడని పేరుపొందెను. మేలయున, నొకసభయందు సంవత్సర ముపన్యసించినను చెప్పినమాట మరలచెప్పడు. ఒకవేళ చెప్పవలసి వచ్చిన ఆమాటను వేరర్థమున నుపయోగించును. రాజాస్థానమున నుండు సచివుల కుండవలసిన గుణములలో నిదియొకటి.

మధురమైనను హృదయంగ మంబునైన
చిత్రమైనను విశ్వాసపాత్రమైన
ప్రమదమొనగదు పునరుక్త భాషణంబు;
తియ్య హల్వాను నొకసారి తిన్నజాలు.

౭

ఒక పండితుడిట్లు చెప్పుచుండ నేనువింటిని: "ఒకడు మాటాడుచుండగా ఆ సంభాషణము పూర్తికాక పూర్వమె మధ్యలో మాటాడువాడు తప్ప తన యజ్ఞానమును బుజువు చేసి కొనువాడు మరియొకడుండడు.

ఓయి, సంభాషణంబున కుండుమొదలు
తుదయు, మధ్యలోమాటాడ దుడుకుపడకు
విశ్రుత వివేకచిత్తులౌ విజ్ఞులౌరులు
పలికి నిలిపినయంచాక పలుకరెపుడు.

౮

మహామూదు నౌకరులలో కొందరు, "ఫలాని విషయమును గురించి సుల్తానువారు మీతో నేమిచెప్పిరి?" అని హాసన్ మైమందీని అడిగిరి. "ఆ విషయము మీకుగూడా తెలిసియుండవచ్చును" అని యాయన చెప్పెను.

"మీతో నేవిషయములు చెప్పదురో యట్టివిషయములు మాబోటివారితో సుల్తానువారు చెప్పరు." అని వారనిరి

"నే నితరులతో చెప్పనను నమ్మకముచేతనే సుల్తానువారు నాతో చెప్పిరి. అట్లగుట మీ రేలనన్ను ప్రశ్నించెదరు?" అని అయన యడిగెను.

తెలిసినంతమాత్ర బలుకడు ప్రాజ్ఞుండు
పరులతోడ నెట్టి వార్తలైన,
ప్రభురహస్యములను బయలుపెట్టుచు తల
నాధివెట్టి జూదమాడినట్లు.

౯

ఒక యిల్లుకొనదలచి వెల తీర్మానము చేసికొనుటలో ముందు వెనుకలాడుచుంటిని. యొక యూదు డిట్లుచెప్పెను: "ఈ యింటిని కొనుము. నే నీప్రదేశమున ప్రాత కాపును. ఈ యింటి మంచిచెబ్బ

రలు నన్నడుగుడు. ఇది చాల మంచియిల్లు. ఏ లోపమును లేదు."

"నీవు నాకు నిరుగు పొరుగుల నుండువను లోపముతప్ప మరియొకటి యుండదు, అని నేనంటిని.

ఈవుపొరుగున నుండిన యింటివిలువ
తగ్గు బదిదేరములదాక, తథ్యమిదియు;
అనపడియెద నీమ్రుతియైనపిదప
వేయివరకైనహెచ్చును విలువయనుచు.

౧౦

ఒక కవీశ్వరుడు దొంగల నాయకునియొద్దకు పోయి పద్యము చెప్పి ప్రస్తుతించెను. అంతట నాయకుడు, "ఈ కవి యొగీని ఒలుచుకొని యూరు దాటగొట్టుడు" అని దొంగల కాజ్ఞాపించెను.

పాపమా దరిద్రుడు విగత వస్త్రుడయి చలిలో వడకుచు పోవుచుండ కుక్కలు వాని వెనువెంట తగులొకనెను. కుక్కల నదలించుటకు రాతికై వెదకెను. కాని భూమిపై నంతయు మంచు పేరుకొని యుండెను. ఏమియుం దోచక దిక్కులేని వాడయి కవి యిట్లనియెను. "అక్కా, మీరు యెటువంటి దొంగలురా! కుక్కలను వదలిపెట్టి రాళ్ళను కట్టివేసిరి."

దొంగల నాయకుడు కిటికీగుండ అతని చూచి యా మాటలకు నవ్వి యిట్లనియెను: "ఓయీ కవీ, నావద్ద నీ కేమైన కావలసి యున్న కోరుకొనుము."

"మహాప్రభూ, నాకు కానుక యియ్యదలతురేని నా చొక్కాయి నాకు పారవేయుంచుడు" అని కవి మొరపెట్టెను.

పరులనుండి ధనము బడయంగవాంఛింతు
రర్థిజనులు; నాకునాశలేదు
నీధనంబుపైని; నిష్ఠురకష్టంబు
పెట్టిపంపకుంట పెద్దకాన్క.

ఈ మాటలువిని దొంగల నాయకునికి కవిపై జాలి గలిగి యాతని చొక్కాను మరల నిప్పించి దానితోడ ఉన్ని చొక్కాయిని కొన్ని దేరములను కానుకగా నిచ్చెను.

౧౧

జోస్యుడు తన యింట ప్రవేశించు నప్పటికి తన భార్యయొద్ద పరాయి వాడొకడు కూర్చుండి సరస సల్లాపములాడు చుండుట గని దూషింపసాగెను. 'రచ్చా రావిడి యైనది. పెద్దమనుష్యుడొకడు ఈ సంగతి తెలిసికొని యిట్లనియెను:

ఇంటనేమైనది యెరుంగగలేవు
గగనగుప్తమునెట్లు కనిపెట్ట గలవు?

౧౨

శ్రవణ దారుణమైన కంఠస్వరము గల యొక మత బోధకుడు తన కంఠము మృదు మధురమైనదను భ్రాంతితోనుండి వ్యర్థ బోధనము చేయుచుండెను. వాని గానమున నెడారిలోని మాలకాకి యరపులు దాగియున్నవని నీవు చెప్పవచ్చును ఖురానులోని "అప్రరము నందెల్ల నింద్యమైనది గాడిద యోండ్ర యొక్కటియె." అనుసూక్తి యాతని తరహాకు సరిపోవును. గాడిదవంటి యీ బోధకుడు ఓండ్ర పెట్టుటకు ప్రారంభించినప్పుడెల్ల అతని కఠోర రావము ఫటస్ పట్టణమును పునాదిలోనికి కంపింప జేయును.

ఆ బోధకునకున్న గౌరవము వలన ఊరివారు అతని లోపమును సహించి, కష్ట పెట్టుట యుచితము కాదని యూరకుండిరి. కాని, యాతనిపై రహస్య విరోధమున్న మరియొక బోధకుడు అచ్చటికి వచ్చి యిట్లు చెప్పెను: "మిమ్ము స్వప్నమున చూచితిని. మంగళమగుగాక!"

"ఏమి చూచితివి" అని ఆయన యడిగెను.

"మీ కంఠ స్వరము మధురముగ మారినట్లును అందు వలన ప్రజలు ఆనంద భరితులైనట్లును నేను కలగంటిని."

అంతట నాబోధకుడు ఈ విషయమై కొంత యాలోచించి యిట్లనియెను: "దేవుడు నిన్ను సంతృప్తి పరచుగాక! యెటువంటి శ్రేయస్కరమైన కలగంటివి. దీని మూలమున నా లోపములు నాకు బోధపడినవి. కర్ణ కఠోరమైన కంఠస్వరము గలవాడననియు నేను గొంతెత్తి యరచి చదువుట వలన ప్రజలు విసుగుకొని కష్టపడిరనియు నేనిప్పుడు తెలిసికొంటిని యీనాడు మొదలు మెల్లగ ప్రార్థనము చేయుదునని ప్రతిజ్ఞ చేసికొంటిని.

తప్పులెల్లను నొప్పుల కుప్పలనుచు
ముల్లుగాంచి గులాబీలు మల్లెలనుచు
బొగడుమిత్రుల సాంగత్యమున వినిగతి
క్షుద్ర-శత్రువు లోపంబు జూపువరకు

ఎవడైన దనతప్పు లెరిగించుదాక
దనతప్పునొప్పని తలచునజ్ఞుండు.

౧౩

సంజార్యా నగరపు మసీదున నొక మునాది గొంతెత్తి

యరచి నమాజు చేయుచుండెను ఆ కఠిన రావము విన్నవారందరు ద్వేషముతో వెడలిపోవుచుండిరి. ఆ మసీదునకు స్వామి యైన యమీరు సుస్వభావుడు. న్యాయబుద్ధి గలవాడు. ఇతరుల మనస్సు నొప్పించుటకు నిష్టము లేనివాడు గావున యమీ రిట్లనియెను. "యీ మసీదున పూర్వమునుండి సేవచేసిన మునాదు లున్నారు. వారిలో నొక్కొకనికి అయిదు దీనారముల బత్తె మిచ్చుచున్నాను. నీ వింకొక చోటు చూచుకొందువేని నీకు పది దీనారముల నిచ్చెదను." యీ మాటలకు సమ్మతించి పోయెను.

తరువాత కొంత కాలమునకు ఆతడు అమీరువద్దకువచ్చి యిట్లనెను: "స్వామి, మీరు నన్ను మోసము చేసితిరి. పది దీనారముల కేనన్ను ఆ యుద్యోగమునుండి వెడలనంపితిరి. నేనిప్పుడున్న చోటినుండి వేరొకచోటికి పోదునేని వారు ఇరువది దీనారముల నిచ్చెదమని చెప్పుచున్నారు. అయినను నేనొప్పుకొనలేదు."

అమీరు నవ్వి యిట్లనెను: "జాగ్రత్త. నీ వొప్పుకొనవద్దు. ఏబది దీనారముల నిచ్చుటకు వారొల్లియున నంగీకరింతురు!

కొండచరిమట్టి గొడ్డటగొకుచుండ
వెడలు గరుగర్రు శబ్దంబు విధమునిదు
బొంగుగొంతుకలోబుట్టి భయకొల్పు
కఠినరావంబు మాయెద గదలగొకు.

కఠోర కంఠుడొకడు గొంతెత్తి ఖురాను చదువుచుండ నొక పెద్ద మనుష్యుడు ఆ దారిని పోవుచుండి యిట్లడిగెను:

"నీకు నెలజీత మెంత?"

"ఏదో కొద్ది"

"అట్లయిన నీవేల యింత శ్రమపడు చున్నావు?"

"దైవ ప్రీత్యర్థము."

"మరల నీవిల్లు చదవకుండుట యెద్దైవమునకు ప్రీతికరముగ నుండును."

ఈవు ఖురాణసూక్తులిట్లు పఠింప
న్యూనమౌను ముసలిమాని యందంబు.

గులాబితోటలోని
చతుర్థాధ్యాయము

సంపూర్ణము.

గులాబితోట

పంచమాధ్యాయము

ప్రేమయౌవనములు

౧

హాసన్ మైమందీని యిట్లడిగిరి: "సుల్తాను మహమ్మదునకు చాలమంది చక్కని బానిసలు గలరు. వారిలో నొక్కొకడును లోకాద్భుత రూపవంతుడు. అట్లయ్యును సుల్తాను అంతగా నంద చందము లేని అయ్యాజును ప్రేమించినట్లు వారిలో నొక్కనినైన నేల ప్రేమింపడు?" ఆయన యిట్లు చెప్పెను:

"హృదయమున నెక్కినది కంటికిని ఇంపుగ నుండును."

ఎవ్వడేనియు నీరాగ దృష్టిజూడ
'యూసఫు' కురూపిగా దోచుచుండు; గామి
ప్రణయదృష్టికి దయ్యపులాడురూపు
కానిపించు దివ్యాకృతి గాగనెపుడు.

ప్రభువునకు నిష్టుడైన యెవ్వాడుగాని
తప్పులొనరింప నవియెల్ల నొప్పులగును;
రాజు త్రోసిపుచ్చిన వాని వ్రాతయేమొ
యింటివారైన నాదర దృష్టిగనరు.

౨

ఒక పెద్దమనుష్యునివద్ద రమణీయవతియగు దాసి యుండెను. దానిపై నతడు మోజుపడి యుండెను. "యెంత శోచనీయము! నా యీ దాసికి అంత చక్కదనమున్నందుకు. గట్టి హాయితనము నిర్లక్ష్యభావము లేకుండిన నెంత సంతోషకరముగ నుండెడిది!" అని ఆయన యొక స్నేహితునితో ననెను. అంతట మిత్రుడిట్లు

చెప్పెను: "సోదరుడా, స్నేహము నంగీకరించినప్పుడు న్యాయమును కోరకుము, ప్రేయసీ ప్రేయసుల సంబంధమునందు, దాసి యొడయడు అను భేదమంతరించును."

యింటిలోపమందు తెరగంటి వంటివాని
తోడ నయ్యాటలాడ నా తొత్తుగూతు
రాజ్ఞవెట్టును స్వామినియట్లు; లతడు
ప్రణయభారంబుమోయు సేవకునిభంగి.

యిటిక కంకరగొట్టుటో యింటవలయు
నీరుదెచ్చుటో దాసికి నియతవృత్తి;
యట్లుగాకది ప్రేయసి యయ్యెనేని,
చెనటియజమాని చెంపకు జేటుమూడు.

౩

ఒక పుణ్యాత్ముడొకనియందు ప్రేమబద్ధుడై యుండుట చూచితిని. అతనికి సహించుకొను శక్తిగాని ప్రణయము వెల్లడించుకొను ధైర్యముగాని లేకుండెను. అతని నెన్నిచీవాట్లు పెట్టి మందలించినను వానిపై వ్యామోహము వదలక యిట్లనెను:

నీ యుడుపుకొంగుపై జేయి నేనువదల
గత్తితో నీవెనామేన గాటులిడిన;
నాకు నీకన్న నెవ్వరున్నారు దిక్కు?
చత్తునేని నీవాకిట వచ్చిపడుదు

ఒకనాడాతనికి బుద్ధిచెప్పి యిట్లంటిని: "నీచమైన యీ వ్యామోహమునకు లొంగిపోవుటకు నీ ప్రశస్తమైన తెలివి యేమైనది?" అతడు కొంత తడవాలోచించి యిట్లనియెను:

పణ్యము భూపాలుడెచ్చోట బణములిడునొ
భక్తిభుజబలంబున కట బట్టులేదు;
కంఠదఘ్నంబుగా నదీకర్దమమున
బూడినయతండు మురికిని బూసికొనడె?

౪

ఒకనాడొకడు చిత్తము పరవశమయి ప్రాణములపై నాశ వదలుకొనెను. ఆతడు కోరిన విషయము అపాయకరమైనదియు, సుడిగుండమువలె ప్రాణసంశయము గొల్పునదియునై యుండెను. అది నోటబలుకుటకు వీలులేని యూహాకబళముగను, ఉచ్చ్వాల కెలయింపరాని పక్షిగను పొందరానిదై యుండెను.

ప్రియురాలి నీసొమ్ము పాటింపకున్న
యమ్మైన సొమ్మైన యుపకు నీకొకటె.

ఒకతూరి యూరివాని కొల్లు సలహా చెప్పిరి: ''నిష్ప్రయోజనమైన యీ పిచ్చి తలంపు వదలుము. నీవలెనే కొందరు ప్రజలు నైతము వ్యామోహమునకు చిక్కిరి. వారి హృదయము శృంఖలాబద్ధమైనది.'' యీ మాటలకాతడు దుఃఖించి యిట్లనియెను:

నాకు హితబోధపలదని నా సఖులకు
దెలుపు; మద్వానియుండె నావృష్టిచిక్కె;
బాహుబలమున యోధులు పరుల, జక్క
దనముగలవారు ప్రియుల, నిర్దయతనొంత్రు.

ప్రాణభీతిచే ప్రియురాండ్రనుండి హృదయము మరలించుట ప్రేమధర్మముగాదు.

స్వప్రయోజన బంధాల బడిననీవు
వంచకుడవైదు వనురాగ పాలనమున.
నకియ చెంగటజేర నసాధ్యమైన
దత్ప్రయత్నముసేగ మృతిధర్మమగును.

వీలైవనికొంగు విడకచేకొందు
గాకున్న నీ యింటికడకేగి చత్తు.

అతని మంచి సెబ్బరల నరయువే సిన బాంధవులువాని శోచనీయ స్థితికి జాలిగొని నీతి బోధించి కట్టుదిట్టములలో నుంచిరి.

వైద్యుండురోగికి బంచశిక్షంబు
నీయ నాతనికోర్కె యెగురుజక్కెరకు.

ప్రణయ విహ్వలచిత్తుడౌ వానిచెవిని
జెలియ గునగునలాడిన పలుకువినవె?
యాత్మగౌరవ పరుడవౌ నంతవరకు
నాముగౌరవమొక లెక్కగాదు నీకు.

అతని కోర్కెకు తావలమైన రాజకుమారునికి వాని విషయమై యిట్లుచెప్పిరి: "ఎవడో యొక యువకుడు మైదానమున నిరంతరము కనుపించుచుండును. మధురమైన భావయు చమత్కారోక్తులును పలుకుచుండును. ప్రజలు యాతని యుపన్యాసముల వినుచుందురు. కాని మనస్సులో వేదనయు ప్రేవులలో మంటయు వలపు పిచ్చియు నతనియందు గనపడుచుండును" ఈ మాటలువిని తనయందే యీ యువకుని చిత్తము లగ్నమై యున్నదనియు, తన్ను గురించియే దుఃఖఘూర్ణిని సుడిగాలిపలె వేసెననియు నెరింగి రాజకుమారుడు ఆతని నైపునకు గుర్రమును పరుగెత్తించెను.

రాజకుమారుడు తనయొద్దకే వచ్చుచున్నాడని తెలిసికొని యాయువకుడేడ్చుచు నిట్లు పలికెను:

నన్ను జంపినవాడు నను జేరవచ్చె
దనబలి పశువుపై దయగల్గెనేమొ!

"ఎట్లున్నావు? యెచ్చటనుండి వచ్చితివి? నీ పేరేమి? వృత్తి యేమి?" యని రాజకుమారుడు ఎంత దయతో నడిగినను ఆ యువకుడు ప్రేమ సముద్ర తరంగములలో నమాంతముగ మునిగిపోయి యుండుటవలన నూపిరి విడచుటకైన శక్తిలేక యుండెను.

కడదాకగ ఖురాను కంఠస్థమయ్యు
బలుకలేనమాల్ ప్రణయవిహ్వలుడు!

రాజకుమారుడిట్లనెను: " నాతో మాటలాడవేల? నేనును దరిచేసి సంఘమునకు జేరినవాడన అదియునుగాక వారికి నేను దాసుడను."

స్నేహితుని యాదరోక్తుల ప్రోత్సాహమువలన ఎట్టకేలకు ప్రేమతరంగ సంక్షోభమునుండి తలయెత్తి యువకు డిట్లనియె:

ఈవు నావద్దనిలుచుండ నింతవరకె
ప్రాణములు వీడిపోకుంట యద్భుతంబు!
నీవుమాటాడవచ్చిన నిమిషమందె
పలుకశక్తియు మిగులుట గొలుపువింత.

ఆ యువకుడిట్లు పలుకుచు ఎలుగెత్తి యరచి ప్రాణము దేవుని కర్పించెను.

ప్రేయసిగుడారు వాకిట ప్రేమదగ్గు
దన్తమింపక యుండిన నక్కజంబు!
అతడొకవేళ బ్రతికిన బ్రాణములను
క్షేమముగ జిక్కబట్టుట చిత్రమగును!

౩౪

ఒకవిద్యార్థి రూపవంతుడుగను మృదుమధురభాషిగ నుండెను. మానవ స్వభావ దౌర్బల్యము వలన నుపాధ్యాయుడు వానిపై ననురాగము చూపుచు నితర బాలురను శిక్షించినట్లు వానిని శిక్షింపక యొంటరిపాటున కనబడినపు డిట్లు చెప్పుచుండెను.

నన్ను నేనుమరచిపోవుచున్న యటుల
మగ్నమయ్యెను నీ యందె మనసునాకు;
ఓయి దివ్యాస్య, నినుగాంచుచున్నయపుడు
బాణమెదురైన గన్నులవాల్పఁబోను

ఒకానొక సమయమున ఆబాలుడిట్లు చెప్పెను: "మీరు నా పాఠముల విషయమున నెట్లు శ్రద్ధతీసికొందురో అట్లే నా ప్రవర్తనమును గురించియు శిక్షించుడు నా కిష్టమైనదియు మీ కిష్టము కానిదియు నా స్వభావమున మీ కేదైన తోచినయెడల నన్ను హెచ్చరింపుడు. నేను సరిదిద్దుకొనుటకు యత్నించెదను. యీ మాటలకు నుపాధ్యాయు డిట్లనియెను: ఓయీ, యీ మాటలు వేరొకనితో చెప్పుము. ఏలయన నిన్ను చూచుచున్న నాకంటికి ఒప్పులు తప్ప మరేదియు గానరాదు.

ఒప్పులను దప్పులని నొక్కిచెప్పుచుండు
నీ విరోధి కనిపెకల్ నేలబడుత!
ఒప్పొకటియుండి డెబ్బదితప్పులున్న
నొప్పొకటి తప్ప సఖుదెద్దియుంగనండు.

౩౫

ఒకనాటిరేయి నా ప్రాణమిత్రు డొకడు ఇంట ప్రవేశింపగా

చూచి నొడలు మరచి లేచునప్పుడు నా చొక్కాయికొంగు తగిలి దీపమారిపోవుట నాకు జ్ఞప్తియున్నది. యాతడు కూర్చుండి. "నన్ను చూచినంతనే దీపము నేల యార్పితివి" యని నిందించెను. నే నిట్లంటిని: "యేలయన, సూర్యుడుదయించెనని సందేహించుట మొదటి కారణము, యీ పద్యము నా మనసునకు వచ్చుట రెండవ కారణము:

హేయరూపుడుదీపిక యెదుటనిలువ,
లెమ్ము, వానిని సభవెడలింపు మపుడె;
తెనెవాతెర నగుమోముతెరవ యైన
పైటచెంగునుబట్టి దీపంబునార్పు.

౭

చాలకాలమునుండి యగపడని యొక స్నేహితుని చూచి, "యెచ్చటనుంటివి? నీకొరకు నిరీక్షించుచుంటిని" యని యొకడు పల్కెను. "విసుగు పుట్టించుటకంటె నిరీక్షింపబడుటయే మేలు," అని యాతడనెను.

మోహపుంగైపు పుట్టించు ముద్దులాడి
వచ్చినావాలసించి; నీపైటవిడువ;
అనదీరంగ బ్రియురాలి నరయుకంటె
నెప్పుడో యొకప్పుడుగాంచ నెంతొప్రియము.

యితర మిత్రులతోడ వచ్చునేని వలపులాడి తగవులాటకే వచ్చును. యేలయన, ఈర్ష్యయు పత్యర్థితయు నశింపదు.

అన్యులౌ వలపుకాండ్రతో నరకుఖంబు
చెలియ నయ్యాటల గలసిమెలసియున్న
నెంతసేపాపట్టదు దహియించివైవ
నంతరంగము నీర్ష్యాదవానలంబు.

పిన్ననవ్వులు మోమున బెనగులాడ
నకియ యిట్లువచించె: నోసాది, నేను
సభను వెలుగొందు దీపికాజ్వాలః నంటు
నెన్నొపురుగులంచావ నాకేమిలెక్క?

౮

చాలాకాలము క్రిందట నేనును మరియొక స్నేహితుడును బాదముకాయలోని రెండుపప్పులవలె కలసిమెలసి వసించుచుంటిమి. అకస్మాత్తుగ నతడు పయనింపవలసివచ్చెను. కొంతకాలమునకు తిరిగి వచ్చి "యీలోపల క్షేమసమాచారములు తెలుపుట కెవ్వరినైన నా వార్తావహుని పంపగూడదా" యని నాతో నిష్ఠురములాడెను.

"నీ సౌందర్యమునుగాంచి యా ప్రేషితుని కన్నులు ఆనందించుచుండ నేనుమాత్రము భగ్నాశుడనయి యుందునన్న తలంపు నన్ను వేధించె!" నని నేనంటిని.

ఎవ్వడైనను నీమోము తృప్తిదీర
గాంచ నీర్ష్యాగ్ని నామది గడలుకొనును;
అయిన నను కొందు గ్రమ్మర నంతలోన
నిన్నుగని తృప్తిచెందుట నున్నయనుచు.

౯

ఒకానొక పండితునకు నొకనిపై మనసు తగిలియుండెను యీ రహస్యము బహిరంగమాయెను. అతడు ప్రజల దౌర్జన్యము వలన బాధపడుచు మితిలేని యోర్పువహించి యుండెను. ఒకనాడు నేనాతని నిట్లుమందలించితిని: "ఆతనితోడి నీస్నేహము నిష్కల్మష మనియు గర్హ్యమైనది కాదనియు నేనెరుగుదును. అయినను తాము ప్రజల యాడికలకు పాల్పడుటయు మట్టుమర్యాద లెరుగని మొరకల దౌర్జన్యమునకు అగ్గమగుటయు పండితుల గౌరవమునకు నర్హముగాదు." అంతట నా పండితుడిట్లనియెను: "మిత్రుడా, నన్ను నిందింపకుము. చాలాసారులు దీని ఔచిత్యమునుగురించి యాలోచించితిని. యాతని చూడకయుండుట కష్టమునకంటె దౌర్జన్యము సహించుటయే మేలుగ తోచినది ప్రేమపాత్రమైనదానిని చూడనీయక కన్నుల మరల్చుటకంటే, దానిని పొందుటకుపడు కష్టమునందు హృదయము నిల్పుటయె తేలికగ నుండునని తత్వవేత్తలు చెప్పిరి."

ప్రియురాలిపై మతిపెట్టిన యతడు
తనగడ్డమొదలకు దాబట్టియిచ్చు;
పలుపువెట్టిన జింక పరుగెత్తలేదు;
ఎవతె లేకుండిన నిహముశూన్యంబొ
యట్టినెచ్చెలి కష్టపెట్టిననేమి?
ఒకనాడు ప్రియురాలి నొకయొఉ-బడిక
నడిగితి; నదిమొదలనుతాపమునను
పలుమారునే క్షమార్పణము గోరితిని;
హృదయంబువెట్టితి సుదతికట్టెదుట,
నేమిజేసినగాని యింతియిష్టంబె;
ప్రియమునవిల్చుటో వెడలగొట్టుటయొ
యెట్లుచేసినమేలొ యెఱుగునాచెలియ.

౧౦

నా నిండుజవ్వనమున నిట్టిది తటస్థించెనని. నీ వెఱుగుదువు. ఒక ప్రియమిత్రునితో నన్యోన్యరహస్యములు చెప్పుకొనదగినంత సంబంధముండెను. మేలయిన అతని కంఠస్వరము మృదుమధురముగను వదనబింబము పూర్ణచంద్ర సదృశముగ నుండెను.

అతని చెక్కుల సొంపారు నాకలంబు
జీవనామృతముంగ్రోలి చివురువెట్టు;
నతని తరితీపువాతెర నరయుచేని
కండచక్కెర రుచిచూడగల్గినట్లు.

యిట్లుండ అతని ప్రవర్తనము నా స్వభావమునకు వ్యతిరిక్తమయి నా కంగీకారము గాకయుండుట సంభవించెను. అంతట స్నేహబంధము సడల్చి యాతనితో నిట్లంటిని:

పడవోయి నీయిచ్చవచ్చినవారి,
నాతలంపొల్లవు, నీదారితోడు.

అతడు వెడలిపోవుచు నిట్లనుచుండ వింటిని.

అరుణు సాంగత్యంబు వల దివాంధంబు
విడనేమి, రవికాంతి విలువకులోటె ?

యిట్లువచియించి యాతడు పయనించెను. వాని దుఃస్థితికి నా మనసు నొచ్చుకొనెను.

సాంగత్యలాభంబు నమరెు; గష్టంబు
పడుదాక దెలియము ప్రమదంపు విలువ
క్రమ్మరవచ్చినఁ గడతేర్చుమోయి,
నీవెన్క బ్రాణంబు నిలబెట్టుకంటె
నీముందు మరణింప నెగడుమోదంబు.

అయినను దైవవశమున, కొంతకాలము గడచినపిదప నతడు తిరిగి వచ్చెను. దావీదు కంఠమువలె మధురమైన యాతనిగొంతు బొంగురువోయెను. యూసఫువలె రమణీయమైన యాతని రూపము పసచెడెను. సీమరేగుపండువలె నున్ననైన యాతని చిబుకము ఉరు వెక్కి దుమ్ముపట్టి యుండెను. ఆతని సౌందర్యమూల్యము తగ్గెను నేనాతని చూచినంతనే కౌగిలింతునని యాసపడియుండెను. కాని నేను ప్రక్కకుతొలగి యిట్లంటిని:

అలరు సూనూగుమీసాల యౌవనమున
నరయువచ్చినవారల దరిమితీవు;
ఈతమొక్క గడ్డంబుతో నింపుదరిగి
చేరినాడవె యీనాడు చెలిమిగోరి.

ఆరయుగ నీదుజవ్వనపు టామనిపచ్చలు పాలిపోయె; నె
ప్పురుసున జింతిలంగ మరలవచ్చునె పూర్వపు సోయగంబు? నీ
ప్పాగవయులేదు ప్రాయ్యి; నిపబోకటపాత్రను; టెక్కులే నీ
నరసనుగోరువారికడ నల్పుము చెల్వగుముద్దుముచ్చటల్.

ఆ కలంబులు తోట నందంబుగొలుపు,
నటు వచించినవాని కంతయుఁ దెలియు;
అనగఁ:- సుందరు చెక్కులందు మోసెత్తు
పచ్చల జొంపంబు ప్రణయవిహ్వలుల
యుల్లంబు వెదుకంగ నుప్పొంగుచుండు;
నీ గడ్డపుఁ జా మడినిండె తోటాకు,
కోసిన కౌలదియుం గొనరిపైకెదుగు;
గడ్డంబుపెంచిన గత్తిరించినను
యౌవనప్రాభవం బంతరించెడిని;
గడ్డంబుపైనీకు గలయంత ప్రభుత
ప్రతుకుపైనాకున్న, ప్రళయంబువరకు

జేవీడకద్దాని జిక్కఁబట్టిదను
యిటుల ప్రశ్నించితిః నేమయ్యె నీదు
వదనసౌందర్యంబు? పరివృతంబయ్యె
జంద్రబింబము చీమచాలులచేత;
నిటువలెఁ నామొగమేమాయెనేమొ!
గళిత సౌందర్యదుఃఖము చూపుపొంది
నలుపుదాలిచెనంచు నాకు దోచెడిని.

౧౧

"సుందరులైన యువతులను గురించి నీ యభిప్రాయమేమి" యని యొక బాగదాదు అరబ్బీని ప్రశ్నించితిని ఆతడిట్లు చెప్పెను "నాడచక్కనైన శరీరముగల యంతవరకు బిఱుసుతనమును గట్టి తనమును పూనుదురు. వారికి బిఱుసుతనము వచ్చి నిష్ప్రయోజకు లయినప్పుడు దయచూపి చెలిమి పాటింతురు."

అందచందములొనరు ప్రాయంపువాడు
విరబిగిసి కటాక్షుల విసుగుగొలుపు;
మీసమును గడ్డముమువచ్చి మిసిమితరుగ,
గలసిమెలసి వర్తించు సఖ్యంబుగోరి.

౧౨

"ఒకడొక చంద్రవదనతోడ రహస్యగృహమున కూరు చుండియుండ, ద్వారములు మూయబడియుండ. సేవకులు నిద్రించు చుండ, కామోద్రేకము దుర్దమమైయుండ, నొకయరబ్బి చెప్పినట్లు "ఖర్జూరములు పండియున్నవి. తోటకాపరి నిరోధింపడు" అన్నట్లు అంగయు ననుకూలముగనుండ, వాడు సంయతబుద్ధి బలముచేత

చిత్తచాపల్యమునుండి తన్ను రక్షించుకొనగలడా?'' యని యొక పండితుని ప్రశ్నించిరి. ఆతడిట్లు చెప్పెను: ''ఒకవేళ ఆతడు చంద్రాశ్యలకు వశ్యుడుగాక తప్పించుకొన్నను. పరనిందాపరాయణుల విమర్శనములకు గురికాకమానడు.''

సాధ్యమౌ దనపతి శాసించినిలుప;
నయిన లోకుల నాల్కలరికట్టతరమె?

సాదృశ్యము

చిలుకను కాకితోడ నొకపంజరమున బంధించిరి. చిలుక కాకి వికారరూపమునకు నీసడించుకొని యిట్లనియెను: ''యేమి యసహ్యమైన స్వరూపము! యెటువంటి యభిశప్తముఖము! ఎట్టి యనాగరక స్వభావము!''

ప్రొద్దుపొడుపునలేచి నీ మోముజూడ
శాంతదివసోదయం బంధసంధ్యయగును
నీకునీవంటి నిర్భాగ్యు నెయ్యమొప్పు
కాని. నినుబోలువాడు జగానలేడు.

యిందు వింతయేమనగా, కాకియు చిలుక సహవాసమునకు ప్రాణము విసిగి తన కాలదుర్గతికి దీనముగా పలవరించుచు ఆశాభంగముతో చేతులునలుపుకొనుచు నిట్లనియెను: ''నా యదృష్టమెంత తలక్రిందైనది! కాలము ఊసరవిల్లివలె మారుచుండును! నాకోడి కాకులతోడ తోటగోడలపై నొయ్యారముగ పచారుచేయుటయేనా గౌరవమునకు తగియుండును

భక్తుదుర్మతులతో వసియింపజేయ
పతనికయ్యదియె కారాగారశిక్ష.

ఇటువంటి తెలివితక్కువదియు, మొండిపట్టుగలదియు, పనికి మాలినదియునగు వదరుబోతు చిలుక సహవాసబంధమున జిక్కి గోడుగుడుచుచు నాకాలమెల్ల శిక్షననుభవించుటకు నేనెట్టిపాపము చేసియుంటినోగదా!''

పాడుపేరూపు చిత్రింపబడినగోడ
ప్రక్కకేనియు నెవ్వరు పదములిడరు;
నీవున్స్వర్గానముండ నిర్మితమైన
గొంకకితరులు నరకంబు గోరుకొంద్రు.

పండితులు పామరుల నెట్లు ద్వేషింతురో అట్లే పామరులు కూడా పండితులను ద్వేషింతురన్న విషయము నీవు తెలుసుకొందువుగాక యని యీ పాద్యశ్యము నుదాహరించితిని:

కోడెపోపామూక గోష్ఠిలోనుండె
పరమభక్తుం: డంత బల్లిపూబోణి
యతనితో పచియించె: ననఘాత్మ, మీకు
మాగోష్ఠినుండ నమ్మతిగాకయున్న
మటమటమని మోము మాడ్చబోకుండు,
అది యంతకుణ్మున్నె యతివికర్షకము!
లాలెలు పన్నీరు పూలమధ్యమున
నిలనాటినట్టి యొండినకట్టివీవు,
ఎదురుగాలివె, లేక యొనలేని చలివె!
పెరిగడ్డగనుండు పెనుమంచుశిలవె!

౧౩

నేనును మరియొక స్నేహితుడును కలసి కొన్నియేండ్లు ఒకరి కొకరుగా తోడునీడగా యాత్రసల్పుచుంటిమి. ఒకే కంచమున దిని యొకమంచమున పరుండుచుంటిమి. మిత్రుల మితిలేని సౌఖ్యములను ఇరువురము అనుభవించుచుంటిమి. తుదకు కొంచెము లాభము కారణంగా అతడు నాహృదయమును నొప్పించుట కియ్యకొనెను. సహవాస మంతరించినది. యిట్లయ్యును ఇరువురియందు హృదయానుబంధము బొత్తిగా తెగిపోలేదు. యేలన, పూర్వము నేను రచించిన యీ రెండుద్విపదలను ఆతడొక సభయందు చదివెనని వింటిని.

ఎలనవ్వుతోడ నెచ్చెలి వచ్చినంత
పుంటిలో నుప్పుడు పోల్కి బాధించు;
చెలిముంగురులుచేత జిక్కనెట్లుండు ?
దాతకొంగర్థిచే దవిలినట్లుండు.

అచ్చటవినుచుండిన మిత్రబృందము ఈ ద్విపదలను మెచ్చుకొనిరి. ఇందలి భావచమత్కారమునకు గాకపోయినను ఆ మెచ్చుకోలు వారి మధురమైన సహృదయత్వమునకు సాక్ష్యమగుచున్నది.

అంతట ఆ స్నేహితుడు ఆ సభయందు నన్ను అతిశయోక్తులతో ప్రశంసించి, మా పూర్వసహవాస మంతరించినందులకు వగచి యందుకు కారణమైన తన తప్పిదమును ఒప్పుకొనెను. ఆతనికిగూడ కోరికయున్నదని యెరిగి యీ ద్విపదలను వ్రాసిపంపి రాజీచేసుకొంటిని:

మనకు నన్యోన్యంబు మైత్రిబంధంబు
గలదు; దానిని నీవె ఖండించినావు;
మరల నీపై జిక్కె మనసు; మున్నట్లు
మారెదవంచునే మదినంశయింప;
నింకరాజీనీకు నిష్టంబయేని.
ప్రియతరుండగుదువు; వెండిరారమ్ము,

౧౪

ఒకనికి చక్కని యిల్లాలుండెను. ఆమెమరణించెను విక్రతాంగియైన ముసలియత్తమాత్రము ఓలెపైకము వసూలుచేయు వరకు అల్లునియింటనే నివసించుచుండెను. ఆమెసహవాసము తొలగించు కొనుటకు ఆతనికే యుపాయమును తోపలేదు.

ఇట్లుండ స్నేహితులు కొందరు ఆతని విచారించి యోదార్చుటకు వచ్చిరి. వారిలో నొకడు ''నీ ప్రియురాలివియోగము నెట్లు సహించుచున్నావని'' అడిగెను.

''భార్య తల్లిని చూచుచుండుటకంటె భార్యావియోగమంత కష్టముగాదు,'' అని ఆతడు బదులుచెప్పెను.

తొసరుగులాబిలు వంగిలిపోవ
కంటకనిచయంబె కడకులభించె;
బంగారు పెన్నిధి పరులుగొంపోవ
పామొక్కటియె గుంటబన్నుండి మిగిలె;
కానివారల మోముగాంచుటకంటె
కనులు బల్లెమున కగ్గముసేయవచ్చు;
ఒకవిరోధిని జూచుచుండుటకంటె
వేయిమిత్రులతోడ విడివడవచ్చు.

౧౫

నా యౌవనకాల మందొకనాడు ఒకవీథియందు సంచరించుచు నొక చంద్రముఖిని గాంచితిని. యెండతాపము నోరెండ జేయుచుండెను. యెడారి వేడిగాలి యెముకలలోని మూలగను ఉడికించి కరగజేయుచుండెను. బలహీనతవలన నిశితమైన సూర్యాతపము సహింపలేక, యెవరైన నా తాపము తొలగింపవచ్చుననియు గుటికెడునీళ్లు తావనిచ్చినా దాహము నుపశమింప జేయుదురనియు ఆశించి యొకగోడనీడ నాశ్రయించితిని.

అంతనే యొకయింటి మొగసాల చీకటిలో చుక్కవంటి చక్కనిపూబోణి ప్రకాశించెను. ఆ కాంత సౌందర్యమును వర్ణించుటకు అనర్గళ వాగ్ధోరణిగల నాలుకకైన అశక్యమని చెప్పవచ్చును చీకటిరాత్రిలో ప్రొద్దుపొడుచుచున్నదా లేక, జీవనామృతము చీకటి కోనలోనుంచి వెలికుబుకుచున్నదా యనునట్లుండెను.

ఆయువతి మంచినీటిగిన్నెను చేకొని దానిలో కొంచెము పంచదార చిలకరించి పూలయాసవము కలిపెను. పన్నీరుచిల్కి సువాసన గుబుల్కొన జేసెనో లేక తన కపోలములందలి గులాబీలను కొంచెము కలిపెనో నేనెరుగను. ఎట్లయిననేమి, మొత్తముమీద ఆ రమణీమణి చేతినుండి పానకమునందుకొని త్రాగితిని. పోవనున్న ప్రాణము మరల కుదుటపడెను.

దోసెడు నీటితో దొలగునే దప్పి
యాపగా జలమైన నణపలేదన్న.

ప్రతి ప్రభాతమునందు నీవంటి రమణి
దివ్యవదనంబుగాంచు నదృష్టమున్న
పుణ్యపురుషుని యానంద పూర్ణహృదయ
మెట్టులుండునొ వర్ణింప నెవరితరము ?

అనవమత్తుడౌ నతడు మేల్కొనును
అర్ధరాత్రముదాటః అసాఖి ప్రణయ
పానీయమత్తుడౌ పావనాత్ముండు
అంత్యదినోదయమందె మేల్కొనును.

౧౬

మహమ్మదు ఖవారజంషాహి ఖతాప్రభువుతో హితాభిప్రాయానుసారముగ రాజీచేసుకొన్న సంవత్సరమున, నేను కాష్ఘర్ నగరపు ముఖ్యమసీదునందు ప్రవేశించితిని. అచ్చట చక్కని దేహసౌష్ఠవమును అందచందములుగల యొకబాలుని చూచితిని. అత డిట్లు వర్ణింపదగియుండెను:

గురువు శిక్షించె నీకు పోకులపనందు
హృద్వశీకరణంబు, గారించునేర్పు
లాలనము, నక్షిచాలన లాఘవంబు
అడ్డులేని దౌర్జన్య, మనాదరంబు.

యిట్టి యున్నతిరూపంబు నిట్టి ప్రకృతి
గల మనుష్యుని నెందు నేగాంచనైతి;
అయిన దేవదూతయె యువియన్ని నీకు
నేర్పియుండునటంచు నే నిశ్చయింతు.

ఆ బాలుడు "జమక్ షరీ" అను అరబ్బీవ్యాకరణమును చేతబట్టుకొని "జయుదు అమరూను కొట్టెను. మరియు అమరూను క్షతగాత్రుని చేసెను" అని వాక్యపరిచ్ఛేదముయొక్క యవతారికను వల్లించుచుండెను. ఆ మాటలువిని నేనిట్లంటిని. "అబ్బాయీ ఖవారజంషాహియు ఖతాప్రభువును రాజీపడిరి. జయుదు అమరూల విరోధమింకను కొరవయున్నదా?"

ఇందుకు ఆ బాలుడు నవ్వి నా యూరిపేరడిగెను. "పవిత్రమగు షీరాజ్ పట్టణము" అని చెప్పితిని.

"అట్లయిన సాదీపద్యములలో నీకేవైన కొన్ని తెలియునా?" అని నన్నాతడు ప్రశ్నించెను. నేనిట్లు అరబ్బీలో జవాబుచెప్పితిని.

వ్యాకృతి పఠించు విద్యార్థి పలతుగాని
జైదు అమరూనుసట్లునకా జడుపుసతియు;
పరస వినియుక్తచిత్తత బ్రక్కనున్న
వారి దలయెత్తిచూడడు బాలకుండు.

కొంచెమాలోచించి యాతడిట్లనియెను: "ఈ దేశమున వ్యాప్తిలోనున్న సాదీకవిత్వము చాలవరకు పారసీభాషలో నున్నది. కావున మీరు పారసీపద్యములు చదివిన అర్థము సులభమగును." అంతట నేనిట్లు చెప్పితిని:

నీదుభావంబు వ్యాకృతి నిహితమగుట
మాయెడంద వివేకమ్ము మాసిపాయె;
ప్రియుని హృదయంబు నీయురిబిట్టయద్యో;
మాకు నీవును, వ్యాకృతి నీకు ప్రియము.

మేము పయనింప నిశ్చయించుకొన్ననాటి ప్రొద్దున మాతోడి యాత్రికులలో నెవడైననొకడు ఫలానియతడు సాదీయని చెప్పియుండవచ్చును. ఆ బాలుడు పరుగెత్తుకొనివచ్చి ఆదరముచూపి మనమున నొచ్చుకొనుచు "ఇంతకాలము మీరేల చెప్పక యూరకుంటిరి నేను కృతజ్ఞత తెలుపుకొని మీంబోటి పెద్దలసేవకు సంసిద్ధుడనుగ నుండియుందును," అని చెప్పెను.

"నీ యెదుట నేను ఫలానివాడనని చెప్పుకొనుటకు నోరాడక యూరకుంటిని" అని నేనంటిని. "మేము మిమ్ము శ్రద్ధాభక్తు

లతో సేవించునట్లు మీరేల కొంత కాలము ఇచ్చట నుండరాదు" అని యాతడడిగెను.

"ఏలయన నీ క్రిందికథననుసరించి" యని నేనంటిని:

మనుజనంఘమువీడి మమతవోనాడి
పర్వతగుహయందు పరమసంతృప్తి
కాలఁబుగడపెడు ఘనునిదర్శించి
యిట్లంటిః బుణ్యాత్మ; యెడదదాన్యంబు
విడిపోవబట్నంబు వేంచేయరాదె?
అన బూజ్యుడిట్లనె: ఆపట్టణమున
అచ్చరలంబోలు నతివలున్నారు ;
బురదగుంటను నేస్గు పూని కాళ్మెట్ట
గంరదమ్నుంబుగా కాయంబు క్రుంగు.

యీ కథ చెప్పి యొకరినొకరు మొగము ముద్దిడుకొని వీడుకోలొసగి కొంటిమి.

ఇంపు చెలికాని ముద్దిడ నేమిఫలము
త్వరగ వీడ్కొల్పి పంపించవలసియున్న ;
అట్టి వీడ్కోలు 'సెబిని' ననుకరించు
ఒక్క చెంపను నెరుపు వేరొకట బసుపు.

వీడ్కొన్ననాడె నే వేదనామృతుడ
గాకయుండిన నా యగాధంపు జెలిమి
ఎంతొ బూటకమని యెత్తిపోసెదవు.

౧౭

బొంతలు తొడుగుకొన్న దరిబేసి యొకడు మక్కాకేగుచున్న

సార్థవాహమును కలిసికొని మాతోడ యాత్రచేయుచుండెను. అరబ్బీరాజొకడు కుటుంబపోషణమునకయి యా దరిబేసికి నూరు దీనారముల బహుమతి చేసెను. 'కఫాచే' దారిదోపిడిగాండ్రు సార్థవాహమును కనిపెట్టియుండి దానిని శుద్ధపూజ్యముగ దోచుకొనిరి వణిజులు లబోదెబోయని కొట్టుకొనిరి. కాని యేమిప్రయోజనము లేకపోయెను.

ఏడిచి వేడినా యెంత కుయ్యోడిన
దొంగలిత్తురె మళ్లీ దోచిన ధనము.

పుణ్యాత్ముడైన యొక దరిబేసిమాత్రము కలతచెందక శాంతముగ నుండెను. "దొంగలు నీధనమును దోచుకొనలేదేమొ" యని నేనంటిని.

"నా ద్రవ్యమునుకూడా వారపహరించిరి. ధనము పోయినప్పుడు కష్టపడవలసినంత వ్యామోహము నాకు దానిపై లేదు," అని యా పుణ్యాత్ముడు వచియించెను.

ఎట్టివస్తువులపైని యెవ్వారిపైని
మనసుపెట్టకుము; క్రమ్మరుపంగలేవు.

యిప్పుడు మీరుచెప్పినది నా పూర్వస్థితికెంతయు నన్వయించుచున్నది. నా యౌవనకాలమున నొకయువకునితోడ నత్యంత మైత్రితో కలసిమెలసి యుండుట తటస్థించెను, పారహాచ్చె మెరుగని మా స్నేహమెంత గాఢమైనదనగా అతని సౌందర్యము నా కన్నులకు మక్కావలెను అతనితోడి సాంగత్యము నా జీవితె మూలధనముగను ఉండెను.

ఒకవేళ స్వర్గాననుండిన నుండు
నట్టి సుందరమూర్తి యవనిలోలేడు;
అతడుమరణింప నన్యులచెలిమి
వెలియయ్యె, నటువంటి వేరొక్కని నిల
గాలించిచూచిన గనలేనికతన.

ఆకస్మికముగా ఆతని జీవితమూలధనము మృత్యుపంకమున మునిగిపోయెను. వియోగదుఃఖపు నిట్టూర్పుపొగలు వాని కుటుంబమునుండి వెలువడెను.

కొన్నిదినములు నేనాతని గోరీయొద్ద స్నేహబద్ధుడనై కూర్చుండియుంటిని. ఆతని వియోగమును గురించి నేను రచించిన పద్యములలో నీ క్రిందివి కొన్ని:

మరణపు ముల్లు నీ పదసుమంబును దాకిననాడె, కాలపుం
గరకు కటారి నాతల దెగంబరిమార్చిన, నీవులేని యీ
నిరయమువంటిలోకమును నేగనకుందును; నీదు గోరిముం
దర నిపుడున్నవాడనయొ, నా మృతికెంతయు వేచియుండియుజా

పడుక పైనిగులాబీలు పరపకున్న
గన్నుమోడిచి విశ్రాంతి గనడుసఖుడు;
కాలము హరించెనతని కపోలరక్తి,
ఆతని స్మృతికబల్లేరు లంకురించె.

ఆస్నేహితుని వియోగానంతరము సంతోషానుభవమును ఇతరుల సాంగత్యమును కోరనని దృఢముగ నిశ్చయించుకొంటిని.

నిన్న నెయ్యంపుదోటలో నెమ్మిలీల
రమ్యగతినుంటి; నేడు సర్పంబుపోల్కి
ముడుచుకొనియుండునయ్యొ! సముద్రయాత్ర
దరగ వెరలేకయున్న నాదాయకరమె.

ప్రొద్దుపొడుపున బన్నీరుపూలచెలిమి
ముల్లువెరలేకయున్న నామోదకరమె.

౧౮

ఒక అరబ్బిరాజునకు లయిలామజ్నూనుల కథచెప్పుచు మజ్నూను ఉన్మాదావస్థను గురించి యిట్లువచియించిరి: "మంచి తెలివితేటలు పాండిత్యముకలిగియు నతడు చిత్తమును చిక్కబట్టు కల్గిమునువదలి యెడారిదారిపట్టెను." రాజు నాతని నిచ్చటికి రప్పింపుడని యాజ్ఞాపింపగా వారు మజ్నూనును హాజరుపెట్టిరి. అంతట రాజిట్లుమందలించెను: "మృగత్వము వహించి, మానవసాంగత్యము బహిష్కరించి, యేకాకివై యెడారిలో క్రుమ్మరుటకు. నుదారమైన మానవస్వభావమున నీకేమిదోషము గోచరించినది?" అంతట మజ్నూను దుఃఖించి యిట్లనియెను:

నేను లైలాను ప్రేమించినానటంచు
నాదుమిత్రులు నిందింత్రునన్ను. గాని
చెలియనొకమారు వారు వీక్షింతురేని
యిట్టినాస్థితి హేతువూహింపగలరు.

పదిగనాదోషములు పొగబట్టువారు
హృదయమోహిని, నిన్ను దర్శింతురేని
చేతి నారింజకున్మారు చేతిప్రేళ్లు
చెనటులై కోసికొనుటలో జిత్రమేమి?

ఈతనికింతటి దురవస్థ తెచ్చిపెట్టిన లైలా రూపలావణ్యము లెట్టివోయని యామెసౌందర్యమును స్వయముగ చూచుటకు రాజు

మనము ఉవ్విళ్లూరుచుండెను. లైలాను రప్పించుట కాజ్ఞయైనది, 'హాయా' తెగవారి కుటుంబములలో వెదకి వెదకి తుదకు ఆమెను కనుగొని తీసుకొనివచ్చి రాజాంతపురమున నడిమిచౌకమున నిలబెట్టిరి. రాజు ఆమెరూపమును కొంతసేపు నిదానించి పరికించెను. కాని రాజుకంటికాయువతి రూపము అమిత సామాన్యమైనదిగ కనిపించెను. ఏలయన తన యంతఃపుర పరిచారికలలో నథమురాలైనను అందచందముల లైలాకన్న మిన్నగనుండెను.

మజ్నూను ఇంగితజ్ఞుడుకావున రాజు మనసులోని భావమూహించి యిట్లనియెను: "మహాప్రభూ, మజ్నూను కంటిద్వారముననే లైలాసౌందర్యమును దర్శింపవలయును అట్లయిననే ఆ దివ్యదృశ్యముయొక్క రహస్యము మహిమ మీ హృదయమున ప్రకాశించును"

ఆరోగ్యవంతుడై యలరుమానవుడు
వ్రణబాధ తత్త్వంబు భావింపగలడె?
నావంటివానికే నాబాధవినుతు;
కాటుపొందనివాని కడగందురీగ
కథజెప్ప వ్యర్థంబుగా దోచుగాదె!
నరిగ నాస్థితినీకు నమకూడుదాక
వ్యర్థగాథగ నాయవస్థ గన్పట్టు.

౧౯

హాందాక్ నగరపు న్యాయాధిపతినిగురించి యిట్లుచెప్పకొనిరి: లాడములుకొట్టువాని కూతురిపై ఆ పెద్దమనుష్యునకు వలపుగలిగెను. కామప్రేరితమైన యాతనిహృదయము కొలిమిలోని గుర్రపు లాడమువలె నెర్రగక్రాగెను.

కొంతకాలము చంచలచిత్తుడై యతడు ఆ యువతిని వెదుకుచు, నిరీక్షించుచు, తనకు తటస్థించిన విషయములు చెప్పకొనుచు నిట్లనియెను:

నిడుపగుదేవదారు ధరణీజము నా గనువిందుజేసి యో
పడతి, మదీయహృత్స్రమము బాదములంజెడద్రొక్కెదేల, నా
యెడదను నీ విలోల లలితేక్షణముల్ చెరవెట్టు; నెవ్వరుం
బుడమిని నీ మనంబుగొన బోలని చోగనుమోడ్చు మీదయుణ.

ఒకనాడాయువతి దారిలో న్యాయాధిపతికెదురుపడెను. ఈతని వ్యవహారములు గాలివార్తగా తన చెవినిపడియుండుటవలన. మితిమీర కోపగించుకొని కఠినముగా దూషించెను. రాళ్లురువ్వెను. ఆతని యవమానమునకు కావలసిన ప్రయోగములలో నేదియు వదలిపెట్టలేదు. అంతట ఆ న్యాయాధిపతి విశ్వాసపాత్రుడైన యొక మిత్రునితో నిట్లనియెను:

యిటుచూడుప్రేయసి యెటులగాంచెడినో
కుటిలభ్రుకుటిగూడ గూర్చునందంబు
మనముప్రేమించెడు వనితచేదెబ్బ
ఖర్జూరఫలమట్లు కడుతీయ్యనౌను.

నోటనీపిడికిటి పోటులందినుట
వెన్నరొట్టెలదినుకన్న ప్రియంబు.

నిజముగా నా కాంత లజ్జావిహీన చేష్టలందు ఔదార్య సౌరభము గుబులొ్కనుచున్నది.

క్రొత్తగాదెచ్చినట్టి యంగూరుఫలము
చప్పరించిన పుల్లని చవినొనంగు;
రెండుమూన్నాళ్లు నోర్పుతోనుండుమోయి,
యదియె విరబండి మధురసస్యందియగును.

ఇట్లు వచించి ఆయన న్యాయస్థానమునకు వచ్చి గద్దెపై కూర్చుండెను. అంతట తనయాజ్ఞకు లోబడి యుద్యోగముచేయు చుండిన కొందరు పెద్దమనుష్యులు వినయపూర్వకముగ భూమిని ముద్దిడి యిట్లువిన్నవించిరి: "ఒకవేళ మర్యాదాలోపమని యని పించుకొన్నను దేవరవారి యనుమతితో నొకమాట మనవిచేయ దలచుకొంటిమి. పెద్దల అభిప్రాయమిట్లున్నది:

ప్రతిమాటకుందప్పు పట్టుటతగదు;
ఘనులతప్పరయుట ఘనమైనతప్పు.

అయినను పూర్వమునుండియు దేవరవారి యౌదార్యము మాబోటిదాసుల సుఖజీవనమునకు కారణమైయున్నదన్న కృతజ్ఞత వలన నిట్లువిన్నవింపవలసి వచ్చినది. మాకు న్యాయమైనదని తెలిసియు మీకు తెలుపనియెడల అది యొకవిధమగు విశ్వాస ఘాతుక మగును. మీరు ఆ లాడాలవారి యువతిపై మోహమువదలి కోరిక మరలించుకొనవలయును. న్యాయాధిపతి పదవి యున్నతమైనది; అనన్యగమ్యమైనది. అట్టి పవిత్రపదవిని పాపపంకముచే కళంకితము చేయకుడు. ఆ కాంత యిట్టిదని మీరెరుంగుదురు; చూచియున్నారు మాటలను వినియున్నారు.

ఎన్నియవమానములు పడ్డహీనమతికి
నొకరిమానంబుపై శ్రద్ధయుండుటెట్లు?
ఏబదేండ్లుగడించిన దేనికీర్తి
నొక్కనాటి దుష్కార్యము మొక్కలించు.

స్నేహితులు లేకగ్రీవముగ నొసంగిన హితోపదేశము న్యాయా ధిపతికి సమ్మతముగ నుండెను. వినదగనైన వారి యభిప్రాయము లను కొనియాడుచు అతడిట్లనియెను: "నా ప్రాణమిత్రులదృష్టి

నా స్థితిని కాపాడుటయందు నియుక్తమై యుండుట యెంతయు న్యాయముగను ప్రత్యుత్తరములేని ప్రశ్నగను ఉన్నది. అయినను హితము బోధించినందుకు స్నేహము త్యజింపబడునేని సత్యవంతులను దగాకోరులని నిందింపవలసి వచ్చును."

"యిచ్చవచ్చినయంత హితముబోధించు
కాని భంగినల్పు గడుగంగవశమె
నినుదలంచుట మాన్పనేరరిందెవరు;
తలదెబ్బతగిలిన త్రాచునునేను;
బలమరిచుట్టగా బడియున్నవాడ."

యిట్లునుడివి ఆ యెమ్మెలాడిస్థితి గతులరయుటకు కొందర నియోగించి ధనము మితిమీఱ వెచ్చించెను. తక్కెడలో ధనముండు వారికి రెట్టలలో బలముండునని చెప్పుదురుగదా!

ధనముజూచినవాడు తలవంచు ద్రాసు
పతె, లోహబాహులబలము గల్గియును.

ఎట్లయిననేమి, మొత్తముమీఁద నొకనాటిరేయి న్యాయాధిపతియు ఆ వలపులాడియు రహస్యకేళీవిలాసముల దేలియాడిరి. ఈ విషయమెవ్వరో ఆ రాత్రియే రక్షకభటాధిపతికి నెఱుకపరచిరి. రాత్రియెల్ల న్యాయాధిపతి తలయందు ద్రాక్షాసారాయి కైపును, కౌగిట ఆ ప్రియురాలును ఉండెను. సంతోషాదిశయముచేత నిద్ర పట్టక కూనరాగములు తీయుచుండెను.

ఒకవేళనిరాత్రి యుక్తకాలంబున
గూయకుండునుగాక కుక్కుటంబు;
కాముకీకాముకుల్ కౌగిట ముద్దుల
నినుమంత తనివొంద రింతదనుక
కనుమోడ్చినారొక్క క్షణమువిరోధులు,
అనువయ్యెదరి; కోర్కెలనుభవింపు;
తెలివితేటలతోడ మెలకువనుండుము
బ్రతుకికక్కటులపాలు పడకయుండ;
రాచనగళుల దొలిభేరి రణనములును
బెనుమసీదున దొలికూయి వినెడువరకు
పెదవి పెదవినివీడుట పిచ్చితనము,
తెలివిమాలినకోడి కూతలనునమ్మి.

న్యాయాధిపతి యీ స్థితిలోనుండగా సేవకుడొకడు పరుగెత్తుకొనివచ్చి "ఇంకను మీరిట్లు కూర్చుండియున్నారేల? లెండులెండు అనుకూల సమయమున్నప్పుడే త్వరపడుడు. అసూయాపరులు మీపై నపనిందలు మోపుచున్నారు. అయినను నిజమే చెప్పుకొనుచున్నారు ఈ కీడు ప్రస్తుతము కొద్దిగనే యున్నది. వివేకముతో వర్తించితిమేని దాని నణగద్రొక్కవచ్చును. అట్లుగాదేని రేపుమాపుల నీవార్త లోకమున వ్యాపించును." అని విన్నవించెను. అంత న్యాయాధిపతినవ్వుచు వానితట్టుచూచి యిట్లనియెను:

మృగరాజుహస్తంబు మృగముపైనుండ
కుక్కలు లొల్లిపెట్ట గొరగానితనము;
మోముమోమునజేర్చి ముదితతోనుండు
మరులు ద్రేల్కరచి భగ్నాశులైకుంద.

"ఏలినవారి రాజ్యమున క్రొత్తగా నిట్టిచెడ్డతనము జరిగినది యేమియాజ్ఞ పెట్టెదరు!" అని ఆనాటిరాత్రియే రాజునకెరిగించిరి అంతట రాజిట్లనియెను: "ఆ పెద్దమనుష్యుడు ఈనాటివారిలో అద్వితీయుడగు పండితుడు అని నేనెరుంగుదును ఒకవేళ విరోధులెవ్వరైనను ఆతని యోగ్యతను మాపుటకు నిశ్చయించుకొని యుండవచ్చును. నాకు ప్రత్యక్షముగ ఋజువుకానిదే యీ మాటలు నేను చెవినిబెట్టను. ఏలయన విద్వాంసులిట్లు చెప్పియున్నారు.

త్వరపడి కుపితుడై కరవాలుపూన
బరితాపమున వెన్క బంటవ్రేల్గరచు.

ప్రొద్దుపొడువగనే కొందరాస్థానికులతోడ రాజు న్యాయాధిపతి పడుకటింటికి వచ్చెను దీపములు వెలుగుచుండినవి. ప్రియురాలు కూర్చుండియుండినది. ద్రాక్షాసవము చిందియుండెను. ఆసవపాత్రికలు పగిలియుండెను న్యాయాధిపతి కైపునిద్రలోనుండి రాజువచ్చినదే యెరుగడు,

అంతటరాజు "లెమ్ము, సూర్యుడుదయించెను" అని మెత్తగాపల్కి యాతని మేల్కొల్పెను. అతడు మేల్కొని తానున్న యవస్థను తలపోసుకొని "సూర్యుడేదిక్కున నుదయించెను?" అని ప్రశ్నించెను.

రాజు ఆశ్చర్యపడి "తూర్పుదిక్కున" అని జవాబుచెప్పెను.

"దేవుడు స్తుతింపబడుగాక! అనుతాపద్వారము ఇంకను తెరువబడియున్నది. పురాణమిట్లు చెప్పుచున్నది: సూర్యుడు పడమట పొడుచువరకు దాసులకు అనుతాపద్వారము మూయబడదు. మరి యునిట్లనెను: దేవుని క్షమార్పణము వేడుచున్నాను. అనుతాపము నొందుదునని దేవునియెదుట శపథము చేయుచున్నాము.

దెలివికొరవయు దురదృష్టములును గలసి
పాపపంకంబుగా నన్ను బడగవిసరె
శిక్షయర్హంబె; యైననా చిన్నతప్పు
కరుణమన్నింప, ప్రతిహింసకంటెమేలు,

అంతట రాజిట్లువచియించెను: "ఇప్పటి నీ స్థితియందు పాప పరిహారముగ అనుతాపము నొందుదునని తెలుపుకొనుటలో నేమియు లాభములేదు.

మేడపై మోకువిసర జేయాడనపుడు
దొంగ యనుతాపమొంద నెబ్బంగిమేలు?
పొడుగువానికె ఫలమంట బోలదనిన
గుజ్జువా డందుకొనలేడు కొమ్మదానె.

చక్కగా రుజువుకాబడిన యిట్టి దుష్కార్య మొనర్చిననీకు క్షమార్పణము దుస్సాధ్యము." అని రాజువచించినంతనే రక్షకభటులు నేరస్థుని చుట్టుముట్టిరి.

"నేను ఏలినవారికి మానవి చేసుకొనవలసినమాట యొకటి మిగిలియున్నది" అని యాతడనెను. "అదియేదని" రాజడిగెను.

నన్ను విసుగెత్తి నిరసించినను, దలంప
వలదు మీకొంగువిడనాడు వాడననుచు;
అరయ దుస్సాధ్యమయ్యు క్షమార్పణంబు
మీ కృపాచిత్తవృత్తి నమ్మితినిప్రభువ.

"ఈ చమత్కార వాక్యములు మెచ్చుకొన తగియున్నవి. అయినను నీ పాండిత్యమునకును వాచాలత్వమునకును సంతసించి యీ దినము నిన్ను నా శిక్షానఖములనుండి విముక్తుని చేయుదునేని యిది యన్యాయముగను అవిచారమూలకముగ నుండును. కావున

నిన్ను కోటపై నుండి క్రిందికి త్రోయించుటయె యుక్తమని నాకు తోచుచున్నది. యేలయన నితరులు నిన్ను నుదాహరణముగ గొని నీతి నేర్చుకొందురు.'' అని రాజువచించెను.

''జగత్ప్రభూ, నేను మీ కుటుంబ దాస్యత్వమువలన పోషింప బడితిని. లోకమున నేనొక్కడనే యిట్టితప్పు చేసినవాడనుగాను వేరొకని త్రోయించుడు. వానినిచూచి నేను నీతి నేర్చుకొందును.'' అని న్యాయాధిపతి విన్నవించెను. ఈ మాటలకు రాజు కడుపుబ్బనవ్వి శిక్షనుపసంహరించి ఆతని మరణమున కెదురుచూచుచుండిన యసూయాగ్రస్తులతో నిట్లనియెను:

తప్పుసేయనివాడు ధరలోనలేడు
ఒరులతప్పులుచూచి పరిహసింపకుము.

౨౦

చక్రనియువకుండు సత్ప్రవర్తనుడు
చంద్రాస్యయుంగూడి జలధియానంబు
సలిపిరి; యానావ సలిలవీచికల
ద్రుళ్లింతలాడుచు సల్లనంజనియె;
ఒకనాడు నావపై నొరగానిల్చి
యువతియు యువకుండు సుపవికల్లోల
గంభీరనాట్యంబు గాంచుచునుండ
సొరిగనోడయు, వారు సుడిగుండమందు
విరుచుకొనిపడిరి విధిచేష్టవశతన;
ఆవర్తజలవేగ మతిశయింపంగ
సంపజంటవిధాన నందుచుట్టిదరు;
అదిగాంచి నావికుడప్పుడో దుమికి

యువకుని బాహువు నొడిసిపట్టంగ
"ననువీడి ప్రియురాలి మునుగావు" మంచు
నలలమధ్యమునుండి యతచెనా ప్రియుడు;
ఆపల్కులకు లోకమతని ప్రేమించె;
"ప్రియను కష్టములలో విడనాడినట్టి
పాపినడుగకుమీవు ప్రణయతత్వంబు"
అని యదృశ్యుండయ్యె నంబుగర్భమున;
ప్రణయతంత్రంబుల బహువిధానములు
అంతుపొంతులెరుంగ నయ్యోసాదీకి;
బగదాదున నరబ్బి భాషచందమున,
హృదయరంజనియందు హృదయంబునిల్పి,
కనులెత్తిచూడకు కడమలోకంబు;
మరలజీవింతురేని మజ్నూనులైలి,
ప్రణయతత్వంబిందు బడయంగగలరు.

గులాబితోటలోని

పంచమాధ్యాయము

సంపూర్ణము.

గులాబితోట

షష్ఠాధ్యాయము

వార్ధక్యదౌర్బల్యము

౧

దిమిష్కునగరమునందలి పెద్దమసీదున కూడియున్న పండిత సభయందు నేను శాస్త్రివాదము చేయుచుండగా నొకయువకుడు ప్రవేశించి "ఇచ్చటనున్నవారిలో పారసీభాష తెలిసిన వారెవరైనా నున్నారా" అని ప్రశ్నించెను. వారు నన్నుచూపిరి. "విషయ మేమి?" యని నేనడిగితిని. అతడిట్లనియెను: నూటయేబది సంవత్స రముల వయస్సుగల యొకవృద్ధుడు మరణావస్థలో నున్నాడు. అతడు పారసీభాషలో ఏమోచెప్పుచున్నాడు. మా కర్థమగుటలేదు. మీరు దయచేసి కొంచెము శ్రమతీసుకొని యచ్చటికి వత్తురేని మీకు ప్రతిఫలముకూడ ముట్టవచ్చును. అతడొకవేళ వీలునామా వ్రాయించవచ్చును.

నేనా వృద్ధునివద్దకుపోయి తలవిండుపై వంగితిని. అతడిట్లు తిన్నగాచెప్పెను:

కొన్నినాళ్లైన గోర్కెలుగుడుతునను చు
పలచితిని, ప్రాణమయ్యో! పైదారిపట్టె;
ఎలువగలజీవితపు పైడిపళ్లెరమున
కణము చవిచూచితినొలేదొ, చాలుననిరి

ఈ పద్యములోని భావమును దిమిష్కునగరవాసులకు అరబ్బీ భాషలో వివరించితిని. ఇంతదీర్ఘకాలము బ్రతికియుండియు, ఐహిక జీవితముపై అతనికిగల కోర్కెనువిని వారాశ్చర్యపడిరి.

"నీస్థితి ఎట్లున్నది?" అని ఆముదుసలిని ప్రశ్నించితిని. అత డొక నిట్టూర్పువిడిచి యిట్లనియెను:

"ఏమని చెప్పుదును?

పన్నువిరిగెడునప్పుడు పడెడుబాధ
నొక్కపారి యనుభవించి యుందువేని
ప్రాణము ప్రియాంగమునువిడి పరచుస్థితియు
నెట్టులుండునో నీవె యూహింపగలవు."

అంతట నేనిట్లంటిని: "మరణముతలంపును నీ మనమునుండి వెడలింపుము. నీ శరీరస్థితిపైని సంశయము వదలుము. ఏలయన, దేహస్థితి దృఢముగనున్నను చిరంజీవత్వమున కది హామీ కాదనియు ఒకవేళ రోగము హెచ్చినన్న మాత్రమున అది మృత్యువునకు అమోఘమైన సూచనకాదనియు యూనాని తత్త్వవేత్తలు వచించి యున్నారు. సెలవిత్తురేని, మీ రోగము కుదుర్చుటకు వైద్యుని పిలిపించెదను." ఈ మాటలకు ఆ వృద్ధుడు కనులెత్తి చూచి నవ్వి యిట్లనియెను:

భాండమట్టుల వృద్ధుండుపగిలిపోవ
జేయివిదలించు విగతాశచేత వెజ్జు
గోడకాలులోలోపల గ్రుంగుచుండ
గృహముగళల శృంగారించు నింటిపెద్ద.

చరమదశ బాధకడలు నశక్తవృద్ధు
కాళులకు దాది ముసలమ్మ గంధమలదు;
ఉలుకుదిన్న కొయ్యటు దేహముదుటుదక్క
మందుమాకులు మంత్రంబు లెందుకెక్కు.

౨

ఒక వృద్ధునిగురించి యిట్లు చెప్పుకొనిరి: ఆతడొక మెల

ప్రాయపు టందగత్తెను పెండ్లియాడెను. పడకటిల్లు పన్నీరుపూవు లతో సింగారింపబడెను.

అతడు ఏకాంతమున ఆ కాంతతోడ కూర్చుండి, హృదయ మును కన్నులను ఆమెయందు లగ్నము చేసియుండెను. క్రొత్త కోడంటికపుసిగ్గు, భయము, అనిష్టము వదలించిన సహవాసము దృఢమగునని తలంచి రాత్రులయందు కన్నుమాల్పక ఆమెతోడ సరససల్లాపము లాడుచుండెను.

ఇట్లుండ నొకనాటిరాత్రి యాతడీవిధముగ నుపన్యసింప సాగెను: "నీపైని అదృష్టము చెలిమిచూపినది; వైభవము కన్ను తెరచినది. ఏలయన నావంటి ముసలిమగని సాంగత్యము నీకుప్రాప్తిం చెను. నేను లోకజ్ఞానము కలవాడను. గొప్పగా బ్రతికినవాడను. సుఖదుఃఖము లనుభవించినవాడను. మంచిసెబ్బరలు గోష్ఠిమర్యా దలు స్నేహనియమములు చక్కగ నెరుంగుదును. దయాదాక్షిణ్య ములు, సంతోషస్వభావము కలదు. మధురభాషిని.

చేతనైనంతవరకు నీచిత్తమరసి
కన్నులను గప్పుకొందు నో కలికిమిన్న;
చిలుకకటుతిండి కలకండ పలుకులైన
దియ్యనౌ నాదుబ్రతుకు నీ తిండికిత్తు.

మొరకతనము, తెలివితక్కువతనము, కోపదారితనము గల యొకయువకుని చేతిలో దైవవశమున నీవు పడకుండుట మంచి దయ్యెను. అట్టి చంచలచిత్తుడు ప్రతిక్షణము ఇంద్రియలోలుడై యుండును. నిమిషనిమిషము అభిప్రాయములు మార్చుకొనును. ప్రతి రాత్రియు నొక్కొకచోట నిద్రించును. ప్రతిదినమును ఒక్కొక ప్రియురాలిని చేపట్టును.

ముక్కు మొగమందమును దెల్పిపోనరుగాని
యువకుల కెడంద యచలమై యుండుదొకట;
ప్రతినిమిష మన్యరోజాలపైకి నెగురు
బుల్బులికి ప్రేమవిశ్వాసముల్ తిరంబె!

అయినను నావంటివృద్ధుల తెగకు సంబంధించిన పెద్దమనుష్యులు తెలివితేటలతోను మట్టుమర్యాదలతోను జీవనయాత్ర సాగింతురుగాని యువకులవలె అజ్ఞానవంచితులు గారు.

చాన, నీకన్నమేలైనవాని గొనుము;
అవను వృథసేయ కాదాయమంతగనుము;
నిన్నుబోలినవాని వాంఛింతువేని
నన్నుగిలు భాగ్యరేఖా ప్రసన్నపథము.

"ఆ యువతి హృదయమును వశపరచుకొని నాయందు బద్ధానురాగనుగ నొనర్చికొనగలను." అని తలంచి యానారణితో వచించితిని. ఆ తరుణి తిరగాలున వేదనాభరితమైన హృదయాంతరాళమునుండి వేడినిట్టూర్పు వెడలించి యిట్లనియెను: "మీరు చెప్పినమాటలను తెలివితో నెంత విమర్శించి చూచినను అందొక్కటియు పూర్వమొకప్పుడు నాదాది చెప్పిన వాక్యములతో తులతూగదు. అవియేవన: "జవ్వనముగల చిన్నది ముసలివాని ప్రక్కలో పరుండినయప్పటి వేదనకంటె ప్రక్కలోని బాణక్షతి బాధయే మేలుగ నుండును."

మగని పేరెద దనియుని మగువయింట
సణుగుగొణుగులు ఘర్షణ స్పర్ధలెనగు;
కర్రమోపునలేచెడు తొర్రివగ్గు
తెరవ పడుకింటిమోజులు దీర్పగలడె?

మొత్తముమీద సారాంశమేమనగా, వారిరువురికి పొత్తుకుదరక సంబంధము తెగదెంపుచేసుకొనిరి. నిర్ణీతకాలము దాటినవెనుక ఆ యువతిని ఒకయువకునికిచ్చి పెండ్లిచేసిరి. ఆతడు కోపదారి. చేతిలో పైసాలేనివాడు. దుఃస్వభావుడు. అందువలన పాపమా యిల్లాలు దౌర్జన్యమునకు కష్టములకు పాల్పడియును దేవునికి కృతజ్ఞతాపూర్వకముగ నిట్లనియెను: "దేవుడు స్తుతింపబడుగాక! ఆ నరకబాధలు తప్పించుకొని యిప్పటి స్థిరసౌఖ్యమును పొందితిని."

మధురవదనంబు పట్టుజామాలునూడు
పొడియు, గంధము, రంగును, ఫోగలిప్ప
పొలతులకు నవ్వియెల్లను భూషణములు;
పురుషులకు బూరుషత్వమే భూషణంబు.

కోపగింపులు దుడుకులు కోటులున్న
అనమ సౌందర్యమూర్తి పీవొట వలతు;
నితరులంగూడి స్వర్గాన బ్రతుకుకంటె
నరన నీవుంట నరకవాసంబుమేలు!

పాటలాధరముద్దు నోటవెల్వడిన
యుల్లివాననయైన నొప్పిందంబగును
వికృతాంగిచేతి గుల్విరిబంతికంటె

3

'బకర్' దేశమున భాగ్యవంతుడైన యొకవృద్ధునకు నేను అతిథినైయుంటిని. ఆతనికి రూపవంతుడైన యొకకుమారుడుండెను వృద్ధుడు తనచరిత్రమిట్లుచెప్పెను. "నాకీ జీవితమందు, ఈ బిడ్డ యొక్కడు తప్ప మరెవ్వరు కలుగలేదు. ఆ కోనలో నొకచెట్టున్నది

దానివలన ఆ ప్రదేశము యాత్రాస్థలమైనది. ప్రజలు వరములడుగుటకు అచ్చటికి వచ్చుచుందురు. నేను కొన్నిరాత్రులు ఆ చెట్టు దగ్గర వరపడి దేవుని ప్రార్థించుచుంటిని. అంతట వరప్రసాదము వలన ఈ బిడ్డ పుట్టెను.''

ఆ కుమారుడు మెల్లగా మిత్రులతో నిట్లు చెప్పెనని వింటిని: ఆ చెట్టున్నచోటు నాకు తెలిసియున్న ఎంతబాగుగానుండును? మా తండ్రి చావుకొరకు నేను ప్రార్థించియుందును.''

పిల్లవాడు తెలివిగలవాడాయెనని తండ్రి సంతోషించుచుండ తండ్రి తెలివిమాలిన ముసలిగొడ్డని కొడుకు నిందించుచుండెను.

తరలె బెక్కేండ్లు నీ జీవితంబునందు
తండ్రిగోరినిగాంచ నాతట్టుచనవు;
పితరులరుసింప జెయిచాచిపెట్టినావె?
కొడుకు నీకేమి యొనరింపగోరుకొనెదు?

౪

ఒకనాడు దారిపట్టి యౌవనగర్వమున పరుగెత్తి రాత్రికాలమున ఒక తిప్పమొదల అలసిసొలసి పడియుంటిని. సార్థవాహామును వెన్నంటివచ్చిన యశక్తుడైన ముసలివాడొకడు నన్నుచూచి ''ఏల నిద్రించుచున్నావు? ఇది నిద్రించుటకు తగిన స్థలముకాదు,'' అని నన్ను హెచ్చరించెను. ''నడచుటకు కాళ్ళురావు. నేనెట్లు నడవగలను'' అని నేనంటిని. ''పరుగెత్తి యలసి కూలబడుట కంటే కొంతనడచుచు కొంత విశ్రాంతిగొనుచు పోవుటయే మేలు'' అని పెద్దలు చెప్పినవాక్యము నీవు వినలేదా?

అంచెజేరుతలంపున్న నాత్రపడకు
ఓర్పువహియించుము; నాదు హితోక్తివినుము;
రయమునంబోవు నౌకజామరబ్బిహయము,
తడబడక రేలునుబవళ్ళు నడచునొంటె.

౫

మా సంతోష గోష్ఠియందొక చురుకైన యువకుడుండెను. ఆతడు చతురమధురభాషి, దరహాసవదనుడు. ఏవిధమైన దుఃఖమును ఆతనిహృదయము నంటలేదు. ఆతడు వెడలిపోయి చాలాకాలమయ్యెను మేమిరువురము కలసికొనుట తటస్థింపకుండెను. తర్వాత కొంతకాలమునకు చూచునప్పటికి ఆతడు పెండ్లియాడి బిడ్డలతండ్రియై యుండెను. ఆతనిసంతోషము మూలచ్ఛేదమై మోము గులాబి వాడియుండెను. ఆ మార్పుగమనించి "నీ స్థితిగతులేమి" అని ప్రశ్నించితిని. "పిల్లలతండ్రి నైతిని, కావున పిల్లతనము మానితి" నని ఆతడు చెప్పెను.

వృద్ధుడవైనంత విడుపిల్లతనము;
ఆటపాటలు వీడుమయ్యా బాలురకు.

యువకుని యుత్సాహముండునే ముదుకకు
ఎక్కునే వెనుకకు నేటినీరు?
పంటకారున దంటుపసలేని పరిచేలు
పడకనిల్చునె పచ్చపైరులటుల?
హస్తసంచ్యుతమయ్యె యౌవనమయ్యయ్యొ!
ఎంతమోహనమైన ఋతువుచనియె!
సింహముష్టిబలంబు జీర్ణించె బాహుల
చిరుతనాజున్నుతో గరతుతృప్తి;

తలకు రంగువేసిన యవ్వతట్టుచూచి
నేనిటంటిని: ముసలమ్మ, నెరకలేమొ
కప్పిపాడిపూతతో నల్పుగాంచెగాని
వంక వీవును సరిచక్కపరచలేవు.

౬

యౌవనపుటజ్ఞానమున ఒకనాడు మా తల్లిని అరచి కసరితిని ఆమెహృదయమున వేదనపడుచు ఒకమూలకూర్చుండి ఏడ్చుచు నిట్లనియెను: "నీకు బాల్యము జ్ఞప్తియున్నయెడల ఇప్పుడు నన్నిట్లు కష్టపెట్టి యుండవు.

పులివలె శౌర్యంబు బలమును గల్గి
గున్నయేనుగుబోలు కొడుకునుగాంచి
ముదముతో నిట్లనె ముదుసలి తల్లి
పాల్ద్రావి నాయెద బన్నున్ననాటి
నిస్సహాయస్థితి నీవ్మృతినున్న
గసరికొట్టవునన్ను; గాని యీనాడు
సింహసత్త్వుడవీవు; జీర్ణాంగి నేను.

౭

పిసినిగొట్టు భాగ్యవంతుడొకడుండెను. అతని కుమారుడు వ్యాధిగ్రస్తుడాయెను. మేలుగోరు మిత్రులిట్లనిరి: "పిల్లవాని రోగము కుదురుటకు ఖురాను పారాయణము చేయుము, లేదా జంతువునైన బలియిమ్ము" కొంతసేపాలోచించి యా లోభి యిట్లనియెను: "మంద దూరాననున్నది కావున ఖురానుపారాయణమే మేలని తలంచెను" ఈ మాటలువిన్న యొక పెద్దమనుష్యుడిట్లని

యెను: "ఆతనికి ఖురాను పారాయణమేల యిష్టమైనదనగా, ఖురాను నాలుక కొనయందున్నది. ధనము ప్రాణకోశము నందున్నది."

దాసహస్తంబుజాపని మానవుండు
భక్తిమెడవంచినంతనే ఫలితమేమి?
రూకయిమ్మన్న, గాడిద రొంపినట్లు
కదలడు; ఖురాను గోరిస జదువు శతము.

౮

" నీవేల పెండ్లిచేసికొనవు?" అని యొకముసలివాని నడిగిరి.
"నాకు ముసలిదానిపై కోరికలేదు."

"నీకు భాగ్యమున్నది కావున యువతినే యేల పెండ్లియాడరాదు?"

"ఏలయన, అది యువతియేయైన నావంటిముసలాతని ఎట్లు ప్రేమింపగలదు?" అని ఆయన చెప్పెను.

డెబ్బదేడుల తాతయ్య నిబ్బరంపు
యౌవన రసానుభూతిపై నాసగొనుట
కలను నంధుండు కన్నులు గాంచినట్లు;
తరుణి బలమునుగోరు, నీ ధనముగాదు.

౯

కడచన్ననాళుల గడువృద్ధుడొకడు
తరుణిని జేపట్టి దలపోసియొక్క
ముద్దుల మూటను, మోహంపు బరణి

ఎలప్రాయపుంగలికి, వలరాచములికి
'ముత్యా' మనెడి పేరి ముగ్ధనుదెచ్చి,
ముత్తెంబు బరణిలో మూసినపోల్కి
మగపురుగుల కంటకగపడనీక
అంతిపురంబున కామెనర్పించె
ఆ నిషేకముహూర్తమతి వైభవముగ
జరిగె; పూవులపాన్పు నంసిద్ధమయ్యె;
పడుకటింటను వెల్గె పటికలస్తరులు;
అత్తరు జవ్వాది యగరు గంధములు,
పన్నీరుపూవుల పచ్చివాసనలు
కామాగ్ని నెగనూదు గాలియైవినరె;
శయనమందిర మిహ స్వర్గమైయొప్పె;
యుద్ధసన్నద్ధుడై వృద్ధవీరుండు
నంగబలంబెల్ల నాయత్తపరచె;
ప్రథమ యత్నముననే ధ్వజభంగమయ్యె;
విల్లెక్కుపెట్టి యేవిధము చూచినను
గురిదాకునట్లుగా గొట్టలేడతడు;
ముతకబొంతనుగుట్ట మొనగలసూది
యుక్కుడిగాకున్న యుపయోగపడదు.
తన మానమర్యాద తనవంశకీర్తి
తన జీవితసుఖంబు తనప్రేమరక్తి
యీ మాయలచినాలి యింతియొల్లమిని
అంతయు నశియించె ననినిందమోపె;
ఆలుమగలనందు నధికఘర్షణము
తిట్టుకొట్టులునింట తీరనిపోరు
బలిసి, రక్షకభట స్వామికిందెలిసె;

సాదియిట్లు వచియించెః చాలించునింద;
తరుణిది యేలాటి తప్పులేదిందు;
వార్ధక్యమునచేయి వడకుచునుండ
ముత్యంబునకు బొంద బొడువనీతరమె?

గులాబితోటలోని

సప్తమాధ్యాయము

సంపూర్ణము.

గులాబితోట

సప్తమాధ్యాయము

విద్యాప్రయోజనములు

౧

ఒకానొక వజీరునకు మందబుద్ధియగు కుమారుడుండెను. విద్యాభ్యాసమువలన బుద్ధి వికసించునని తలంచి తండ్రి కుమారుని ఒక పండితునియొద్దకు చదువబంపెను. అతడు కొంతకాలము బాలునకు విద్యనేర్పెను. కాని ప్రయోజన మేమియు గాన్పించనందున "ఈతడు బుద్ధిమంతుడు కాకపోవుటయేగాక నన్నుగూడ వెర్రివానిని చేసెను" అని చెప్పి ఆ బాలుని మరల తండ్రియొద్దకు పంపెను

పదనులేని యినుము బలుసానవెట్టియు
జక్కజేయగలడె శాణికుండు;
సహజ బుద్ధిశక్తి సంపదయున్ననే
శిక్షణమునమేలు చెందవచ్చు.

ఏడుమార్లుకుక్క నేటిలో గడిగిన
తడిగనున్నవరకు దాల్చు మురికి;
మారబోదు తాను మక్కాకునేగియు
ఏసుక్రీస్తు వెక్క రాసభంబు

౨

ఒక తత్వవేత్త తనబిడ్డలకిట్లు నీతిబోధించెను: "ప్రియపుత్రులార, కళలు: శాస్త్రములు నేర్చుకొనుడు. లౌకిక ప్రాభవములు ఆస్తిపాస్తులు నమ్మియుండ తగినవికావు ఒకచోటినుండి మరియొక చోటికి పయనించునప్పుడు ధనము ఆపదలకు అపాయములకు మూలమగును, లేదా దొంగలు దోచుకొనవచ్చును. అట్లుకాదేని అనుభుక్తమయి క్రమక్రమముగ క్షీణింపవచ్చును. అయితే, విద్యయట్టిదికాక యింకిపోని సెలయేటివలెను, స్థిరమైన ప్రాభవము

వలెను. మరణపర్యంతము పాపగ్రస్తుడైయుండును. విద్యావంతుడొకవేళ పదభ్రష్టుడైనను చింత లేదు. ఏలయన విద్య తనంతతానే యొక యైశ్వర్యము. పండితుడెక్కడికి పోయినను గౌరవింపబడును; ఉన్నతస్థానమలంకరించును. విద్యావిహీనుడు పొట్టకూటికయి తిరుగులాడుచు కష్టపడుచుండును.

పదవి యధికారముండిన వాడు మరల
నాజ్ఞ ననువర్తియై దాస్యమందునుంట,
బ్రతుకు సుఖముగ బుచ్చినవాడు పరుల
కటికిరాపిడికోర్చుట కష్టతరము.

శ్యామదేశంబున జరిగె విప్లవము
తమవృత్తులనువీడి తరలిరి ప్రజలు;
విద్యావివేకంబు వెలయుట కతన
పసుచు రైతులు మంత్రిపదవులంగొనిరి
మున్నట్లు మంత్రుల మురిపెంపు సుతులు
తెలివితేటలులేని వెబెలౌకతన
ఇంటింట బిచ్చంబునెత్తి జీవింత్రు.

3

రాజకుమారునికి విద్య నేర్పుటకై యొక విద్వాంసుడు నియమింపబడెను. ఆ పండితుడు రాజకుమారుడన్న గౌరవమైనచూపక వానిని కఠినముగ దండించుచుండెను. అంతట నొకనాడు బాలుడీ దారుణ శిక్షనోర్చుకొనలేక చొక్కాయి నూడబెరికి నొప్పిపుట్టుచున్న తన శరీరమును తండ్రికిచూపి మొరపెట్టెను.

అంతట తండ్రి కోపోద్రిక్త చిత్తుడయి ఉపాధ్యాయుని రావించి యిట్లనియెను: “నా కుమారుని ఇంతదారుణముగ దండిం

చునట్లు సామాన్యులగు రైతుబిడ్డలనైన దండింపవు. కారణమేమి?"

"ఏలయన, ఆలోచించి మాటలాడుటయు పదుగురు మెచ్చునట్లు ప్రవర్తించుటయు సర్వజన సామాన్యమునకు తగనై యున్నది; అందుముఖ్యముగ సామాజాలకు అవశ్యకము. వారు ఏకార్యము చేసినను ఏమాట మాటాడినను ఏదోయొక విధముగ లోకమున వ్యాపించును. సామాన్యుల సేతలకు మాటలకు అంతవెల్లడి యుండదు.

ధరను నిరుపేదకొకనూరు తప్పులున్న
నందునొకటియు నెరుగబోరతనినఖులు,
రాజుపొరబడి యొక యకార్యంబుసేయ
దిక్కుదిక్కులనదియు ప్రతిధ్వనించు.

కావున ఉపాధ్యాయుడు సామాన్యజనుల బిడ్డల శిక్షణము కంటె రాజకుమారుల నీతిప్రవర్తనములు శిక్షించుటయందు ఎక్కువ శ్రద్ధపూనుట అవశ్యకము.

పసితనంబున నద్వృత్తి పట్టుపడిన
బెద్దతనమున భాగ్యంబు పీడకుండు,
పచ్చికట్టె గోరినయట్లు వంచవచ్చు,
అరినను నిప్పుచూపక యలవిగాదు.

ఆ పండితుని ప్రత్యుత్తరములోని సమంజసమైన విశదీకరణకు రాజు సమ్మతించి అతనికి గౌరవసూచకమగు అంగీని ధనమును బహుమతిచేసి పదవిని హెచ్చుచేయించి పంపెను.

౪

పడమటిదేశమున నొక యుపాధ్యాయుని చూచితిని. అతని మొగమెప్పుడును మటమటలాడు చుండును, మాటకటువు దుఃస్వ

భావుడు. ప్రజల పీడించువాడు. మితిమీరతిని త్రాగెడువాడు. అతని గాంచినంతనే ముసల్మానుల సంతోషము నశించును. అతడు ఖురాను పఠించువిధము మానవ హృదయమును శోకాంధకారమున ముంచును. ముద్దులొలుకు బాలబాలికలు అతని క్రౌర్యమునకు లొంగి నవ్వుటకు శక్తిగాని మాటలాడుటకుచనవుగాని లేకయుండిరి. ఒకతూరి యొకనిపాలబుగ్గలపై లెంపకాయలు వేయును. మరొక సారి యింకొకని స్ఫటికమువంటి కాళ్లను చిరుతలలోచానిపి యొత్తును.

తుదకు ఆ యుపాధ్యాయుని దుష్టస్వభావమునందు లేశమాత్రము పిల్లల తల్లిదండ్రులకు తెలియవచ్చి అతని బాగుగా మర్దించి యూరు వెడలగొట్టిరి.

అంతట ఆ పాఠశాల నొకసజ్జనునికి అప్పగించిరి. అతడు సత్స్వభావము గలవాడు తత్త్వవేత్త ఆవశ్యకమైననే తప్ప మాటలాడడు. అతని నాలుకయాడదు. మొదటి యుపాధ్యాయునివలన బాలురకు కలిగినభయము బొత్తిగ నశించినది. రెండవ యయ్యవారి కారుణ్యము గుర్తెరిగి యొక్కొక విద్యార్థియు నొక్కొక దయ్యముగ పరిణమించెను.

అతని మెత్తదనమువలన బడిపిల్లలు చదువుసంధ్యలుమాని వీలైనపుడెల్ల ఆటపాటల ప్రొద్దుపుచ్చుచు, వ్రాత పూర్తికాక పూర్వమే పలకలను ఒకరితలపై నొకరు పగులగొట్టుకొనుచు రచ్చారావడి చేయుచుండిరి.

గురువుమెత్తనయ్యెన గొంకుజంకెడలి
బాలురు వీథి గోలీల నాడెదరు.

రెండువారములు గడచిన వెనుక నేనా మసీదునకు పోయి

నప్పుడు మరల వచ్చుట మొదటి యుపాధ్యాయుని చూచితిని. బడి పిల్లల తండ్రులు ఆతని నెట్లో సంతోషపెట్టి తీసుకొనివచ్చి మరల నుపాధ్యాయపదవి నొసంగిరి. ఇందుకు నేను నొచ్చుకొని యిట్లంటిని: “ఈ సైతానును దేవదూతలకు చదువు చెప్పుటకేల నియమించిరి”

లోకమెరిగిన యొకవృద్ధుండు నా మాటలువిని నవ్వుచు నిట్లనియెను:

పాదుషాహి కుమారుని బడికిబంపె
వెండి పలక వాని మెడకు వ్రేలగట్టి;
“నాన్నదయకన్న గురువుదండనముమేలు”
అనెడు పలుకందు స్వర్ణాక్షరాంకితంబు.

ఒక పుణ్యాత్ముని కుమారునికి మితిమీరిన ద్రవ్యము పిన తండ్రి మూలమున చేపడెను. అతడు ముండలముతాకోరయి హద్దు మీరి చరించుచుండెను. అతడాచరింపని పాపకార్యములుగాని, రుచి చూడని లాహిరివస్తువులుగాని లేవని చెప్పవచ్చును. ఒకతూరి యిట్లు హితముబోధించితిని: “కుమారా, ఆదాయము పారుచున్న నీరమువంటిది. వ్యయము తిరుగుచున్న తిరుగలిరాయివంటిది. అనగ నమ్మకమైన రాబడియున్నవాడె యెక్కువగ వెచ్చించుటవలన ఆపదనొందడు.”

సిరుదగవైన రాబడి లేకయున్న
వెడలెరుంగక వెచ్చింప నిడుమలొదవు,
కొండపట్టుల వర్షంబు గురియకున్న
ఇంకు ‘దిజ్లా’ జలంబొక్క యేటియందె.

తెలివి తెచ్చుకొని మంచినడవడిక యలవరచుకొనుము. ఆటపాటల కొంటెతనము వదలుము. నీ యాస్తియడుగంటినపుడు కష్టములపాలయి అనుతాపము నొందెదవు.” నామాటలు భోగలాలసుడైన ఆ యువకుని చెవినిదూరక హితమును తిరస్కరించుచు నిట్లనియెను: “క్షణికమైన నేటి సంతోషమును మరణానంతర కష్టభావనచే అనను భోగ్యము గావించుకొనుట ప్రాజ్ఞసమ్మతముగాదు.

భాగ్యవంతులు భోగేచ్ఛపరగువారు
భావి దుఃఖభయంబున వనరనేల?
ప్రాణమిత్రుడ, సంతోషమనుభవింపు.
పగవకుమునేడె రేపటి వ్యధలుదలచి.

ఔదార్య పట్టభద్రుడనయి దానదీక్షవహించిన నా కీర్తి సర్వజన సన్నుతి పాత్రమయి లోకమున వ్యాపించియుండ నాకు నీ హితమెట్లు సరిపడును.

జనుల దయజూచి, దాస ధ్వజంబునెత్తి
ధనము సంచులు బిగియింప ధర్మమగునె?
పేరును ప్రతిష్ఠయును బయల్వెడలినంత
దలుపుమూయంగ నెవ్వరి తరముచెపుమ.

నా హితబోధ నాతడంగీకరింపలేదనియు నా వేడి యూర్పులకు ఆతని చల్లని యినుము ఒత్తుడు పడలేదనియునెరింగి బుద్ధిచెప్పుటమాని, ఆతని సాంగత్యము వీడి తత్త్వవేత్తల యుపదేశము ననుసరించితిని. “నీ విధి ప్రకారము నీతిబోధించుము. వారు వినరేని నీ దోషముకాదు.”

ఎన్నినీతులు ధర్మంబు లెరిగియున్న
విననివానికి జెప్పకు; వేగమతడు

అర్యుల హితోక్తి వినదైతి నయ్యో యనుచు
బద్ధుడై నీపదంబుల బడగలందు

కొంతకాలము గడచిన వెనుక, నేను పూర్వముతలంచినట్లె యాతనికి దుర్దశ తలచూపెను. తన కుట్లబొంతకు పేలికలపై పేలికలు వేసి కుట్టుకొనుచు అన్నకబళమునకై యిల్లుల్లు తిరుగుచున్న ఆ యువకుని దురవస్థచూచి చింతించితిని. ఇట్టి స్థితిలో ఆతని నిందించి, పుంటిని చెలరేపి యుప్పుచల్లుట అనూనుపముగనుండును గావున, నాలో నేనిట్లనుకొంటిని.

తుచ్ఛభోగు దదృష్టమత్తుండు తలప
నెపుడు లేమిడిదినముల యిక్కటులను;
ఎండకాలంబున ఫలంబు లిచ్చుకతన
అకురాల్చును జలికాలమందు జెట్లు.

౨౬

"నీ బిడ్డలలో నొకనినిగా చూచుకొని వీనికి విద్యాబుద్ధులు నేర్పుము" అని పాదుషా తనకుమారుని ఒకపండితుని కప్పగించెను. ఒక సంవత్సరము ప్రయత్నపూర్వకముగ చదువుచెప్పినను ప్రయోజనములేకుండెను. అయినను పండితుని పుత్రులు శాస్త్రములందు ప్రవీణులయిరి.

పాదుషా పండితుని తూలనాడి "నీవుచేసిన వాగ్దానమునకు వ్యతిరేకముగ ప్రవర్తించితివి. నీయందుంచిన నమ్మకము వ్యర్థము చేసితివి" అని నిందించెను. అంతట పండితుడిట్లు విన్నవించెను: "దేవరవారిబుద్ధికి గోచరింపనిదేదియులేదు. అందరకు శిక్షణమేక విధముగనుండినది. కాని ప్రకృతులు వేరు"

రాళ్లలో వెండి బంగారు ప్రభవమయ్యు
అవిలభించునె ప్రతిరాతియందు మనకు?
స్వాతిచినుకులు పలుచోట్లబడియుశుక్తి
గర్భమునయందె ముత్యమావిర్భవించు

౭

ఒక వృద్ధాచార్యుడు శిష్యునితో నిట్లుచెప్పుచుండ వింటిని: మానవుడు దినబత్తెముపై ఆధారపడియుండునటులు దేవునిపైనాధారపడియుండు నేని అతడు దేవదూతలకంటె ఉన్నత పదము నలంకరించును.

మాతృగర్భంబున మతిలేని విత్తువై
పడినయప్పుడు నిన్ను విడువలేదు;
ఆత్మప్రసాదించె; నతులస్వభావంబు
గ్రహణశక్తియు, బుద్ధిగరిమనిచ్చె;
ఉపరికట్టడ, యంగు, నడుము, నాసె, మెదంచ
తలపు, వివేకంబు, ధైర్యమొసగె;
రెండు భుజంబుల రెండు బాహులగూర్చె
రెండుచేతుల బదిప్రేళ్ల నదికె;
ఇట్టి కరుణామయుండగు నీశ్వరుండు
అఖిలజీవుల కాధారమైనవాడు
నీదు దినబత్తెమును నేల నేడుమరచు
నోయి యవివేకచిత్తుడా, యూహసల్పు.

౮

ఒక యరబ్బీ తన కుమారునికిట్లు చెప్పుచుండ వింటిని; "ఈ

జీవితమున నీవేమి సత్కార్యము లొనర్చితివని అంత్యదినమున నిన్ను డుగుదురుగాని నీతల్లిదండ్రులెవరని ప్రశ్నింపరు."

పావనంబైన 'కాబా'కు బైనికప్పు
పట్టుపుట్టము సత్కీర్తి, పట్టుపురుగు
వలనవచ్చుటగాదు; తాభవ్యమిత్రు
సంగతిని గొన్నినాళ్ళుంట సమతగాంచె.

౯

తత్త్వవేత్తల గ్రంథములందిట్లు చెప్పబడియున్నది: "తేలు ఇతర జంతువులవలె పుట్టక తల్లిప్రేవులను భక్షించి పొట్టను చీల్చుకొని బయలువెడలి యెడారి దారిపట్టును. తేలుబొరియలలోనున్న చర్మములే యందుకు నిదర్శనము.

ఒకప్పుడు ఈవిచిత్ర విషయమును ఒక పెద్దమనుష్యునికి చెప్పితిని. ఆతడిట్లనియెను: "ఈవాక్యములోని సత్యమును నిరూపించుటకు నాహృదయమే సాక్ష్యము. ఇంతకన్న వేరు విధముగనుండదు. బాల్యమున తల్లిదండ్రులయెడ నెట్లు ప్రవర్తింతురో అట్లే పెద్దతనమున వారంగీకరింపబడుదురు."

ఇట్టి నీతిని మరవకు మెప్పుడనుచు
మరణదశబల్కె తండ్రి యాత్మజునితోడ;
బంధుమిత్రుల నమ్మని పామరుండు
పండితుల స్నేహదృష్టికి బాహ్యుడగును.

"చలికాలమున నీవేల బయటికిరావు" అని తేలునడిగిరి. "ఎండకాలమున నేనేమి కీర్తిని గడించితిని గనుక చలికాలమున గూడ బయటికి రావలయును," అని అది జవాబుచెప్పెను.

౧౦

ఒక దరిద్రుని భార్య గర్భవతిగనుండెను. నెలలునిండి కాన్పు సమయము దాటెను. దరిద్రునికి తన జీవితమునందెప్పుడును కొడుకుపుట్టియుండలేదు కావున అతడిట్లనియెను: "సర్వశక్తి సంపన్నుడగు భగవంతుడు నాకొక కుమారుని ప్రసాదించునేని నాయొడలిమీది కట్టబొంత తప్ప మిగిలియున్న నా సర్వస్వమును బీదలకు దానముచేయుదును."

దైవవశమున అతనికి కుమారుడు జన్మించెను. అంతట అతడు వాగ్దాన ప్రకారము దరిద్రులకు విందుచేసెను. కొన్ని సంవత్సరములు కడచిన వెనుక నేను శ్యామదేశయాత్రనుండి తిరిగి వచ్చి ఆ నా స్నేహితుడు కాపురముండిన యూరు చేరితిని. అతని స్థితిగతులను గురించి విచారింపగా వారిట్లుచెప్పిరి. "ఆయన జిల్లా జైలులో బంధింపబడియున్నాడు." "కారణమేమి?"

"అతని కుమారుడు సారాయిత్రాగి కొట్లాడి యొకని ప్రాణముతీసి కాలికి బుద్ధిచెప్పెను. ఆ కారణముచేత (మరల కుమారుడు వచ్చు వరకు) అతని మెడకు గొలుసును, కాళ్ళకు సంకెళ్లను తగిలించి బాధించియున్నారు."

"ఈ దురవస్థ దేవుని ప్రార్థించి తానే తెచ్చుకొనెను" అని నేనంటిని.

"గర్భవతియైన గృహిణి ముష్కరులు దుష్టు
లైన పుత్రుల బ్రసవించు నంతకంటె
గరముమేలగు బాముల గాంచునేని"
యనెడు పెద్దల నీతివాక్యంబు వినుము.

౧౧

నేను బాలుడనుగానుండినపుడు "యుక్తవయస్సు వచ్చినదని తెలుసుకొనుటకు గుర్తు లేవి?" అని యొక పెద్దవాని నడిగితిని. ఆత డిట్లనెను: మూడు గుర్తులుగలవని శాస్త్రప్రమాణములు గలవు మొదటిది: పదునైదు సంవత్సరముల ప్రాయము. రెండవది: స్వప్నస్ఖలన ప్రారంభము. మూడవది: బాలతృణావిర్భావము వీని యన్నిటికంటె నిజమైన గుర్తు మరియొకటి కలదు. అదియేదన, ఇంద్రియచాపల్యబంధమున చిక్కుటకంటె. మున్నటికన్న మిన్నగా దేవదేవుని సంతోషపరచుటయందె మనస్సు లగ్నమైయుండుట. ఈయొక్క గుణములేని యెడల యుక్తవయస్సు వచ్చినదని మత విశ్వాసముగలవారు తలంపరు."

సప్యరేతస్సు నలువది నాళ్లవరకు
గర్భముననుండి పిండంబు కరువుగట్టు;
నలువదేండ్లకు సద్వర్తనంబు తెలివి
లేని మూఢుని నరుడనలేముమనము.

మనుజుండు కేవల మాంసపిండంబు
భౌతిక ప్రతిమ యఁణా భావంబు విడుము;
దయయు దాక్షిణ్యంబు దాతృత్వమగును
మానవత్వమునకు మహిత చిహ్నములు;
సద్గుణ సంపత్తి సతతంబువలయు;
చిలుమద్దళము మని సింధూరములను
గూర్చి వ్రాయును శిల్పి గోడపైబొమ్మ;
గుణములులేకున్న గోడబొమ్మకును
నరునకు భేదంబు నరయంగరాదు;
లోకంబు బలిమిమై లోగొనుకంటె
నిన్నునియత్నంబున నీవె లోగొనుము.

౧౨

ఒక సంవత్సరమున మక్కాయాత్రికుల మధ్య వివాదముప్పతిల్లినది. నేనుకూడ ఆ యాత్రయందొక బాటసారిగనుంటిని. ఒకరిపై నొకరు తలపడి హీనమానములడిగికొంటిమి.

ఒంటె యంబారితొట్ల గూర్చుండియున్న యొక పెద్దమనుష్యుడు ప్రక్కతొట్టిలోనున్న వానితో నిట్లనుచుండవింటిని: "చదరంగమును ఎడారి కొసకెక్కిన దంతపు పియాదరాణి యాయెను. అనగా, మున్నటికన్న పదవిహెచ్చెను. మక్కాయాత్రసేయు పియాదాలు (బాటసారులు) ఎడారికొసకెక్కి పదభ్రష్టులగుట చిత్రము గదా!"

యాత్రికులబట్టి బాధించు నధమపథిక,
నీవు హాజీవిగా; వొంటె నిక్కమైన
హాజియనవచ్చు; నేలన, నాకలెత్త
ముండ్లజెముడును మేయును మోతమోయు.

౧౩

ఒక హిందువు (హిందూదేశస్థుడు) బాణసంచులు ఎగురవేయుట నేర్పించుచుండెను. ఒక ప్రాజ్ఞుడుచూచి యిట్లనియెను: "పూరియింటిలోనుండు నీకు ఇట్టియాట తగదు."

సరియని నీబుద్ధి స్ఫురియించుదాక
మాటలాడకు మెట్టి మాటలనైన;
ప్రతికూలపు జవాబు రానున్న దెలిసి
ప్రశ్నింపకుము; దానబరువు సహించు.

౧౪

పామరుడొకడు కంటిజబ్బుతో బాధపడుచుండెను. ఆతడు గుఱ్ఱపు వైద్యునియొద్దకుబోయి "కంటికి మందువేయుము" అని యడిగెను. ఆ వైద్యుడు నాలుగుకాళ్ల జంతువుల కన్నులకు వేయు కాటుకను వాని కన్నులకు చరిమెను కన్నులు గ్రుడ్డిగారిపోయినవి. అంతట వాడు న్యాయాధిపతి యొద్దకుపోయి తన దుస్థితిని గురించి మొరపెట్టుకొనెను. న్యాయాధిపతి వానిని యిట్లు ఓదార్చెను: "ఆతని దేమియు తప్పులేదు. నీవుగాడిదవుకాకుండిన యెడల గుఱ్ఱపు వైద్యుని యొద్దకు పోయియుండవు."

ఈ కథలోని నీతి యేమనగా, ఎవ్వడైనను గొప్పకార్యములందు అనుభవ జ్ఞానములేని వానిని నియమించునేని తుదకు ఆతడు పశ్చాత్తాపపడుటయే గాక, ప్రాజ్ఞులట్టివానిని లఘుచిత్తుడని తలంతురు.

జ్ఞానవంతుడు ముఖ్యమౌ కార్యములను
వదలిపెట్టడు కొరగానివానిచేత;
నేతకాడయ్యు జాపల నేయువాని
పట్టుపనిశాల మగ్గాన బెట్టబోరు.

౧౫

పెద్దగురువులవారి పుత్రుడు మరణించెను. "ఆయన గోరీ రాతిపై నేమి వ్రాయమనియెదరు?" అని యడిగిరి. "ఖురాను శ్రీసూక్తులు గౌరవయుక్తములు గావున ఇటువంటి చోటుల వ్రాయదగదు. ఏలన, కాలక్రమముగ అక్షరములు మాసిపోవును. జనులు త్రొక్కుదురు. కుక్కలు మూత్రవిసర్జనము చేయును.

ఏదైన నొకటి వ్రాయవలసిన యవసరమున్నయెడల ఈ పద్యము చాలును,"

పచ్చికలు నాకలంబులు పట్టెదోట;
ఎంతయానంద మొదవెడు హృదయమునకు!
విరులకారు వచ్చెడుదాక వేచియుండు,
పచ్చగిల్లును నామట్టి ప్రాణమిత్ర.

౧౬

భాగ్యవంతుడొకడు బానిసను కాలుసేతులు బంధించి దండించుచున్నపుడు పుణ్యాత్ముడొకడు ఆ దారిని పోవుచు నిట్లనియెను. "సర్వశక్తి సంపన్నుడగు దేవుడు, నీవంటి మానవుని, నీ యాజ్ఞకు లొంగియుండు నట్లొనరించి, ఆతని కంటెను నీకు శ్రేష్ఠత్వము ప్రసాదించెను. ఇందుకై దేవునికి నీవు కృతజ్ఞుడవై యుండుము. ఆ బానిస నిట్లు దారుణముగ శిక్షించుట సమ్మతము గాదు. ఏలయన అంత్యదినమున వాడు నీకన్న శ్రేష్ఠుడుగను, నీవు వానినిచూచిసిగుపడి తలవంచుకొనవలసినవాడవుగను తటస్థించును.'

బానిసపై గోపపడకు మెక్కుడుగ,
రంపానగోయకు, నొంపకు మెడద;
పదిదేరములకు నవ్వానివిల్చితివి;
నీశక్తిచేవాని నిర్మింపలేదు;
ఇట్టినీ కరినాజ్ఞ యెందాకసాగు?
నీకంటెమించిన నృపుడుగలండు,
బానిసలకు నీవు ప్రభువువైయున్న
ప్రభువు నీకుండుట భావింపుమోయి!

పూజ్యుడైన మహమద్ ప్రవక్త యిట్లు శెలవిచ్చెను: "అంత్యదినమున విశ్వాసపాత్రుడగు మంచి బానిస స్వర్గమునకు కొనిపోబడుటయు దుర్నీతుడగు నొడయుడు నరకమున ద్రోయ బడుటయు శోచనీయము."

అడ్డుచెప్పక సేవించునట్టి దాసు
హద్దుమీరి కోపించుట యర్థమగునె?
కడదినంబున బానిన విడువుగాంచ
స్వామి నంకెళ్లబడుట విచారకరము.

౧౨

ఒకానొక సంవత్సరమున శ్యామదేశస్థులతో కలసి బల్ఖ పట్టణమునుండి పయనించితిని. దోపిడిగాండ్రవలన దారి అపాయ కరముగ నుండెను. ఒకయువకుడు దారితోడుగ మాతోడ వచ్చు చుండెను. అతడు బాణప్రయోగమునందు దక్షుడు. ఆయుధముల నుపయోగించుటయందు నేర్పరి. అతడెంత బలవంతుడనగా, దిట్ట్రమైన పదుగురు మనుష్యులు అతనివింటిని ఎక్కుబెట్టలేకుండిరి. దేశ ములోని యెట్టి మల్లురైనను అతనితో పెనగి నేలపై పడద్రోయ లేకుండిరి.

అయినను, అతడు భాగ్యవంతుడు; నీడపట్టున పెరిగినవాడు. యాత్రలు కష్టములు ఎరిగినవాడు కాడు. శౌర్యము పురికొల్పు యుద్ధభేరీ గర్జనములు వానిచెవులలో గింగురుమనలేదు. అశ్విక భటుల ఖడ్గముల తళతళ శంపాద్యుతులు అతనికన్నుల మిరుమిట్లు కొల్పలేదు.

పరులచేతుల బట్టుబడియుండ లేదు,
వాని చుట్టును బాణవర్షంబు పడదు.

నేనును ఆ యువకుడును ప్రక్కప్రక్కన పరుగెత్తుచుండుట తటస్థించెను. దారిలో పాతగోడ లెక్కడకనుపడినను ఆతడు బాహుబలమున వానిని విరుగద్రోయుచుండెను. ఆతని కంటికగ పడిన ప్రతిచెట్టును పెకలించుచు నిట్లు జంబాలుకొట్టెను:

వీరుని భుజశక్తి గోరుకరియేది?
తరుణుని పంజాకు దాళుహరియేది?

మేమీ స్థితిలోనుండగా, ఇద్దరుదొంగలు రాతిబండ వెనుక నుండి తలవెడలబెట్టి మమ్ముగ్రనధించుటకు ఆలోచించుచుండిరి. ఒకని చేతలాఠీకర్రయు మరియొకని చంకలో కొయ్యసమ్మెటయు నుం డెను.

"విరోధులు వచ్చిరి. నీవేలయూరక నిల్చితివి?" అని యువ కుని హెచ్చరించితిని,

బలశౌర్యములు నీకు గలయంతచూపు
వైరి నీచేజావ వచ్చియున్నాడు.

నేను చూచునప్పటికి, యువకుని మోకాళ్లు మోచేతులు గడగడ వడకుచుండినవి. చేతినుండి విల్లునంబులు జారిపడినవి.

బొందళముదూయు బాణంపుమొనను నెరక
జీల్చు ప్రతివాడు, యుద్ధంబు చేపఢంగ,
నెననిమొనసిన వీరుల కెదురునిల్చి
పోరగల్గునె వెన్నిచ్చి పారిపోక!

వేరుపాయము లేనందున మా మూటాముల్లెలు ఆయుధ ములు కట్టుపుట్టములు ఆ దొంగలకు సమర్పించి యెట్టులనో ప్రాణ ములతో తప్పించుకొని బయటపడితిమి.

గర్జించి దిగమ్రింగ గడగు సింహమునైన
    నుచ్చులబంధించు నుదుటుగల్గు
కార్యజ్ఞుడును శక్తిగలయట్టి మనుజుని
    అతిముఖ్యకార్యములందు బనుపు;
కడుబాహు బలమున్న గజశరీరంబున్న,
    యుద్ధభూమినినిల్వ యువకునికిని
జడుపుతోవడకెను సంధిబంధంబులు.
    బంకచెమ్మటమేన బట్టిదొరగె;
స్మృతులగల గూఢసూక్ష్మంబు లెత్తిచెప్ప
ధర్మశాస్త్ర ప్రవీణులే తగిన యట్టు,
లనుభవజ్ఞులె సంగరమందునిలిచి
వైరినెదిరించి పోరంగవలతులెపుడు.

౧౮

భాగ్యవంతుని కుమారుడొకడు తనతండ్రి గోరీముందు కూర్చుండి యొక బీదవానికొడుకుతో నిట్లు వాదించుచుండ నేను చూచితిని:

ధనికుని కుమారుడు: మా తండ్రిగోరి తెల్లరాతితో కట్టబడియున్నది. అక్షరములు రంగులతో వ్రాయబడి యున్నవి. క్రింద చలువరాతి పలకలు పరువబడి, యందందు పచ్చలయిటికెలు పొదుగ యున్నవి. మీ తండ్రిగోరి యెట్లున్నది?—ఒక యిటికిరాయిపెట్టి రెండు పిడికెళ్ల మట్టి చల్లబడియున్నది!

బీదవానికొడుకు: మీ తండ్రి యీ బరువైన రాళ్ళక్రిందబడి తన్నుకలాడి తప్పించుకొని బయటబడుటకుముందే మాతండ్రి స్వర్గము చేరియుండును,

బరువు కొద్దిగ వేయబడినగార్దభము
చల్లగా దరలు నిన్నుందేహముగను.
పస్తులయిక్కట్లు పడుదరిద్రుండు
మరణయాత్రకు కొద్దిబరువుతోదరలు;
భోగభాగ్యంబుల భూరిసౌఖ్యముల
బెరిగినమనుజుండు మరణించునపుడు
వానినివిడలేక వనటపాల్పడును;
చెరసాల విడుపుగాంచిన యట్టిఖైది,
సంకెళ్లబడిన పాచ్చాకంటె మిగుల
నానందమునుబొందు ననియెంచుకొమ్ము.

౧౯

"నీయందిరవు గొనియున్న యింద్రి తృష్ణయే నీకు బల వత్తమవిరోధి" అనుమహదీసులోని యీసూక్తి భావమేమని నేనొక పెద్దలనడిగితిని. "నీవుమంచిచేసి స్నేహముతో వర్తింతువేని ఎట్టి విరోధియు మిత్రుడగును. కానియింద్రియతృష్ణ అట్టిదికాదు. దానిని మన్నించుకొలది విషమించి యెదురుతిరుగును," అని ఆయన వివరించెను.

మితభుక్తిచేకూర్పు మేలైన ప్రకృతి;
జంతువువలెదిన్న జడిమనొందెదవు;
ఇతరులకోర్కెల నీడేర్చినంత
వారునీయిష్టాను వర్తులైయుంద్రు;
ఇంద్రియోద్ధత తృష్ణయట్టిదిగాదు.
దానికోర్కెలుదీర్ప దలపైకినెక్కు.

౨౦

కలిమి లేములను గురించి సాదీకిని అతని ప్రతిపక్షునకును జరిగిన వాద ప్రతివాదములు.

బయటికి దరిద్రుని వలె నగపడినను దరిద్రుల సద్గుణములు లేని యొకడు, గోష్ఠియందు కూర్చుండియుండ నేను చూచితిని. ఆతడు భాగ్యవంతులను నిందించుచు వారి యక్రమములను తూర్పారబట్టుచు తన చెడ్డతనమును ప్రకటించుచుండెను. ఆతనిమాటలు "నిరుపేదలకు శక్తి లేదు, భాగ్యవంతులకు ఇచ్ఛ లేదు," అనునంత వరకు వచ్చినవి.

> దయగల్గువానికి ధనముశూన్యంబు
> ధనమున్నవానికిదయ ఖండిసున్న.

నేను గొప్పవారి ద్రవ్యముతో పోషింపబడిన వాడనుగాన, అతనిమాటలు కర్ణకఠోరములయి నన్ను బాధింప నిట్లంటిని: "ఓయి మిత్రుడా, భాగ్యవంతుడు బీదలరాబడికి మూలము. యతులకు సన్యాసులకు ధాన్యపుపాతర, అభ్యాగతులకు ఆశావలంబనము. బాటసారులకు ఆశ్రయము. ధనికులు ఇతరులకు సంతోషము చేకూర్చుటకు తాము భారమువహింతురు. సేవకులను దీనులను అన్నము ముట్టకుండ వారు భుజింపరు వారి భుక్తశేషములగు భక్ష్య భోజ్యములు అనాధలకు ముదుసలులకు ఇరుగుపొరుగువారికి పంచి పెట్టబడును.

విత్తవంతులు ధర్మకార్యములకు శాశ్వతాదాయము వచ్చు దానములు చేయుదురు. మొక్కుబడుల చెల్లింతురు. అతిథులను సత్కరింతురు భిక్షముపెట్టుదురు పస్తున్నవాని యాకటిమంట దీర్తురు. ఖైదీలను బంధవిముక్తుల గావింతురు. జంతుబలులతో

దేవుని తృప్తిపరతురు. అట్టివారి ప్రాభవము నీకెట్లు లభ్యమగును! దినమునకు రెండుమారులు నమాజుచేయుటతప్ప నీవేమియు నొనర్ప లేవు దానికిని నూరుగండములు.

ధనవంతులకు మంచిసేయు శక్తిగలదు. వారి ప్రార్థనములను భగవంతు డంగీకరించును ఏలయన, వారిధనము దానములకు విని యోగ పడును. వారికీర్తి నిష్కళంకము; హృదయము శాంతము. కమ్మని భోజనముపై భక్తి బలమాధారపడి యుండును. పుణ్యశీలత పరిశుభ్రమైన యుడుపుల వలన కలుగును. పస్తుపడి కడుపువెన్ను ముకకంటుకొని యున్నవానికి స్థిరమైన భక్తియెట్లుకుదురును? రిక్తహస్తునకు ఎట్టిమానుషత్వముండును? బద్ధపాదుడెట్లు విహరింపగలడు? ఆకలిగొన్నవాడు ఏమిమంచి చేయగలడు?

> రేపటికి దిండి లేనిదరిద్రుడెపుడు
> కలత చెందని నిద్దురగనడురాత్రి;
> సీతు కారున సుఖియిరప చీమలెరను
> గొరత లేకుండ వేసవి గూడబెట్టు.

విశ్రాంతికిని దినపస్తులకును పొత్తుకుదురదు. చిత్తశాంతికిని రిక్తహస్తతకును సంబంధముపొసగదు, శాంతహృదయుడు సాయం కాలము నమాజుకు కూర్చుండ, ఆకలిగొన్నవాడు మాపటి పూట అన్నమునకై నిరీక్షించుచు కూరుచుండును. ఎప్పటికైన వీరిద్దరకుఏమి పోలికయుండును?

> దేవతత్పరుడౌను దినమున్నవాడు?
> బత్తెము లేకున్న జిత్తమల్లాడు.

భాగ్యవంతుల పూజాపురస్కారములు దేవునకంగీకారపాత్ర ములగును. ఏలయన, వారిహృదయము వేదన చలితముగాక,

శాంతముగను, ఏకాగ్రముగను ఉందును. జీవయాత్ర సుఖముగ గడపుటకు తగినసౌకర్యములు సిద్ధమైయున్నవిగాన, ప్రతిదినమువారు పూజలందు నిమగ్నులు కాగలరు. ఒక యరబ్బి యిట్లుచెప్పెను: "నిర్భరదారిద్ర్యమునుండియు నేనిష్టపడనివాని సహవాసము నుండియు భగవంతుడు నన్నురక్షించుగాక!"

"ఇహపరముల యందును దారిద్ర్యము నింద్యము" అను శ్రీసూక్తి 'ఖబరు' నందుకలదు. ఈమాటలువిని నా ప్రతివాది యిట్లనియెను:" ఈసూక్తి నేనీవువింటివిగాని" దారిద్ర్యమేనాకు యశస్కరము" అనుమహమ్మదు ప్రవక్తవచనమును నీవుమరచితివి.

సాది:— ఊరకుండుము. సుఖదుఃఖముల నేకరీతిగప్రవర్తించుచు విధి బాణములకు గురియైన దైవతత్పరుల దారిద్ర్యమును గురించి మహమ్మదు ప్రవక్త అట్లుసెలవిచ్చెనుగాని, ధర్మ కబళము సంపాదించుకొనుటకు పవిత్రమైన కుట్టబొంతను దొడుగుకొని, నీచ జీవనము చేయు వేషధారులకు ఆసూక్తియన్వయింపదు.

పెద్ద పెద్దగనినదించు భేరి, నీదు
పటిమ యెందాక, శూన్యగర్భంబవీవు!
దారిఖర్త్రంబులేక నీతాత తరమె
యుద్ధ యాత్రల గష్టాల కోర్చిమ్రోగ?

మనుజుండవైతేని మానుయాచనము,
వేయిపూసలమాల ప్రేళ్లద్రిప్పకుము

గాఢమైన మతవిశ్వాసములేని దరిద్రుని బేసిలేమిడి ఆతని పతితుని చేయునంత వరకు వదలదు. నిరుపేద యైనవాడు మతభ్రష్టుడగును ద్రవ్యముండిననే తప్ప దిగంబరులకు కప్పడములనిచ్చుటకును, బద్ధులైనవారిని చెరవిడిపించుటకును సాధ్యముకాదు. మనబోటి నిరుపేదలకు అట్టిధనికుల యౌన్నత్యమెట్లు కలుగును? ఇచ్చునప్పుడు

మీఁదైన యుదారహస్తముఁ కను. తీసుకొనునప్పుడు క్రిందైనదీనహస్తమునకును ఏమి సంబంధము గలదు? "ఈ తెగవారికి. అనగా యథార్థమైన ముసల్మానులకు దినబత్తెమేర్పాటు కాబడియున్నది" అని పవిత్రమైన ఖురానునందు సర్వోన్నతుఁడైన భగవంతుడు స్వర్గవాసుల భోగములను గురించి సెలవిచ్చియున్నాడు,

దగగొన్నవానికి నగపట్టు, గలను,
జగమెల్లసెలయూట బొగడ చందమున.

నేనిట్లు వచించినంతనే ఆదరిబేసికి ఓర్పుసడలి, నోటికిఅడ్డము ఆపులేక, సిగ్గువిడిచి యిట్లువదరెను:

ప్రతివాది:- నీవుమిక్కిమీర అత్యుక్తులతో ధనవంతులను పొగడుటయు, మనసునొచ్చునటులమాటాడుటయు చూడ, ప్రతి ధనికుడును దారిద్ర్యవిషమును హరించుటకు సంజీవనౌషధము వంటి వాడనియో లేక ధర్మశాల తలుపులు తెరచు తాళముచెవి వంటి వాడనియోయూహించినట్లున్నది.

ధనవంతులు మద మత్తులు; గర్వితులు; అహంభావులు; అసహ్యావర్తనులు; ఐహికధనభోగాసక్తులు; సంపద్గౌరవతృష్ణాతప్తులు; బతిమాలి భంగపడిననేతప్ప ఇతరులతో మాటలాడరు. అలక్ష్యతిరస్కారదృష్టులతో తప్ప ప్రసన్నవదనులై చూడరు. పండితులను బిచ్చగాండ్రని తలంతురు. ఫకీరులను తలకు మొలకు లేనిదరిద్రులని నిందింతురు. గట్టిరొక్కమున్నదన్న కావరముచేతను, అందరకన్నమాదిపైచేయియని యుద్ధతులై ప్రవర్తింతురు. ఎవరి తట్టైనతలయెత్తి చూడవలయునని తలంపరు. "వినయమునందు ఇతరులకంటె తక్కువగను, సంపదలయందు హెచ్చుగను ఉన్నవాడు బయటికి ధనవంతుడుగ నగపడినను యథార్థముగ అతడుదరిద్రుడే" అని తత్వవేత్తలు చెప్పినమాటలు వారెఱుగరు.

ధనమదంబున మూర్ఖుండు తత్త్వవిదుల
బండి తావళి నవమాన పరచునేని,
అట్టి వాడంబరా బోతెయైనగాని
మొరటుగావాని గాడిదముద్దియనుము.

వాది:--భాగ్యవంతులను నిందింపకుము. వారు కరుణామయ హృదయులు.

ప్రతివాది:—నీవు అబద్ధము చెప్పుచున్నావు. వారురూపాయలకుదాసులు, ధనికులు శ్రావణనీలమేఘములే యగుదురుగాక, వర్షింపకుండిన నేమిలాభము? కాంతిప్రవాహము లయ్యును ఎవరిమీదనుప్రకాశింప కుండిన ప్రయోజనమేమి? సామర్థ్యమనుగుర్రముపైనెక్కియు పరుగెత్తింపకున్న నేమిఫలము? వారు దేవుని కొరకైనను అడుగెత్తియట్లపెట్టరు. స్వప్రయోజనము నాశింపక చిల్లిగవ్వయైన నొకరికి కియ్యరు. ఎంతయోశ్రమపడి ద్రవ్యమార్జింతురు. నీచాతినీచముగ దానినిపదిలముచేయుదురు. తుట్టతుదకు బాధపడుచు విధిలేక, అంతయువదలిపెట్టిపోయెదరు. "లోభికళేబరము భూమిలోనికి పోయినప్పుడువానిద్రవ్యము భూమిలోనుండి పైకివెడలును," అని పెద్దలు చెప్పియుండిరి.

ఒక్కడు నిరతము శ్రమలకు
జిక్కి ప్రయత్నించి నిలువ చేసిననిధి వే
రొక్కడు శ్రమ యత్నంబుల
నొక్కటియునులేక దానినూరకగొనియుఁజా.

వాది:—భాగ్యవంతుల లోభిత్వమును యాచనామూలమున తప్ప ఇంకేవిధమున నీవెరిగియుండవు. ఆశాపాశబద్ధులు కానివారికి కరుణామయులును లోభులునుఒకేవిధముగ కనిపింతురు. బంగారు ఏదియైనది మొరపురాయి కనుగొనును.

లోభి యెవడైనది బిచ్చగాడు కనుగొనును

ప్రతివాది:—నేను అనుభవపూర్వకముగ చెప్పుచున్నాను. భాగ్యవంతులు ద్వారములయొద్ద సేవకులనుకాపుదారి యుంతురు. ప్రియస్నేహితుల నైననుదానీయక అడ్డగించుటకు బలిష్ఠకాయులైన మొరకలను నియోగింతురు. వారుసజ్జనులయు పండితులయు మెడ పట్టలనొడిసి పట్టుకొని "ఇచ్చట ఎవ్వరును లేరని" చెప్పుదురు. నిజముగా సత్యమే చెప్పబడినది.

తెలివితేటలు, యోచన, తెంపుదనము
స్వామికిని లేవటన్న భావము ధ్వనింప
"నింటనెవ్వరు లేరు, పొండెచటి కైన"
ననుచు యుక్తంబుగా బణిహారిపల్కు.

వాది:-ఏలయన, యాచకుల పీడింపులకును, బిచ్చగాండ్రి యాచనాలేఖలకును తట్టుకొనలేక ప్రాణమువిసిగి వారట్లుచేయు చుందురు. ఎడారిలోని యిసుకయంతయు ముత్యములైనను, బిచ్చ గాండ్రి కన్నులునిండునని తలంచుట తెలియని తనము.

నూతులు నిండునె సీతున
రాతిరి బడు మంచు నీటి రవలు తొరంగన్?
అతత ధన ధాన్యాశా
చేతస్కుల కనులునిండి చెందునె తృప్తిన్?

కష్టపరంపరల ననుభవించి జీవితముపై విసుగుపుట్టినమను ష్యుడుబుద్ధిపూర్వకముగ ఘోరకృత్యములందు తన్నుతానే పడద్రోసి కొనును. భగవంతుని శిక్షకాతడు భయపడడు. ఇదిశాస్త్రసమ్మత మైనది॥"అదిశాస్త్ర నిషిద్ధమైనది,"అనుజ్ఞానము వానికుండదు,

కుక్క నొక మంటి పెళ్లతో గొట్టినంత
నెముక యని సంతసంబున నెగిరి దూకు;

క్రోల శవపేటి నిరుపురు మోయుగాంచి
అన్న భాజనమని యెంచు నధముడాన,

అయినను, ధనవంతుడు దైవాను గ్రహమునకు పాత్రుడగుట వలన శాస్త్రసమ్మత కార్యములనే తలపోయును. అందువలన శాస్త్రనిషిద్ధ కార్యములనుండి రక్షింపబడును. నేను నా పక్షము స్థాపించుకొనుటకు కావలసిన యన్నివాదములను దిఙ్మాత్రముగ సూచించితినేగాని ప్రమాణీకరించి వివరింపలేదు. అయినను మీ న్యాయ నిర్ణయముపై నాధారపడియుండెదను.

మోసగాడు పెడరెక్కలు విరిచి కట్టబడుట, అప్పు చెల్లింపనివాడు చెరసాలబడుట, అమాయకత్వము ముసుగు చింపబడుట, దొంగతనము చేసినవారలకు చేయి తెగగొట్టబడుట, మొదలగు ఈదుఃస్థితులకు మూలకారణము దారిద్ర్యమేగదా! అట్లుకానిది ఎప్పుడైననీవు చూచియున్నావా? సింహములవంటి మనుష్యులుకూడ, అక్కరవలన ఇండ్లకు కన్నములువేసి పట్టుబడుదురు. చీలమండలకు, వెనుప్రక్క బొందలుపొడిచి వారిని తలక్రిందుగా వ్రేలగట్టుదురు.

ఒకవేళ యొకదరిద్రునికి దుర్దమమైన కామము చెలరేగినపుడు మనస్సును చిక్కబట్టుశక్తి చాలక, పాపకార్యము సల్పుటతటస్థింపవచ్చును. ....సామాన్యముగ నమాయికులయ్యును రిక్తహస్తులగుదురేని క్రమక్రమముగ వారుపాప పంకిల చిత్తులగుదురు. ఆకలిగొన్నవాడు రొట్టెనుదొంగిలించును.

క్షుత్పీడితంబైన శునకంబు మాంస
శకలంబు గాంచ, విచారింపబోదు
"సాలహు" నొందిన మాంసంబొ "దజ్జాలు"
ఖరము మాంసమొ యంచు, క్షణమునేపైన.

ఎందరు పరిశుద్ధ హృదయులు లేమిడిమూలమున దుర్నీతి పరులయి అమూల్యమైన వారికీర్తిని అపయశో మారుతమున తూర్పారబట్టుచున్నారు.

ఇహ భోగ విముఖత యెరియునాకటను,
శీలంబు పుణ్యంబు చెడును లేమిడిని.

ధనికులు బీదలను చేరరానీయక తలుపులుమూసుకొందురని యింతకుముందు చెప్పియుంటివి. ఎడారులలో నివసించుచున్న హాతీంతాయిపట్టణవాసియయ్యేనేని బిచ్చగాండ్ర యొరపిడికితట్టుకొనలేక దిక్కుదోపకయుండును. వారుఆతనిచొక్కాయిని చీలికలు పేలికలుచేసి మొదలినుండి యూడబెరికియుందురు.

హెచ్చరింతునోయి. యెవరైన నావంక
జూచునట్లు నన్ను జూడవలదు;
బిచ్చగాండ్రచూపు టుచ్చుల జిక్కిన
నరుని కెట్టిమంచి జరుగబోదు.

ప్రతివాదిః-వారిదుఃస్థితికి నాకు జాలిగలుగుచున్నది.

వాదిః-వారిసంపదలపై నీకు అసూయపుట్టుచున్నది.

మేమిద్దరమిట్టుపరస్పరము వాదించుకొనుచు కాయకు కాయ యొదురొడ్డుచుంటిమి. ఆతడురాజును తోసిరాజన్న నేనురాణిని అడ్డముపెట్టుచుంటిని. తుదకు ఆతని జతనపుసంచిలోని రొక్కము అడుగంటినది. వాదపుదొనలోని బాణములన్నియు ప్రయోగింపబడినవి.

వాగ్వాదమున నీవు వక్తతోబోర
శస్త్రసన్న్యాసంబు సరికాదునీకు;

ఎరువు దెచ్చినమాట హరువు డాబులును
అత్యుక్తులును దప్ప నామె తెరుగు?
మతశాస్త్రములలోని మర్మముల్దెలిసి,
జ్ఞానంబుకొరలేక కాన్పించు మోయి,
యమకంబు గమకంబు లలరువాయాళి,
ద్వారంబుకడ నాయుధంబులనిల్పి;
కోటలోనొకబంటు గూడగన్పడదు.

కడపటికి ఆతనికొక్క వాదముకూడ లేకుండెను. నేనాతని క్రిందు చేసితిని. ఇందు కాగడు సహింపలేక, దౌర్జన్యము పూని తెలివి తక్కువ ప్రసంగము చేయనారంభించెను. సాధారణముగ అజ్ఞానుల పద్ధతియిట్టిదియె. వారు ప్రత్యర్థి వాదములకు బదులు చెప్పలేక యోడి పోయినప్పుడు ద్వేషము ప్రకటింతురు. విగ్రహశిల్పియైన "ఆజరు" కుమారునితో (అబ్రహాము) వాదింపలేక తగవుపెట్టుకొనెను. ఖురానులో నిట్లు చెప్పబడియున్నది: " నీ వీవాదమున కొప్పుకొనవని యెడల రాళ్లు రువ్వినొప్పించెదను."

నన్నాతడు దూషించెను: నేనాతని నిందించితిని. అతడు నా మెడపట్టను ఒడిసిపట్టుకొని చింపివేసెను. నేనాతడి గడ్డముపట్టు కొని తెగగుంజితిని మేము ఒకరిపై నొకరు తలపడితిమి. ప్రజలు పొట్టలుబ్బనవ్వుచు, వేడుకచూచుటకు మా వెంట పరుగెత్తుచుండిరి. మా యీ చేష్టల వినికిడి వలన లోకము ఆశ్చర్యముతో వ్రేలు కరచెను:

కడకు మా వివాదమును న్యాయాధిపతికి విన్నవించి ధనికులకును, దరిద్రులకును గల తారతమ్యము న్యాయముగా నిర్ణయింప వలయుననియు ఆ తీర్పునకు మేము బద్ధులమై యుందుమనియు తెల్పితిమి.

న్యాయాధిపతి మా స్థితిగతుల వరసి, మా వాద ప్రతివాదములు విని, తలవంచుకొని, ముందువెనుక లాలోచించి కొంతసేపైన వెనుక తలయెత్తి నాతట్టుచూచి యిట్లనియెను: "ఓయీ, నీవు భాగ్యవంతులను ప్రశంసించి బీదలను నిష్ఠురముగ మాటాడితివి. గులాబియుండుచోట ముల్లుకూడనుండునని తెలిసికొమ్ము. సారాయి తోడ మత్తుండును. పెన్నిధియున్నచోట పాముండును. ఆణిముత్యములుండుచోట మనుష్యులను దిగమ్రింగు మకరములు, "చోర" చేపలుండును. ఐహికభోగ మకరందమునకు మృత్యువుకాటు వెన్నంటియుండును. స్వర్గసౌఖ్యములకు ముందు సైతాను గోడవలె నిలిచియుండును.

ఇంపులనెలంత ప్రియుని హింసింపకున్న
నేమిసేయును ప్రత్యర్థి యీసు గోసు?
ముల్లు పన్నీరుపూవు, సమ్ముదముఖేద.
మహియు బెన్నిధి, యన్యోన్యమనుసరించు.

తోటయందు కస్తూరితుంగలున్నచోట ఎండిన చెట్ల మ్రోడులుండుట నీవు చూచుటలేదా? ధనికులయందుగూడ నట్లే కొందరు కృతజ్ఞులు, కొందరు కృతఘ్నులు నుందురు. అట్లే నిరుపేదలందును సహనముగలవారు, దుడుకుపనువారు నుందురు.

మంచుతుంపురులెల్ల మంచిముత్తెంబు
లైన, గవ్వలయట్టులంగల్లునిండు.

దరిబేసి స్వభావముగల భాగ్యవంతులు, భాగ్యవంతమైన హృదయముగల దరిబేసులు, భగవంతునికి సమీపవర్తులగుదురు. దరిబేసుల సుఖదుఃఖములతో సహానుభూతిగలవాడే భాగ్యవంతులలో నుత్తముడు చాల యరుదుగా భాగ్యవంతుల సాంగత్యము

కోటీశ్వరుడై దరిద్రులలో శ్రేష్ఠుడు. దేవునియందు విశ్వాసము గల వానికి ఆయన విశ్వదాతయగును"

అంతట నన్ను మందలించుట చాలించి, దరిద్రుని తిరిగి న్యాయాధిపతి యిట్లనియెను: "ఓయీ, ధనవంతులు నిషిద్ధకార్యము లొనరించుచుందురనియు భోగమత్తులనియు నిందించితివి. నీవు వివరించినట్టి గుణములుగల సంకల్పశూన్యులు కృతఘ్నులు వారిలో నున్నారు. వారు సంపాదించి కూడబెట్టుదురు; తామనుభవింపరు; ఇతరులకు పెట్టరు. అనావృష్టివలన కరువు వచ్చినను, అతివృష్టి వలన వెల్లువ పెట్టినను తాము క్షేమముగానుందురన్న నమ్మకముచేత దరిద్రుల కష్టముల విచారింపరు. దేవునికైన భయపడరు.

తిండిలేకయొక్క దీనుండు మరణింప
"అంతనాకుగలదు, చింతయేల?
బాతుకేమి భయము పల్లె వెల్లువపెట్ట"
ననుచు నధమ ధనికు డెనయుదృప్తి.

ఒంటె యంబారిలో సుఖముగా గూర్చుండి పయనించు వారికి ఎడారి యిసుకలో పడిచచ్చు బాటసారిపై నేమి కనికరము!

తన చింపి గొంగడిని చ
య్యన బయటికిదెచ్చుకొన్న యధమాత్ముడు లో
ననుకొనును "లోకమెల్లను
మనినను మాడినను నాకుమాత్రము సుఖమౌ"

నీ విప్పుడు వివినట్టి ప్రవర్తనము గలవారు కొందరున్నారు. కాని మఱికొందరు బీదాబిక్కలకు ధనధాన్యములు పంచిపెట్టు కరుణామయ హృదయులు, కీర్తికాములు, క్షమాపరులు, ఇహపరసుఖాసక్తులు కూడనున్నారు.

సకల సామ్రాజ్య పట్టాభిషిక్తుడు, న్యాయవర్తనుడు, మత విశ్వాసపూర్ణుడు, విజయధ్వజుడు, రాజాధిరాజు, ఇస్లాంమత దుర్గ సంరక్షకుడు, సులేమాన్ రాజ్యమునకు వారసు, సమకాలీన నృపులలో న్యాయవంతుడు ముజఫరుద్దీన్ వలద్ద్ అతబక్ అబుబకర్ బిన్ సాద్ జంగీ (దేవుడాయనకు చిరాయువు నొసగి ఆయన ధ్వజములకు విజయము చేకూర్చుగాక!) వారి దాసులు గూడ భాగ్యవంతులలో పైని చెప్పబడిన యుత్తమ వర్గమునకు చెందినవారు.

కరుణమెయి మీరు ప్రజలను గాచునటుల
దండ్రి బిడ్డల సైతము దనుపలేడు;
సృష్టికర్త యిలకు మేలుసేయు కోర్కి
సకల సామ్రాట్టుగా మిమ్ము సలిపినాడు.

న్యాయాధిపతి యీ విధముగ మా యూహాకతీతమగునట్లు ఉపన్యసింప విని, ఆయన తీర్పును శిరసావహించితిమి. ఇదివరకు జరిగిపోయిన దానికి పరస్పర క్షమార్పణము వేడుకొని, కలహము మాని, సమాధానము చేసుకొని దోషపరిహారముగ ఒకని పాదములందొకడు తలమోపి, మోములు ముద్దిడుకొని, మావితర్కమును ఈ పద్యముతో ఉపసంహరించుకొంటిమి.

కటిక నిరుపేద, వనరకు కాలగతికి,
అట్టియూహల మరణించు టార్తికరము;
ధనికుడా, యిచ్ఛశక్తియు దనరునీకు;
ఇమ్ము, కుడువుము, గాంచెద విహము పరము.

సప్తమాధ్యాయము
సంపూర్ణము,

సాంఘికధర్మ నిర్వర్తనవిధులు

గులాబితోట

అష్టమాధ్యాయము

*

౧

ధనము జీవిత సౌకర్యము కొరకేర్పడినది. కాని, జీవితము ధనమును ప్రోగుసేయుటకు కాదు.

"అదృష్టవంతుడెవడు? దురదృష్టవంతుడెవడు?" అని యొక ప్రాజ్ఞుని ప్రశ్నించిరి. "తాననుభవించి వెదచల్లువాడు అదృష్ట వంతుడు. తాను చచ్చి మిగిలించువాడు దురదృష్టవంతుడు." అని ఆయన బదులుచెప్పెను.

జీవితంబెల్ల ధనరాశి చేర్చికూర్చి
తాను గుడువక యొరులకు దానమిడక,
యేమిసేయక చచ్చిన హీనుగూర్చి
దేవదేవుని నీవు ప్రార్థింపవలదు.

౨

మూసా ప్రవక్త (ఆయన ఆత్మకు శాంతికలుగుగాక!) ఖారూన్ అను కోటీశ్వరునకు "నీకు దేవుడు మేలుచేసినట్లె నీవును ఇతరులకు మేలుచేయుము." అని యుపదేశించెను. ఆతడు ఆ సల హాను చెవినిబెట్టకయుండెను. వాని యంత్యదశ యెట్లయినదియు మీరు వినియున్నారు కదా.

తన ధనముతోడ మేలుచేయని నరుండు
పరసుఖంబుల బసిడికి బలియొనంగు;
గరిమిగల లాభమునుగాంచ దలతువేని
ప్రజల గరుణింపు, నిను లోకభర్తయట్లు.

"దానము చేయుము. కాని, దాని ప్రతిఫలమును మరల నీవు పొందనుద్దేశించి చేయకుము, "అని అరబ్బులు చెప్పుదురు.

పృథ్వి నెటదాన వృక్షంబు వేరునాటు
దాని పాదవును. గొమ్మలు దాకునభము;
తత్ఫలంబును భుజియింప దలతువేని.
కుజము మొదలంట రంపాన గోయబోకు.

తనదయకు నీవు వెలిగాక మనిచినట్టి
దేవునికి నీకృతజ్ఞత దెలుపమ్రొక్కు;
కలదు సుల్తాను కొలువని గర్వపడకు;
దైవకృపచేతనే యది దక్కెనోయి.

3

ఇద్దరు మనుష్యులు నిరర్ధక పరిశ్రమయు, లాభము లేని ప్రయత్నమును చేసినవారని చెప్పవచ్చును, మొదటివాడు, ధనమార్జించి యనుభవింపనివాడు, రెండవవాడు, శాస్త్రములు నేర్చుకొని అభ్యాసములో నుంచనివాడు.

శాస్త్రములు క్రిందిమీదికి జదువనేమి,
వేత్తగాజాలదభ్యాస విభుతలేక;
ప్రాజ్ఞుడునుమతవిశ్వాస పరుడుగాడు,
పాత్రములుమోయు నాచతుష్పాత్తుగాని.

తాను మోయుచున్న తలమీది భారంబు
కట్టెమోపా, పుస్తకములకట్టొ,
అని యెరుంగలేని యధమ నిర్భేదను
నకును శాస్త్రమేడ? జ్ఞానమేడ ?

౪

శాస్త్రజ్ఞానము మతాభివృద్ధి కొరకేర్పడినది. గాని లౌకిక విషయవాంఛ లనుభవింపజేయుటకుగాదు.

మనుజుడెవడు విరక్తినిమహితభక్తి
నాత్మవిజ్ఞానమును వెలకమ్ముకొనునొ,
అట్టినీచుండు వరిపంట గుట్టవెట్టి
యగ్గిరగిలించిన నికృష్టుడనగజెల్లు

౫

వైరాగ్యములేని విద్వాంసుడు కాగడా చేతపట్టుకొనిపోవు చున్న గ్రుడ్డివానివంటివాడు. అతడు ఇతరులకు దారిచూపునేగాని, తాను చూడలేడు.

అప్రయోజకముగా నరిగెజీవితము
కొనినదేదియులేదు; ధనమెల్లదరిగె.

౬

రాజ్యము వివేకవంతులగు పండితుల మూలమున శోభించును. మతము విరాగులగు సత్పురుషుల మూలమున దోషరహితమగును. పండితులకు పాదుషాల ఆశ్రయము అక్కరయైన దానికంటె పాదుషాలకు పండితుల హితోపదేశము ఆవశ్యకమగును.

ఓయిపాదుష వినుదేని యొక్కనీతి.
ఇంతకంటెను మేలైనదెందులేదు;
పనులయందునియోగించు పండితులను,
కనగ, వారలపని యదిగాకయున్న.

౭

మూడువస్తువులు మూడింటితో గూడనిదే చిరకాలముండవు: వాణిజ్యముతో గూడని ధనము వాదప్రతివాదముతో గూడని శాస్త్రజ్ఞానము, దండనీతితో గూడని రాజ్యము.

౮

చెడ్డవారిని కరుణించుట, మంచివారిని శిక్షించినట్లగును. బలాత్కరించువారిని మన్నించుట పేదవారిని బలాత్కరించినట్లగును.

అతిదుష్టుదరిజేర్చి యాదరింపంగ
కడకు నీయాస్తికే కడగండ్లదెచ్చు.

౯

పాదుషాల చెలికారమునందును. బాలుర మధుర కంఠస్వరమునందును నమ్మకముంచరాదు. అది క్షణములో మారిపోవును. ఇది కలవలె అదృశ్యమగును.

వేయి తగులాటకాండ్రున్న వెలదియందు
జిత్తమెన్నడు లగ్నంబు సేయబోకు;
వలచుటొకవేళ నీ కనివార్యమైన
ఎడద యొడబాటునకు సిద్ధపడుటమేలు.

౧౦

నీకుండిన ప్రతిరహస్యమును స్నేహితునికి చెప్పకుము. ఒక వేళ అతడు ఎదురుతిరిగెనేని ఒకానొకప్పుడు, విరోధికాడని యెవరు

చెప్పగలరు? నీకుండిన శక్తినంతయు శత్రువుపై ప్రయోగించి యాతని నొంపకుము. ఏలయన ఆతడొకవేళ మిత్రుడుగా మారిన మారవచ్చును.

నీవు దాచియుంచుకొనతలచిన రహస్యమును స్నేహితుడైన ను ఎవనితో చెప్పకుము. ఏలయన ఆ స్నేహితునకును స్నేహితు లుందురు. వారికిని అట్లె.

తనరహస్యము నొకనితోననియు, మరల
నితరులకు జెప్పవలదని హెచ్చరించు
కంటె, జెప్పకయుండుట కరముమేలు;
నాల్కదాటినమాటలు నగరుదాటు.

సెలయేటి మొగదల నలవియౌగట్ట,
బలిసి పెన్నేరైన బంధింపగలమె?

బహిరంగముగ జెప్ప భయపడుమాట
గూఢంబుగా జెప్పగూడదెవ్వరికి.

౧౧

శక్తితరిగిన విరోధి వినయముతోవచ్చి చెలిమి పాటించునేని బలమైన శత్రువును కాగలనను ఉద్దేశ్యమేతప్ప వేరొకటియుండదు. "మిత్రుల మైత్రినే నమ్ముటకు వీలులేదనగా ఇక శత్రువుల ముఖ స్తుతులతో నేమి ప్రయోజనము" అని పెద్దలుచెప్పిరి.

అల్పుడని శత్రువును వదలిపెట్టినవాడు అజాగరూకతతో నిప్పురవను ఆర్పక విడిచినవాని బోలును.

నేడె వీలున్నయపుడార్పు నిప్పురవను,
అదియె దావాగ్నియై లోకమంతగాల్చు;

శరపరంపర గురిపించు శక్తియుండ
నెదిరి విల్లెక్కు పెట్టుట కెడమునిడకు.

౧౨

పరస్పరము విరోధమున్నవారిలో ఒకనిని గురించి మరియొక నితో మాటాడునపుడు, ఒకవేళ వారు మిత్రులై కలబలుకు కొందు రేని, నీవు సిగ్గుపడవలసిన యావశ్యకము లేనట్లుగా మాటాడుము.

పగవారలిరువురి తగవగ్నికీల;
కొండెగాడందిడు నెందుకట్టెలను;
వారివీరికి మిత్రభావంబు గుదుర,
నడిమి చాడీకోరు కడుగర్హుడగును;
అరుల యిద్దరిమధ్య నగ్నిరగిల్చి
యందులో బొగ్గౌట యదియేమితెలివి?
చిన్నగామాటాడు చెలికాండ్రతోడ
పరమశత్రులచెవి బడకుండునట్లు;
గోడకు మున్ముపక్క గూడిమాటాడు
వేళజాగ్రత! చెవుల్ వెన్నుపక్కనుండు.

౧౩

విరోధులతో చెలిమి పాటించువాడు స్నేహితులను కష్టముల పాలు సేయును.

పగవారితో మిత్రభావంబునెరపు
వానిసంబంధంబు వదలుపండితుడ.

౧౪

కార్యనిర్వహణము నందు "ఇట్లు చేయవచ్చునా, చేయ కూడదా" అని నిశ్చయించుకొనలేనప్పుడు ఏ మార్గమవలంబించిన నీకు కష్టములు కలుగవో ఆ మార్గమునే కోరుకొనుము.

చల్లగామాటాడు నరసాత్ముతోడ
గరినోక్తులాడకు గద్దించినట్లు;
నీ తల్పుదట్టి శాంతిని గోరువాని
చివ్వకునాల్గువ్వి నొవ్వాడబోకు.

౧౫

ధనముతో నొక కార్యమును సాధించుటకు వీలున్నయెపుడు, దానికొరకు ప్రాణమును అపాయమున కగ్గము సేయకూడదు.

అన్నియుపాయముల్ వ్యర్థమైనపుడు
ఖడ్గంబుచేబట్ట కడున్యాయమగును.

౧౬

బలహీనుడైన విరోధిపై దయచూపకుము. ఏలయన ఆతడు మరల బలవంతుడయ్యెనేని నిన్ను మన్నింపడు.

పగవాడశక్తుడై పడెనంచుజూచి
మీసాలువడత్రిప్పి మిట్టాడబోకు;
ప్రతియెమ్ములోనుండు బలమైనమజ్జ;
ఒక్కొక చొక్కాయినుండు నరుండు.

౧౭

దుష్టుని కడ తేర్చువాడు ప్రజలను వానిదౌర్జన్యమునుండి విడుదల సేయును. తానును దేవునిదండమునుండి విడుదలయగును.

క్షమయు బ్రియమౌనుగాని, ప్రజావిరోధి
పుండునార్ప మలామును బూయబోకు;
పాముగరుణించి విడిచినవాడెరుంగ
దదిమనుజసంతతికి వైరియన్ననిజము.

౧౮

విరోధిసలహా నంగీకరించుట తప్పయినను, వినుటన్యాయ్యమె, ఏలయన, దానికి విరుద్ధముగ నీవు నడచుకొనవచ్చును. ఇదెంతయు ఉచితము.

శత్రువేమిపల్కినను హెచ్చరికవలయు,
కడకు జింతింపనట్లుగా నడచుకొమ్ము;

నేరుగాకుడుప్రక్కకు దారిచూప
నెడమప్రక్కకు దిరిగి నీవేగవలయు.

౧౯

మితమీరినకోపము జనులకు భయము పుట్టించును. సమయానుకూలము గానికారుణ్యము లాఘవముదెచ్చును. జనులునిన్ను చూచి తిరిగిపోకుండునంత గట్టితనమును, నీతో ఎక్కువ చనవుగా నుండకుండునంత మెత్తదనమును చూపుము,

వైద్యుడెట్లుదుర్మనము ప్రక్కలించి
కురుపుమాన్పమొలామును జరుము, నట్లె
కఠినతయునుగారుణ్యము గలశియున్న
గార్యనిర్వహణంబున గలుగుమేలు.

పండితుడుమేరవిడు కఠినుండుగాడు,
పెత్తనముక్రిందు పడునటుమెత్తవడడు;
ఉన్నతుడనంచు మితిమీరి యుబ్బిపడడు,
తానునీచతనెపుడేని తగ్గిపోడు.

గొల్లనింగాంచియిట్లనె కొడుకు: "తండ్రి,
నేర్పునాకుబురాతననీతి" ననిన,
"గరకుకోరలతోడేలు కరవరాని
యంతసౌజన్యముంబూను" మనుచుబల్కె.

౨౦

ఇద్దరుమనుష్యులు రాజ్యమునకు మతమునకును విరోధులన వచ్చును. వారెవరనగా:—క్షమా గుణములేని పాదుషాయొకడు. శాస్త్రజ్ఞానములేని భక్తుడు మరియొకడు.

దైవాజ్ఞనెరవేర్ప దానుండుగాని
ప్రభువు, రాజ్యమునకు రాకుండుగాక!

౨౧

మిత్రులకు తనపై గల నమ్మకము తొలఁగునట్లు పాదుషా విరోధులపై కోపగించుకొనరాదు. మొట్టమొదట కోపాగ్ని కోపగించు వానిపై బడును. తరువాత దానికీలలు విరోధిని తాకవచ్చును లేక తాకకపోవచ్చును.

మట్టిలోబుట్టిన మనుజులకింత
యుద్ధతిగర్వంబు నొప్పగాదెందు;
ఇంతటితలనిక్కు నింతటిదుడుకు
గలవాడుమట్టిలో గలిగెనఁ గంటె
నగ్నిలోజనియించెనని నేదలంతు;
మునుబలిఖాఁ పట్నమునకునేనేగి
యొకమహాత్మునిగాంచి "యోపుణ్యపురుష
యజ్ఞానమునశించు నట్లుబోధించు"
మననాతడిట్లనె: "అవనియట్లీవు
సహనంబువహియించు; సహియింపవేని
నేల బూడిచిపెట్టు నీశాస్త్రములను."

౨౨

దుఃస్వభావుడు (తన దుఃస్వభావమును) వైరిచేతిలో పట్టు పడియున్నాడు. ఏచోటికేగినను దండనము పట్టునుండి తప్పించుకొన జాలకున్నాడు.

తానునిహలోక కష్టముల్దాటిపోయి
పరమునొందియు నిజదుఃస్వభావశృంఖ
లానిబద్ధుడయి విముక్తిగానలేడు;
అనుసరించును దననీడయందుగూడ.

౨౩

విరోధి సిపాయిలలో అన్యోన్యవిభేదములు పుట్టెనని తెలిసిన యెడల నీవు నిర్విచారముగ నుండుము. వారు ఒకటిగా కలసిమెలసి యుందు రేని నీ దుఃస్థితిని గురించి యాలోచింపుము.

శత్రువులలోన సమరంబుజరుగనీవు
సుఖముగామిత్రుల కడగూర్చుండవచ్చు;
అరులునొకటైన, దుర్గకుడ్యములపైకి
పెద్దరాళ్లెత్తి విల్లెక్కుపెట్టుమోయి

౨౪

విరోధి తన మాయోపాయములన్నియు నిరర్థకము లయినపుడు స్నేహము ప్రారంభించును. ఏలయన విరోధముతో నెరవేర్పలేని కార్యములను మైత్రిమూలమున కొనసాగింప వచ్చును.

పాముతలను విరోధిచేతితో కొట్టుము. ఏలయన, రెండు ప్రయోజనములలో ఏదైన నొకటి వ్యర్థముకాదు. విరోధి నెగ్గిన పాముచచ్చును. పాము నెగ్గిన విరోధి చచ్చును.

సమరదివమునబల హీనశత్రువనుచు
దలచియేమరి యుండుటతగవుగాదు;
బ్రతుకుపైనాసవీడినవాడు భయము
వదలిసింగపుదల జీల్చిమెదడుపెరుకు.

౨౫

ఒకవార్త హృదయము నొప్పించునని నీకు తెలిసినప్పుడు నీవు చెప్పక యూరకుండుము. దానిని మరియొకడు తెలుపనిమ్ము.

ఓసి బుల్బులి, యామనిడాసెనన్న
మంచివార్తను జనులకు పంచరమ్ము;
చిత్తదారకమైనట్టి చెడ్డకబురు
పరమపాపిష్టి గూబకు వదలిపొమ్ము.

౨౬

నీవు చెప్పుమాటలు పరిపూర్ణముగా అంగీకరింప బడునను నమ్మకము లేనిదే పాదుషాకు ఇతరుని ద్రోహమును తెలుపకుము. అట్లు కాదేని నీ మరణమునకు నీవే ప్రయత్నించి నట్లగును.

పలుక నంగవించు, పలుకులంగీకృతి
నొందగలవటంచు నూహయున్న;
మనుజజీవితమున మాటముఖ్యంబగు;
తప్పులాడి ఘనత తరుగనీకు;

౨౭

స్వాభిప్రాయ గర్వితునకు సలహా చెప్పువానికి, సలహా చెప్పు వానికి, సలహా చెప్పుటకు మరియొక నీతిబోధకుడు కావలసి యుండును.

౨౮

వైరిమోసములకు లోబడకుము. ముఖస్తుతి చేయువారి

పొగడ్తలకు ఉబ్బి తబ్బిబ్బులుగాకుము. వారు మోసపుటుచ్చులు పన్నియున్నారు. వీరు నీ యత్యాశను పెరరేపినారు.

౨౯

ఋణముసేపుబ్బిన పీనుగు కాలిమడమవలె తెలివితక్కువవాడు ముఖస్తుతులకు సంతోషించి యుబ్బును.

మాటకారి పొగడ్తల మాటవినకు
కొద్ది మూలధనంబుతో గోరుపెద్ద
లాభ; మొకవేళ వానితలంపుమేర
కాశదీర్పవయేని, వాడంటగట్టు
నీకు నిన్నూరుతప్పులు నిశ్చయముగ.

౩౦

ఎవ్వరైనను తప్పులెత్తి చూపించువరకు వక్తయుపన్యాసము నిర్దోషముగ నుండును.

తెలివితక్కువవారు తలలూపిరనుచు,
నీతలంపున నీవె నిపుణుండవనుచు
మాటల సొగసులో సాటిలేరనుచు
గర్వింపబోకుము; గలదులోకంబు.

౩౧

ప్రతివారికి తన తెలివి నిర్దోషమనియు, తనబిడ్డ యండ గాడనియు తోచును.

ఒకయూదునకు మరియొక్క మునల్మాను
నకుగల్గె వాగ్వాద మొకదినంబు;
వాదవస్తువు విన్నవచ్చె నాకును నవ్వు,
మునలిమానిట్లనె మొరకించి;
విక్రయపత్రంబు నక్రమమైనదే,
కాదేని నేజత్తు యూదుడనుగ;
అనవిని యూదుండు నాగ్రహంబున "తౌరి
యతు" పైనొట్టిడి యనియెనిట్లు;
నేనబద్ధము లాడిన, నీవిధాన
మునలిమానుడనయి ప్రాణములనువిడుతు;
తెలివి లోకమునందు నదృశ్యమైన,
నమ్మ డొకడును దాను నజ్ఞానియంచు.

3_౨

పదిమంది మనుష్యులొక పల్లెరమున భుజింతురు. రెండు కుక్కలు ఒక కళేబరము కొరకు కీచులాడును. ఆశబోతునకు ప్రపంచములోని వస్తువులెల్ల తన యెదుటనుండినను సంతృప్తిగలుగదు. తృప్తిగలవాడు ఒకరొట్టెతో తనివిచెందును.

వ్యాపార సామాగ్రిగల భాగ్యవంతునికంటె తృప్తిగల దరిద్రుని మేలని పెద్దలుచెప్పిరి.

ఒక్కరొట్టెతోడ నుదరంబు నిండును;
అవనియందుగలుగు నఖిలధనము
ఆశబోతువాని యాకటికన్నుల
నింపలేదు, కోర్కె జంపలేదు.

అంత్యకాలము తన కానన్నమౌట
దంద్రి నాకీనీతి దయచేసిపోయె:

"అగ్నియోగామంబు; త్యజియించు దాని,
నరకకీలలు లోన బెరరేపబోకు;
ఆ నిప్పులో గాలు నంతటిశక్తి
నీకులే; దోర్పను నీటనీనాడె
చల్లి, చల్లార్పుము పెల్లుమంటలను."

౩౩

తనకు శక్తియున్నపుడే మేలుచేయని యతడు శక్తితరిగిన కాలమున కష్టములకు పాల్పడును.

ప్రజల బాధించెడు పాపాత్ముకంటె
దురదృష్టవంతుండు ధరణిలేడెందు;
కష్టకాలమువచ్చి కడగండ్లుగుడుప
సాయంబుసేయనే సఖులుండబోరు.

౩౪

తొందరగ చేయబడిన వస్తువు తొందరగ నశించును.

నలువదేడులు మాగ గలిపిమర్దించి
తూర్పుదేశపు మట్టితో చీనిగిన్నె
చేయుటవినియుంటి; చిరకాలముండు;
బాగదాచన నూరు పాత్రలు దినము
నలుపుచుందురు; వాని విలువయుండెలియు;
కోడిగ్రుడ్డు పెకల్చుకొనివచ్చు పిల్ల
అప్పుడే తిరుగాడి యాహారమరయు;
మనుజుని శిశువన్న జననమౌవెనుక
తెలివి వివేచన గలుగకయుండు;

అటహాత్తుగా వచ్చునది యేమిలేక్క?
క్రమముగా వికసించి, గౌరవమందు
ఉత్తమత్వమునందు, యోగ్యతయందు
నితరజీవులకంటె హెచ్చుగానుండు.
మానవనంతాన మహితమేదస్సు;
అన్నిచోట్లనుజిక్కు నద్ధంపుముక్క
కాన, మూల్యములేదు కారగ్గుచోట
అరుదుగాజేపడు ననలైనకెంపు
అందుచేదానికి నధికంబువిలువ.

౩౫

ఓర్పువలన కార్యములు చక్కబడును, తొందరపాటు వలన మొదలు చెడును.

ఇసుకయెడారిలో పయనించుచుండ నా కన్నులతో దీనిని చూచితిని:

శీఘ్రగామికన్న జేరెముందుగనంచె,
మందగామి శ్రమము నొందకుండ;
గాలియడుగు తేజి దూలెనుబరుగెత్తి,
యొంటెవాడు మెల్లనూరుచేరె.

౩౬

అపండితునకు మౌనము శ్రేష్ఠము. ఈ హితోపదేశమును అతడు గమనించునేని అపండితుడు కానేరడు.

నీకు రసవాక్పు మత్కృతి నెగడదేని
నాలుకను నోటజెరపెట్ట మేలుగలుగు;

నాల్కదప్పిన దప్పును సరునిఘనత;
పప్పు పొల్లైన గింజకు బరువులేదు.

మతిలేని మూఢాత్ము డతియత్నమునను
చదువుసంధ్యలు నేర్పసాగె గాడిదకు;
అదిగాంచి పండితుండనియె; "నోచెనటి,
యేమిసాధించెదవీ వెర్రిసేత?
ప్రజలయాడికలకు భయపడుమోయి,
నీవల్ల జంతువు నేర్చునేమాట?
జంతువుకద నీవు చదువు మౌనంబు
ప్రత్యుత్తరమునిచ్చు పట్టునెవడు
తలపోయడెవాడు తగనిమాటాడు;
మాటలాడిన నాడు మతిమంతునట్లు,
లేక, జంతువురీతి మూకత్వమూను."

౩౭

తాను తెలిసిన వాడని యితరులు మెచ్చుకొనుటకుగా, తన కన్న దెలిసిన వానితో తర్కించువాడు, తాను తెలియనివాడని తెలుపుకొనును.

నిన్ను మించిన వేత్తనిలిచివాదింప
ఎరిగియుండియును నీవెదిరింపబోకు.

౩౮

దుష్టులతో సహవాసము చేయువాడు మంచిని చూడలేడు.

సైతానుతో దేవదూత స్నేహింప
అభ్యసించును ద్రోహ మధమవంచనము;
చెడ్డవారలయొద్ద చెడ్డనేర్చెదవు;
తోడేటిపనిగాదు తేలుకుట్టడము.

౩౯

మనుష్యుల రహస్యదోషములను వెల్లడిచేయకుము. వారిని అవమాన పరతువు. నీవునునమ్మకము చెరచుకొందువు.

౪౦

శాస్త్రములు చదివి, అభ్యసింపనివాడు, పొలము దున్ని విత్తనములు చల్లని వానినిపోలును.

౪౧

హృదయములేని వానియందు (దేవునియెడ) వినయము పుట్టదు. పప్పులేని దొల్లగింజ వ్యాపారమునకు పనికిరాదు. వాదించుటలో చురుకుతనముగల ప్రతివాడును వ్యాపారములో గట్టివాడని చెప్పరాదు.

అందచందముగల యాకృతుల్ చాల
నవగుంఠనములలో నలరుచుండు;
ముసుగెత్తనందులో ముసలవ్వతోచు

౪౨

రాత్రులన్నియు "శక్తిమంతమగు రాత్రు" లయ్యెనేని శక్తి

మంతమగురాత్రి (షబెఖదర్) అశక్తిమంతమగును.

రాయిరప్పలు పద్మరాగంబులైన
రెండింటివెలలలో నుండదువాసి;

౪౩

చక్కని రూపముగల ప్రతివానికిని చక్కని నడవడికి యుండదు. గుణము హృదయగతముగాని, చర్మగతముకాదు.

ఒకనిపాండిత్య సోపానమొక్కనాట
దెలిసికొనవచ్చు; సంతస్సుదెలయలేము;
కానజాగ్రత్త పెక్కేండ్లుగడచువరకు
వానిదుష్టస్వభావంబు బయలుపడదు.

౪౪

గొప్పవారితో పోరాటము పెట్టుకొన్నవాడు తన నెత్తురును తానే మొలికి చుకొనును.

పెద్దవాడవటంచు గర్వింతువీవు;
"కాంచునొకటి రెండుగా మెల్లకంటివాడు,"
అనుచు సత్యంబుపల్కిరి జనులువినుము;
తగరుతోడిపోట్లాట నీతలకుచేటు.

౪౫

సింహముతో పంజాపట్టుటయు, కరవాలు వాదరను పిడికిట గ్రుద్దుటయు బుద్ధిమంతుల కార్యముగాదు.

శక్తిమత్తులబోర నమకట్టబోకు;
చేతులుచంకలో జేర్చిమాటాడు.

౪౬

బలవంతునితో ధైర్యమున పోరాడిన బలహీనుడు తన చావుమూలమున విరోధులకు స్నేహితుడగును.

నీడసుఖముగ బెరిగిన వాడవగుట,
సమరవీరులతో బోరశక్తి గలదె?
బలము చాలని బాహువు;—తెలివిమాలి
యినుపముష్టి మనుష్యుని నెదురుకొనెదు!

౪౭

హితబోధవిననివాడు నిందావాక్యములు విననలసియుండును.

చేసిన హితబోధ చెవిదూరకున్న
నేను నిందించిన బూను మౌనంబు.

౪౮

గుణహీనులు గుణవంతులనుచూచి యోర్చుకొనలేరు. ఎట్లనగా, బజారుకుక్క వేటకుక్కలనుచూచి యరచునేగాని ముందుకు చొరబారదు. నీచుడు గుణములందును నైపుణ్యమునందును ఇతరులతో సరిరానియప్పుడు వారిని నిందింప సాగును.

హీనుడు నశక్తి దుర్జను డీసుబోతు
అధికులనెట్టైన నపనిందలాడుచుండు;
ఎదురుపడినప్డు, నీచుని వదరుబోతు
నాలుకయు, గట్టినటు మాటగోలుపోవు.

౪౯

ఆకటి తొందరలేనిదే యేపక్షియైనను వేటకాని వలలో పట్టుపడదు ఒకవేళ వేటకాడు సైతము వలయొడ్డియుండడు.

కాలికి సంకెళ్లు, కేలికిం గట్లు
పొట్టమూలంబున బొసగుచునుండు;
ఉదరదాసుండవై బ్రదిమివెచ్చింప,
దైవచింతనసేయ దగవౌనెనిక?

౫౦

తత్త్వజ్ఞులు అకాలభోజనము చేయుదురు. భక్తులు సగము కడుపునకుతిని తృప్తిపడుదురు. సన్న్యాసులు ప్రాణము చిక్కబట్టుట కెంతమాత్రము వలయునో అంతమాత్రమె భుజింతురు. యువకులు పళ్లెరములోని యన్నమును అడుగంటనూడ్చి తిందురు. అయినను దేశదిమ్మరులైన ఫకీరులు శ్వాసమునకైన సందులేనియట్లు పొట్టలో నన్నము కూరుదురు. వారు తిన్నవెనుక ఎవరికిని ఒకమెతుకైన నుండదు.

తిండిపోతుకు నిద్ర రెండు రేలోలేదు,
తిన్న రేయియు దినకున్నట్టి రేయి.

౫౧

ఆడువారితో ఆలోచించిన చేటుమూడును. ద్రోహిని కరుణించిన నేరమగును.

చిరుతపులిని నీవు కరుణించి విడుట
గొర్రెమందను గోడుగుడిపినట్లగును.

౫౨

విరోధి యందుబాటులో నున్నపుడు చంపనియతడు తనకు తానే విరోధియగును.

చేతరాయియు, బాముచేసూటినుండ,
మొత్తకవిడువాడు మొద్దురాయండు.

దీనికి వ్యతిరేకముగ ప్రవర్తించుటయె న్యాయ్యమని కొందరు చెప్పిరి. ఎట్లనగా, అపరాధి మరణదండనము నిర్వహించుటయందు ఆలస్యముమేలు. ఏలన వానిని చంపుటకును లేక వదలిపెట్టుటకును తగిన యవకాశముండును. అట్లుగాక, అతడు తొందరగ చంపబడు నేని, మన్నింప వలయునన్న మంచిసలహా, ఒకవేళ నిష్ప్రయోజన మగును. ఇట్టి సందర్భమున తొందరపాటునకు పరిహారము. అసంభవము.

ప్రాణములుదీయుపని సులభంబెగాని
మృతునికెవడైన ప్రాణంబులీయగలడె?
త్వరపడకయోర్పు వహియించి శరమువిడువు;
విల్లువదలిన బాణంబు మళ్లిరాదు.

౫౩

అవివేకులతో వాదమునకుదిగు తత్త్వవేత్త గౌరవమునుపయి ఆశపెట్టుకొనరాదు. వివేకశూన్యుడొకప్పుడు వాచాలత్వమున తత్త్వజ్ఞుని క్రిందుచేసిన ఆశ్చర్యమేమియులేదు. ఏలయన, రాయి రత్నమును పగులగొట్టును.

వాయసము గోకిలము నొక్క పంజరమున
నుంచ, గోయిల యుత్సాహముడుగుటరుదె;
పండితుడు, దుండగీడులు బాధపెట్ట
గోప పడబోడు, మదిలోన గుందబోడు.

పనికిరానిరాయి బంగారుగిన్నెను
జితుకమొత్తినంత శ్రేష్ఠమగునె?
పైడివిలువతగ్గి పాడయిపోయెనే
రాతివిలువహెచ్చి ఖ్యాతిగనునె?

౫౪

ఆటకూటాయగారి సమాజమున, విద్వాంసుని సూక్తులు వన్నెకెక్కకుండుటలో ఆశ్చర్యమేమియులేదు. ఏలయన, వీణానినాదము యుద్ధభేరీ గర్జనములలో మునిగిపోవును. అంబరు సువాసన వెల్లుల్లిపాయల కంపులో మటుమాయమౌను.

సిగ్గిడితనాన, విద్వాంసు జెనకితివని
పెద్దగొంతుమూఢుడు నిక్కబెట్టుమెడను;
తెలియడేమొ "హుజ్జాజి" మంజులరవంబు
సమరదుందుభి రవళిలో సన్నగిలుట.

౫౫

రత్నము బురదలో పడినను పూర్వయోగ్యతకు భంగము కలుగదు. దుమ్ము ఆకసమున కెగసినను తననీచత్వమును కోలుపోదు.

౫౬

విద్యాభ్యాసము లేనివాని శక్తి శోచనీయము. శక్తిలేని వాని విద్యాభ్యాసము వ్యర్థము. బూడిద యుత్తమ సంబంధము గలదయ్యును (అగ్ని యుత్తమ ప్రకృతి గలదిగావున) తనయందు యోగ్యతలేనందున దుమ్ముతో సమమయ్యెను. చక్కెరవిలువ చెరకు గడపై గాక, తన యంతఃసారముపై ఆధారపడియుండును.

పతితుడు "కనాను" దుర్గుణవంతుడగుట
దాబ్రవక్తకు బుట్టియు దరిగె ఘనత;
సద్గుణంబున్న జూపుము; జాతియేల?
పొలుపగు గులాబి ముండ్లలో బుట్టలేదె?

౫౭

తనంత తాను వాసన గొట్టుటవలన కస్తూరియని తెలిసికొందుముగాని, సుగంధము లమ్మువాడు చెప్పుటవలనగాదు. పండితుడు సుగంధ భార పేటిక వంటివాడు; మౌనము వహించియు తన గుణ సౌరభ్యము వాసింపజేయును.

మూఢసభనున్న విజ్ఞానభూషణుండు,
అంధమధ్యగత మనోహరాంగి యువతి,
మతవిరోధినాస్తిక హస్తగత ఖురాను
బోలునని చెప్పియుండిరి పుణ్యమతులు.

౫౮

ఏండ్లుపూండ్లు యత్నించి సంపాదించిన స్నేహితుని నొప్పించి యొక్కక్షణములో విడనాడుట తగదు.

రాయికొన్నేండ్లకు రత్నమైదనరు,
రాతితో దానిని వ్రక్కలింపకుము.

౫౯

దుర్బలహృదయుడు మాయలాడి జవరాలిచేతిలో చిక్కుపడి యున్నట్లు, వివేకము కామము చేతిలో చిక్కుపడి యున్నది.

ఏయింట నాడుది యెలుగెత్తి యరుచు
అయింట సంతోష మాసింపబోకు.

౬౦

శక్తితోఁగూడని తెలివి వంచన మనవచ్చును. తెలివితోఁ గూడని శక్తి మూఢత్వమును వెర్రితనమును గలిగించును.

తొలుతన్యాయజ్ఞతయు, బుద్ధి తెలివితేట
వలయు, నావల సామ్రాజ్యవైభవంబు;
అజ్ఞమతిప్రాభవము రాజ్యమర్ధచయము
దైవ ధిక్కార యుద్ధ సాధనములగును.

౬౧

తాను పస్తుపడి కూడపెట్టు భక్తునికంటె, తానుదిని యితరులకు పెట్టు గృహస్థుడు యుత్తముడు.

౬౨

లోకులమెప్పు పడయుట కొరకు కామమును వర్జించు నతడు, క్రమమైన కామమును వీడి అక్రమమైన కామమునకు లోనగును.

దైవచింతనమున దత్తచిత్తుడుగాక
మత నివిష్టుడైన మాయభక్తు
డయ్యోపాప? మేమియరయు జీకటియట్లు
మురికిపట్టియున్న ముకురమందు?

౬౩

కొద్దికొద్దిగా చేరిన అనేకమగును. బొట్టుబొట్టుగా చేరినజలము వెల్లువయగును.

అంతంతగాజేర నధికమైతోచు;
అన్నిగింజలుచేర నగుధాన్యరాశి,

౬౪

విరోధిచేత రాయిదెబ్బ తిన్నవాడు బాహుబలము లేనందున అనుకూలసమయము వచ్చువరకు వేచియుండి వానిని పుటమార్చును.

౬౫

సామాన్యుడు తనయెడ తప్పిదమొనరింప, పండితుడు సౌజన్యము వహించి వదలిపెట్టరాదు. ఏలయన, ఇరువురకును నష్టము

గల్గును. పండితునకు గౌరవము తగ్గును. వాని మూఢత్వము స్థాపించినట్లగును.

నీచునితో నీవు నెమ్మిమైబలుక
అతని గర్వము నిక్కు నభివృద్ధిచెందు.

౬౬

పాపమెవ్వఁడు చేసినను అది యంగీకృతముకాదు. పండితులు చేసిన మరింత గర్హ్యమగును. ఏలన, సైతానుతోడి పోరాటమునందు జ్ఞానమే యుద్ధసామాగ్రి. అట్టి యుద్ధపరికరములు గలవాడే చెరబడునేని మిక్కిలి లజ్జాకరమగును.

వాంఛలుడుగని పాండిత్యవహునికంటె
జ్ఞానహీనుడు సామాన్య మానవుండె
మాన్యుడగు; నీతపంథుడై మార్గమెడయు;
అతడు కనులుండియును గూపమందుబడును.

౬౭

ప్రాణము ఒక యూపిరిపై నాధారపడి యున్నది. లోకస్థితి రెండు అస్థితులమధ్య నున్నది. మాతమును లౌకిక సంపదకొరకు అమ్మువాడు గార్దభమనిపించుకొనును. యూసబును అమ్మినవాడు మరల ఏమికొందురు?

వైరిమాటనమ్మి వరమైత్రి బంధంబు
త్రెంపినాడవీవు తెలివిమాలి;
ఎవని వీడినావొ, యెవ్వనిగూడితో
యూహసేయుమోయి, యొక్కక్షణము.

౬౮

సైతాను పరమభక్తులను, సుల్తాను దరిద్రులను లొంగదీయలేడు.

ప్రార్థనము సేయకుండెడు వాని కప్పు
నీయకుము పస్తుపడివాడు వాయిదెరవ;
దైవవిధుల నిర్వర్తింప దప్పునతడు
అప్పుచెల్లించునని యేమియానగలదు?.

౬౯

తన జీవితకాలమున తనయన్నము తిననివారు తాను మరణించిన వెనుక పేరును జ్ఞప్తిపెట్టుకొనరు. ద్రాక్షపండ్లరుచి విధవరాలెఱుంగునేగాని, తోట సొంతదారు ఎఱుంగడు.

ఆకలిగొన్నవారిని మరవకుండుటకయి మతవిశ్వాసముగల యూసబు, కఱువుకాలమున సగమాకలి తీఱునట్లు భుజించుచుండెను.

భోగభాగ్యంబుల సుఖించు పురుషుడెట్లు
కటికయాకటి బీదలగతి గ్రహించు?
దీనజన కష్టముల నెట్లుదెలియవచ్చు,
దనకు నిక్కట్టు లొకతూరిదగులకున్న?.

వాజిపైస్వారివెడలిన వన్నెకాడ,
కట్టెలబ్బిగాడిద చూడు కష్టపడెడు;
నీవు పొరుగింట నిరుపేద నిప్పుడుగకు;
పొయ్యివెడలునది యెడంద బుట్టుపొగయె.

౭౦

వానివుండునకు తొలాముచరిమి, యొకపూట తినబెట్ట లేకుం దువేని, కరవుకాలమున దుఃస్థితిలోనున్న దరి జేసిని "నీవెట్టున్నావు" అనియడుగకుము,

బరువుతోనూబి దిగబడ్డఖరముగాంచి
కనికరింపుము; లేదేని, చనకుదరికి;
"పడినదెట్లని" యోదార్పు వచ్చియుంట
పూనుకొనితోకబట్టుము పురుషనట్లు.

౭౧

నిర్ణీతమైనదానికంటె ఎక్కుడుగ ననుభవించుట, నిర్ణీతకాలమున కంటెముందుగ మరణించుట అను నీరెండు విషయములు తెలివికి సాధ్యముకావు.

వేడినిట్టూర్పులును మొరల్ వేనవేలు
నుతులు నిందలు మాన్పవు నొసటివ్రాత;
అనిలభాండారపతికేమి కనికరంబు
ఇంటమునలమ్మ దీపంబు గెంటియార.

౭౨

ఓయీ, అహారమన్వేషించువాడా, కూర్చుండుము, నీవు భుజింపగలవు. ఓయీ, మృత్యువుచే నన్వేషింపబడువాడా, కదలకుము, నీవు ప్రాణమును రక్షించుకొనలేవు.

యత్నపడినను బడకున్న నన్నమబ్బు
దేవదేవుని కరుణార్ద్ర దృష్టివలన;
పెద్దపులినోట దలదూర్చి పెట్టబడియు
మృత్యువాసన్నమగుదాక మ్రింగబోదు.

౨౩

కామతత్పరుడగు భాగ్యవంతుడు బంగారు జలపోతపోసిన మంటి గడ్డ పుణ్యాత్ముడగు నిరుపేద, దుమ్ముమునుకొని యందము మాసిన ప్రియురాలు. ఈతడు మూసాప్రవక్త కట్లబొంత. ఆతడు ఫారాను చక్రవర్తి రత్నఖచితమైనయంగి. సజ్జనులకు దుర్దశ సంభవించినను నగుమోముతో నందురు. దుర్జనులకు ప్రాభవము కలిగినను మొగము వ్రేలాడ వేసుకొని యుందురు.

ప్రాభవము గౌరవముగల భాగ్యశాలి
దగ్ధహృదయుల యిక్కట్లు దలపడేని
ప్రాభవము గౌరవంబు పరంబునందు
జేకురవటంచు నతనితో జెప్పమోయి.

౨౪

ఈర్ష్యాళువు, దేవుడితరులకు కరుణించిన భాగ్యమునెడ లోభత్వముచూపును. నిర్దోషులపయి వైరమూనును.

మెదడుచచ్చిన మనుజుండు, వదరుబోతు
గౌరవస్థుని నిందింప గని యిటంటి:
మందభాగ్యుడవై నీవు గుందెదేని,
యది యదృష్టవంతుని దోషమౌనటోయి.

ఈనుబోతువాని కిక్కట్లుగోరకు
తనకు దానెయౌను దగినకీడు;
వానిపై విరోధమూన నక్కరలేదు
పదములంటితిరుగ బరమవైరి.

౨౫

ఇచ్ఛలేని విద్యార్థి, రూకలులేని ప్రేయసుడు, జ్ఞానములేని యాత్రికుడు, రెక్కలులేని పక్షి. అభ్యాసహీనుడగు శాస్త్రవేత్త ఫలములులేని వృక్షము. శాస్త్రజ్ఞతలేని భక్తుడు ద్వారములేని గృహము.

౨౬

ఖురాను అవతరించిన యుద్దేశము ప్రజలు సత్ప్రవర్తనము నేర్చుకొనుటకేగాని, కేవల మధ్యాయములు వల్లించుటకుకాదు.

విద్యావంతుడు కాని సామాన్యభక్తుడు, కాలినడకబోవు బాటసారి, సోమరిశాస్త్రజ్ఞుడు, నిద్రపోవుచు స్వారిచేయువాడు, ప్రార్థించుటకు చేతులెత్తు పాపి, గర్వముతో తలయెత్తు భక్తునికన్న మేలైన వాడు.

కరుణా స్వభావంబు గలపైనికుండు
క్రూరతాత్త్వకు కంటె గుణతరుండగును.

౨౭

అభ్యాసములేని శాస్త్రజ్ఞుడు బాలునివంటివాడని యొకనితో చెప్పిరి. "తేనె కూర్పలేని తేనెటీగ" అని అతడు చెప్పెను.

తేనె కూర్పుపుగాన తెగకుట్టబోకు
మని చెప్పు నరఘకు; నదిక్రూరచిత్త.

౨౮

పౌరుషములేని మనుష్యుడు స్త్రీసముడు. అత్యాశాపూరితుడగు భక్తుడు దారిదోపిడికాడు.

తివిరి ప్రజమెప్పువడయుగ దెల్లయుంగి
దొడిగితివిగాని, చరితంబు దోషయుతము.
అంగరేకు చేతులు పొట్టివైన బొడుగు
వైన, లౌకికవృత్తిని మానుమోయి.

౨౯

రెండు తెరగుల మనుష్యులకు దుఃఖము హృదయమును వదలదు; పాదము ఆశాభంగ పంకమునుండి బయటపడదు. వారెవరనగా, ఒకడు నౌవ్యసన విపన్నుడగు వణిజుడు, మరియొకడు దేశద్రిమ్మరి ఫకీరులతో సహవాసముచేయు వారసు.

ఆస్తి దరిబేసి మూతకు నర్పణంబు
సేయకుండిన నీ నెత్రు దీయగలరు;
వారిసంగతి వదలుము; వదలవేని
యున్నమట్టుకు వారికి నూడ్చిపెట్టు.

దంతి మావటి చెల్మి దలపకు, లేక
యేన్గుపట్టెడునట్టు విల్లునిర్మించు.

౮౦

సుల్తాను ప్రసాదించిన యంగి ప్రియమైనదయ్యును, దాని కన్న సొంత ప్రాతచొక్కాయి శ్రేష్ఠమగును. గొప్పవారి యింటి విందు రుచికరమైనను, దానికన్న సొంత సంచిలోనున్న రొట్టె ముక్కయె మరింత యింపుగానుండును.

చేతికష్టపు ప్రాప్తి చిరుగూర, కాడి,
గ్రామాధిపతి విందుకంటె మేలౌను.

౮౧

సందేహముతో ఔషధము సేవించుటయు, ఇదివరకు చూచి యెరుగని మార్గమున సార్థవాహముతోడగాక యొంటరిగ నడచుటయు సముంజసము కాదు. మరియు ప్రాజ్ఞసమ్మతమునుగాదు.

"శాస్త్రవిజ్ఞానమునందు ఇంతటియున్నతపదవి నెట్లు పొందితిరి." అని ఇమాంమహమ్మదుగజిలీని ప్రశ్నించిరి.

"ఎట్లనగా నాకు తెలియని విషయమును ఇతరుల నడిగి తెలుసుకొనుటకు సిగ్గుపడినదిలేదు." అని ఆయన జవాబుచెప్పెను.

వైద్య నిపుణుని నీనాడి పట్టనిమ్ము
ఆసయుండు నారోగ్యము నందెదవంచు;
అడిగికనుగొమ్ము; నీచమౌ నడుగుటన్న,
నదియెపథసూచి పొందితీ యశములకును.

౮౨

ఎట్లయిన నొక విషయము నీకు తప్పక తెలియబడునని తెలి

సికొందు వేసి, దానిని గురించి తొందరపడి యడుగకుము. ఏలయన నీ ప్రాభవమునకును, గౌరవమునకును హానికలుగును.

మహిమ, దావీదుచేతిలో మైనమట్లు
లినుము మారుట లకుమాను గనెనుగాని,
అడుగ డెటుమారెనంచు, దానడుగకుండ
దెలియబడునను నమ్మిక గలదుగాన.

౦౩

చెడ్డవారితో సహవాసము చేయువానిని, ఒకవేళ వారి దుఃస్వభావము అలవడకపోయినను, వారి మార్గ మవలంబించు వాడని యితరులు సందేహింతురు. ఎట్లనగా, పానశాలకు నమాజు చేయుటకు పోయినను, ద్రాక్షసారాయి తాగుటకు పోయెనని చెప్పుదురు.

మూఢుల సహవాసమున మూఢబుద్ధి
వైతివక దుర్యశ మార్జించినావు;
పెద్దలనొకనీతి వేడనిట్లనిరి:
"అజ్ఞుల గూడకు; మదిమేలయన్న,
జ్ఞానముండిన, గొన్ని నాళ్లకు నీవు
ఖరతుల్యుడౌదువు; కడుమొద్దువైన
నంతకంటెను మొద్దువౌదు వెచ్చరిక!

౦౪

ఒంటె బుద్ధికౌశలమును సౌజన్యమును ఈ కథ వలన తెలిసికొనవచ్చును.

ఒక బాలుడు ఒంటె ముక్కు త్రాటిని పట్టుకొని నూరు ఫర్లాంగులు తీసికొనిపోయినను మెడ నటునిటు త్రిప్పక వాని ననుసరించును. అయినను అపాయకరమైన లోయ ముందుండి మరణ శంక గలిగినపుడు, బాలుడు తెలియనితనమువలన ఆ దారినే నడువ గోరినపుడు, వాని చేతిలోనున్న కళ్లెమును వదలించుకొని, వాని యిష్టప్రకారము నడుచుకొనదు. ఏలయన, ఆపత్సమయమున మెత్తదనమూనుట నింద్యమగును. విరోధి మెత్తదనమువలన స్నేహితుడు కాక పోవుట యట్లుండ వాని వైర తృష్ణ మరింత హెచ్చునని పెద్దలు చెప్పుదురు.

కరుణమన్నించువానికి కాలిధూళి
గమ్ము, వైరింప గన్నుల దుమ్ముచల్లు;
కరిను మెత్తగ బతిమాలకార్యమున్నె?
అకురాయి వినా శోధ్యమౌనె త్రుప్పు?

౮౫

ఇతరులు సంభాషించుచుండ, తన తెలివితేటల భాండారము బయలుపడుటకుగా నడుమసందుకొని మాటాడునతడు తన యజ్ఞానమును ప్రకటించుకొనును.

పదిగ ప్రశ్నింపబడనిదే ప్రాజ్ఞుడెపుడు
నొసగడు తనంతతానె ప్రత్యుత్తరంబు;
వెరసి యొప్పయ్యు వాచాటు వివరణంబు,
వాచ సారాంశమును నమ్మ వలనుపడదు.

౮౬

నాకు మరుగు తలమున స్నేక కురుపులేచియుండెను. మా

గురువుగారు ప్రతిదినమును 'పెట్టున్నది'. అని యడుగుచుండిరేగాని, ''ఎక్కడ కురుపులేచినది'' అని యడుగకుండిరి. అవయవములను ప్రత్యేకముగ పేర్కొనుట అసభ్యమని మానుకొనినట్లు నేను గ్రహించితిని.

ఆలోచింపక ప్రశ్నించువారు ప్రత్యుత్తరము వలన కష్టపడుదురు.

మాట సూటిదనము మది జక్కఁదలపక
నోరుదెరచియెదియు నుడువరాదు;
దబ్బరాఁ చెరను దప్పించుకొనుకంటె,
సత్యమాడి చెరకు జనుటమేలు.

౮౭

అబద్ధము చెప్పుట కత్తిగంటివంటిది. ఎట్లన, గాయముమాని సను మచ్చనిలచి యుండును. అబద్ధములాడుదురన్న దుష్కీర్తి గాంచిన యూసబు సోదరులు నిజము చెప్పినను జనులు నమ్మకుండినది నీ వెరుగవా?

సహజముగ సత్యమాడెడు సజ్జనుండు
ఒకటబొంకిన మన్నించి యూరకుంద్రు;
అనిశము నసత్యమాడు దుర్వ్యసనముగన్న
నరుడు నిజమాడినను వాని నమ్మబోరు.

౮౮

ఎట్లుచూచినను సృష్టియందలి ప్రాణికోటులలో మానవుడే యుత్తముడు. జంతువులలో కుక్క నీచమైనది. అయినను పెద్దల

అభిప్రాయ పరిష్కారము. చేసిన మేలు మరచు మనుష్యునికంటె మేలుమరువని కుక్కయే శ్రేష్ఠమగును.

ఒక్కకడియున్న మొకపరి కుక్కకిడిన
మరపదవ్వల రాళ్లతోదరుము కొనిన;
అధము జిరకాలమాదట నాదరింప
స్వల్పవిషయంబు కొరకు ద్వేషము వహించు.

౮౯

ఇంద్రియలోలుడు సద్గుణములను పెంపుచేయలేడు, సమర్థుడు కానివాడు నాయకత్వమునకు తగడు.

దండి తిండికాని దయనాదరింపకు
దండి తిండి మొద్దుతనముదెచ్చు;
ఎద్దుపోల్కి బలియనిచ్ఛగించెదవేని
ఖరమురీతిదినుము కఱ్ఱపెట్టు.

౯౦

అంజీలులో నిట్లు చెప్పబడియున్నది. "ఆదాము సంతానములారా. నేను మీకు భాగ్యము నొసంగుదునేని, నన్ను మరచిపోనియుండే మునిగి తేలుచుందురు. అట్లుగాక, పేదరికము నిత్తునేని దుఃఖపీడితులయి నిరుత్సాహముతో కూలబడియుందురు. అట్టి మీరు నన్నెట్లు మధుర స్తుతుల సేవింపగలరు? ఎట్లు నన్ను పూజించుట కాతురపడుదురు!"

కలిమియున్న నలక్ష్యము కావరంబు,
కలిమి లేకున్న హృదయార్తి కష్టభరము;

ఇందునందును నీస్థితి యిట్టులుండ,
దైవనక్తుండ వైయుండు తరుణమేది?

౯౧

సమాన రహితుడగు జగదీశ్వరుడు తన యిష్టప్రకారము ఒకనిని సింహాసన భ్రష్టునిగావించును. ఇంకొనిని మత్స్యగర్భము నందైన కాపాడును.

నిను నుతించెడు వానికొనరునంతుష్టి
యూనసబువలె జేపయుదరస్థుడైన.

౯౨

భగవంతుడు రౌద్రముపూని ఖడ్గమును వరనుండి బయటికి లాగిన ప్రవక్తలు వలీలు వెనుకకు తగ్గుదురు. కరుణార్ద్ర దృష్టి పరపునేని పుణ్యాత్ములపైనను దుష్టులపైనను సమానముగ ప్రసరించును.

అంత్యదినమున జమా ఖర్చులరసిచూడ
ఏకమాహాతువు ప్రవక్తలీయగలడు?
"ఈశ, కరుణింపు, పాపులకాశగలదు
తమరి క్షమయందు" ననెడుప్రార్థనముదప్ప.

౯౩

ప్రాపంచిక కష్టములనుభవించియు సన్మార్గము నవలంబింపని మనుష్యుడు అంత్యమున నిరంతర శిక్ష ననుభవించును.

శ్రేష్ఠులైనవారు శిక్షించుటకుమున్ను
బుద్ధిచెప్పి వెనుక బద్ధుజేయ
దలతు; రట్లునీవు తమనీతివినకున్న
గడకు బందిగమున నిడుదురోయి.

౬౮

భావిసంతతులు తమ చరిత్రను (చెడ్డకు) ఉదాహరణముగ గ్రహింపకుండునట్లు అదృష్టవంతులు పూర్వచరిత్రలనుండియు, సాదృశ్యములనుండియు నీతిని గ్రహింతురు.

పలసుజల్లినధాన్యంబు వంకఁబసదు
పక్షి, మున్నందు నొక పక్షిపట్టువడిన;
పరులయిక్కట్లుగని నీతి బడయుమోయి,
ఒరులునినుగాంచి నీతిని బొరయునట్లు.

౬౯

పుట్టుచెవిటివాడు వినవలయుననిన ఎట్లు వినగలడు? అదృష్టము తన యుచ్చులలో నొకనిని చిక్కించుకొని లాగుకొనిపోవ, పోకుండ వాడెట్లు తప్పించుకొనగలడు.

భక్తకోటి తమిస్రలు వరలుచుండు
తిగ్మతేజోవిరాజిత దినములట్లు;
బాహు బలమున గలుకదీ భాగ్యగరిమ.
దేవుడు దయార్ద్రమతి ప్రసాదింపకున్న.

నీపైనినెవరితో నేమొర్రలిడుదు,
నినుమించుతీర్పరి గననువేరొకని;

నీచేయికంటెమించిన చేయిలేదు;
ఏరికైనను నీవు దారిచూపింప
దప్పుగొట్టుట కేరితరః మొకవేళ
తప్పుదారినిచూపి త్రిప్పుటపెట్టు
నరిత్రోవజూపించు శక్తుడెవ్వండు?

౯౬

కడపటి దశలో కష్టమనుభవించు పాదుషాకంటె అంత్యమున సుఖమనుభవించు బిచ్చగాడు మేలు.

దుఃఖంబునకువెన్క దొడరుసుఖంబు
సౌఖ్యంబువెన్నాడు క్షతికంటెమేలు.

౯౭

ఆకాశము భూమిపయి వాన కురిపించును. భూమి ఆకాశముపయి దుమ్ముచల్లును.

నాస్వభావము నీకు నచ్చకయున్న
విడువ బోకుము నీదు విమలవర్తనము.

౯౮

సర్వేశ్వరుడు మన దోషములనుచూచి కప్పిపెట్టును. పొరుగింటివాడు చూడకపోయినను పెద్దగొంతుతో ప్రకటించును.

గుప్తవస్తువుగాంచు గుణమున్నప్రజకు
ఒకనిచే నొకనికి నుండదుశాంతి.

౯౯

బంగారమును గనినుండి త్రవ్వి బయటికి తీయుదురు. లోభి చేతిలోని బంగారము వానిని చంపనిదే బయటపడదు.

నీచులర్థంబు గుడువక నేలనిడుదు;
రనుభవముకంటె నాసయేయధికమంద్రు;
అయ్యో! నిధియట్టులేయుండు; నధమలోభి
చచ్చు నొకనాడు శత్రులు సంతసింప.

౧౦౦

దీనుల పోషింపనివాడు నిరంకుశుని బలాత్కృతికి పాల్పడును.

బలము చలముగల్గు ప్రతిబాహువుసశక్త
బసులకరము విరువబాలకుండు;
పేదయెడల గాయపెట్టకు; మొకనాడు
బల్లిదుండు నిన్ను భంగ పరచు.

౧౦౧

ఒక దరిబేసి యిట్లు ప్రార్థించెను: ''కరుణామయా, దుర్జనులను కరుణింపుము. సజ్జనులను సద్గుణములతో పుట్టించి వారిపయి తమంతటామే దయచూపియున్నారు.''

౧౦౨

ప్రాజ్ఞుడు పోరాటమువచ్చు నెడల ప్రక్కకు తొలగును. శాంతి చేకూరునేని అచ్చట లంగరువేయును. ఏలయన ఆసమయ

మున నొగ్గునసనుండుట క్షేమకరము. ఈ సమయమున మధ్య నుండుట సౌఖ్యకరము.

౧౦౩

జూదగానికి మూడు ఆరులు కావలసియుండెను. కాని మూడు ఆసులు చేతికి వచ్చెను.

బయలుకంటెనుమేలు పచ్చనిపీడు,
అయిన, గర్లముబేదు హయముహస్తమున.

౧౦౪

అంగీయంచులకు జలతారు కుట్టించి యెడమచేతి వ్రేలికి ఉంగరము పెట్టుకొన్నవారిలో మొట్టమొదటివాడు జంషీదుచక్రవర్తి. "కుడిచేయి శ్రేష్ఠమైయుండగా ఎడమచేతినేల యలంకరించితిరి?" అని ఆయనను ప్రశ్నించిరి.

"కుడిచేతికి తాను కుడిచేయియైన ఘనతయేచాలును." అని ఆయన జవాబు చెప్పెను.

చినిశిల్పుల బిల్చి చెప్పెని రీతి
పాహిఫరీదూను: "సౌధతోరణము
సందు నీ వాక్యంబు లలర గుట్టుండు:
ప్రాజ్ఞుడా, దుష్టుని పయిజూపుకరుణ,
తక్కొరుల్ తమయంతవాెమె సజ్జనులు."

౧౦౫

"కుడిచేయి యింత శ్రేష్ఠమైయుండగా ఎడమచేయినేల

యుంగరము ధరింతురు.'' అని యొక పెద్దమనుష్యుని అడిగిరి.

''పండితులెల్లప్పుడు అలక్ష్యముచేయబడుదురని నీవెరుగవా'' అని యాయన ప్రత్యుత్తరమిచ్చెను.

కలిమిలేముల సృష్టి వెలయించుధాత,
భాగ్యమేనియు గుణభాగ్యమేనిచ్చు.

౧౦౬

తల తెగునను భయముగాని, ధనముపయి ఆశగాని లేనివారు పాదుషాలకు సలహా చెప్పుటకు తగియుందురు.

మెడను ఖడ్గంబుపెట్టిన, నడుగులపయి
పసిడి చల్లిన, వెరపునంబరములేదు
దైవమును విశ్వసించు తత్వజ్ఞమతికి;
ఇదియె యేకత్వపు బునాది; యిదియెచాలు.

౧౦౭

పాదుషా నిరంకుశుల నడగద్రొక్కుటకును, రక్షకభటాధిపతి హంతకుల శిక్షించుటకును, ఖాజీదొంగలను విచారించి తీర్పుచెప్పుటకును ఏర్పడియున్నారు. కేవలము న్యాయముతోడనే సంతృప్తిపడు వాది ప్రతివాదు లిరువురు ఎప్పుడును ఖాజీదగ్గరకు పోరు.

న్యాయమును దెల్లముగగాంచి యువలజెప్ప
వలసియుండిన మృదువుగా బలుకమేలు;
ఇష్టపడినీవు పన్నుల నీయకున్న
కష్టపెట్టిగైకొను గర్రగాహుబంటు.

౧౦౮

అందరి దంతములు పులుసు తినుటవలన మోటుపడును. కాని ఖాజీకి మాత్రము తీపు (లంచము) తినుటవలన కరకుచెడును.

ఖాజీకి నొక దోసకాయ నర్పింప
పది పుచ్చమడులు నీ పరముగా నిచ్చు.

౧౦౯

వృద్ధురాలైన వెలయాలు తన వృత్తిని గురించి పశ్చాత్తాప పడును. పదభ్రష్టుడైన రక్షకభటాధిపతి తత్క్రూరత్వమునకై అను తాపమునొందును.

ప్రాయపు నరుండు సన్న్యాసి వ్రతముపూన
దైవపథమున సింహంబు దేవనడచు;
బడుగువృద్ధుండు సన్నియువదలనేమి,
సొంతముగ లేవలేదు కూర్చున్నచూల.

౧౧౦

ఒక ప్రఖ్యాత పండితుని ఇట్లడిగిరి: ''భగవంతుడు సృజించిన వృక్షములలో ఎన్నియో ఫలవంతములై నవియుండ, వానిలో నొక్కదానికిని కాని ''స్వతంత్ర'' అను పేరు ఫలశూన్యమైన దేవదారు వృక్షమునకుమాత్ర మేలవచ్చెను? దీని రహస్యమేమియో తెలుపుము.''

ఆయన యిట్లు చెప్పెను: ''ఒకొక్కదానికిని నిర్ణీతమైన ఫలము, ఋతువుకలదు. ఆ కారణము వలన ఒకప్పుడు తరువులు

శోభించును. మరియొకప్పుడు జీర్ణించి వాడి వత్తలైయుండును దేవదారు వృక్షమునకు ఇట్టి మార్పులేవియు లేవు. ఎల్లకాలము పచ్చని సంతోషమును వెదచల్లుచుండును. ముక్తుల తత్త్వము కూడ నిట్టిదే.

స్థిరముగానట్టి దానిపై చిత్తమిడకు;
ఘనఖలీఫాలు మృతులైన వెనుకగూడ
బాగదాద్ మహాపట్టణ పరిసరోర్వి
జలసమృద్ధిగబారు 'దిజ్లా' ప్రవంతి.

కలిమియున్ననీవు ఖర్జూర కుజమట్లు
కనికరించి ప్రజల గావవలయు;
తిండి పేదవైన, దేవదారు మహీజ
మట్లుముక్తపదవి సంది బ్రతుకు.

౧౧౧

రెండు తెరగుల మనుష్యులు మరణించి వారితోడ దుఃఖమును గొంపోయిరి. వారెవరనగా: ఒకడు ఉండి అనుభవింపనివాడు, మరియొకడు తెలిసి యాచరింపనివాడు.

పిసినిగొట్టుదోష వివరంబు ప్రకటింప
యత్నపడనిమనుజు నరయలేము;
రెండునూర్లతప్పులుండియు దయయున్న
దయయెవానినెల్ల దాచిపుచ్చు.

ఉపసంహారము

—:o:—

దేవుని కృపవలన 'గులాబితోట' అను ఈ గ్రంథము పరిసమాప్తమైనది. ఈ గ్రంథమందంతటను పూర్వుల కవిత్వమునుండి ప్రమాణములు గ్రహించు కృతికర్తల యాచారమును నేనవలంబింపలేదు. ఏలయన

పరుల మేలంగిసి యెగవెత్తుకంటె
తనమాసికలబొంత తగుబ్రాతదైన.

సాదీ వచనములు చాలవరకు హృదయోల్లాసము వెదచల్లునవిగను. మాధుర్య సమ్మిశ్రితములుగను వుండును. హాస్యదృష్టులైన కొందరు ఈ వచనముల నిట్లు విమర్శింపసాగిరి: మొదటి సారమును నిరర్థకముగ వెచ్చించుటయు, ఏమిలాభమునుపొందక దీపపుపొగలో కష్టపడుటయు బుద్ధిమంతుల కార్యముకాదు.''

అయినను ఎవరి హృదయములు ప్రకాశింపజేయుటకు ఈ వచనము లుద్దేశింపబడియున్నవో అట్టి సహృదయులకును, మహనీయులకును ఈ క్రింది విషయములు గోప్యములుకావు. హితోక్తిమౌక్తికములు మధురరీతి సూత్రమున గుచ్చబడియున్నవి. మనసు విసుగెత్తి మానవులు అంగీకార విముఖులు కాకుండునట్లు హితమను తిక్తౌషధమును చమత్కారమకరందమున మిశ్రితము చేయబడియున్నది.

జీవితంబెల్లవెచ్చించి సిద్ధపరచి
మంచిహితములు మీకునర్పించినాడ;
వానిప్రీతిగ గ్రహియింపరేని మీరు,
దేవుడుప్రవక్తలంబంపి తెలుపునాత!

అష్టమాధ్యాయము, ఉపసంహారవాక్యములు
సర్వము సంపూర్ణము.

———

ఆంధ్రీకర్త విన్నపము

తెలిసి తెలియకయో యెటో తెలిసినట్లు
సాదిప్రియకావ్యమును తెల్గుసలిపినాడ,
పారసీభాషలోని ఖాపప్రశస్తి
తెలుగు చదువరులెల్లరు దెలిసికొనగ.

ఆకవీశ్వరుప్రతిభ శతాంశమైన
తెలుపగలనేని నాశ్రమ ఫలితమగును;
తెలుగువారికి వేమన్నతెలిసినట్లు
స్మృతిని సాదీయు నికమీద మెలగుగాత!

తప్పులెల్లనావి, యొప్పులకుప్పలు
మీకుసాది దివ్య సృష్టిలోవి;
అతనికీర్తివెలుగు నాశ్రయించితి, పుట్టి
గోడ పసిడిపూత గోరినట్లు!

తెనుగువారికి సహజమౌ తియ్యదనము,
తప్పుమన్నించి మెచ్చు నుదారగుణము,
పొల్లులో గట్టినేరు నపూర్వబుద్ధి
యుద్ధరించుత యీకృతి నుచితరీతి.

తప్పు-ఒప్పుల పట్టిక

పుట	పంక్తి	ముద్రణ	సవరణ
7	22	నలుక	నాలుక
19	19	ఉపద్రవకరమైవ	ఉపద్రవకరమైన
38	4	దరిచేసి	దరిచేసీ
38	21	పలక	పలుక
48	5	ముఖ్యసేవలకు	ముఖ్యసేవకులకు
48	17	పూర్వవాతవైన	పూర్వదాతలైన
49	4	ధిదృక్షు	దిదృక్షు
50	7	వృద్ధియే	వృద్ధియౌ
51	17	నిట్టార్పు	నిట్టార్పు
53	4	కోపమగ్గవించి	కోపమగ్గలించి
56	8	దీనిని	వీనిని
59	3	వారిని	వారివిధి
62	9	గెలువలేడు	గెలువలేము
62	21 22	మోధ్య	[illegible]
66	13	నంగ్రిము	సంగ్రహము
77	18	సైపలేడు	సైపవేడు
78	8	ఆర్ధియొకడు	ఆర్థియొకడు
85	10	యెన్మ్న	మిన్నున
85	20	అనతిని	అనవిని
86	5	వేవాగ్ని	వేవనాగ్ని
87	7	నాగదికి	నాగతికి
88	9	నుమ్మవింప	నుమ్మలింప
89	7	కింకెచ్చు	కింకెచ్చుట
92	12	ధనభయంబు	దనచయంబు
93	4	జొనుపదగునె?	జొనుపదిగునె?
93	7	వేదన	లేదన
93	15	గురుని	గురునిహత

120	17	18	మధ్య	౪౪
133	5		సూర్యతపంబు	సూర్యాతపంబు
133	15		విరువరు	విలువరు
134	15		తెనిసికొని	తెలిసికొని
136	22		వాః|ప్రూరము	వాఃప్రపూరము
136	23		ఎవరనివర్ణనమునందు	ఎవనివర్ణనమునందు
140	12		శ్రమువహించుట	శ్రమసహించుట
141	7		వానికంటే	వానికంటెచెప్పవలెలేనివాడు అదృష్టవంతుడేగదాయని
142	15		విశే	విశేష
143	11		యొరులు	యొుములు
143	13		మనుజుని	వణిజుని
145	16		కొట్ట	కొట్టమోడ
145	17		గుస్తరింవ	గుస్తరింప
146	5		తనుపు	తనువు
146	2	3	మధ్య	అందుకొబిచ్చగొడిట్లుజవాబు చెప్పెను.
146	7		బలాఢ్యులగు	బలాఢ్యుడగు
146	22		టయి	టయొ
151	6		వేచు	లేచు
151	7		లోకంబు	భోగంబు
154	20		నిల్వవే	నిల్వలే
155	20		నిర్ణయముగ	నిర్ణయమున
157	6		లొలసి	సొలసి

		ముదిృతము	…వరణ
157	22 23	మద్య	గండుచీమలుదొంతరగట్టు
157	24	చూర్చుండి	కూర్చుండి
158	3	మీమధ్య	మీమధ్యనేనొకడనున్నాను
162	9	రహితగ	రహితముగ
162	17	పతయుకుండు	పడయుకుండు
162	19	నెపుడు	నెపుడొ
163	20	పెంచి	పిలిచి
168	2 3	మధ్య	3
168	19	గత	తగ
169	4	తమ	[illegible]
169	5	మ[illegible]సకు	మతహీనునకు వీనిపై
171	12	ఆయన	ఆయనే
172	18	కేమెన	కేమైన
175	8	సమ్మతించిపోయెను	మునాదిసమ్మతించివెడలిపోయె
179	6	నెక్కనది	కెక్కనది
177	9	లాడురూపు	బాడురూపు
188	12	పడవోయి	పదవోయి
188	15	అరుణ	అరుణు
189	14	టెక్కులే	టెక్కులేల
191		దనపతి	దనమతి
192		నెవ్వరు	నెవ్వారు
202	13	ఆరోగ్య	ఆరోగ్య
202	22	కామపేరితమైన	కామప్రేరితమైన
205	6	భంగినల్పు	జంగినల్పు
208	1	దెలివికొరవయు	దెలివికొరతయు
215	5	కోడంటికపు	కోడంట్రికపు
216	2	యుండు	యుండ
232	7	వుంటిని	పుంటిని
267	7	దురనము	దుర్మాంనము
296	12	క్షమాహతువు	క్షమాహేతువు